ఓ హెన్రీ కథలు

స్వేచ్ఛానువాదం ! "శ్రీ రాగి"

పల్లవి పబ్లికేషన్స్
ఏలూర్‌రోడ్, విజయవాడ-2.

ఓ హెన్రీ కథలు

అనువాదం శ్రీరాగి

మొదటి ముద్రణ
జూన్, 1992

పల్లవి పబ్లికేషన్స్
ఏలూరురోడ్, విజయవాడ–2.

ముఖచిత్రం
క్రిజిన్

ప్రింటర్స్ :
ఆర్. వి. ప్రింటర్స్,
విజయవాడ-2.

891.73
S14 O

తెలుగు విశ్వవిద్యాలయ
గ్రంథాలయం
నమోదు సంఖ్య 40661
తేది 15.3.95

వెల :
సాధారణప్రతి రూ. 20-00
గ్రంథాలయప్రతి రూ. 30-00

అంకితము

జన్మనిచ్చి, పెంచి, పోషించిన జననీ, జనకులకు
(కీ॥ శే॥ కోపల్లి వెంకట అప్పారావు బి. య్యే.
కీ॥ శే॥ సౌభాగ్యమ్మ)
ప్రేమతో, భక్తితో.

"సుబ్బాలు"

అనువాదకుని గురించి

అసలు పేరు	:	కె. పి. యస్. సుబ్రహ్మణ్యేశ్వరరావు
కలం పేరు	:	"శ్రీరాగి"
జననం	:	2-3-27
తండ్రి	:	కీ॥ శే॥ కోపల్లి వెంకట అప్పారావు
తల్లి	:	కీ॥ శే॥ సౌభాగ్యమ్మ
భార్య	:	విమలాదేవి, సాహిత్యరత్న.
సంతానం	:	ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె
బాల్యం-చదువు	:	తెనాలి నగరం, గుంటూరు జిల్లా
విద్య	:	బి. యే. లిటరేచర్. (ఆంధ్ర యూనివర్సిటీ)
సాహిత్యం	:	1951 నుంచి రచనలు చేస్తున్నారు. చాలా కథలు వివిధ పత్రికలలో ప్రచురించబడినవి. మొదటి కథ "గుమాస్తా" 13-6-51 ఆంధ్ర పత్రిక వారపత్రిక. "నాడు—నేడు" ఫిబ్రవరి 92 స్వాతి మాసపత్రిక.
నవలలు	:	1969లో అధికారమూ-అంధత్వమూ 1989 లో బదిలీ
అనువాదం	:	"Call of the Heart"" రష్యను నవల "గుండె పిలుపు" పేరుతో అనువాదం చాలా రష్యను కథలు అనువాదం. An APPLE ఉదయం వార పత్రికలో ప్రచురణ. బదిలీ, అధికారమూ-అంధత్వమూ ఆంగ్లములోకి అనువాదం.

విషయసూచిక

1. క్రిస్మస్ బహుమతులు — 9
2. ఓ బిజీ బ్రోకరు శృంగారపు కథ — 17
3. విస్కీ-ప్లాస్కు — 23
4. పెద్ద మనిషిగా మారిన దొంగ — 30
5. ఓ వింత కథ — 43
6. నగరం యొక్క కంఠ ధ్వని — 45
7. విల్లీ తండ్రికి చేసిన సహాయము — 53
8. ప్రేమ పక్షులు — 58
9. దెబ్బ తీసిన ఆత్మత్యాగము — 62
10. ఆఖరి పత్రము — 72
11. వినోదపు డిటెక్టివులు — 80
12. మోలీ విజయము — 90
13. ఓ వింత జబ్బు — 93
14. హృదయాలు—హస్తాలు — 98
15. ఓ దిన పత్రిక కథ — 102
16. వెయ్యి డాలర్లు — 108
17. వయసు పైబడిన ప్రేమికులు — 118
18. ఇరవై సంవత్సరాల తర్వాత — 122
19. క్షురకుని ప్రసంగం — 128
20. గొప్ప డిటెక్టివ్ — 135
21. హెయిర్ టానిక్ — 144
22. 'బిన్‌క్లీ' పత్రికా రచన ప్రయోగశాల — 155

క్రిస్మస్ బహుమతులు

(The Gift Of The Magi)

'ఒక డాలరు, యెనభై సెంట్లు!' తన దగ్గర వున్న డబ్బంతా అదే? దాంట్లో అరవై సెంట్లు పెన్నీ నాణాలు వున్నాయి. కూరల వాడితోనూ, వెచ్చాల కొట్టు వాడితోనూ, గీరి గీరి బేరంచేసి సరుకుకొంటే, ఆ డబ్బు మిగుల్చుకో గల్గింది. "డెల్లా" ఆ డబ్బును మూమ్మారు లెక్కించింది. ఒక డాలరు యెనభై సెంట్లు! అంతే!

మరుసటి దినమే క్రిస్టమస్ పండుగ.

ఇంక తనేం చెయ్యగలదు ? ప్రక్కమీద పడుకొని యేడ్వటం తప్ప. పాపం డెల్లా సోఫాలో పడుకొని ఆ పనే చేసింది. ఈ జీవితంలో, తిట్లు, చివాట్లు తప్ప.... యేముంది ? చిరునవ్వులు యెప్పుడో!

ఆ భవనం క్రింద అంతస్థులో రోడ్డు మీదకున్న చిన్న గదికి తమ వుత్తరాల పెట్టె వుంది. దాంట్లో వుత్తరాలు యెవరు వేస్తారు ? తమను పిలవడానికుపయోగించే విద్యుత్ మీట వుంది. అది యెవరు వుపయోగిస్తారు ? అక్కడ చిన్న బోర్డు వుంది. దానిమీద "మిస్టర్ జేమ్సు డిల్లింగుహామ్ యంగు" అని అందంగా వ్రాసి వుంది.

డెల్లా దంపతులున్న భాగానికి అద్దె యెనిమిది డాలర్లు. ఆ యింటామె జీవితంలో మొదటిదశ నుంచి రెండవ దశకు చేరుకొంటున్నది ఆ యింటిని తదేకంగా పరీక్ష చేస్తే కొంతవరకు బిచ్చగాని యిల్లును పోలినట్లు కనపడుతుంది.

"డిల్లింగు హామ్" ధనవంతుడిగా వున్నప్పుడు వారానికి ముప్ఫయి డాలర్ల అద్దె యిచ్చి, అందమైన 'ఫ్లాటు'లో వుండేవాడు. కాని ఆయన ఆదాయమే యిరవై డాలర్లకు దిగిన తర్వాత, బోర్డుమీద వున్న 'డిల్లింగు హామ్' అక్షరాలు మసక మసకగా కనిపిస్తున్నాయి. మిస్టర్ జేమ్సు డిల్లింగు హామును ఆయన సతీమణి ముద్దుగా 'జేమ్సు' అని పిలుస్తుంది. 'డెల్లా' తన భర్త నెంతో గౌరవంతో, ఆదరంతో, చూసుకొంటుంది.

డెల్లా తన యేడ్పు మాని, తన బుగ్గలకు పౌడరు అద్దుకొని, కిటికీ ప్రక్కన నిలబడి బయటకి చూసింది.

ఒక బూడిద రంగు దొడ్లో, ఓబూడిదరంగు కంచెమీదుగా, బూడిద రంగులో వున్న పిల్లి నడిచిపోతున్నది.

రేపే క్రిస్టమస్!!

తన దగ్గర వున్న 1.80 డాలర్లతో భర్తకి బహుమానం కొనాలి. అంత చిన్న మొత్తంతో, ఏమి విలువైన బహుమానము తను కొనగలదు? ప్రతి వారం యెంతో కష్టపడి మిగిల్చినా యింతకన్నా పెద్ద మొత్తము కూడపెట్టలేక పోయింది. తన జీతం వారానికి 20 డాలర్లు. తను అనుకొన్నదానికంటే ఖర్చులు విపరీతంగా వున్నాయి. ఖర్చు లెప్పుడూ అలాగే వుంటాయి. అతనికి అందమైన బహుమానం కొనాలనుకొంటూ తను యెన్నో రోజులు గడిపింది.

గదిలోని కిటికీల మధ్యగా బరువైన ఓ అద్దముంది ఆమె కిటికీ నుంచి కదిలి, ఆ అద్దంలో తన ప్రతిబింబము చూసుకొంది. ఆమె నేత్రాలు కాంతితో ప్రకాశిస్తున్నాయి. కాని యిరవై సెకండ్లలో ఆ ముఖపు రంగు మారింది. వెంటనే ఆమె వెనుక వ్రేలాడుతున్న, అందమైన జుట్టుని, తన ముఖం మీదకి లాగుకొంది.

జేమ్సు దంపతులు గర్వింపతగిన వస్తువులు వారి యింట్లో వున్నవి రెండు! ఒకటి జేమ్సు చేతికి వున్న బంగారపు గడియారము. ఆయన

తాత తండ్రుల నుంచి ఆయనకు సంక్రమించింది. రెండవది డెల్లా యొక్క కేశ సంపద. అది రాణి 'షేబా' జుట్టుకన్న యెంతో మనోహరమైన దని, నిశ్చయంగా, గర్వంగా, చెప్పగలదు డెల్లా. 'కింగ్‌సాల్మన్' ఆ భవనపు 'జానిటరు'గా (భవనంలోని నేలలను, గోడలను శుభ్రపరిచే వుద్యోగి) పనిచేసి వుంటే, జేమ్సు తన గడియారాన్ని ఆయన ముందు యెన్ని సార్లు గర్వంగా ప్రదర్శించేవాడో! అంతటి గొప్పరాజు కూడా, తన చేతి గడియారము చూసి, అసూయ పడేవాడు. ఆమె జుట్టు పైనుంచి దూకే జలపాతపు అలల లాగా, గొప్పగా ప్రకాశిస్తున్నది. అది ఆమె మోకాళ్ళ దాకా జారి, ఆమె ధరించే గౌనులాగా కన్పిస్తున్నది. వెంటనే, వణుకుతున్న చేతులతో, తన జుట్టును వెనక్కి వేసుకొంది. ఆమె ఓ నిమిషం అలాగే నిలబడిపోయింది. ఆమె నేత్రాల నుండి ఒకటి, రెండు అశ్రుకణాలు కారి, మాసిపోయిన, ఎర్రని తివాచీ మీద పడ్డాయి.

తన గోధుమ రంగు పాత జాకెట్టు తొడుక్కొని, తన గోధుమ రంగు పాత టోపీని నెత్తిమీద ధరించింది. ఆమె కళ్ళలో యింకా మెరుపులు మెరుస్తుండగా, సుడిగాలి వేగముతో, తన గది తలుపులు తీసుకొని, మేడ మెట్లు దిగి, వీధిలోకి వచ్చింది. అక్కడ "మేడమ్ సోఫ్రానీ" దుకాణములో, కేశములకు సంబంధించిన అన్ని వస్తువులు దొరుకును అనే బోర్డు ముందర నిలబడి. రొప్పుతూ, రోజుతూ, ఓ అంతస్థు పైకెక్కి, 'మేడమ్ సోఫ్రానీ' ముందు ప్రత్యక్షమయింది. ఆమె చాలా లావుగా, తెల్లగా, పెద్దదిగా వుంది. ఆమెలో పేరుకు తగిన మృదుత్వము కనిపించుట లేదు.

"మీరు నా కేశములను కొంటారా ?" అడిగింది ఆమెను డెల్లా.

"నేనందుకే యిక్కడ వున్నాను. మీ టోపీ తీస్తే, మీ కేశ సంపద నొకసారి వీక్షిస్తాను...." మేడమ్ అంది.

రాగి రంగులో, జలపాతపు అలల లాగా, నిగ నిగలాడుతున్న డెల్లా జుట్టును ఆమె తదేకంగా చూసింది.

"ఇరవై డాలర్లు!" అన్నదామె అనుభవం గడించిన తన హస్తముతో డెల్లా జుట్టును పైకెత్తుతూ.

"ఆ డబ్బు యిలా యివ్వండి! వెంటనే!" అన్నది డెల్లా.

ఓ ! తర్వాత మేడమ్ సోఫ్రానీ కత్తెరలు డెల్లా యొక్క గులాబీ రంగు జుట్టుమీద నాట్యమాడాయి. తన భర్త కిచ్చే బహుమతి కోసం.... డెల్లా.... రెండు గంటలు బజారులోని దుకాణములన్నిటినీ శోధించింది.

చివరకు ఆమెకు కావలసిన వస్తువు దొరికింది. అది జిమ్మీ కోసమే ప్రత్యేకముగా చేయబడినట్లు వుంది. అలాంటి వస్తువు మరి యే యితర దుకాణములోనూ లేదు. అది ప్లాటినంతో చేయబడిన చేతి గడియారపు గొలుసు. మంచి డిజైనుతో చాలా అందముగా కన్పిస్తున్నది. అది జేమ్సు దగ్గర వున్న గడియారానికి సరితూగేటట్లుగా వుంది. దానిని చూడగానే జిమ్మీకోసం కొనాలని నిశ్చయించుకొంది. ప్రశాంతతలోనూ, విలువలోనూ జేమ్సును పోలివుంది.

ఇరవై ఒక్క డాలర్లు ఆ గొలుసుకోసం డెల్లా యిచ్చింది. ఇంక తన వద్ద మిగిలిన 80 సెంట్లతో, హడావుడిగా యింటికి తిరిగి వచ్చింది. ఇంక జేమ్సు తన పాత తోలు గొలుసును వాడక్కరలేదు. అందమైన గొలుసుకు బిగించిన తన బంగారపు గడియారంలో, తనకు కావలసినప్పుడల్లా టైము చూసుకోగలడు.

డెల్లా యింటికి చేరిన తర్వాత ఆమె నావహించిన మత్తు కొద్దిగా తగ్గింది. ఆమె తన దగ్గరవున్న వంకరలు తిరిగిన యినుప పనిముట్టుతో గ్యాసు వేడితో, తన తల మీద మిగిలిన జుట్టును, గిరజాల జుట్టుగా మార్చటానకి చాలాసేపు తిప్పలు పడింది.

నలభై నిమిషాలు ఆమె శిరస్సు మీద దగ్గర దగ్గర గిరజాలతో

కూడిన జుట్టు తయారైంది. ఆమె యిప్పుడు పాఠశాలనుంచి పారిపోయిన విద్యార్థినిలాగా కనబడుతున్నది.

ఆమె తన ప్రతిబింబాన్ని అద్దంలో జాగ్రత్తగా విమర్శనా దృష్టితో చూసింది.

జేమ్సు రెండవసారి నన్ను చూడకముందే చంపకుండావుంటే నేను 'కోనీద్వీపపు అమ్మాయి' లాగా కనపడుతున్నానని అనగలడు. కాని నేనేం చెయ్యగలను ? ఒక డాలరు ఎనభై సెంట్లతో నేనేం చెయ్యగలను.

తనలో తానే అనుకుంది డెల్లా.

జిమ్మీ యింటి కెప్పుడూ ఆలస్యంగా రాడు. డెల్లా తన చేతిలో గొలుసును రెండుగా మడిచింది. తలుపుకు దగ్గరలో టేబిలుకు ఓ మూల కూర్చున్నది అటువేపు నుంచే జిమ్మీ లోపలికి వస్తాడు.

మొదటి అంతస్థు మెట్లమీద జిమ్మీ అడుగుల చప్పుడు విన్పించింది. ఆమె ముఖం ఒక్క నిముషం పాలి పోయింది. ప్రతిరోజూ, ప్రతి చిన్న విషయానికీ, ఆమెకు భగవంతుని ప్రార్థించే అలవాటుంది. ఆమె దేవుణ్ణి యిలా ప్రార్థించింది.

"ఓ భగవంతుడా! నేను యింకా అందముగానే వున్నట్లు ఆయనకు కన్పించనీ!" అని.

గది తలుపు తెరుచుకొంది జిమ్మీ లోపలికి వచ్చి దానిని తిరిగి మూసాడు. చిక్కినట్లుగానూ, దీర్ఘాలోచనలో వున్నట్లుగానూ, అతను కన్పిస్తున్నాడు. పాపం! ఇరవై రెండేళ్ళ వయసులోనే, కుటుంబభారం తనమీద పడింది. అతనికి క్రొత్త ఓవర్‌కోటు కావాలి. అతని చేతికి తొడుగులు లేవు.

జిమ్మీ తలుపు దగ్గరే ఆగిపోయాడు. మాంసపు వాసన గుర్తించి ఆగిపోయిన శునకంలాగా. అతని కళ్లు డెల్లా మీద కేంద్రీకరించినై. డెల్లా చదవలేని భావమేదో ఆ కళ్ళల్లో ప్రతిఫలించింది. అది ఆమెను భయాభ్రాంతను చేసింది. అది అతని కోపం కాదు, ఆశ్చర్యం కాదు,

భయం కాదు, అసమ్మతి కాదు. ఆమె అనుకొన్న యే భావమూ కాదది. అతడు పూరికే ఆమె ముఖం వంక చూస్తూ వుండిపోయాడు.

ఆమె బిల్లను ప్రక్కకు త్రోసేసి. అతని ముందుకు వెళ్ళింది.

"జిమ్! డార్లింగు!" ఆమె పెద్దగా ఏడుస్తూ అన్నది. "నా వేపు అలా చూడకు. నేను నా జుట్టు కత్తిరించుకొని అమ్మేసాను. నీకు క్రిస్టమస్ పండక్కి బహుమానం యివ్వకుండా నేను బ్రతికి వుండలేను. నా జుట్టు త్వరలోనే తిరిగి పెరుగుతుంది. నువ్వేమీ అనుకోవుగదూ ? నేను అలా తప్పనిసరిగా చెయ్యాల్సివచ్చింది. నా జుట్టు త్వరగా, భయంకరంగా పెరుగుతుంది. నీకు తెలీదు.... నీ కోసం యెంత మంచి అందమైన బహుమానం తెచ్చానో!"

"నీవు నీ జుట్టు కత్తిరించుకొన్నావా ?" జిమ్మీ కష్టంమీద అడిగాడు అతడెంత శ్రమపడినా, ఆ సత్యాన్ని గ్రహించ లేకుండా వున్నాడు.

"అవును.... నేను నా జుట్టును కత్తిరించి అమ్ముకొన్నాను. డెల్లా అన్నది. "నీవు... నన్ను.... ఈ ఆకారంలో మెచ్చుకోలేవా ? నాకు జుట్టు లేదు.... అయినా.... నేను.... నేనే.... కాదా....?"

జిమ్మీ ఆ గది అంతా చూసాడు యేదో తెలుసుకోవాలని.

"నీవు జుట్టు పోయిందని చెప్తున్నావా ?" అతడు మూర్ఖంగా అడుగుతున్నాడు.

"అవును. దానికోసం నీవు వెతకక్కరలేదు" డెల్లా అంది. నేను దానిని అమ్మేశాను నేను చెప్తున్నాను.... అలా అని రేపు క్రిస్టమసు పండుగ! దానిని నీ కోసమే అమ్మేశాను. నీవు నాపట్ల సుహృద్భావము చూపించు.... నా వెంట్రుకలనయితే లెక్కించవచ్చు". "ఆమె తన గొంతులో మాధుర్యాన్ని నింపుకొంటూ అంది. "కాని యెవరూ కూడ నాకు నీ మీద వున్న ప్రేమను గణించలేరు.... నేను.... భోజనంలోకి బంగాళా దుంపలు వేయించాను జిమ్!"

తన మత్తులో నుంచి జిమ్మీ త్వరలోనే మేల్కొన్నాడు. అతడు డెల్లాను కౌగిలించుకొన్నాడు. పది సెకండ్లు అలా వాళ్ళిద్దరిని గమనించండి

వారానికి ఎనిమిది డాలర్లు అయినా, సంవత్సరానికి పది లక్షల డాలర్లు అయినా దానిలో బేధమేమిటి? ఓ గణిత శాస్త్రజ్ఞుడు దానిని గురించి తప్పుగా చెప్పవచ్చు.

ముగ్గురు తెలివైన వ్యక్తులు 'బేబీ జ్యూసస్'కు క్రిస్మస్ బహుమతులు తెచ్చియుండవచ్చు. కాని ఆ ప్రత్యేక బహుమతి వాటిలో లేదు. ఈ విషయం మీకు తర్వాత తెలుస్తుంది.

జిమ్మీ తన ఓవర్ కోటు జేబులో నుంచి ఓ ప్యాకెటు తీసి బల్ల మీద విసిరేసాడు.

"నీవు నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దు డెల్!" జిమ్మీ అన్నాడు. తల కత్తిరించుకొన్నా, క్షవరం చేసుకొన్నా, షాంపూ రాసుకొన్నా, నేను నా ప్రియురాలిని తక్కువగా చూడను.... కాని నీవు ఆ ప్యాకేజీ విప్పి చూస్తే నీకే తెలుస్తుంది, నే నెందు కింత దిగ్భ్రాంతి చెందుతున్నానో!"

వణుకుతున్న తన తెల్లటి వ్రేళ్ళతో ఆమె ప్యాకేజీ మీద వున్న దారాన్ని విప్పింది. అనంతమైన, నిర్వచించలేని కేక ఒకటి ఆమె గొంతు నుంచి వచ్చింది. కాని.... అయ్యో! వెంటనే ఆమె అసలైన స్త్రీలాగా, బేలతనంతో, కన్నీళ్ళు కార్చింది. ఆమె దుఃఖంలో యెంత ఆవేదన వున్నదంటే, భగవంతుడొక్కడే ఆమె ఆవేదనను తీర్చగలడా అన్నట్లుగా.

కారణ మేమంటే, ఆ బల్లమీద అనేకరకాలైన దువ్వెనలు.... ప్రక్కపాపిటి, నిలువుపాపిటి, వెనుక జుట్టును దువ్వుకోవటానికి వీలైన దువ్వెనలు అక్కడ వున్నాయి. అవి కావాలని ఆ యింట్లో కిటికీ దగ్గర కూర్చొని.... ఎన్నాళ్ళు తపస్సు చేసిందో! అందమైన దువ్వెనలు తాబేలు చర్మముతో చేసినవి చెమ్కీ అంచులతో అదృశ్యమై పోయిన తన తల జుట్టులో అలంకరించుకొనేందుకు వీలైన రంగులలో అవి చాలా ఖరీదైన దువ్వెనలు.... ఆమెకు తెలుసు! ఆమె వాటిని స్వంతం చేసుకోవటానికి తపించి కృశించి పోయింది.

కాని అవన్నీ యిప్పుడు ఆమె సొత్తయినాయి. కాని.... యే జుట్టునయితే అవి అందంగా అలంకరించగలవో, ఆ జుట్టు యిప్పుడు లేదు.

కాని ఆమె వాటిని తన హృదయాని కత్తుకొంది.

చివరికి కాంతి హీనమైన తన కళ్ళనెత్తి జిమ్మీ వంక చూసి యిలా అనగలిగింది. "జిమ్! నా జుట్టు త్వరగా పెరుగుతుంది" అని.

డెల్లా చిన్న పిల్లలాగా ఆనందంతో గంతులేసింది.

జిమ్మీ యింకా తన ప్రేయసి డెల్లా తెచ్చిన అందమైన బహుమానం చూడలేదు. దానిని ఆమె తన అరచేతిలో వుంచుకొని చూసించింది. మూగదైన విలువైన ఆ వాచీ గొలుసు.... ఆమె శక్తివంతమైన మనోహరమైన శక్తితో ప్రకాశిస్తున్నది.

"జిమ్! ఆ గొలుసు చాలా అందంగా లేదూ ? దానికోసం నేను వూరంతా గాలించాను. ఇప్పుడు నీవు రోజూ వందసార్లు టైము చూసుకో వచ్చు. నీ చేతి గడియారము యివ్వు దానికి పెడితే అది ఎంత అందంగా వుంటుందో నేను చూస్తాను.

డెల్లా చెప్పిన దానిని చెయ్యటానికి మారుగా జిమ్మీ గదిలోని సోఫా మీద దొర్లటం ప్రారంభించాడు. తల క్రింద చేయి పెట్టుకొని, డెల్లా వంక చూసి, మందహాసం చేసాడు.

"డెల్!" అతడు అన్నాడు. "మన క్రిస్టమస్ బహుమతులను కొంచెంసేపు దూరంగా వుంచుదాం. ఎందుకంటే అవి ప్రస్తుతం మనం వాడుకోవటానికి పనికిరావు. నీ తల దువ్వెనలు కొనటం కోసం నా వాచీ అమ్మేసాను. ఇంక ఈ వస్తువులను దూరంగా వుంచు!

ఇద్దరు మూర్ఖులైన పిల్లలు తాము ప్రేమించిన వారికి క్రిస్టమస్ బహుమతులు యివ్వటానికి తమ దగ్గర వున్న విలువలేని వస్తువులను త్యాగం చేసారు.

క్రిస్మస్ బహుమతులలో వారి బహుమతులే గొప్పవని మనం అనుకోవచ్చు. క్రిస్టమస్ పండక్కి బహుమతులిచ్చి పుచ్చుకొనే వాళ్ళలో వాళ్ళిద్దరే తెలివిగలవాళ్ళుగా గణించవచ్చు.

)—o—(

ఓ బిజీ బ్రోకరు శృంగారపు కథ

(The Romance of a Busy Broker)

"హార్వీమాక్సువెల్ బ్రోకరు హడావుడిగా తన కార్యాలయములోకి ప్రవేశించాడు. ఆయన ప్రక్కన యస్థానంలోవున్న అందమైన లేడీ స్టెనోగ్రాఫరు వుంది. 'పిచ్చర్' బ్రోకరు యొక్క అంతరంగిక గుమాస్తా. తన యాజమాని వంక, మామూలు నిరాశక్తతతో, ఆశ్చర్యంలేని చూపు చూసాడు. అప్పుడు ఉదయం సరిగా తొమ్మిదిన్నర గంటలయింది.

'గుడ్ మార్నింగ్ పిచ్చర్!' అంటూ మాక్సువెల్ తన అంతరంగిక గుమాస్తాకు సుప్రభాతం చెప్పాడు. వెంటనే తనగదిలోని బల్లవద్దకు వెళ్ళి తనపనిలో నిమగ్నుడయ్యాడు. ఆయన బల్లమీద పుత్తరాలు, టెలిగ్రాములు కుప్పలు కుప్పలుగా వున్నాయి.

యుక్తవయస్సులో వున్న ఆ లేడీ స్టెనోగ్రాఫరు ఒక సంవత్సరము నుండి ఉద్యోగముచేస్తున్నది. ఆమె చాలా నిరాడంబరముగా వుంది. ఆమె మెడలో గొలుసు లేదు. చెవులకు లోలకులులేవు. చేతులకు గాజులు లేవు. ఆమె చాలా సాధారణమైన బూడిదరంగు దుస్తులు ధరించింది. అవి ఆమె విగ్రహానికి బాగా సరిపోయి, ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. ఆమె శుభ్రమైన, నల్లటి టోపీకి, ఆకుపచ్చని బంగారపు పక్షిరెక్క బిగించబడి వుంది. ఆ వుదయం ఆమె చాలా మృదువుగా వుండి, వింతకాంతితో ప్రకాశిస్తున్నది. ఆమె నేత్రాలు కాంతితో మెరుస్తున్నాయి. ఆమె చెక్కిళ్ళు గులాబిరంగుతో తళతళలాడుతున్నాయి. ఆమె ముఖంలో ఆనందం పుట్టి పడుతున్నది.

పిచ్చర్‌కు ఆమె వేషభాషలలో యేదో ఒక ప్రత్యేకత కనబడుతున్నది. మామూలుగా తనయజమాని ప్రక్కగదిలోకి వెళ్ళి కూర్చోకుండా ఆహాలులోనే, యేదో అనిశ్చయత్వంతో, కొంచెం సేపు తారట్లాడింది. ఒకసారి యజమాని 'మాక్సువెల్' చూపులను ఆకర్షించేటంత దగ్గరగా ఆయన బల్లదగ్గరకు వెళ్ళింది.

కాని ఆ బల్ల ముందు కూర్చున్నతడు మనిషి అని చెప్పలేము. అతడు ఒక యంత్రము! చక్రములచేత, నడుపబడుతున్నటువంటి, స్ప్రింగులతోటి, విప్పబడుతున్నటు వంటి యంత్రము లాంటి, న్యూయార్కునగరములోని, బ్రోకరు వ్యాపారస్థుడతడు.

"మంచిది! ఏమిటి సంగతి?" ఆమెను మాక్సువెల్ చురుకుగా అడిగాడు. అతని బల్లమీద ఎత్తుగా పేరుకొని పోయి వున్న వుత్తరాల కట్టను తెరచి చూస్తున్నాడు. అతను చురుకైన చూపుతో, ఆమెవంక నిర్లక్ష్యముగా చూసాడు.

"ఏమీలేదు!" అంటూ స్టెనోగ్రాఫర్, చిరునవ్వుతో ఆయనకి దూరంగా వెళ్ళింది

ఆమె ఆంతరంగిక గుమస్తాను, అడిగింది.

"మిస్టర్ పిచ్చర్! స్టెనోగ్రాఫరును నియమించే విషయం గురించి మిస్టర్ మాక్సువెల్ నిన్న నీతో యేమన్నా చెప్పారా?"

"అవును ఇంకొక స్టెనోగ్రాఫరును రప్పించమని అడిగారు. నిన్న సాయంకాలమే వుద్యోగస్థులను పంపే వ్యాపారసంస్థకు ఫోనుచేసి ఈ వుదయం స్టెనోగ్రాఫరు వుద్యోగానికి కొంతమంది అభ్యర్థులను పంపమని చెప్పాను. ఇప్పుడు 9.45 అయిండి, కాని యింతవరకెవ్వరూ రాలేదు.

అంటూ పిచ్చర్ సమాధానం చెప్పాడు.

"అలా అయితే ఎప్పరైనా యింకొకరు వచ్చేటంత వరకు స్టెనోగ్రాఫరు పని నేను చూస్తాను. "అంటూ తను కూర్చునే బల్ల దగ్గరకు వెళ్ళి ఆకు పచ్చని బంగారపు రెక్కగుచ్చబడిన తన నల్లటోపీని, తను మామూలుగా వుంచే స్థానములో వుంచింది తరువాత తన పనిలో నిమగ్నమయింది.

కవి అయినట్లయితే, జీవితములో అతి సందడిగా వున్న వేళలను గూర్చి గానము చేయగలడు. కాని వ్యాపారస్థుల విషయం అందుకు భిన్నంగా వుంటుంది వాళ్ళు సెకండ్లు నిమిషాలను, డబ్బుతో లెక్కిస్తారు.

పైగా ఈరోజు "హార్వే మాక్స్‌వెల్"కు చాలా ఎక్కువ పనిదినము. ఒక ప్రక్కన టెలిప్రింటరులో సమాచారము వచ్చిపడుతున్నది. మరో ప్రక్కన టెలిఫోన్లు విడవకుండా మ్రోగుతున్నాయి. వ్యాపారస్థులు,వాటకం దార్లు గుంపులు, గుంపులుగా ఆయన కోసం కార్యాలయంలోకి వస్తున్నారు. వాళ్ళలో సంతోషముతో మాట్లాడేవాళ్ళు కొంతమంది అయితే, కోపముతో మాట్లాడేవాళ్ళు మరి కొందరు. మరి వ్యాపారపు లావాదేవీల ప్రభావము వాళ్ళనలా మాట్లాడేటట్లు చేస్తుంది. గుమాస్తాలు, తుపాకులోని నావికుల లాగా, అటూ యిటూ పరుగులు తీస్తున్నారు.

పిచ్చరు ముఖములో గూడా జీవము కళకళలాడుతున్నది. ఈ స్టాక్ ఎక్స్ఛేంజి వ్యాపారంలో, జమాపజమాలు మంచు తుఫానులా, చల్లని మంచు జల్లులా వుంటాయి వాటి ప్రభావము బ్రోకర్ వ్యాపారములో ప్రతిఫలిస్తుంటాయి.

"మాక్స్‌వెల్' తనకుర్చీలో అటూయిటూ తిరుగుతూ, ఒక నృత్య కళాకారునిలా,తనపని చూసుకొంటున్నాడు. టెలిప్రింటరు నుంచీ, ఫోనుకూ బల్లనుంచి ద్వారము దగ్గరకూ, శిక్షణ పొందిన బఫూనులా గెంతుతున్నాడు.

ఇంత ఒత్తిడిపనిలో కూడా, తన గదితలుపు తెరవెనుక ఒక అంద మైన యువతి, ఆడంబరముగా అలంకరించుకొని నిలబడి వుండటం 'మాక్స్‌వెల్' గమనించాడు.

పిచ్చరు గూడా, ఆమె వెంబడీ నిలబడి వున్నాడు. పిచ్చరు మాక్స్ వెల్ ముందుకు వచ్చి అన్నాడు. "స్టెనోగ్రాఫర్ల ఏజన్సీ నుంచి ఓ యువతి మన కార్యాలయంలో వుద్యోగం కోసం వచ్చింది."

"మాక్స్‌వెల్" తనతలను వీరివేపు సగము మాత్రమే త్రిప్పాడు

"ఏం వుద్యోగం?" కోపముతో అడిగాడు.

స్టెనోగ్రాఫరు వుద్యోగము మీరు నిన్న స్టెనోగ్రాఫరు కోసం

అభ్యర్థులను పిలిపించమని నాకు చెప్పారు ఏజన్సీ వాళ్ళు ఈమెను పంపించారు !

"మిస్టర్ పిచ్చర్! నీకు మతి పోతున్నదయ్యా!" అన్నాడు మాక్సువెల్. అటువంటి సలహాను నేను నీకెందుకిచ్చి వుంటాను? ఇక్కడ ఒక సంవత్సరం నుంచి పనిచేస్తున్నా "మిస్ లెస్లీ" తృప్తికరంగా పనిచేస్తున్నది గదా! ఆమె యెంతకాలం పనిచేయ తలచుకొంటుందో, అంతకాలం ఆ వుద్యోగం ఆమేదే! అమ్మాయి! ఇక్కడ స్టెనోగ్రాఫరు వుద్యోగ మేదీ ఖాళీలేదు. ఏజన్సీ వాళ్ళ కిచ్చిన ఆ ఆర్డరును వెంటనే రద్దు చెయ్యండి. పిచ్చరుగారూ! ఇంక యిటువంటి స్టెనోగ్రాఫర్లను నా వద్దకు పంపించవద్దు!"

పాపమా అందమైన స్త్రీ, కోపంతో, తనకాలి బూట్లతో పెద్దగా చప్పుడు చేస్తూ ఆ కార్యాలయం నుంచి నిష్క్రమించింది.

పిచ్చర్ అక్కడ వున్న అకౌంటెంటుతో యిలా అన్నాడు. "మన యజమానిగారికి రానురాను మతిమరపు తనం యెక్కువై పోతున్నది. నిన్న చెప్పినది యివ్వాళ మర్చిపోతున్నాడు" అని.

తర్వాత పని వొత్తిడి యింకా యెక్కువైంది. స్టాక్ ఎక్స్ఛేంజిలో బేరాలు-కొనడం అమ్మటం-జోరుగా సాగుతున్నాయి. ఓ డజను కంపెనీ షేర్లలో మాక్సువెల్ వాడకం దార్లు చాలాధనం పెట్టుబడి పెట్టారు వాటిలో క్రయ విక్రయాలు ఆకాశంలో ఎగిరే డేగల వేగంతో జరిగిపోతున్నాయి.

మాక్సువెల్ పెట్టుబడి పెట్టిన కొన్ని కంపెనీ వాటాలకే పెద్దనష్టం వచ్చింది. ఆయన చాలా సున్నితమైన బలమైన, యంత్రములాగా పని చేస్తున్నాడు. మంచి ఔన్నసుతో వేగముతో ఎక్కడా జంకకుండా, సరియైన అంకెలతో, పదజాలముతో, తిరుగు లేని నిర్ణయాలతో గడియారము లాగా అతను పనిచేస్తున్నాడు. ఆ సమయములో మానవ ప్రపంచముతో గాని, ప్రపంచ ప్రకృతితోగాని, అతనికి సంబంధము లేదు.

నుదుటి మీద చెదిరిన జుట్టుతో, చేతిలో ఎన్నో టెలిగ్రాములు మెమోలతో, తన కుడి చెవిలో ఓ కలముంచుకొని, మాక్సువెల్, తన పని చేసే బల్లముందు నిల్చొని వున్నాడు.

అతడు తన గదిలో కిటికీలను తెరచేవుంచాడు బయట వెచ్చనిగాలి తనగదిలోకి ప్రసరించేటట్లుగా. అది వసంతకాలము.

ఆయన కిటికీలో నుంచి, సున్నితమైన, మధురమైన, సువాసన ఆయన గదిలోకి విసురుగా వచ్చి, ఒక్క నిమిషము ఆయనను కదల కుండా చేసింది ఆ మధురమైన సువాసన, మిస్ లెస్లీకి సంబంధించినదే. ఆ సువాసన. ఆ పరిమళము, ఆమె స్వంతము అది ఆమెదే.

ఆ సువాసన స్పష్టముగా కళ్ళకు కనిపించేటంతగా, తాకటానికీ, తగినంత దూరములోనికి ఆమెను తీసుకొచ్చింది. ఆమె....యిరవై అడు గుల దూరములో వున్న ప్రక్కగదిలో వుంది. డబ్బుతో కూడిన ఈ ప్రపంచమంతా, ఒక చిన్న బిందువుగా మారినట్లయింది. ఆ బ్రోకరు.... మహాశయునికి.

"భగవంతుడా! ఆపని నేనిప్పుడు చెయ్యాలి!" ఆయన సగముపైన విన్పించేటట్లు అన్నారు. "ఆమెనిప్పుడే అడుగుతాను. ఇంతవరకు నేనెందు కడగలేదో నా కాశ్చర్యముగా వున్నది!"

అతడు, ఆమెవున్న గదిలోకి, దూసుకువెళ్ళాడు. ఆమె బల్లముందు ఆమె కెదురుగా నిల్చొన్నాడు.

ఆమె ఆయన వంక చిరునవ్వుతో చూసింది. ఆమె చెక్కిళ్ళు సిగ్గు తో ఎరుపెక్కాయి. ఆమె నేత్రాలు పవిత్రతను సూచిస్తున్నాయి. మోచేతి మీద ఆమె బల్లముందు నిలబడ్డాడు మాక్సువెల్! అతడి చేతిలో యింకా ఆఫీసు కాగితాలున్నాయి. చెవిలో కలముంది.

"మిస్ లెస్లీ!" అతను త్వరత్వరగా మాట్లాడాడు. నాకిప్పుడొక నిమిషము విశ్రాంతి దొరికింది ఇప్పుడే నా మనస్సులో వున్నది స్పష్టంగా చెప్పాలనుకొంటున్నాను. నీవు నాకు భార్యగా వుండగలవా? మామూలు పద్ధతిలో నిన్ను ప్రేమించి, వివాహమాడటానికి. నాకు టైము లేదు కాని నిన్ను నేను నిజముగా ప్రేమిస్తున్నాను. దయచేసి త్వరగా నీ అభిప్రాయం చెప్పు! ఆ దుర్మార్గులు నా ముందు సిద్ధముగా వున్న అమృతాన్ని నానుంచి లాక్కోవటానికి నన్ను బాధ పెడ్తున్నారు."

"ఓ! మీరేమి మాట్లాడుతున్నారు?" స్టెనోగ్రాఫరు తన విభ్రమాన్ని ప్రకటించింది. ఆమె తలకుర్చీలో నుంచి లేచి, తన గుండ్రని నేత్రాలతో, అతనివంక, తేరిపార చూసింది.

"నీవు అర్థము చేసుకోలేవా?" అతను తననుతాను అదుపు తెచ్చుకోలేని స్థితిలో వున్నాడు. "నేను నిన్ను వివాహమాడాలని కోరుతున్నాను. మిస్ లెస్లీ! నేను నిజంగా నిన్ను ప్రేమిస్తున్నాను. ఇది వరకే నీకీసంగతి చెప్పాలను కొన్నాను. కాని యిప్పుడే ఒక్క నిమిషము నాపని ఒత్తిడి నుంచి విశ్రాంతి దొరికింది. వాళ్ళు తిరిగి నన్ను ఫోనులో పిలుస్తున్నారు! పిచ్చర్! వాళ్ళను కొంచెముసేపు ఆగమని చెప్పు, మిస్ లెస్లీ! నీ నిర్ణయం త్వరగా చెప్పవా?"

మాక్స్‌వెల్ గబగబా తన అభిప్రాయం చెప్పాడు. స్టెనోగ్రాఫర్ చాలా తమాషాగా ప్రవర్తించింది. మొదట ఆమె సంభ్రమముతో నిండిపోయింది. తర్వాత కళ్ళ నీళ్ళు కార్చింది. తర్వాత చిరునవ్వునవ్వింది ప్రకాశవంతంగా ఆమె తనచేతిని ఆ బ్రోకరు మెడమీద, నెమ్మదిగా, మృదువుగా వుంచింది.

"నాకిప్పుడర్థమవుతున్నది!" ఆమె అన్నది. "ఈ వెధవవ్యాపారము మీ బుర్ర చెడగొట్టుతోన్నది. అన్ని మర్చిపోయేటట్లు చేస్తున్నది. మొట్ట మొదట మిమ్మలను చూసి నాకు భయమేసింది. హార్వీ మహాశయా! మీకు జ్ఞాపకం లేదా? నిన్న రాత్రి ఎనిమిది గంటలకు, ఈ వీధి చివరవున్న చిటల్ చర్చి"లో మన వివాహం జరగలేదా?"

దిగ్భ్రమ చెందటం యిప్పుడు "హార్వే మాక్స్‌వెల్" వంతయింది.

)—o—(

వి స్కీ ఫ్లా స్కు
(The Pint Flask)

హౌస్టను పట్టణములో ఒక ప్రఖ్యాతి వహించిన "కర్నల్" వున్నాడు అతడు చర్చిలోగూడా ప్రముఖ సభ్యుడు. అతడు ప్రతి ఆదివారమూ, ప్రార్థనకు, కుటుంబముతో చర్చికి వెళతాడు. ఆ ఆచారప్రకారమే ఆ ఆదివారము చర్చికి కుటుంబముతో బయలుదేరాడు. అతడు చాలా మంచివాడని, నెమ్మదస్తుడని, పేరుపడ్డాడు. అతడు ధరించిన నల్లని పొడుగైన కోటు, బూడిదరంగు ట్రౌజరూ, అతనికి బాగా సరిపోయినై. వాటిలో అతడు విలాసముగా కనబడుతున్నాడు. పెద్ద బజారులో కొంత దూరము నడిచిన తర్వాత, కర్నలుకు తన ఆఫీసుగదిలో బల్ల మీది వుంచిన వుత్తరం జ్ఞాపకం వచ్చింది. దానిని తాను వెనక్కివెళ్ళి తీసుకొస్తానని చెప్పి, వాళ్ళనక్కడే ఆగమని చెప్పి తన ఆఫీసు గదిలోకి వెళ్ళాడు. అక్కడ వుత్తరం తీసుకొని వస్తుండగా, ఆ బల్ల మీద ఒక ఔన్సు విస్కీ వున్న పెద్ద ఫ్లాస్కు కనిపించి అతనిని చకితుణ్ణి చేసింది. అతనికి విస్కీ అంటే గిట్టదు. ఎప్పుడూ ఒక్క చుక్కగూడా ముట్టుకొని వుండడు. తనని ఎగతాళి చెయ్యాలని ఎవరో తమాషాకోసం ఆ ఫ్లాస్కును అక్కడ పెట్టి వుంటారని అతడు తలపోసాడు.

ఆ ఫ్లాస్కును వీధిలోకి విసిరి వెయ్యాలని ఆలోచించి యింటి వెనుక తలుపు దగ్గరకు వెళితే, ఆ తలుపు తాళం వేసి వుంది. కిటికీ తలుపు తెరచి వీధిలోకి పారవేద్దామని తలుపు నెత్తటానికి ప్రయత్నిస్తే అది లేవలేదు. ఇంతలో కర్నలు భార్య, కర్నలు యింటిలో యింతసేపు యేమి

చేస్తున్నాడని ఆశ్చర్యముతో తలుపు తెరుచుకొని లోపలికి వచ్చింది. ఆమెను చూసి కర్నలు గాభరాపడి తనేమి చేస్తున్నాడో తెలుసుకోకుండా ట్రౌజరు వెనుక జేబులో దాచాడు.

"ఏమిటి ? మీరింత ఆలస్యం చేస్తున్నారు ? ఉత్తరం కనపడ లేదా?" అంటూ కర్నలు భార్య ప్రశ్నించింది. దానికి సమాధానం చెప్పలేని కర్నలు, ఆమెతో బయటికి వచ్చాడు అతడు ఫ్లాస్కును ఆమెకు చూపించి పరిస్థితి వివరించి వుండాల్సింది. కాని అతడు ఆ పని చెయ్యక తన అవకాశాన్ని పోగొట్టుకొన్నాడు. దానిని తన వెనుక జేబులో వుంచుకొని పెద్ద బజారుగుండా, అతడు కుటుంబముతో, నడుస్తున్నాడు. అది చిన్న పీపా అంత పెద్దదిగా వుండటం వలన, ఎవరన్నా చూస్తే, తాను దానిని దొంగ తనము చేసాడంటారనుకొని, అతడు తన కుటుంబానికి వెనకాల నడుస్తు న్నాడు. అతడు చర్చిలో ప్రవేశించి, తన స్థానముకో కూర్చున్నప్పుడు పెద్ద శబ్దముయింది విస్కీ వాసన దాని ప్రభావం చూపడం ప్రారంభిం చింది. ఆ వాసన, నాఘ్రాణించలేక చాలా మంది ముక్కు మూసుకొని చుట్టు చూసారు. దానితో కర్నలు ముఖం బీటుముక్కంత యెరు పెక్కింది. తన వెనుక స్థానములోనుంచి ఒక ఆడగొంతుక వినిపించింది.

"ఈ ముసలి కర్నల్ 'జె'— మళ్ళి త్రాగి వచ్చాడు. అతడు ప్రతి రోజూ త్రాగుతున్నాడని అంతా అనుకొంటున్నారు. పైగా ప్రతి రోజూ పెళ్లాన్ని కొడుతున్నాట్ట గూడా !"

అని, హౌస్టను పట్టణంలో అతిగా వాగే ప్రఖ్యాతి వహించిన ఒక నారీమణిగా ఆమెను గుర్తించాడు కర్నల్. అతడు వెనక్కి తిరిగి ఆమె వంక తేరిపార చూశాడు. ఆమె యితనిని చూసి మళ్ళీ మెల్లగా గొణిగింది. 'అతని వంక చూడండి! ఎంతటి అపాయకరంగా కన్పిస్తు న్నాడో! పైగా త్రాగి చర్చికి వస్తున్నాడు!' అని.

ఆ విస్కీ-సీసానే శబ్దం చేసిందని కర్నలుకు తెలుసు అతడు కదల టానికి భయపడ్డాడు. సీసా ముక్క ఒకటి నేలమీద పడింది. సాధారణంగా ప్రార్థన చేసేటప్పుడు కర్నలు మోకాలుమీద మోకరిల్లేవాడు. కాని ఈ

2)

రోజున అలాగాక తన సీటులో నిటారుగా కూర్చున్నాడు. అతని భార్య అతని ప్రవర్తనని గమనించి మెల్లగా అన్నది. "జేమ్సు నీవు నాకెంత బాధ కలిగిస్తున్నావో నీకు తెలీదు. నీవు యింక ప్రార్థన చేయవద్దు! ఈ స్థితిలో "ఇంజర్‌సాల్" యొక్క వుపన్యాసం వినవిస్తే ఫలితం యేమిటో నాకు తెలుసు. నీకు మన మతములో నమ్మకము లేదు. మరి ... అదేమిటి? నీ దగ్గర వాసన వస్తున్నది! ఓ 'జేమ్సు' ఆదివారం నాడు గూడా నీవు త్రాగుతున్నావా ?

అంటూ కర్నల్ భార్య తన కన్నీళ్లను చేతి రుమాలుతో తుడుచు కొన్నది. కర్నల్ కోపముతో పళ్లు కొరికాడు.

చర్చిలో ప్రార్థన అయిపోయిన తర్వాత వాళ్ళ యింటికి వెళ్ళగానే అతని భార్య దొడ్డిలోనికి వెళ్ళి మధ్యాహ్నభోజనానికి కొద్దిగా "స్ట్రాబెర్రీ"లను త్రవ్వటం మొదలు పెట్టింది. దీని వలన, కర్నలు తను అనుకొన్నట్లుగా దొడ్డి వెనకాలవున్న కంచెలోకి ఆ విస్కీ-సీసాను పార వెయ్యలేక పోయ్యాడు. ఆదివారంనాడు అతని యిద్దరు పిల్లలు అతనిని విడవకుండా అతని వెంబడే వుంటారు. వాళ్ళను వదిలించుకోవటం అతనికి కష్టమయింది. చివరకు వాళ్ళను యేదో ఒక నెపము మీద యింటిలోనికి పంపించి విస్కీ-సీసాను తీసి, రోడ్డు మీదకు విసిరేసాడు. దానికి అదివరకు తగిలిన దెబ్బ చిన్నది కావటంచేత, అది వీధిలోని చెత్తకుప్ప మీద పడిగూడా పగలలేదు.

కర్నలు ఆ సీసాను పారవెయ్యగానే కొంత కోలుకొన్నాడు. అతని పిల్లలు బయటకు పరుగెత్తుతుంటే, వీధిలో నుంచి ఎవరో అరవటం విన్పించింది.

"అయ్యా! ఇటు చూడండి! సీసాలను వీధిలో పార వెయ్యటం చట్ట విరుద్ధం. మీరు దానిని విసిరేస్తుండగా నేను చూసాను కాని మీరు దానిని వెనక్కి తీసుకొంటే, యేమీ కేసు వుండదు"

తెలుగు విశ్వవిద్యాలయ
గ్రంథాలయం
నమోదు సంఖ్య 40661
తేది 15.3.95

వి స్కీ ప్లా స్కు

కర్నలు వీధిలోనికి చూస్తే, అక్కడ ఒక రక్షక భటుడు కంచె వెనకాల నిల్చొని, తనవేపు ఆ విస్కీ సీసాను చూపిస్తున్నాడు. వెంటనే కర్నలు ఆ సీసాను అందుకొని వినపడకుండా గొణుక్కొని, దానిని జేబులో పెట్టుకొన్నాడు.

"ఓయి నాయనా! ఆ పోలీసు నీకేమి యిచ్చాడు? మమ్మల్ని చూడనియ్యి!" అంటూ అతని కోటుని పట్టుకొని సీసావున్న జేబును అందుకోబోయారు అతని పిల్లలు. కర్నలు వారి కందకుండా కంచె వేపు తిరిగాడు. "దయ్యపు పిల్లల్లారా! మీరిక్కడ నుంచి పోకపోతే చావకొడతాను!" అంటూ వాళ్ళమీద విరుచుకు పడ్డాడు.

కర్నలు యింటిలోనికి వెళ్ళి తనటోపీ తలమీద పెట్టుకొన్నాడు. మైలు దూరమయినా సరే నడిచి వెళ్ళి అప్లాస్కను వదిలించు కోవాలనుకొన్నాడు.

"మీరెక్కడకు పోతున్నారు?" అతని భార్య ఆశ్చర్యంతో అడిగింది. "మధ్యాహ్నపు భోజనం దాదాపు తయారయింది. మీ కోటు విప్పి, మీరు కొంతసేపు ఎందుకు విశ్రాంతి తీసుకోకూడదు? అది మీకు అలవాటే గదా?" అన్నది.

"భోజనం తగలబడ!" అతడు కోపంతో అన్నాడు. "నా కాకలి లేదు. లేదు.... నాకు వంట్లో సుస్తీగా వుంది. నాకు భోజనమక్కర లేదు. నేను బయటికి షికారుకు వెళుతున్నాను."

ఇంతలో "పాపా! ఆపోలీసువాడు నీ కిచ్చిందేమిటో మాకు చూపించవా?" అడిగాడు పిల్లల్లో ఒకడు.

"పోలీసతనా?" అతని భార్య పెద్దగా అరచింది. "ఓ! జేమ్స్! నీవిలా ప్రవర్తిస్తున్నావంటే నాకు చాలా బాధగా వుంది. నీవు త్రాగటం లేదని నాకు తెలుసు. కాని ఈ రోజున నీకేమయింది? లోపలికి వచ్చి పడుకో! నేను నీ కోటును విప్పుతాను" అన్నది.

మామూలుగా చేస్తున్నట్లుగా కర్నలు భార్య అతని కోటుని విప్పటానికి ప్రయత్నించింది. అది కర్నలుకు బాగా కోపము తెప్పించి అతను చిందులు వేసేటట్లు చేసింది.

"నీవు నీ చేతులతో నన్ను తాకవద్దు" కర్నలు అరిచాడు. "నాకు తలనొప్పిగా వుంది. నేను షికారుకు వెళుతున్నాను. ఉత్తర ధ్రువానికయినా సరే వెళ్ళి ఆ సీసాను వదిలించుకు వస్తాను" అంటూ అతడు యింటి గేటు దాటి వెళుతుంటే అతని భార్య తల వూపుతూ అనుకొన్నది."ఆయన చాలా ఎక్కువగా పని చేస్తున్నాడు. కొంచెం దూరం నడిచి వస్తే ఆయన ఆరోగ్యం కుదుట పడవచ్చు" అని.

విస్కీ ప్లాస్కు పారవెయ్యటానికి సరైన ప్రదేశం వెతుక్కుంటూ, చాలా బ్లాకులను దాటి వెళ్ళాడు రోడ్డుమీద చాలా జనం వుండి అతని వంకే చూస్తున్నట్లు కనిపించారు.

దారిలో అతనికి యిద్దరు ముగ్గురు స్నేహితులు కన్పించారు. వారతని వంక వింతగా చూసారు. అతని ముఖం ఎర్రబడింది. అతని టోపీ తల వెనకాలకు పోయింది, అతని కళ్ళలో యేదో వింతైన చూపు కన్పిస్తున్నది. వారిలో కొందరు అతనితో మాట్లాడకుండా అతనిని దాటి వెళ్ళారు. కర్నలు పిచ్చిగా నవ్వుకొన్నాడు. అతడిని నిరాశ యెదుర్కొంటున్నది. ఎక్కడైనా ఖాళీప్రదేశానికి అతను చేరుకొన్నప్పుడు, అతడు ఆగి, అన్నివేపులా శ్రద్ధగా, తనను ఎవరన్నా గమనిస్తున్నారేమో చూసేవాడు. యెవరూ చూడకుండా, విస్కీసీసా తీసి విసిరేద్దామని, కాని కిటికీలలోనుంచి జనం అతనిని చూడటం సాగించారు. ఇద్దరు ముగ్గురు చిన్న పిల్లలు అతనిని వెంబడించారు కూడా. కర్నలు వారివంక తిరిగి కోపముగా కసిరాడు. వాళ్ల దానికి తిరిగి సమాధానం యిచ్చారు.

"చూడండయ్యా ఆ ముసలాయనవంక! పడుకోవటానికి యెక్కడ స్థలం దొరుకుతుందా అని చూస్తున్నాడు. చెరసాలకు వెళ్ళి అక్కడ హాయిగా నిద్రపోవచ్చుగదా!" అంటూ

చివరకు ఆ పిల్లలను వెళ్ళగొట్టగలిగాడు. చివరికి పిచ్చి మొక్కల చుట్టూ వున్న ఓ చదరపు స్థలము అతనికి కనిపించింది అతను చాలా ఆనందపడ్డాడు. ఆ మొక్కలు అక్కడక్కడ అతని తలంత ఎత్తుగా యెదిగి వున్నాయి.

ఈ ప్రదేశములో అయితే ఆ విస్కీ ఫ్లాస్కును వదిలించుకోవ టానికి వీలుగా వుంటుంది. ఆ ఖాళీ చదరమున కెదురుగానే చర్చి అధికారి నివాసముంది. కాని ఆయన యిల్లు కనపడనంత యెత్తుకు అక్కడి పిచ్చిమొక్కలు పెరిగివున్నాయి.

కర్నలు ఏదో తప్పు చేసినట్లుగా చుట్టూ చూసాడు. ఆ మొక్కల మధ్య నున్న దారిగుండా, మొక్కలు బాగా ఎత్తుగా పెరిగినచోట ఆగి, తన జేబులోనుంచి విస్కీఫ్లాస్కు తీసాడు. దాని వంక ఒక్క క్షణం చూసి భయంకరంగా నవ్వాడు. పెద్దగా యిలా అన్నాడు.

"మంచిది!.... నీవు యితరులకు తెలీకుండా నన్ను చాలా ఇబ్బంది పెట్టావు. ఇప్పుడు నీ పీడ విరగడ చేసుకొంటాను" అని,

అతడు ఫ్లాస్కును విసిరివేయబోతూ వుండగా అతనికి ఏదో శబ్దము వినిపించింది. పైకి తలెత్తి చూస్తే, అక్కడ 'చర్చి మినిస్టరు' నిల్చొని, కర్నలు వంక భయపడిన కళ్ళతో తేరిపార చూస్తున్నాడు.

"నా ప్రియమైన కర్నలు జేమ్సుగారూ! మీరు నాకు చెప్పలేని బాధ కలిగిస్తున్నారు. మీరు త్రాగుతారని నాకెప్పుడూ తెలియదు. మిమ్మల్ని ఈ పరిస్థితిలో చూసి చాలా విచారపడుతున్నాను".

ఈ మాటలు విని కర్నలుకు పట్టలేనంత కోపం వచ్చింది. "మీరిక్కడ నాకు నీతులు బోధించవద్దు" కర్నలు పెద్దగా అరిచాడు. "నేను యిష్టమొచ్చినంత త్రాగుతాను. ఎవరు ఏమనుకొన్నా నాకు భయము లేదు. నే నెప్పుడూ త్రాగుబోతునే! గడిచిన రెండు వారాలలో నేను 15,000 గ్యాలన్ల విస్కీ త్రాగాను. ప్రతి ఆదివారం నేను చాలా

చెడ్డ మనిషిగా మారతాను. ఇదిగో ఈ సీసాను నీ మొఖం మీద విసురుతున్నాను".

కర్నలు ఫ్లాస్కును చర్చి మినిస్టరు మీద విసిరేసాడు. అది అతని చెవిమీద గాయం చేసి ఇరవై ముక్కలయింది. పాపమాచర్చి అధికారి బాధతో అరుచుకొంటూ తన యింటివేపు పరుగుతీసాడు.

కర్నలు పెద్ద రాళ్ళ గుట్టను ప్రోగుచేసి, పిచ్చి మొక్కల చెట్లలో దాచుకొన్నాడు. అతను వూరిలోని జనంతో తన వంట్లో వోపిక వున్నంత వరకు పోరాడ దలచుకొన్నాడు. అతని దురదృష్టము అతనిని నిరాశ వాదిగా తయారు చేసింది.

ఓ గంట తర్వాత ముగ్గురు రక్షక భటులు అశ్వాలమీద కర్నలును పట్టుకోటానికి, ఆ పొదల దగ్గరకు వచ్చారు. ఆ సమయానికి అతనిలో వుద్రేకం తగ్గి శాంతపడ్డాడు. మొదటినుంచి ఆ విస్కీఫ్లాస్కు చేసిన అల్లరిని గురించి, వారికి విప్పి చెప్పాడు. అంత వరకు అతను మంచి ప్రవర్తనగల పౌరుడిగా గుర్తింపబడి వుండటం చేత, రక్షకభటులు ఆయనను మందలించి, యింటికి పోనిచ్చారు.

కాని యిప్పుడు ఆ కర్నలు చేతిలో నిండిన విస్కీ సీసానుగాని, ఖాళీ విస్కీసీసానుగాని, పట్టుకోమని చెప్పలేరు మీరు!

—)*(—

పెద్ద మనిషిగా మారిన దొంగ

(A Retrieved Reform)

చెరసాల చెప్పుల దుకాణంలో, చెప్పలను జాగ్రత్తగా కుడుతున్నాడు "జిమ్మీవాలంటైను ఒక జైలు గార్డువచ్చి, అతని ముందున్న కార్యాలయంలోకి తీసుకువెళ్ళాడు. గవర్నరు సంతకం చేసిన క్షమార్పణపత్రం వార్డను జిమ్మీ చేతిలో వుంచాడు. అతనికి నాలుగు సంవత్సరాలు శిక్ష విధింపబడింది. అప్పుడే నాలుగు నెలలు శిక్ష అనుభవించాడు. జిమ్మీకి పలుకుబడి గల స్నేహితులు చాలామంది వున్నారు. వారి సహకారంతో తనశిక్ష నాలుగు నెలలలోనే పూర్తి అవుతుందని ఆశించాడు. కాని అలా జరగలేదు.

"వాలెంటైన్! నిన్ను రేపు విడుదల చేస్తున్నాము. నీవు హృదయములో చెడ్డ వాడివికాదు. ఇంకనైన యినుప పెట్టెలు బద్దలు కొట్టటం ఆపి ఒక మంచి మనిషిగా బ్రతుకు!" అంటూ వార్డను అతనికి బోధించాడు.

"నేనెప్పుడు యినపెట్టెలు బద్దలు కొట్టలేదే!!" ఆశ్చర్యంతో అన్నాడు జిమ్మీ.

"బద్దలు కొట్ట లేదే అనుకో! ఆ స్ప్రింగుఫీల్డు పనికి నిన్నెవరు పంపారు? సంఘములో పేరువున్న వ్యక్తికి సహాయం చెయ్యటం కోసం, నీ పవిత్రతను, నీవు ఋజువుచేసుకోవులే గదా! లేక జూరీ సభ్యులు నిన్ను వుత్తపుణ్యానికే అమాయకంగా శిక్షించారనుకోమంటావా? ఏమైనా నీవొక బలిపశువు అయినావుగదా!"

"నేనా? నాజీవితంలో ఎప్పుడు స్ప్రింగు ఫీల్డులో లేను!"

"క్రోనిన్! ఇతనిని జైలులోకి తీసుకు వెళ్ళు!" నవ్వుతూ అన్నాడు వార్డన్. అతనికి బయటకు పంపేటప్పుడు క్రొత్తదుస్తులియివ్వు! ఉదయం సరిగా ఏడు గంటలకు అతని జైలు గది తాళము తీసి ఆఫీసుకు తీసుకురా. జిమ్మీ! నేను చెప్పిన సలహాను గురించి కొంచెము ఆలోచించు!"

మరునాడు సరిగా ఏడుంబావుకు జిమ్మీ వచ్చి వార్డను ఆఫీసుకు బయట నిలబడ్డాడు. అతను సిద్ధముగా తయారుచేయబడిన మంచి సూటు ధరించాడు, మంచి అందమైన చెప్పులు వేసుకొన్నాడు కాళ్ళకు ఖైదీలను విడుదల చేసేటప్పుడు వాటి ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది.

జైలు గుమాస్తా, జిమ్మీకి, ఒక రైలు టికెట్టు, ఒక అయిదు డాలర్ల నోటు యిచ్చాడు. వాటితో అతడు తన వూరిలో పునర్నివాసం ఏర్పరచు కొని, మంచిపౌరునిగా బ్రతకాలని ప్రభుత్వం వారి వుద్దేశ్యము. వార్డన్, జిమ్మీకి ఒక సిగరెట్టు యిచ్చి అతనితో కరచాలన చేసాడు.

ఖైదీ నం. 9762, వాలంటైను, గవర్నరు గారి క్షమాభిక్ష చేత విడుదల చేయబడినట్లుగా జైలురికార్డులలో లిఖించబడింది.

2

పక్షులు పాడుతున్నాయి, ఆకు పచ్చని చెట్ల నుండి చల్లగాలి వీస్తున్నది. పువ్వులు సువాసనను వెదజల్లుతున్నాయి కాని, జిమ్మీ వాటినేమీ పట్టించుకోకుండా రెస్టారెంటుకు దారి తీసాడు. అక్కడ మొదటిసారిగా, జిమ్మీ స్వతంత్ర వాయువులను పీల్చాడు. వండిన మంచి కోడి మాంసము తిని, ఒకసీసా తెల్లని సారా త్రాగాడు. తర్వాత మంచిరకపు సిగరెట్టు వెలిగించుకొన్నాడు. అక్కడ నుంచి తీరికగా రైలుస్టేషనుకు వెళ్ళాడు. బయట కూర్చున్న గ్రుడ్డివాని టోపీలో పైసలు వేసి, రైలు బండి ఎక్కాడు మూడు గంటలు రైలులో ప్రయాణము చేసిన తర్వాత ఒక చిన్న నగరంలో రైలు దిగాడు.

అతడు నేరుగా "మైక్ డోలాన్" కేఫ్‌కు వెళ్ళాడు. అక్కడ మైక్‌తో కరచాలనం చేసాడు. ఆ 'బారు'లో అతడొక్కడే వున్నాడు.

"నిన్ను యింకా త్వరగా విడిపించలేక పోయినందుకు విచారముగా వుంది. అప్పటికి 'స్ప్రింగు ఫీల్డు' నుండి అభ్యంతరము తెలిపాము. గవర్నరు నిన్ను క్షమించటానికి, యెంతకీ వొప్పుకోలేదు. నీవు బాగున్నావా?"

అన్నాడు మైక్ డోలాన్.

"బాగున్నాను. నా గది తాళపు చెవి వుందా?" అడిగాడు జిమ్మీ.

తన గదితాళం తీసుకొని, జిమ్మీ మేడ మీదకి వెళ్ళి, తన గది తలుపు తాళం తీసాడు. తనెలా వదిలిపెట్టి వెళ్ళాడో, అలాగే వుంది తన గది. ఇంకా నేలమీద డిటెక్టివ్ "బెన్ ప్రైజ్" షర్టుకాలరు గుండీ పడి వుంది. తనను అరెస్టుచెయ్యటానికి ప్రయత్నించినప్పుడు, తను డిటెక్టివ్ షర్టు చింపాడు. అప్పుడు అతని షర్టు గుండీ క్రింద పడింది.

గోడలో నుంచి ఒకమడిచిన మంచాన్ని బయటికి లాగాడు జిమ్మీ. అక్కడవున్న రంధ్రములో నుంచి, ధూళితో నిండిన సూటుకేసు బయటికి తీసాడు. ఆ సూటుకేసును తెరచి అందులో వున్న మంచి నిపుణతతో తయారుచేయబడిన పనిముట్లు వంక తేరిపార చూసాడు. ఇనుప తలుపులకు రంధ్రాలు చేసే పరికరాలూ, చెక్క తలుపులకు రంధ్రాలు చేసే వడ్రంగి పనిముట్లు ఇనుపపెట్టెలాంటి గట్టి పెట్టెలు తెరవటానికుపయోగపడే యితర పనిముట్లు ఆ సూటుకేసులో వున్నాయి. వాటిని చూసి అతడు గర్వపడుతుంటాడు. అవి తయారు చేసే ప్రత్యేకమైన చోటులో కొనటానికి, అతనికి 700 డాలర్లు ఖర్చు అయినాయి.

ఓ అరగంట తర్వాత జిమ్మీ, హోటలు మేడ మీద నుంచి క్రిందికి దిగి వచ్చాడు. అతడిప్పుడు, మంచి అందమైన దుస్తులు వేసుకొని వున్నాడు. అతని చేతిలో పరిశుభ్రమైన సూటుకేసు వుంది.

"ఏమన్నా, నీ వృత్తి పని మీద వెళ్తున్నావా?" మైక్ డొనాల్ నెమ్మదిగా అడిగాడు.

"నేనా?" అంటూ తొట్రుపాటు పడ్డ గొంతుతో జిమ్మీ అన్నాడు." నేనుఒకప్రఖ్యాతి వహించిన బిస్కట్ల కంపెనీ రిప్రజెంట్ టివ్‌ను. మీరు ఏమంటున్నారో నా కర్థం గావటం లేదు."

జిమ్మీ చెప్పినదానికి మైక్ డొనాల్ చాలా సంతోషించి, మంచి వేడిపాలు తెప్పించి, జిమ్మీచేత త్రాగించే దాగా వదలలేదు అతడెప్పుడూ మద్యము లాంటి ద్రవాలను త్రాగడు.

3

"వాలెంటైన్" నం. 9762, విడుదలయిన వారం రోజులకు. "రిచ్ మాండ్" మరియు "ఇండియానా" పట్టణాలలో, రెండు యినుప పెట్టె దొంగతనాలు అద్భుతంగా జరిగినై. దొంగను పట్టుకోవటానికి, పోలీసులకు యేమీ ఆధారాలు దొరకలేదు. ఆ రెండు దొంగతనాలలో, 800 డాలర్లు మాత్రమే అపహరింపబడ్డాయి. మరో రెండు వారాల తర్వాత, 'లోగన్ స్పోర్టు' పట్టణంలో దొంగతనం చేయడానికి వీలు లేని అతి ఆధునికపు రక్షణలతో తయారుకాబడిన యినుప పెట్టె అతితేలికగా తెరవబడింది. పెట్టెలో వున్న 1500 డాలర్లు కన్పించలేదు. సెక్యూరిటీ పత్రాలుకాని, వెండినగలు కాని, చెక్కుచెదరలేదు. ఈ రెండు దొంగతనాలు డిటెక్టివుల దృష్టి నాకర్షించినాయి. "జెఫ్రన్" పట్టణములో పాతరకపు యినుపపెట్టె కలిగిన బ్యాంకు అధికారులు, తమ 'భూగృహము'లో దాచిన 500 డాలర్లు వేరేచోటికి తరలించారు.

ఇలా చాలా ఎక్కువ ధనము దొంగిలింపపడటంతో, అది డిటెక్టివ్ 'బెన్‌ప్రైజ్' దృష్టి నాకర్షించింది. అతడు పేరు గాంచిన అపరాధ పరిశోధకుడు. అతడు దొంగతనములు జరిగిన ప్రదేశాలను పరిశీలించాడు. అన్ని దొంగతనాలు ఒకే రకంగా జరిగినట్లు అతనికి తోచింది.

డిటెక్టివ్ "బెన్ ప్రైజ్" యిలా అన్నట్లు తెలిసింది, ఇదంతా ఆ కులాసా పురుషుడు 'జిమ్మీవాలెంటైన్' హస్త కళాకుశలమే! ఆ 'కాంబి నేషన్' నాబ్ వంక చూడండి. చల్లగాలిలో కూరగాయలు తరిగినట్లుగా విడదీసాడు. అతని ఒక్కడి దగ్గరే అటువంటి సున్నితమైన పనిముట్లు వున్నాయి. తాళంలోని ఆభాగంలో యెలా రంధ్రంవేసాడో గమనించండి! ఒక్క-రంధ్రము తొలుస్తే చాలు. నేనుయిదంతా 'జిమ్మీ' చేతి మహాత్యమే అనుకొంటున్నాను. ఈ సారి అతను దొరకకుండా పోడు" అని.

"బెన్ ప్రైజ్" జిమ్మీ అలవాట్లు అన్నీ తెలుసు 'స్ప్రింగుఫీల్డు'కేసులో పనిచేసేటప్పుడు అతడివన్నీ నేర్చుకొన్నాడు. ఇతడు బాగా 'లాంగ్‌జంపు' చేయకలగటం, దొంగతనముచేసిన ప్రదేశమునుండి త్వరగా తప్పించు కొని పోగలగటం,తోడుదొంగలసహవాసం లేక పోవటం మంచి సంఘము మీద అభిరుచి—ఈ గుణాలన్నీ కలిసి, జిమ్మీ తనకు శిక్ష పడకుండా తప్పించుకుపోవటానికి సహకారం చేస్తున్నాయి.

ఇంతటి తెలివైన, పట్టుకోవటానికి కష్టమైనట్టి దొంగను పట్టు కోవటానికి 'బెన్ ప్రైజ్' పరిశోధన మొదలు పెట్టాడని ప్రజలకు తెలిసింది.

4

ఒక సాయంకాలము జిమ్మీ "అర్కాన్‌సాస్" రాష్ట్రిములో రైలు-రోడ్డుకు అయిదు మైళ్ళ దూరములో వున్న "ఎల్మోర్" అనే చిన్న నగరంలో టపా తీసుకొని వచ్చే గుర్రపు బండి నుంచి తన సూటుకేసుతో దిగాడు. కాలేజీ నుంచి అప్పుడే వచ్చిన ఒక గొప్ప అబ్బాయిలా, జిమ్మీ దుస్తులు ధరించాడు. అతడు రోడ్డు ప్రక్కనే వున్న ఒక హోటలులో ప్రవేశించాడు.

దారిలో అతనికి యవ్వనవతియైన ఓ యువతి తారసపడింది. "ఎల్మోరు బ్యాంకు" అనే బోర్డు వున్నభవనంలోకి ఆమె ప్రవేశించింది. జిమ్మీ ఆ అమ్మాయి కళ్ళలోకి చూసి, తనను తానే మర్చిపోయాడు. ఆ అమ్మాయి తన కళ్ళను కొద్దిగా దించి, జిమ్మీ వంక చూసింది, అతని

లాగా అందముగా దుస్తులు అలంకరించుకొని వున్న యువకులు ఆ నగరములో చాలా అరుదు.

బ్యాంకు మెట్లమీద వూరికే తిరుగుతున్న ఓ కుర్రవానిని జిమ్మీ పట్టుకొని, అతనికి మధ్య మధ్యలో పది సెంట్లు యిస్తూ తను, ఆ బ్యాంకు స్టాకు హోల్డరు అయినట్లుగా, ఆ చిన్న నగరాన్ని గురించి ప్రశ్నలడిగి తెలుసుకొన్నాడు. ఈ లోగా బ్యాంకులోకి వెళ్ళిన యువతి, జిమ్మీ విషయం పట్టించుకోకుండా రాజకీవితో తన సూటుకేసుతో బయటికి వచ్చి తనదారిన పోయింది.

"ఆ అమ్మాయి పేరు "మిస్ పోలీసింప్సన్" కాదా" అంటూ ఆ అమ్మాయిని గురించి ఆ కుర్రవానిని అడిగాడు.

"కాదు, ఆమె పేరు "అన్నా బెల్ ఆడమ్స్" ఈ బ్యాంకు ఆమె తండ్రిదే. మీరు 'ఎల్మొరు' ఎందుకు వచ్చారు ? మీ 'వాచీ' గొలుసు బంగారపు దేనా ? నేను ఒక మంచి శునకాన్ని కొందామనుకుంటున్నాను మీ దగ్గర యింకా సెంట్లు వున్నాయా ? ఆ కుర్రవాడు అడిగాడు.

జిమ్మీ ప్లాండర్సు హోటలుకు వెళ్ళి 'రాల్ఫ్ డిస్పెన్సర్' అనే పేరుతో, ఒక గది అద్దెకు తీసుకొన్నాడు. రిసెప్షను గుమాస్తాకు తను ఆ వూరికి వ్యాపారము చేయటానికి వచ్చినట్లు చెప్పాడు. ఆ వూళ్ళో చెప్పుల వ్యాపారము యెలా వుందో కనుక్కొన్నాడు. ఆ వూరిలో చెప్పుల వ్యాపారము ప్రారంభించాలనుకొంటున్నట్లు అతనితో చెప్పాడు. ఆ వూరిలో, ఆ వ్యాపారము బాగా సాగుతుందా అంటూ ప్రశ్నించాడు.

ఆ హోటలు గుమాస్తా, జిమ్మీ ధరించిన దుస్తులను చూసి అతను ప్రవర్తించే తీరును చూసి ముగ్ధుడయ్యాడు. 'ఎల్మొరు' నగరంలోని నాగరికతకు, అందమైన యువకులకు, చెందిన సంఘములో అతనొకడు. అతడు జిమ్మీ అడిగినవాటికి స్నేహపూర్వకమైన సమాధానాలు చెప్పాడు.

చెప్పుల వ్యాపారానికి మంచి భవిష్యత్తు వుండవచ్చునీ, ప్రత్యేక మైన చెప్పుల దుకాణం ఆ వూరిలో లేదనీ, జనరలుస్టోర్సు వాళ్ళే చెప్పులు గూడా అమ్ముతుంటారనీ, మిగతా వ్యాపారాలు కూడా బాగానే సాగుతున్నాయనీ, మిస్టరు స్పెన్సరు ఆ వూళ్ళోనే వ్యాపారం పెట్టుకోవ టానికి నిశ్చయిస్తాడని, అతను ఆశిస్తున్నట్లుగా ఆ గుమాస్తా చెప్పాడు. నివసించ తగిన మంచి వూరనీ, అక్కడి ప్రజలు మంచి ప్రవర్తనగల వారనీ, అతను చెప్పాడు.

ఆ వూరిలో కొన్ని రోజులుండి గమనించిన తర్వాత, వ్యాపారం ప్రారంభించే వ్యవహారం నిర్ణయించుకొంటాననీ మిస్టరు స్పెన్సరు గుమాస్తాతో చెప్పాడు.

'మిస్టరుస్పెన్సరు' త్వరలోనే ఆ వూరిలో చెప్పుల దుకాణం ప్రారంభించాడు. ఇప్పుడు 'జిమ్మీవాలంటైను' అనే వ్యక్తి లేడు. ఆకస్మిక పేరులో పడి, అతడు మంచి వ్యాపారస్థుడైన 'మిస్టరు స్పెన్సరు'గా మారి పోయాడు.

ఒకరోజున జిమ్మీ తనగదిలో కూర్చుని, తన పాతతమిత్రుడైన సెయింట్ లూయీకి వుత్తరం వ్రాసి పోస్టులో పడవేసాడు. దానిలో యిలా వుంది— "డియర్ ఓల్డుపాల్" రేపు వచ్చే బుధవారం రాత్రి తొమ్మిది గంటలకు, నీవు "లిటిల్ రాకు"లో "సల్లివాన్" ప్రాంతంలో వుంటావని ఆశిస్తున్నాను. నీవు నాకోసం కొన్ని చిన్న పనులు చేసి పెట్టాలి. నా పని ముట్లను తీసుకోవటానికి నీవు సంతోషిస్తావని అనుకొంటాను. అటువంటి అద్భుతమైన పరికరాలు వెయ్యిడాలర్లు పెట్టినా నీకు దొరకవు. నేను నా పాతవ్యాపారాన్ని ఒకసంవత్సరం క్రితమే వదిలేసినట్లు "బిల్లీ"తో చెప్పు నాకిప్పుడు మంచి వస్తువుల దుకాణముంది. నేనిప్పుడు పవిత్రమైన జీవితం గడుపుతున్నాను. ఇప్పటి నుంచి రెండు వారాలలోనే వొక అందమైన అమ్మాయిని వివాహమాడ బోతున్నాను. జీవితములో యిదిఒక్కటే సరియైన మార్గము. పదిలక్షల డాలర్లు యిచ్చినా యిప్పుడు పరాయిసొత్తు డాలరు కూడా ముట్టను. నా వివాహమయిన తర్వాత, యిక్కడ నా స్టోరు

నంతా అమ్మేసి, పశ్చిమ ప్రాంతానికి పోదామను కొంటున్నాను. అక్కడ యితే పాతకేసుల ప్రకారం నన్ను పట్టుకొనే అవకాశముండదు.

"పాల్! నేను నీకు నిజం చెపుతున్నాను. నేను పరిణయమాడబోయే" అమ్మయి నిజంగా దేవత! ఆమె నన్ను పూర్తిగా నమ్మింది. ఈ ప్రపంచాధిపత్యమంతా నాకిచ్చినా ఆమెకోసం, ఒకచిన్న వెధవపని కూడా చెయ్యటానికి అంగీకరించను. నీవు తప్పక "సర్లీ" దగ్గర వుండాలి. నేను నిన్ను తప్పక చూడాలనుకొంటున్నాను. నేను వచ్చేటప్పుడు, నీకు బహుమానం యివ్వదలచుకొన్న, నా అమూల్యమైన పనిముట్లు తీసుకువస్తాను.

నీ పాత స్నేహితుడు
జిమ్మీ

6

సోమవారం రాత్రి, జిమ్మీ ఈ వుత్తరం వ్రాసిన తర్వాత, డిటెక్టివ్ "బెన్ ప్రైజ్" యితరుల కంటపడకుండా కొన్ని సంఘాలకు, యూనిఫారాలు సరఫరా చేసే ఒక గుఱ్ఱపు బండిలో. "ఎల్మోరు" చేరుకొన్నాడు. అతడు ఆ వూరిలో చాలా సేపు తిరిగాడు, తనకు కావలసిన సమాచారము సేకరించేటందుకు. స్పెన్సర్" చెప్పుల దుకాణానికి ఎదురుగా వున్న మందుల దుకాణంలో కూర్చుని "రాల్ఫుడి స్పెన్సరు" వంక పరీక్షగా చూసాడు.

"నీవు బ్యాంకరు కూతురును వివాహమాడ బోతున్నావా? "అంటూ తనలో తను నెమ్మదిగా అనుకొన్నాడు. "కాని నీకేమవుతుందో నాకు తెలీదు!"

* * * *

ఆ మరునాటి వుదయము జిమ్మీ "ఆడమ్స్" గారింట్లోనే భోజనం చేసాడు. ఆరోజు అతడు "లిటిల్ లాక్"కు వెళ్ళి, తనకొక మంచి అందమైన వివాహపుసూటునూ, "అన్నాబెల్" కోసం ఒక అందమైన బహుమానం కొనాలనుకొన్నాడు. ఎల్మోరు" వచ్చినప్పటి నుంచి, అతడు తన

దొంగ వ్యాపారము వదిలిపెట్టి ఒక సంవత్సరము గడిచింది గనుక తనిప్పుడు సురక్షితముగా బయటకు వెళ్ళ వచ్చని అతను భావించాడు.

ఆరోజు పుదయం భోజనమయిన తర్వాత, 'ఆడమ్స్' కుటుంబ సభ్యులందరూ క్రిందకు వచ్చారు. మిస్టర్ ఆడమ్స్, అన్నాబెల్, జిమ్మీ, అన్నాబెల్ సోదరి, ఆమె యిద్దరు పిల్లలు ఒక అమ్మాయికి అయిదు సంవత్సరాలు, రెండో అమ్మాయికి తొమ్మిది సంవత్సరాలు. వాళ్ళంతా కలిసి జిమ్మీ మకాంచేస్తున్న హోటలుకు వచ్చారు. జిమ్మీ మేడ పైకిపోయి, తన గదిలోని సూటుకేసు తెచ్చుకొన్నాడు. అప్పుడు వాళ్ళంతా కలసి బ్యాంకుకువెళ్ళారు. అక్కడ జిమ్మీ ప్రయాణం చేయతలచుకొన్న గుర్రపు బండి సిద్ధముగా వుంది. ఆబండితోలే, "డాల్ఫ్ గిబ్సన్" అశ్వ చోదకుడు తయారుగావున్నాడు.

అందరూ కలిసి బ్యాంకు గదిలోకి వెళ్ళారు, ఆగదిలో ఎత్తుగా, ఓకుకలపతో చేయబడిన యినుపకడ్డీలతో, ఖాతాదారులు లోపలికి రాకుండా వుండేందుకు కట్టిన చట్రము వుంది. జిమ్మీకూడా ఆ కుటుంబముతో అక్కడికి వెళ్ళాడు. 'ఆడమ్సు'కు కాబోయే అల్లుడికి యెక్కడికి వెళ్ళినా ఆహ్వానమే! "మిస్ అన్నాబెల్"ను పరిణయమాడబోతున్న మంచి లక్షణములు కల్గిన అందమైన ఓ యువకుడు తమకు అభివందనం చెయ్యటం ఆ బ్యాంకు గుమస్తాలను యెంతో.... ఆనందపరచింది.

'అన్నాబెల్' హృదయము ఆనందముతోనూ, మంచి యవ్వనపు పొంగుతోనూ, గంతులువేస్తున్నది. ఆమె జిమ్మీ టోపీని, తలమీద నుంచి తీసి అతని సూటుకేసును తన చేతిలోకి తీసుకొంది.

"మిస్టర్ రాల్ఫ్! ఈ పెట్టెయింత బరువుగా వుందేమిటి! దానినిండా యిటుకరాళ్ళున్నాయా?" అంటూ హేళనచేసింది.

"దానినిండా, నికెల్ ప్లేటుతో చేసిన. చెప్పులకు వేసే పట్టాలున్నాయి అన్నాడు జిమ్మీ ప్రశాంతముగా "వాటిని నేను అమ్మి వేస్తున్నాను. వాటిని అమ్మితే నాకు మంచి డబ్బు వస్తుంది. అన్ని ఖర్చులూ నేను అదుపుచేయా లనుకొంటున్నాను."

"ఎల్మోరు"బ్యాంకు వాళ్ళు, అతిమందమైన గట్టి గోడలతో ఒక గది కట్టించి, బరువైన తలుపులు పెట్టించి అందులో క్రొత్త యినుప పెట్టెలుంచారు. దానిని చూసి "మిస్టర్ ఆడమ్స్" చాలా గర్వపడుతుంటాడు అది అందరికి చూపిస్తున్నాడు మందమైన గోడలతో తయారుచేయబడిన ఆగది చిన్నది. కాని దానికి క్రొత్త రకంగా తయారు గాబడిన తలుపు బిగించ బడింది. 'మిస్టర్ ఆడమ్స్' అది పనిచేసే విధానం గురించి. మిస్టర్ స్పెన్సరుకు వివరించి చెప్పాడు దానికి గట్టి యినుపకడ్డీలతో చేయబడిన మూడు గడియలున్నాయి. వాటి కన్నిటికీ కలిపి, ఒక్కటే హస్తముంది. దానికి "టైము" తాళం బిగించ బడింది.

మిస్టర్ స్పెన్సరు - ఆడమ్స్ చెప్పినది మర్యాదకోసం విన్నాడుకానీ, అంత శ్రద్ధ కనపర్చలేదు.

ఆడమ్స్ యిద్దరు మనుమరాండ్రు 'మే' మరియు 'అగార్' తళతళ లాడుతున్న ఆ యినుపపెట్టె 'మెటలు'ను చూసి దానికి బిగించి తమాషాగా వున్న, టైము గడియారాన్ని చూసి, దానికి తగిలించిన గుండ్రని బిళ్ళనూ చూసి - చాలా సంబరపడ్డారు.

వాళ్ళంతా యిలా ఆ గదిలో ఆ యినుప పెట్టెనూ, ఆ గదినీ చూడ టంలో మునిగివున్నారు. అప్పుడు 'జెన్‌ప్రైజ్' వూరికే అటూయిటూ తిరుగుతూ బ్యాంకులోని కటకటాలమీద తన మోచేతిని ఆనించి, లోపలికి చూస్తున్నాడు. ఆ బ్యాంకులోని 'టెల్లర్' కౌంటరులోని గుమాస్తాకు తన కేమీ అక్కరలేదనీ, తనకు తెలిసిన ఓ పరిచయస్తుని కోసం ఎదురు చూస్తున్నానని చెప్పాడు.

అకస్మాత్తుగా అక్కడకు చేరిన ఆడవారు ఆక్రందన చేసారు. గాభారాతో ఆ యిద్దరు పిల్లలు అక్కడ ఆడుకొంటూ తొమ్మిదేళ్ళ అమ్మాయి "మే" అయిదేళ్ళ అమ్మాయి "అగాతా"ను ఆ మందమైన గదిలో (హట్టు) పెట్టి తలుపులు వేసి, దాని గడియలు బిగించి, వాటిమీద వున్న 'నాబ్'ని (గుండ్రని బిళ్ళ లాంటిది) త్రిప్పి వేసింది. అలా చెయ్యటం "ఆడమ్స్" చేస్తుండగా ఆ అమ్మాయి చూసింది.

పాపం! ఆడమ్స్ వెంటనే గది తలుపు దగ్గరికి వెళ్ళి దాని గడియకి వున్న హస్తాన్ని తన బలమంతా వుపయోగించి లాగి చూసాడు. కాని.... అది రాలేదు.

"ఈ తలుపు తెరవటం సాధ్యంకాదు" అతడు విచారముతో అన్నాడు. ఆ సైము గడియారపు కీ త్రిప్పబడలేదు దాని కాంబినేషను గూడా సరిగా పడలేదు.

"ఓ! నా ముద్దుల పట్టా!" అంటూ ఆ అమ్మాయి తల్లి పెద్దగా యేడ్చింది. "భయంతో నాపిల్ల లోపల చచ్చిపోతుంది. తలుపులు తెరవండి లేకపోతే వాటిని బ్రద్దలు కొట్టండి మీరింత మంది మగవారున్నారు. మీరేమీ చెయ్యలేరా?" అంటూ ఆమె యేడుపు సాగించింది.

ఆ తలుపులు తెరవగల మనిషి 'లిటిల్‌రాక్' దగ్గర కాని లేడు. "వణుకుతున్న గొంతుతో మిస్టర్ ఆడమ్స్ అన్నాడు" ఓయి భగవంతుడా! మిస్టర్ స్పెన్సర్ ! మన మిప్పుడేం చేద్దాం? ఆ పిల్ల అక్కడ ఎక్కువ సేపు తట్టుకోలేదు. అక్కడ సరిపోయేటంత గాలి వుండదు. ఎక్కువ సేపయితే ఆ అమ్మాయి మూర్ఛపోవచ్చు!"

"అగాతా" తల్లి పిచ్చి యెక్కినదానిలా ఆ మందమైన గది తలుపులను తన చేతితో బాదుతున్నది. "డైనమెట్" వుపయోగిస్తే బావుంటుందేమోనని, యెవరో సూచించారు. "అన్నాబెల్" జిమ్మీ వంక తిరిగి చూసింది. ఆమె పెద్దవైన కళ్ళు మనోవేదనతో నిండిపోయాయి. కాని యింకా నిరాశ ఆమెలో చోటు చేసుకోలేదు. తను పూజించే మగవానికి యేమీ అసాధ్యం కాదనే, ఆమె నమ్మకం మిగతా ఆడవారిలాగానే.

"మిస్టర్‌రాల్ఫ్! మీరు ఏమీ చెయ్యలేరా? ఒక్కసారి ప్రయత్నించి చూడండి! అన్నది అన్నాబెల్.

చిన్న మృదువైన మందహాసముతోనూ, చురుకైన కళ్ళతోనూ, "జిమ్మీ" ఆమె వంక చూసాడు.

"అన్నాబెల్! నీవు ధరించిన రోజా పుష్పము యిలా యివ్వ ! ఇస్తావా?" అన్నాడు జిమ్మీ.

3)

జిమ్మీ చెప్పేది సరిగా విన్నానా లేదాఅనే అనుమానం బాధిస్తుండగా, తన వక్షస్థలంమీద వున్న దుస్తులకు గుచ్చుకొన్న గులాబి "పుష్పాన్ని విప్పి, దానిని జిమ్మీ చేతిలో వుంచింది. జిమ్మీ దానిని తన డ్రాయరు జేబులో పెట్టుకొని, తను వేసుకొన్న కోటును తీసివేసి, తన చొక్కామీద వున్న జాకెట్టును లాగేసాడు. అదృశ్యముతో అక్కడ "రాల్ఫుడిస్పెన్సరీ" అదృశ్యమై "జిమ్మీ వాలంటాన్ స్థానమేర్పరచుకొన్నాడు.

"మీరంతా ఆ తలుపుకు దూరంగా వెళ్ళండి !" అతడు వెంటనే అందరిని ఆజ్ఞాపించాడు.

తన సూటుకేసును బల్లమీదవుంచి, పూర్తిగా దాని మూత తెరిచాడు. ఆ నిమిషము నుంచి, అతడు తన యెదుట యెవరు వున్నదీ అతనికి పట్టినట్లు లేదు. ఈల వేసుకొంటూ, తన అందమైన, వింతగా మెరుస్తున్న పని ముట్లను, ఒక్కొక్కటే, ఒక క్రమములో బయటికి తీసాడు. తానెప్పుడూ ఆ పనిలో వున్నప్పుడు చేసిన విధంగానే.

అక్కడ వున్న వారంతా, నిశ్శబ్దంగా, కదలకుండా, అతనేమి చేస్తున్నదీ గమనిస్తున్నారు.

మరునిమిషములో 'జిమ్మీ' తెంపుడుడ్రిల్లు పరికరము ఆ యినుప తలుపులను, మెత్తగా కోయటం మొదలు పెట్టింది. అతడు పదినిమిషాలలో, తన పూర్వపు దొంగతనం రికార్డు బద్దలు చేసేటంత కాలములో, ఆ తలుపులకు బిగించిన తాళాలను లాగివేసి, తలుపులను తెరిచాడు.

'అగాతా' లోపల - దాదాపు స్పృహ తప్పిపోయి వుంది. కాని ప్రాణాలతోనే వుంది. వెంటనే 'అగాతా' తల్లి, తన పిల్లను తన చేతుల్లోకి తీసుకొని తన హృదయానికి హత్తుకొంది.

"జిమ్మీవాలంటైను" తన కోటును ధరించి, బ్యాంకు కటకటాలకు వెనుకగా వున్న తలుపు దగ్గరికి నడిచాడు· అతడు వెళుతుండగా, తనను "రాల్ఫ్" అంటూ ఎవరో పిలుస్తున్నట్లు అనిపించింది. కాని అతడు వెను కాడ లేదు.

ఆ తలుపు దగ్గర ఓ పెద్దమనిషి. దారికి అడ్డముగా నిల్చొన్నాడు·

"హల్లో బెన్!....." వింతైన చిరునవ్వుతో పలకరించాడు· "చివరికి మీరిక్కడికి చేరుకొన్నారన్నమాట! మంచిది! మనం వెళదాం పదండి. దానిలో యేమీ పెద్ద తేడా లేదనుకొంటాను."

అప్పుడు "బెన్ ప్రైజ్" కొంచెం వింతగా ప్రవర్తించాడు.

"మీరు నన్ను తప్పుగా అర్థము చేసుకొంటున్నట్లుంది మిష్టర్ స్పెన్సర్! నేను మిమ్మల్ని గుర్తిస్తున్నట్లు నమ్మడంలేదు. మీకోసము గుఱ్ఱపుబండి సిద్ధముగా వుంది — కాదా?"

"బెన్ ప్రైజ్" అక్కడి నుంచి వెనక్కి తిరిగి వీధిలోకి మెల్లగా నడుచుకొంటూ నిష్క్రమించాడు.

—)*(—

ఓ వింత కథ

(A Strange Story)

'ఆస్టిన్' రాష్ట్రములోని ఉత్తర ప్రాంతములో, ఒకప్పుడు "స్మాదర్సు" అనే పేరుతో ఒక మంచి కుటుంబము వుండేది అ కుటుంబ సభ్యులు-జాన్ స్మాదర్సు, అతని భార్య, అతని అయిదేళ్ళ కూతురూ వున్నారు. కాని జనాభా లెక్కకు వారు ఆరు మంది కుటుంబముగా లెక్కింపబడ్డారు. వారు అసలు ముగ్గురే అయినా!

ఒకరాత్రి, రాత్రి భోజనం అయిన తర్వాత ఆ చిన్న పిల్లకు విపరీతమైన కడుపునొప్పి వచ్చి బాధపడింది· తండ్రి జాన్ స్మాదర్సు, తన కూతురు కడుపునొప్పికి మందుతీసుకురావటానికి హడవుడిగా బయటకు వెళ్ళాడు.

కాని అతను యెప్పటికీ తిరిగిరాలేదు

ఆ చిన్న పిల్లకు త్వరలో కడుపు నొప్పి తగ్గిపోయింది. కాల క్రమములో, ఆ అమ్మాలు పెద్దదై, యువతిగా మారింది.

ఆ పిల్లతల్లి, తనభర్త అంతర్ధానికి చాలా విచారపడి మూడునెలల తర్వాత, తిరిగి వివాహము చేసుకొని, సాన్ ఆంటోనియోకి తరలివెళ్ళింది.

ఆ చిన్నపిల్ల యువతి అయిన తర్వాత, సరియైన కాలములో వివాహము చేసుకొంది. కొన్ని సంవత్సరములు గడచిన తర్వాత ఆమెకు కలిగిన అమ్మాయికి అయిదు సంవత్సరముల వయసు వచ్చింది.

ఆ అమ్మాయి తనతండ్రి నివసించిన గృహములోనే యిప్పటికి కాపురం చేస్తున్నది.

ఒకరోజు రాత్రి ఆ అమ్మాయి పిల్లకు తీవ్రమైన కడుపునొప్పి వచ్చి బాధపడు తున్నది. విచిత్రముగా, ఆరోజే కొన్ని సంవత్సరముల

క్రితం ఆ అమ్మాయి తండ్రి 'జాన్‌స్మాదర్సు' యింటి నుంచి అదృశ్యమై పోయిన దినము. అతడు బ్రతికి వుండి, వుద్యోగము చేసుకొంటూ వున్నట్లయితే, యిప్పుడు వున్న చిన్న పిల్లకు 'తాత' కావలసినవాడు.

"నేను బయటికి వెళ్ళి పాప కడుపు నొప్పికి మందు తెస్తాను" అన్నాడు జాన్‌స్మిత్ అతడే ఆ అమ్మాయిని వివాహమాడిన యువకుడు.

"ప్రియమైన జాన్! మీరు బయటికి పోవద్దు!" అతని భార్య యేడ్చింది. మీరుగూడా మా తండ్రిలాగే, ఎప్పటికీ కనపడకుండా పోయి, తిరిగి రారేమో అని నాకు భయముగా వున్నది!" అన్నది.

వాళ్ళ అమ్మాయి పేరు 'పాన్సీ' 'పాన్సీ'కి యింకా కొంచెము సేపటికి కడుపు నొప్పి తీవ్రమయింది. అప్పుడు జాన్ స్మిత్, మందుకోసం బయటికి వెళ్ళటానికి, తిరిగి ప్రయత్నించాడు. కాని అతని భార్య, అతను బయటకు వెళ్ళటానికొప్పుకో లేదు.

ఆకస్మికంగా, వారింట తలుపు తెరచుకొంది. తెల్లజుట్టుతోనూ వంగియున్న నడుముతోనూ వున్న ఒక వృద్ధుడు వాళ్ళ గదిలోకి ప్రవేశించాడు.

"హల్లో! అదిగో తాతగారు వచ్చారు!" అన్నది పాన్సీ! తన తల్లి దండ్రుల కన్నా ముందే, ఆపాప తన తాతను గుర్తు పట్టకలిగింది.

ఆ ముసలి వ్యక్తి తన జేబులో నుంచి ఒక మందు సీసాతీసి దానిలో నుంచి ఓ చెంచాడు మందు పాన్సీ నోటిలో పోసాడు.

పాన్సీ కడుపు నొప్పి వెంటనే మాయమైంది.

'నేను రావటంలో కొంచెము ఆలస్యమయింది ఎందుకంటే నేను టాక్సీ కోసం చాలా సేపు ఎదురుచూసాను" అన్నాడా వృద్ధుడు.

'పాన్సీ' తల్లిదండ్రుల నోట మాట రాలేదు.

)—o—(

నగరం యొక్క కంఠ ధ్వని

(A Voice Of The City)

పాతికేళ్ళ క్రిందట పాఠశాల విద్యార్థులు తమ పాఠాలను రాగ యుక్తంగా, గానంచేసే వారు. వాళ్ళ పాట ఒక విషప్ బోధలకు, అలసి పోయిన రంపపు మిల్లు చేసే ధ్వనికీ మధ్య వుండేది. అంటే కలపనూ, రంపపుపొట్టునూ నేను అగౌరపరుస్తునట్లు అనుకోవద్దు.

జీవశాస్త్రము బోధించే తరగతిలో వున్నప్పుడు. ఒక అందమైన నీతిని నేర్పే ఓన్న పాట నాకు జ్ఞాపకమున్నది.

'శరీరములో మోకాలు క్రింద నున్న యెముక
అన్నిటి కన్నా పొడుగైన యెముక!'

మానవునికి సంబంధించిన బాహ్యమైన, ఆధ్యాత్మకమైన, బోధనలు పిల్లల మనస్సుల మీద సకారణంగా ముద్రింపబడితే, అది నిజంగా చెప్ప లేని వరం గదా! కాని మనము శరీరము ద్వారానూ, వేదాంతబోధనల ద్వారానూ, గానముల ద్వారానూ, నేర్చుకొన్నది చాలా స్వల్పము.

ఆరోజున నేను చాలా ఆందోళన చెందాను. నన్ను ఓదార్చటానికి ఒక కాంతి కిరణము అవసరమనిపించింది. నేను పాఠశాలలో గడిపిన పాత రోజులను నెమరు వేసుకొన్నాను. కాని ఆ విద్యార్థులు పాడిన పాట లలో, యే ఒక్క పాటా, మానవజాతి అభిప్రాయాన్ని ప్రతి ధ్వనించేదిగా జ్ఞాపకం రాలేదు.

దానిని వేరే మాటలలో చెప్పాలంటే, మానవజాతి అంతాయేమి చెప్పాలను కొంటున్నదో, అది వారు పాడే విచారకరమైన పాటలలో లేదు.

ఇంకోరకంగా చెప్పాలంటే, ఆ పెద్ద నగరం యొక్క కంఠధ్వని వినిపించటం లేదు

ఇప్పుడు మనం ఒకవ్యక్తి చెప్పేది అర్థం చేసుకోగలం. ఒక కవి గానం చేసిన పాటను తెలుసుకోగలం. ఓ చిన్న ప్రవాహములోని అలల కదలికలను గ్రహించగలము. ఒక వ్యక్తి అయిదు డాలర్లు కావాలని ఎందు కడుగుతున్నాడో తెలుసుకో గలము. 'ఫారోస్' సమాధుల మీద వ్రాసిన వ్రాతలను అర్థం చేసుకోగలము. పువ్వుల భాషను, వేకువ జామున నాల్గు గంటలకు పాల డబ్బాల చప్పుడునూ కనుక్కోగలము.

"మిస్టర్ హెచ్ జేమ్స్" విడిచే భయంకరమైన గాలి వత్తిడికి, చెవి గూబ నుంచి వచ్చే తరంగముఽర్థం తెలుసుకోగలమని కొంతమంది పొడుగు చెవుల వాళ్ళు అంటారు.

కాని ఈ నగరం యొక్క కంఠధ్వని యొక్క అర్థము నెవరు గ్రహించగలరు?

దానిని తెలుసుకోవాలని బయటికి బయలు దేరాను. మొట్టమొదటగా నేను 'ఔర్లియా' అనే అమ్మాయిని అడిగాను. ఆమె ఒక తెల్లటి టోపీ ధరించింది దాని మీద కొన్ని ధాన్యపు పువ్వులా, రిబ్బన్లూ గుచ్చబడి వాటి చివరలు గాలికి కదులు తున్నాయి.

నేను నత్తిగా మాట్లాడుతూ, ఆ అమ్మాయిని అడిగాను ఎందుకంటే నాకు ప్రత్యేకమైన కంఠధ్వని లేదు.

"అమ్మాయి! ఈ నగరం చాలా పెద్ద నగరం చాలా చాలా పెద్ద నగరము మేమి అంటున్నది? దాని కేదో విధమైన కంఠ ధ్వని వుండి వుండాలి అది యెప్పుడైనా, నీతో మాట్లాడిందా? దాని భావాన్ని నీవెలా అర్థం చేసుకొన్నావు? అది ఒక పెద్ద భయంకరమైన పదార్థంగా వుండ వచ్చు అయినా దానికి గూడా యేదో చెప్పే శక్తి వుండవచ్చు!"

"మీరు చెప్పేదేమిటో నాకు సరిగా అర్థం కాలేదు"అన్నది ఔర్లియా.

"ప్రతి నగరానికీ, ఒక గొంతు వుంటుందని నేను వూహిస్తున్నాను. ప్రతివారూ, వినే వారుంటే, చెప్పగలిగినదేదో వుంటుంది. ఈ పెద్ద నగరం నీకేమి చెప్పుతున్నది?"

ఔర్లియా, న్యాయశాస్త్ర పరిభాషలో మాట్లాడుతూ అన్నది, "అన్ని నగరాలూ!" "ఒకటే విషయాన్ని చెప్తాయి. అవి అన్నీ దానిని చెప్పినప్పుడు వాటి ప్రతిధ్వని 'ఫిలడెల్ఫియా' నుంచి వినిపిస్తుంది. కాబట్టి అవన్నీ ఒకే విషయాన్ని ఏకగ్రీవంగా చెప్పుతున్నట్లు అనుకోవచ్చు!"

"ఇక్కడ 4,000,000 మంది జనం వున్నారు." నేను అన్నాను. "వార్ స్ట్రీటు నీళ్ళలో చుట్టబడి వున్న ఆ యెక్కువ భూభాగంలో యింత మంది క్రిక్కిరిసి వున్నారు. ఇంతమంది యింత చిన్న ప్రదేశంలో కలిసి వుడటం వలన యేదో ఒక సామాన్యమైన పద్ధతి ద్వారా తమ వ్యక్తిత్వాన్ని లేక ఒకే విధంగా కలిసి వుండటాన్ని, ఒక భావన ద్వారా బయటకు వెల్లడించాలి. అది నీవు చెప్పినట్లుగా ఒకభాషలో ఒక ఏకగ్రీవాంగీకారం ఒక పరిశుద్ధమైన భాషలో ఒక సామాన్య భావం వెలిబుచ్చవచ్చు. దానినే మనం నగరం యొక్క పరిభాషగా చెప్పుకోవచ్చు అదేమిటో, నీవు నాకు చెప్పగలవా?"

'ఔర్లియా' అద్భుతంగా మందహాసం చేసింది. ఆమె తన భుజాలను ముందుకు వంచి కూర్చున్నది. పుష్పములతో వున్న ఓ చెట్టు కొమ్మ ఆమె కుడి చెవి మీదగా నిర్లక్ష్యముతో క్రిందికీ పైకీ వూగుతున్నది. సిగ్గులేని చంద్రకాంతి ఆమె నాసిక మీద పడి ప్రకాశిస్తున్నది.

కాని నేను మొండిగా పట్టు పట్టాను.

"నేను వెళ్ళి తెలుసుకోవాలి" నేను అన్నాను. ఈ నగరం యొక్క కంఠధ్వని యేమిటో? ఇతర నగరాలన్నిటికీ రకరకాల గొంతు ధ్వనులు న్నాయి. అది నిర్దేశించబడిన ఒక విషయం అదేమిటో నేను తెలుసు కోవాలి!" నేను నా ప్రసంగాన్ని కొనసాగించాను గొంతు పెద్దది చేస్తూ," న్యూయార్క్ మహా నగరం నాకు పొగమట్టి నియ్యకుండా యిలా చెప్ప

వచ్చి, "ఓ వృద్ధుడా! ప్రచారం కోసమే నేను మాట్లాడను." "ఏ యితర నగరం కూడా అలా అనదు. "చికాగో" నగరం నిస్సందేహంగా "నేను మాట్లాడతాను!" అంటుంది ఫిలడెల్ఫియా, "నేను మాట్లాడాలి!" అంటుంది న్యూ ఆర్లియన్సు "నేను మాట్లాడేదాన్ని" అంటుంది. లూయిస్ విల్లీ నేను మాట్లాడితే యేమీ అనుకోవద్దు" అంటుంది, లూయిస్ 'నన్ను క్షమించండి" అంటుంది, పిట్సుబర్గు అంటుంది" సిగరెట్టు త్రాగు!" అని మట్టావాయ్‌కాన్ "నేను ప్రయాణించెయ్యాలి!" అంటుంది. మరి న్యూయార్కు మహా నగరం ఏమంటుంది?"

బొర్లియా మందహాసం చేసింది. కాని యేమీ చెప్ప లేదు.

"మంచిది! ఆ సంగతి నేనింకా యెక్కడికైనా వెళ్ళి కనుక్కొంటాను" అన్నాను నేను.

శిల్పములతో అలంకరింపబడిన ఓ అందమైన భవనంలోకి వెళ్ళాను ఆ భవనం నేల మట్టితో కూర్చబడిన రాళ్ళతో చేయబడింది.

ఆ భవనం చదరపు ఆకారంలో వుంది. దాని కాపలాకు ఓ రక్షక భటుడు కూడా వున్నాడు.

నేను లోపలికి పోయి యిత్తడి కడ్డీలతో కట్టబడిన చక్రము మీద నా కాలుంచుతూ, అక్కడ బారులో పని చేసే సర్వరుని అడిగాను అతడి పేరు 'బిల్లీ మాగ్నస్'

"బిల్లీ! నీవు న్యూయార్కు మహానగరంలో చాలా కాలం నుంచి వుంటున్నావు— ఏ రకమైన నృత్యగానాలు, ఈ నగరం నీకు ప్రదానం చేసింది? మధురమైన వాక్చాతుర్యముతోనూ, చేదైన మద్యముతోనూ, చిన్న రొట్టె ముక్కలతోనూ, ఈ నగరం ఒక మధురమైన పాటను ఆలాపిస్తున్నట్లు అన్పించటం లేదా?"

"ఒక్క క్షణం వుండండి! ఎవరో గంట మ్రోగిస్తున్నారు!" అంటూ అతను వెళ్ళి, ఒక ఖాళీ బొక్కెనతో తిరిగి వచ్చాడు దానిని పూర్తిగా నింపి. తీసుకువెళ్ళి, తిరిగి వచ్చాడు. అప్పుడతడన్నాడు "ఆమె

మా యజమాని! ఆమె రెండు సార్లు గంట కొడుతుంది. రాత్రి భోజనంలో ఆమె ఒక గ్లాసు బీరు త్రాగుతుంది. ఆమె పిల్లవాడు గూడా ఆమెతో పాటు త్రాగుతాడు. సరే, మీరేమి అడుగుతున్నారు? వాళ్ళు రెండు సార్లు గంట మ్రోగిస్తే నాకు కోపమొస్తుంది. మీరు 'బేస్‌బాల్' స్కోరు అడిగారా? లేక "గిన్" మద్యం అడిగారా?"

"లేదు, నేను జింజరు అడిగాను" సమాధానం చెప్పాను నేను.

తిరిగి నేను నా అన్వేషణను సాగించి 'బ్రాడ్ వే' దాకా నడిచాను. అక్కడ ఓ సందులో ఓ రక్షకభటుడున్నాడు. ఆ పోలీసు చిన్న పిల్లలను ఆడవారిని రోడ్డు దాటిస్తాడు. నేను అతని దగ్గరకు వెళ్ళాను.

"నిన్నొక చిన్న ప్రశ్న అడగాలను కొంటున్నాను. అడిగితే నా హద్దు మీరినట్లు కాదనుకొంటాను. నీవు, నీ సోదర రక్షకభటులూ, ఈ నగరాన్ని అన్ని వేళలా చూస్తూ వుంటారు. నగరంలోని శబ్దాలన్నీ మీరు వినే వుంటారు. మీకు వినపడనటువంటి ఒక గొంతు ధ్వని వుండవచ్చు! రాత్రిపూట ఒంటరిగా వున్నప్పుడూ, నగరములో తిరుగుతున్నప్పుడూ, దానిని మీరు తప్పక విని వుంటారు. ఇంతశ్రమతో కూడిన ఆ గొంతు ధ్వనిలోని అసలు భావమేమిటి?"

"స్నేహితుడా!" ఆ పోలీసు తన చేతి కర్రను త్రిప్పుతూ అన్నాడు. అది యేమీ చెప్పదు. నాపై అధికారి నుంచి నాకు వుత్తర్వులు వస్తాయి. నీవు సరిగా అర్థం చేసుకొంటున్నా వని నేననుకొంటున్నాను కొంచెంసేపు నా బదులుగా యిక్కడ నిల్చొని, ఈ జనం రాక పోకలు గమనించు!"

అంటూ ఆ రక్షకభటుడు అ చీకటిలో ప్రక్క గొందిలోకి అదృశ్య మయ్యాడు. పది నిమిషాల్లో తిరిగి వచ్చాడు అతను అన్నాడు కొంచెము పెద్ద స్వరంతో. "ఈ రోజుల్లో ఆడవాళ్ళు యెలా వున్నారో మీకు తెలుసు గదా! నా భార్య ప్రతిరాత్రి 9 గంటలకు ఆ వీధి చివర వరకు నాకు "హల్లో" చెప్పటానికి వస్తుంది. సాధారణముగా నేనక్కడ ఉండటానికి ప్రయత్నిస్తాను. ఆ కొంచెంసేపు క్రిందట యేమో నన్నడిగారు కదూ! ఈ నగరంలో మేమేం చేస్తున్నామని గదా! అదిగో 12 బ్లాకులు దాటి పోతే వొక రూఫ్‌గార్డెన్ కవిపిస్తుంది. అది ఈ మధ్యనే ప్రారంభం చేశారు....

అక్కడున్న ఒక పార్కు చుట్టూ తిరిగి, రోడ్డుమీద చెట్లమధ్యగా వున్న బజారుకార్ల గుర్తులను దాటుకొని అవతలి వేపుకు వెళ్ళాను. అక్కడ ఆకాశంలో ఓ పొడుగాటి భవనంమీద ఒక నకిలీ "డయానా" వణుకుతూ ప్రకాశిస్తున్నది. అది అదృష్టవంత మయినదిగానూ, సంపదతో కూడినట్టిదిగానూ, మోసకారిగానూ, వీరనిలానూ అనిశ్చలంగా అక్కడ గాలికి వూగుతున్నది.

దారిలో నా కవి మిత్రుడు కనిపించాడు అతడు హడావుడిగా వెళు తున్నాడు కారులో. అతడు తల దువ్వుకొని, టోపీ పెట్టుకున్నాడు. పద్యాలు పాడుకొంటూ పోతున్నాడు.

"బిల్లీ" అంటూ అతన్ని పలుకరించాను. (అతడు పత్రికలలో "క్లియోన్" అనే కలం పేరుతో పద్యాలు వ్రాసాడు)

"నాకు కొంచెము లిఫ్టు యివ్వు ఈ నగరం యొక్క కంఠధ్వనిని కనుక్కొనే పనిలో నిమగ్నమై యున్నాను. అది ఒక ప్రత్యేకమయిన పని. మామూలుగా అయితే హెన్రీక్లూస్, జూనియర్ మల్లివాన్, ఎడ్విన్ మార్ఖామ్, మేయిర్విన్ మరియు చార్లెస్ స్వాబ్ అంతా కలిసి ఏ విష యాన్ని గురించి అయినా చర్చించవచ్చు. కాని యిది వేరే విషయం. ఎంతయినా కవితా ధోరణిలో వున్న నిండయిన ఈ నగరంయొక్క ఆత్మ యేం చెబుతున్నది? దాని అర్థమేమిటి? నాకు కావాలి! నీవు ఆ విష యాన్ని గురించి యేదయినా చెప్పగలవా?"

"నయాగరా జలపాతం యొక్క ప్రవాహపు సంగీత ధ్వనితో ఈ నగరపు కంఠధ్వనిని పోల్చటానికి లేదు. ఈ నగరము మాట్లాడేటట్లయితే యేమి మాట్లాడుతుందో కొంచెము చెప్పు అది చాలా గొప్పదిగా, భావ పూరితంగా వుండవచ్చు. దానిని గురించి మనం ఒక నిర్ణయానికి రావా లంటే చాలా విషయాలు గమనించాలి ప్రతిదినమూ జరిగే ప్రజల వాహ నాల రాకపోకల రణగొణ ధ్వనులూ, రాత్రిపూట జరిగే నృత్య గాన వినోదాలూ, ఆట పాటలలో గడిపే వ్యర్థకాలమూ, రాత్రిపూట వినిపించే రోదన ధ్వనులూ, పరిగెడుతున్న మోటారుకార్ల శబ్దాలూ, పత్రికా విలేఖరుల అరుపులూ, అంబరవీధులలో నెలకొన్న వుద్యానవనము లందలి

జలాశయములలో ప్రవహించే నీటి హోరునూ, వీధులలో తినుబండారా లమ్మే కుర్రవాళ్ళ కేకలు "ఎవ్వెరిబడీ" యొక్క ముఖచిత్రాలూ, పార్కు లలో ప్రేమికుల గుసగుసలూ .... ఈ శబ్దాలన్నీ కూడా ఆ నగరపు కంఠ ధ్వనిలో కలవాలి. ఆ కలయికలో నుంచి ఓ ముఖ్యమయిన పదార్థము తయారుకావాలి. దానిలోనుంచి ఓ రసమూ, అందులోనుంచి మనము అన్వేషించే బిందువూ లభించాలి."

"నీకు జ్ఞాపకముందా?" ఆ కవి అడిగాడు. "గత వారంలో 'స్టీవర్' స్టుడియో దగ్గరకలుసుకొన్న కాలిఫోర్నియా అమ్మాయి? నేనామెను చూడటానికి పోతున్నాను. ఆమె నా పద్యాన్ని తిరిగి అప్పచెప్పింది "ట్రిబ్యూట్ అఫ్ ది స్ప్రింగు" పద్యంలోని ప్రతి పదమూ వల్లించింది. ప్రస్తుత మిప్పుడు నగరంలో వున్న అమ్మాయి లందరిలో చాలా చురుకయి నది. ఆ! నేను కట్టుకొన్న నెక్ టై యెలా వుంది? దానిని సరిగా కట్టు కొనటం నేర్చుకొనటానికి ముందు నాలుగు టైలను చింపాను."

"మరి నేనడిగిన నగరపు కంఠధ్వని సంగతేమిటి?" అతనిని నేనడి గాను.

"ఓ! ఆమె పాట పాడదు" క్లియోను అన్నాడు. "కాని ఆమె నా పద్యం "ఏంజిల్ ఆఫ్ ది ఇన్ షోర్ లింకు" పాడుతుంటే వినాలి"

నేను నా అన్వేషణ కొనసాగించాను. నేను దారిలో ఒక వార్తా పత్రికలమ్మే కుర్రవాడిని కలిసాను. అతడు వార్తాపత్రికలను నా మొహాన ఆడించాడు. గతంలో వచ్చిన రెండు విప్లవాలలోని వార్తలను పాతపడే ట్లు చేసే సాంఘిక సమస్యలకు చేయూతనిచ్చే వార్తలు ఆ పత్రికలో వచ్చాయి.

"అబ్బాయీ!" అన్నాను జేబులో చేయిపెట్టి పేపరు కొనటానికి డబ్బులకోసం వెతుకుతున్నట్లుగా నటిస్తూ "ఈ నగరం అప్పుడప్పుడు మాట్లాడుతున్నట్లు నీ కనిపించలేదా? ప్రతిరోజూ జరిగే ఈ వ్యాపారంలోని ఒడుదుడుకులూ, యింకా అనేక రకాలుగా జరుగుతున్న విశేషాలు.... ఏమి చెప్తున్నాయి? ఈ పట్టణం మాట్లాడగలదని నీ కనిపిస్తున్నదా?" అడిగాను ఆ పత్రికలమ్మే కుర్రవాడిని.

"మీ మోసపు మాటలు ఆపండి" అన్నాడు ఆ పేపరబ్బాయి. "మీకేమి వార్తాపత్రిక కావాలి? వృధా చెయ్యటానికి నాకు టైమ్ లేదు. ఈ రోజు "మాగ్" యొక్క జన్మదినం. ఆమెకు బహుమతి తీసుకెళ్ళాలంటే 30 సెంట్లు కావాలి"

ఈ కుర్రవాడు నగరపు కంఠధ్వనిని వివరించలేడని తెలిసిపోయింది నేను ఒక పేపరుకొని ఆ రోజు వార్తలలో హత్యలను గురించి, ప్రకటింపబడిన సంధులను గురించి చదివాను.

నేను తిరిగి పార్కుకు వెళ్ళి వెన్నెల నీడలో కూర్చున్నాను నేను చాలోసేపు దీర్ఘంగా, అతి దీర్ఘంగా ఆలోచించాను. నేను అడిగిన దానికి యెవ్వరూ సమాధానం చెప్పలేకపోయ్యారే అని ఆశ్చర్యపోయాను.

అప్పుడు ఆకాశంలోని ఓ నక్షత్రంలో నుంచి హటాత్తుగా వచ్చే కాంతికిరణంలాగా ఆ సమాధానం నాకు తట్టింది. నేను పార్కులోంచి లేచి గబగబా నడిచాను. ఎందుకంటే ఎంతోమంది నావంక అదేపనిగా చూస్తున్నారు. నాకు, నా ప్రశ్నకు సమాధానం తెలిసిపోయింది. దానిని నా హృదయంలో దాచుకొన్నాను. పరుగెత్తుతూ యెవరన్నా నన్నాపి ఆ రహస్యం చెప్పమంటారన్న భయంతో?

"ఔర్లియా" యింకా ముందుకు వంగి కూర్చునేవుంది. చంద్రుడు ఆకాశంలో ఎత్తులో వున్నాడు. ఆయన అందమైన నీడలు యింకా హటాత్తుగా కనిపిస్తూన్నాయి.

నేనామె చేతులను నా చేతులలోకి తీసుకున్నాను. ఒక మేఘం పరుగెత్తుతూన్న చంద్రుని అక్రమించి ప్రక్కలకు ఒరిగిపోయి బలహీనమై చివరకు కనబడకుండా పోయింది.

మేమిద్దరమూ ఆ దృశ్యాన్ని తిలకిస్తున్నాము

ఓ అరగంట తర్వాత "ఔర్లియా" తనసహజమయిన చిరునవ్వుతో అంది. "మీరు వచ్చినప్పటి నుండి ఒక్కమాట కూడా మాట్లాడలేదని మీకు తెలుసా?"

"అదే....అదే....ఈ నగరం యొక్క కంఠధ్వని!!" అన్నాను నేను.

)—o—(

విల్లీ తండ్రికి చేసిన సహాయం

(HOW WILLY SAVED HIS FATHER)

"హౌస్టను" పట్టణంలో "విల్లీ ప్లింటు" అనే కుర్రాడున్నాడు. అతడి వయస్సు ఆరేళ్ళు బంగారపురంగు గిరజాల జుట్టుతో, అమాయక మైన నీలపు కళ్ళతో, మంచి అందమైన బాలుడతడు. అతని తండ్రి చాలా గౌరవనీయుడైన మంచి ప్రవర్తనగల పౌరుడు. అతనికి ఆ నగరపు ముఖ్యవీధిలో నాలుగయిదు భవనాలు వున్నాయి. అతడు వాటిని కొన్ని కార్యాలయాలకు, పురజనుల నివాసానికీ అద్దెకిచ్చాడు. అతను రోజంతా తన అద్దెలు వసూలు చేసుకొంటూ, ఆ యిళ్ళలో పగిలిపోయిన కిటికీ అద్దాలను అతికిస్తూ, వదులైన బోర్డులను మేకులతో బిగిస్తూ, సున్నము రాలిపోయినచోట తిరిగి బాగుచేస్తూ గడిపేవాడు. మధ్యాహ్నం అయిన తర్వాత తన భవనాలలోని యేదో భవనంలో మెట్లమీద కూర్చొని, తన యింటినుంచి పొట్లముతో కట్టుకొచ్చిన ఆహారము భుజిస్తూ, తను కష్టపడిన రోజులను గురించి తలుచుకొనేవాడు. అందముగా దుస్తులు ధరించిన గృహస్తాలు, వ్యాపారస్తులూ మెట్లపైకీ, క్రిందికీ నడుస్తూంటే అతడువారిని చూసి అసూయ పడేవాడుకాదు "హౌస్టను" నగరములో ముఖ్యమైన నివాస గృహము లుండేచోట, బొగ్గూటో చెత్తకుప్పలకు దగ్గరగా వుండే చోట ఓ చిన్న కుటీరంలో అతను నివసించే వాడు. తన భార్యతోనూ, పిల్లవానితోనూ, అక్కడ అతడు సంతృప్తిగా కాపురం చేసుకొంటున్నాడు. అతడికి అద్దెలమీద నెలకు 1400 డాలర్లు వస్తాయి. అతడు చాలా కష్టపడ తాడు. మంచి అలవాట్లు గలవాడు. ప్రతిరోజూ తన అద్దె యిండ్లలో యేదో ఒక దానికి అద్దె పెంచకుండా వుండేవాడుకాదు. అది భవిష్యత్తులో తన కష్టాలలో పనికి వస్తుందని అతని వూహ! ఆశ!

ఒకరాత్రి మిస్టర్ ప్లింటు జబ్బుపడి యింటికి వచ్చాడు. అతడు తన యిళ్ళలోని చవక గోడలకు రంగుకాగితాలు ఆకలి కడుపుతో అంటిం

చుతూ పనిచేయటం వలన అతడు జ్వరపడ్డాడు. అతడు జ్వరముతోనే పడుకొని, భగవంతుని ప్రార్థించాడు. 'ఓ భగవంతుడా! నాకేమన్నా అయితే నా భార్యాబిడ్డలను కాపాడు!" అంటూ.

విల్లీని తన గదిలోనుంచి ప్రక్కగదికి పంపి, తన తలక్రింద దిండులో దాచిన ఆకుపచ్చని నోట్లకట్టను తన భార్యకిచ్చి యిలా అన్నాడు, "ఈ డబ్బును తీసుకు వెళ్ళి బ్యాంకులో రేపు డిపాజిట్ చెయ్యి. అక్కడ మన ఖాతాలో 900 డాలర్లు మాత్రమే వున్నాయి. కొంతమంది యింకా అద్దె యివ్వలేదు. ఇంకా కొంతమంది కిటికీలకు కాన్వాసు తెరలను పెట్టించమన్నారు. సమస్త జంతుకోటిని కాపాడే భగవంతుడే, మనల్నికూడా కాపాడుతాడు. బేకరీ దుకాణానికి వెళ్ళి ఒక చిన్న రొట్టెముక్క తీసుకురా! తర్వాత భగవంతుని ప్రార్థించు!"

'విల్లీ' తను ఆటలలో మునిగినట్లు నటిస్తూ, తండ్రిచెప్పే మాటలు విన్నాడు.

తల్లి బయటికి వెళుతుంటే అడిగాడు. "మమ్మీ! నాయనగారు పని చేయలేనంత జబ్బు పడ్డారా?" అని.

"అవును నా ప్రియమైన విల్లీ! మీ నాన్నగారికి జ్వరము యెక్కువగా వుంది. ఆయనకు బాగా వ్యాధి ముదిరిందనుకొంటున్నాను" అన్నది ప్లింటు భార్య.

తన తల్లి వీధిలోకి వెళ్ళిన తర్వాత విల్లీ టోపీ తలమీద పెట్టుకొని వీధిలోకి వెళ్ళాడు.

"జబ్బుగా వున్న మంచి దయగల నా "పాపా"కు నేను యేదన్నా సహాయం చెయ్యాలి!" తనలోనే అనుకొన్నాడు విల్లీ.

అతడు పెద్ద బజారులోకి వెళ్ళి, తన బీద తండ్రికి వున్న యెత్తయిన భవనాల వంక చూసాడు.

రోడ్డున నడిచేవాళ్ళు కొద్దిగా పసుపుపచ్చని రంగుజుట్టుగల ఈ చిన్ని కుర్రవానిని చూసి, చిరునవ్వు నవ్వారు. కాని, చాలామంది అతని అమాయకపు నీలికళ్ళను చూసి జాలిపడ్డారు.

అంత పెద్ద మహానగరంలో పాపం పసివాడైన 'విల్లీ' తనతండ్రికి సహాయం చెయ్యటానికి యేమి చెయ్యగలడు?

"ఏమి చెయ్యాలో నాకు తెలుసు" అతడు తనలో అనుకున్నాడు. "నేను మా భవనపు అంతస్థులలోకి పోయి అద్దెకున్న కార్యాలయాల అద్దె పెంచుతాను. అది నా తండ్రిని సంతోషపెట్టవచ్చు. అతని ఆరోగ్యము బాగుపడవచ్చు."

విల్లీ అన్నిటికన్నా యెత్తయిన తన తండ్రి భవనములో రెండు అంతస్తులు దాటి వెళ్ళాడు. అతడు మెట్లమీద పైకి వెళ్ళేటప్పుడు ఆయాసముతో, చాలాసార్లు కూర్చొని విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది.

మూడవ అంతస్థులో యిద్దరు యువ లాయర్లు అద్దెకు తీసుకొని 'లా' ప్రాక్టీసు చెయ్యటం ప్రారంభించి యెన్నో రోజులు కాలేదు. వాళ్లు తమ బోర్డును బయట కట్టుకొని, మొదటి నెల అద్దె మిస్టరు ఫ్లింటుకు యిచ్చారు. చిన్న విల్లీ మూడవ అంతస్థు మెట్లు యెక్కి, వారి కార్యాలయములోకి వెళ్ళేటప్పటికి వాళ్ళు జున్నుతో వండిన రొట్టెలు తింటున్నారు. వాళ్ళ బల్లమీద ఆరు ఖాళీ బీరు సీసాలు వున్నాయి. వాళ్ళలో ఒకడు తమాషా కథ చెప్తున్నాడు ఒక ఆడపిల్లను గురించి.

వాళ్ళు తమ కాళ్ళను బల్లల మీద పెట్టుకొని తింటున్నారు దర్జాగా. విల్లీని చూసి, వాళ్ళల్లో ఒకడు బల్లమీదనుంచి తన కాళ్ళను తీసుకొన్నాడు.

"జిమ్మీ! ఇటు చూడు! ఎవరొచ్చారో!" అన్నాడు రెండవ యువకలాయరుని చూసి.

రెండవ లాయరుగూడా తన కాళ్ళను బల్లమీద నుంచి దించి, సరిగా కూర్చొన్నాడు. అతడు కత్తితో జున్నును ముక్కలుగా కోస్తున్నాడు. ఆ కత్తిని తన తలజుట్టుతో తుడిచి చుట్టూ చూసాడు.

తన నీలపు కళ్ళతో, బంగారు రంగుగల వంకీల జుట్టుతో, ఒక చిన్నపిల్లవాడు తలుపు దగ్గర నిలబడి వున్నాడు.

"సిస్సీ! లోపలికి రా అమ్మా!" అంటూ కుర్రవానిని లోపలికి ఆహ్వానించాడతను.

"విల్లీ" ధైర్యముగా వారి గదిలోకి నడిచాడు.

"నేను అమ్మాయిని కాదు. నా పేరు 'విల్లీప్లింటు' నేను అద్దె పెంచటానికి వచ్చాను" అన్నాడు

"విల్లీ! చాలా మంచిపని చేస్తున్నావు" అన్నాడు 'బాబ్' అనే పేరు గల యువకుడు. ఎందుకంటే మేము విద్యుత్ ఘాతముతో మరణిస్తే ఆ పని చెయ్యలేముగదా! సరే! అది నీ స్వంత జుట్టేనా? విల్లీ! నీకు సైకిలు త్రొక్కటం వచ్చా?"

"ఇదిగో ఆ కుర్రవాడి నిబ్బంది పెట్టవద్దు!" అన్నాడు సామ్ అనే పేరుగల రెండో యువకుడు. "ఇతను మంచి పిల్లవాడని నాకు బాగా నమ్మకం విల్లీ! నీవెప్పుడైనా 'చ్యూఇంగ్‌గమ్' (జిగురులాంటి ఓ తడి పదార్థము) తిన్నావా?"

"అతనిని ఏడిపించవద్దు" బాబ్ గట్టిగా అన్నాడు. "అతనిని చూస్తుంటే....అతని గిరజాల జుట్టును, అతను వేసుకొన్న వదులు ట్రౌజర్లను చూస్తుంటే....నాకు ఎవరో జ్ఞాపకమొస్తున్నారు!....నా కన్నీళ్ళను పట్టించుకోవద్దు 'విల్లీ' నా చిన్నపిల్లవాడా! త్వరగా చెప్పు! రెండు వందల పది సంవత్సరాల క్రిందట నీవు వున్నావా?—"

"ఓ! అతనిని వంటరిగా వదిలెయ్యి!" బాబ్‌వంక కోపంగాచూస్తూ అన్నాడు శామ్. "విల్లీ! నా సంతోషం కోసం నేలమీద కూర్చొని కొంచెం సేపు యేడుస్తావా? ఎందుకంటే నాకేమీ పనిలేక బోరుకొడ్తున్నది. నీవలా చేస్తే నేను ఆనందిస్తాను."

"మా తండ్రి చాలా జబ్బుగా వున్నాడు" వచ్చే కళ్ళనీళ్ళనాపు కొంటూ విల్లీ ధైర్యంగా అన్నాడు. "ఆయన కోసం నేనేదైనా చెయ్యా లనుకుంటున్నాను. అయ్యా! దయగల పెద్దమనుషుల్లారా! మీ కార్యా లయపు అద్దెను పెంచనీయండి. నే వెళ్ళి ఆ విషయం మా తండ్రికి చెపితే, ఆయన కోలుకుంటాడు."

"ఇతడు మిస్టర్ ఫ్లింటుగారబ్బాయన్నమాట!" అన్నాడు బాబ్ "అయితే అద్దె ఎంత పెంచాలనుకొంటున్నావు బాబూ!"

"మీరిప్పుడు అద్దె ఎంత చెల్లిస్తున్నారు?"

"నెలకు పదిడాలర్లు."

4)

"దానిని మీరు పంద్రెండు డాలర్లు చేసుకోగలరా?"

"యాభయి డాలర్లు తొంభయి రోజులకు అనుకొందాం....నీకు యిష్టమేనా విల్లీ! మై లిటిల్ ఫెల్లు! సంతోషంగా బీరు త్రాగుదామా!" నల్లటి సిగరెట్టు వెలిగించుకొంటూ అన్నాడు శామ్.

"శామ్! వెధవ వాగుడు వాగద్దు!" అన్నాడు బాబ్. "విల్లీ! అద్దెను నెలకిరవై డాల్లర్లకు పెంచచ్చు! నీకిష్టముంటే— నీవు పరుగెత్తికెళ్ళి ఆ సంగతి మీ తండ్రికి చెపితే, ఆయన త్వరగా కోలుకుంటాడేమో!"

"ఓ! మీకు చాలా కృతజ్ఞతలు!" అంటూ విల్లీ సంతోషముతో పరుగెత్తి యింటికి వచ్చాడు ఈలవేస్తూ.

అతను వచ్చేటప్పటికి మిస్టర్ ప్లింటు పరిస్థితి బాగాలేదు. తన భార్యకు పది డాలర్ల నోటు యివ్వాలనుకొంటూ అతను యేదో గొణుక్కుంటున్నాడు.

"మీ తండ్రికి మతిపోయింది!" అంటూ శ్రీమతి ప్లింటు కళ్ళనీళ్లు పెట్టుకొంది.

విల్లీ తండ్రి మంచము దగ్గరకు పరుగెత్తి చెవిలో చెప్పాడు. "పాపా!" మీ కార్యాలయములలో ఒక దాని అద్దె పదినుంచి ఇరవై డాలర్లకు పెంచాను."

"నీవు మంచి పిల్లవాడివి! భగవంతుడు నిన్ను ఆశీర్వదించుగాక!" అంటూ తన చేతిని విల్లీ తలమీద వుంచాడు అతని తండ్రి.

మిస్టర్ ప్లింటుకు ప్రశాంతమైన గాఢనిద్ర పట్టింది. దానితో అతని జ్వరము తగ్గిపోయింది.

రెండవ రోజున అతడికింకా కొంచెము బలమువచ్చి, మంచము మీద కూర్చోగలిగాడు.

అప్పుడు 'విల్లీ' తాను ఎవరి కార్యాలయానికి అద్దె పెంచాడో చెప్పాడు.

అది వింటూ ప్లింటు గుండె ఆగి మరణించాడు.

ఓయి భగవంతుడా! ఈ జీవితమంతా యిటువంటి ఆశాభంగములతో కూడివున్నది గదా!

—)o(—

ప్రేమ పక్షులం!

(Admit Two)

ఆ డాక్టరుగారు ప్రాక్టీసు మానేసి చాలా కాలమయింది. అయినా ప్రత్యేక శ్రద్ధగల కేసు వచ్చినప్పుడు ఆయన వైద్యం చెయ్యటం కోసం వెళ్ళటానికి వెనకాడేవాడు కాదు.

అతడు అందగాడు. తన వృత్తిలో అపారధనం సంపాదించాడు. ఆరు నెలల క్రిందటనే ఒక అందమైన యువతిని అతడు వివాహమాడాడు. అతని సంపదను, పున్నతస్థితిని చూస్తే యెవరికైనా అసూయ కలుగక మానదు.

ఆ రోజు రాత్రి అతను యింటికి తిరిగి వచ్చేటప్పటికి తొమ్మిది గంటలవుతుంది. అతని గుఱ్ఱపు బండివాడు, అశ్వాలను తీసుకొని, అశ్వశాలలో కట్టేయటానికి వెళ్ళాడు. అతడు తన మేడ మెట్లను అధిరోహించాడు దాదాపు పరుగెత్తుతూ. వెంటనే అతని పడకగది తలుపు తెరచుకొంది. అతని అందమైన భార్య 'డోరీ' వచ్చి అతని మెడను తన చేతులతో చుట్టివేసింది.

"ఓ! రాల్ఫుగారు!" ఆమె గొంతు జాలి కొలుపుతున్నట్లుగా పలుకుతున్నది. "మీరీరోజున చాలా ఆలస్యంగా వచ్చారు. మామూలు వేళకు మీరు రాకపోతే నేను యెంత బాధపడ్డానో మీకు అర్థంగాదు. మీ కోసం భోజనం వేడిగా పుంచాను. నానుంచి యింత సేపు మిమ్ములను వేరు చేస్తున్న మీరోగులను చూస్తే నాకు అసూయ కల్గుతున్నది" అన్నదామె.

"నీవు యెంత క్రొత్తగా, మధురంగా కన్పిస్తున్నావు!" అతడు చిన్నపిల్లలాంటి మొఖం చూసి చిరునవ్వునవ్వాడు. ఆమె అతనిని గట్టిగా

ప్రేమిస్తున్నదని అతని నమ్మకము. "నేను వెళ్ళి ముఖము కడుక్కొని, దుస్తులు మార్చుకొని వచ్చేలోగా నా కాఫీ తయారుగావుంచు" అంటూ అతడు ముఖము కడుక్కోటానికి వెళ్ళాడు.

రాత్రిభోజనము ముగించిన తర్వాత అతడు లైబ్రరీలో తనకిష్టమైన కుర్చీలో కూర్చున్నాడు. డోరీ ఆ కుర్చీ చేతి మీద కూర్చుని, డాక్టరుగారు సిగరెట్టు వెలిగించుకోటానికి అగ్గిపుల్ల ముట్టించి, పట్టుకొన్నది. అతని వద్ద వుండటానికి ఆమె కెంతో సంతోషముగా వున్నట్లు కన్పిస్తున్నది. ఆమె మాట్లాడే ప్రతిమాటా తన భర్త పట్ల ఆమె ప్రేమను ప్రదర్శించేదిగా వుంటుంది.

ఈరాత్రి ఒకరోగి సెంబ్రో-స్పైనిల్-మైనంజిటిస్ వ్యాధితో చని పోయాడు. "డాక్టరు విచారంతో అన్నాడు" మీరు నాతోవున్నా లేనట్లుగానే వుంది "ఆమె అన్నది." మీ ఆలోచన లెప్పుడూ, మీ వృత్తి చుట్టూ తిరుగుతుంటాయి. మీరు నావారే అనుకొన్నప్పుడు గూడా. మంచిది! బాధ పడేరోగులకు మీరు సేవచేస్తున్నారు. చాలా సంతోషం! నేను కూడా మీ బాధలో పాలు పంచుకొంటాను. ఈ కేసును గురించి చెప్తారా?"

"చాలా వింతైన కేసు అది!" డాక్టరు అన్నాడు. తన భార్య చేతిని నొక్కుతూ, సిగరెట్టు నుంచి వచ్చే మేఘాలలోకి చూస్తూ. "అతనికి నేను జబ్బునయం చేసాను. అతను కోలుకొనే వుండాల్సింది. కాని అతడు యే ముందు హెచ్చరిక లేకుండా నా చేతులలోనే ప్రాణాలు విడిచాడు. అతని నెంత బాగా చూసాను? కాని కృతఘ్నతతో ఆఖరి శ్వాస విడిచాడు. అతడు పొరపడినట్లుగా కన్పించాడు. అతను చనిపోవాలను కొన్నాడనే నేను నమ్ముతాను. ఒక విపరీతమైన ప్రేమ పిచ్చిలో పడి అతడు జ్వరము తెచ్చు కొన్నాడు."

"ప్రేమ విషయమా? ఓ! రాల్ఫు! ఆకేసును గురించి నాకు వివరంగా చెప్పండి! ఆస్పత్రిలో ప్రేమ పిచ్చితో రోగి చనిపోయాడా?"

"అతడు బాధపడుతూనే తన ప్రేమ కథ నాకు చెప్పాలని చాలా ప్రయత్నించాడు. అతని తల, తన మడమలను తాకేదాకా అతను వెనక్కి

వంగిపోయాడు. అతని యెముకలు విరిగి పోతున్నాయి. అయినా అంత బాధలో కూడా అతడు, తన ప్రేమ కథలోని ఒక విషయం చెప్పగల్గాడు."

"ఓ!ఎంత భయంకరమైన విషయము!"అన్నది అతని ప్రియురాలు డోరీ తన చేతిని అతని మెడ మీద నుంచి కుర్చీ చేతికి జార్చుతూ.

"నేను అర్థము చేసుకోగల్గినంత వరకు ఒక అమ్మాయి, యింకొక సంపన్నుని వివాహమాడటం కోసం అతని ప్రేమను తృణీకరించినట్లు కన్పిస్తున్నది." డాక్టరుగారు చెప్పుకు పోతున్నారు. "అతడు జీవితం మీద ఆశవదులుకొని చావాలనుకొన్నాడు. కాని తన ప్రియురాలి నామధేయము చెప్పటానికి అతనిష్టపడలేదు. ఆ "మైనంజైటిస్" కేసులో యేదో గర్వించతగినది వున్నది. ఆస్పత్రి మంచము మీద పడుకొని అతడొక దేవదూతగా కన్పిస్తాడు. అతను తనచేతి గడియారాన్ని, తనకు సేవచేసే నర్సుకిచ్చి, ఆమెతో ఒక దేశపు రాణితో మాట్లాడినట్లు మాట్లాడాడు అతను మృతి చెందినందుకు అతని నెప్పటికీ, నేను క్షమించలేను. ఎందుకంటే అంత అద్భుతంగా అతని వ్యాధి నివారణకు నేను కృషి చేసాను. మంచిది అతడు ఈరోజు వుదయం ఈలోకాన్ని విడిచి వెళ్ళిపోయాడు. నాకు అగ్గి పెట్టెనివ్వు. ఆ! అతడు తన సమాధితో తనతోపాటు పూడ్చి పెట్టమని ఒక చిన్న వస్తు విచ్చాడు. ఒక రాత్రి అతడు తన ప్రియురాలితో ఒక గాన సభకు వెళ్ళాలని బయలుదేరానని చెప్పాడు. కాని వాళ్ళు మనసు మార్చుకొని, అక్కడకు వెళ్ళకుండా, ప్రశాంతమైన, మనోహరమైన వెన్నెలలో షికారుకు వెళ్ళారుట! ఆగానసభకి వెళ్ళటానికి కొన్న టికట్టును అతని ప్రేయసి రెండు ముక్కలుచేసి, ఒక్క ముక్క అతనికిచ్చి, మరో సగము తన దగ్గర వుంచుకొంది. ఇదిగో అతడిచ్చిన ఈ చిన్న ఎర్రటి అట్ట ముక్క....దానిలో "ప్రవేశపెట్టుము—" అని మాత్రమే వుంది. ఇదిగో చూడు ఈ చిన్న అట్టముక్కని. పాతకుర్చీచెయ్యి జారుతుంది జాగ్రత్త! దెబ్బతగులుతుందేమో!" అన్నాడు డాక్టరు.

"లేదు రాల్ఫ్! నేను అంత తేలికగా గాయపడను. రాల్ఫ్! ప్రేమ అంటే నీ అభిప్రాయమేమిటి?" అన్నది అతని ప్రియురాలు డోరీ.

"ప్రేమ! చాలా చిన్న విషయం! ప్రేమ అనేది అల్పమైన పిచ్చిని కలిగించే ఓ మత్తు పదార్థం మాత్రమే! ప్రేమ ఎక్కువయితే, బుర్రను తల

క్రిందులు చేసి, అయోమయ స్థితిలోకి దింపుతోంది. అది తడపర(మీజిల్సు) లాంటి ఓ అంటురోగమే కాని ఆ ప్రేమ పక్షులు తమ రోగము కుదుర్చు కోటానికి, డాక్టర్ల దగ్గరికి వైద్యానికి రావటాని కిష్టపడరు"

డాక్టరు భార్య, ఆ చిన్న ఎర్ర టికెట్టులోని సగభాగము తనచేతిలోనికి తీసుకొని పైకెత్తి చూసింది.

"అడ్మిట్!...." ఆమె నవ్వుతూ అన్నది. "అతనీపాటికి యెక్కడికో చేరుకొని వుంటాడు కదా రాల్ఫు!"

"అవును! ఎక్కడో చేర్చబడే వుంటాడు." ఇంకో సిగరెట్టు వెలిగించుకొంటూ జవాబు చెప్పాడు డాక్టరు.

"నీ సిగరెట్టు త్రాగటం పూర్తి చేసి పైకిరా! రాల్ఫు నేనుకొద్దిగా అలసిపోయివున్నాను. నేను పైమేడమీద మీకోసం ఎదురుచూస్తూ వుంటాను.

"మంచిది, ప్రేయసీ! నీకు మంచి కలలు వచ్చుగాక! అన్నాడు డాక్టరు ఆమెకు వీడ్కోలుగా!

అతడు ఆ సిగరెట్టు పూర్తి చేసి యింకోటి వెలిగించుకున్నాడు.

అతడు మేడమీద గదిలోకి వెళ్ళేటప్పటికి రాత్రి దాదాపు పదకొండు గంటలయి వుండచ్చు.

తన భార్య పడక గదిలో దీపము తగ్గించి వున్నది. ఆమె నగ్నముగా తన ప్రక్కమీద పడుకొని వుంది.

అతడు ఆమె ప్రక్కకు వెళ్ళి, ఆమె చేతిని పైకెత్తాడు. ఏదో ఒక స్టీలు పరికరము క్రిందపడి పెద్దగా చప్పుడయింది. ఆమె తెల్లటి ముఖం మీద పాకుతున్నటు వంటి ఎరుపురంగు భయము కలగచేసింది డాక్టరుకు.

అతడు దీపము దగ్గరకు పరుగెత్తి దానిని పెద్దది చేసాడు. అతడు పెద్దగా అరవబోయేముందు. ఒక్క నిముషం ఆగి, టేబిలు మీద పెట్టి వున్న చనిపోయిన రోగి యొక్క టికెట్టు వంక చూసాడు! దాని రెండవ సగము దానికి చక్కగా అతికించబడి వుంది. దానిలో యిప్పుడు యిలా వుంది.

"ఇద్దరిని రానీయండి?"

)—o—(

దెబ్బ తీసిన ఆత్మ త్యాగము

(A Sacrifice Hit)

'అగ్ని గోళము' పత్రిక ఎడిటరుగారు తన పత్రికలో ప్రచురించ దగిన రచనలను యెన్నిక చెయ్యటంలో, కొన్ని స్వతంత్ర భావాలు కలిగి వున్నారు. ఆ పద్ధతి పెద్ద రహస్యమేం కాదు. తన బల్లముందు నవ్వుతూ కూర్చొని, తన బంగారం ఫ్రేము కళ్ళద్దాలను మోకాలు మీద తట్టుతూ, ఆ వివరాలు మీకు చెప్పగలడు.

అతనంటాడు, "అగ్ని గోళం పత్రిక సంపాదక బృందాన్ని నియమించదు. వివిధరకాలకు చెందిన పాఠకులకే మాకు వచ్చిన రచనలను యిచ్చి, వాళ్ళ అభిప్రాయాలనే పరిగణలోకి తీసుకొంటుంది" అని.

ఇది ఆ పత్రికా సంపాదకుని యొక్క సిద్ధాంతము దానినతడు ఈ క్రింది విధముగా అమలుచేస్తాడు.

తన కార్యాలయానికి వచ్చిన ఓ విడత రచనలను, తనవంటి మీద వున్న దుస్తుల జేబులలోకి కుక్కి, తను బయటికి వెళ్ళినప్పుడు, యెదురైన వాళ్ళందరికీ యిస్తాడు. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, ఆ హాలుపోర్టరు ఆభవనాన్ని శుభ్రపరిచే పనివాడు, లిఫ్టులలో పని చేసే అతను, వార్తలు తెచ్చే పిల్లలు, తను భోజనం చేసేహోటలులోని వెయిటర్లు, తన వార్తాపత్రిక కొనే కొట్టు యజమాని, తనకు సరుకులనిచ్చేదుకాణదారు, తన పాలవాడు, రైలుబండి గార్డు (5-30 ఎ. యమ్‌కి పై ప్రాంతాలకు పోయే రైలుబండి) సినిమా థియేటరులో టిక్కట్లు కత్తిరించే పనివాడు, తన వంటవాడు, తన పరిచారిక—వీళ్ళు "అగ్ని గోళం" పత్రికకు వచ్చే రచనలను పరిశీలించి అభిప్రాయం వెలిబుచ్చే పాఠకులు! తనుయింటికి వెళ్ళే లోపల తనజేబు

అన్నీ ఖాళీకాక పోతే, యింటి దగ్గర తన సతీమణి కిస్తాడు? పసివాడు నిద్ర పోయాక చదవమని. కొన్ని రోజుల తర్వాత, అతడు వాళ్ళందరినీ కలుసు కొని వాళ్ళ అభిప్రాయాలను సేకరిస్తాడు.

ఈరకంగా ఆయన పత్రిక చాలావిజయవంతంగా నడుస్తున్నది. ఆ పత్రిక ప్రచారము, ప్రచురణ సంఖ్య విపరీతముగా పెరిగి ఓ అద్భుత రికార్డును స్థాపించింది 'అగ్ని గోళం' కంపెనీ, రచయితల పుస్తకాలను గూడా అమ్మి వేస్తుంది. అది అమ్మి వేసిన రచనలెన్నో విజయం సాధిం చాయి. అవి అన్నీ కూడా ఆ పత్రిక పాఠకులచేత యెన్నిక కాబడినవే! (సంపాదక బృందములోని కొంతమంది చెప్పిన ప్రకారము) అప్పుడప్పుడు ఆ పత్రిక కొన్ని రచనలను వదలి వేయటయూ, అవి తర్వాత యితర సంస్థంచేత ప్రచురించబడి, అద్భుతమైన విజయం సాధించటం జరుగుతూ వుంటుంది.

ఉదాహరణకు కొన్ని! (పుకార్ల ప్రకారం) ఎలివేటరు నడిపే అతను'ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ సైలాస్ లాథమ్'అనే నవలను గురించి చెడ్డగా చెప్పాడు. "దిబాస్" అనే రచనను ఆ కార్యాలయపు బంట్రోతు ఏకగ్రీవంగా తిరస్కరించాడు. "ఇన్ ది బిషప్సు క్యారేజి" అనేరచన. ఆ వీధి శుభ్రపడిచే కండక్టరు చేత అసహ్యకరమైన విమర్శనలను వ్రాయిం చింది "దిడెలివరెన్సు" అనే రచన చందాలు వసూలు చేసే గుమాస్తాచేత తిరస్కరించబడింది. అతని అత్తగారు తన రెండు నెలల చుట్టపుచూపుకు, అప్పుడే వచ్చింది. "ది క్వీన్సు క్వైరు" అనేగ్రంథం ఆ భవనం 'జానీటరు' (భవనం శుభ్రం చేసే పనివాడు) నుంచి "ఈ పుస్తకం యిలా వుంది అనే విమర్శతో తిరిగి వచ్చింది.

ఎన్ని అవాంతరాలు వచ్చినా 'అగ్ని గోళం' పత్రిక తన విశిష్ట పద్ధతిని విడనాడలేదు. దానికి అభిప్రాయాలు వెలిబుచ్చే పాఠకులు తక్కువ కాదు. సంపాదక వర్గంలోని మంచి యవ్వనంలో వున్న 'స్టెనోగ్రాఫరు' నుంచి, బొగ్గుపని చేసే వాని వరకు, ఆ పత్రిక పాఠకవర్గంలో చేరుతారు. అతను 'ది అండర్ వరల్డు' అనే నవల మీద వ్యతిరేక భావం వెలిబుచ్చ

టం చేత, ఆ పుస్తకం పత్రికచేతులు జారింది) వీళ్ళందరు గూడా తాము యెప్పుడో ఒకప్పుడు యేదో పత్రికకు సంపాదకుడిగా వస్తామనే ఆశయం గలవారు.

"ప్రేమ సర్వస్వము" అనే నవలిక రచయిత "ఆలీన్ స్లేటన్‌కు" ఈ 'అగ్ని గోళం' పత్రిక యొక్క రచనల ఎన్నిక విధానం అంతా తెలుసు! అతడు ఆ సంపాదకీయ కార్యాలయాలన్నింటిని తరచుగా సందర్శించేవాడు. ఆ కార్యాలయాల అంతరంగిక విషయాలు అతనికి తెలుసు. 'అగ్ని గోళం' పత్రిక ఎడిటరు అతనికి బాగా తెలుసు ఎటువంటి వివిధవ్యక్తిత్వాలు గల వ్యక్తులకు అతను రచనలు యిచ్చేది అతనికి తెలుసు ప్రేమ కథలన్నీ, ఎడిటరుగారు స్టెనోగ్రాఫరైన "మిస్ పఫ్ కిన్"కు ఆయన యిస్తాడని స్లేటన్‌కు" తెలుసు. ఎడిటరుగారి యింకొక వింతైన మనస్తత్వం యేమిటంటే, రచయితలయొక్క పేర్లు రచనల మీద లేకుండా చేయటం, దానివలన పలుకుబడి గల రచయితల పేర్లు రచనల నిర్ణయాన్ని ప్రభావితం చేయకుండా వుంటుంది· అని ఆయన అభిప్రాయం,

తన జీవితమంతా కృషిచేసి, స్లేటన్' తన రచన "ప్రేమే సర్వస్వం రచించాడు. తన హృదయమంతోనూ, బుర్రతోనూ, దానితో ఆరునెలలు, కుస్తీపట్టాడు. అది పవిత్రమైన, గొప్ప పున్నతమైన, శృంగార భరితమైన భరించలేని ప్రేమకథ! అది వచనకవిత్వంలోకి మార్చిన నవలిక ఈ భూమి మీదవున్న అన్ని బహుమానాలకన్నా, గౌరవాలకన్నా, అతీతమైనది! భగవంతుని జాబితాలోని అత్యున్నతి బహుమతి! స్లేటనుకు వున్న సాహిత్యపు ఆశయం చాలా గట్టిది. తాను ఎన్నుకొన్న కళలో అత్యున్నత శిఖరాల నందుకోవటానికి, అతడు ఈ ప్రపంచములోని సర్వస్వము త్యజించుటానికి గూడా సిద్ధముగా వున్నాడు. 'అగ్ని గోళం' పత్రికలో, తన నవలిక ప్రచురణకి అవసరమయితే తనచేతిని ఖండించుకోవటానికీ, తన శరీరాన్ని కత్తికి అర్పించటానికి గూడా, అతడు సిద్ధముగా వున్నాడు. తన కల ఫలించటమే అతనికి కావలసింది.

స్లేటన్ తన నవలిక పూర్తిచేసి 'అగ్ని గోళం' కార్యాలయానికి స్వయముగా తీసుకువెళ్ళాడు. ఆ పత్రిక కార్యాలయం, అన్ని (కొత్త

వ్యాపార సంస్థలున్న ఓ పెద్ద భవనంలో ఓ 'జానిటరు' (భవనములోని గోడలను, నేలలను పరిశుభ్రంచేసే వుద్యోగి) ఆజమాయిషీలో వుంది.

'స్లేటన్' ఎలివేటరు దగ్గరకు వెళ్ళటానికి, లోపలి తలుపు దగ్గర అడుగు పెట్టగానే, బంగాళాదుంపలను మెత్తగా చేసే ఓ వంట పరికరము ఎగురుకొంటూ వచ్చి, స్లేటను తల మీద టోపీని ధ్వంసంచేస్తూ, తలుపు అద్దాన్ని పగులకొట్టింది. దాని వెంబడే 'జానీటరు' భయంతో, వూపిరి తిరగని స్థితిలో, పరుగెత్తుకొంటూ వచ్చాడు. అతను లావుగా, మొరటుగా వున్నాడు. ఓ లావాటి స్త్రీ పరిగెత్తుతున్న జానీటరును వెంబడించింది. కోపముమూర్తిభవించిన మొఖముతో జానీటరు కాలు ఆ నున్నటి నేల మీద జారి కుప్పగా, నిరాశతో నేలమీద కూలిపోయాడు. వెంటనే ఆలావు పాటి స్త్రీ ఒక్కసారిగా 'జానిటరు' మీదికి లంఘించి, అతని జుట్టును పట్టుకొంది పాపం! జానీటరు పెద్దగా అరవటం సాగించాడు.

కొద్ది క్షణాలలో, ఆమె తన పగను తీర్చుకొన్న తర్వాత విజయోత్సాహంతో, వెనకవున్న వంటగదిలోకి నిష్క్రమించింది. పరుల కంటబడకుండా 'జానీటరు' వెంబడే లేచి కూర్చున్నాడు. అతను అవమాన భారంతో కుంగి పోయాడు.

"అయ్యో! సంసారమంటే యిలాగే వుంటుంది!" అంటూ హాస్య ధోరణిలో స్లేటనుతో అన్నాడు. "ఆమే నేను యెన్నోరాత్రులు నిద్ర మేల్కొని కలలుగన్న వనితారత్నము! మీ టోపీ పాడయినందుకు నాకు చాలా విచారముగా వున్నది. దయచేసి ఈ విషయం నాతోటి అద్దె కున్న వాళ్ళతో చెప్పకండి. నేను నా వుద్యోగం పోగొట్టుకోవాలను కోటం లేదు.

స్లేటన్, హాలు చివర వున్న, ఎలివేటరెక్కి 'అగ్ని గోళం' కార్యాలయంలోకి వెళ్ళాడు. అక్కడ 'ప్రేమేసర్వస్వము' కాపీని, ఎడిటగారికి చ్చాడు. ఒక వారం రోజులలో, దాని ప్రచురణ విషయం తెలియచేస్తానని ఎడిటరు అన్నాడు.

ఇంటికి వెళ్ళే దారిలో, 'స్లేటన్' తనకు జయము చేకూర్చే పథకాన్ని గురించి ఆలోచించాడు. అతడి బుర్రలో అది ఒక మెరుపులాగా తట్టింది.

అంత గొప్ప పథకం కనిపెట్టినందుకు తన తెలివి తేటలను తనే అభినందించా కోకుండా వుండలేక పోయ్యాడు. ఆరాత్రి నుంచే ఆపథకాన్ని అమలులో పెట్టటానికి నిశ్చయించుకొన్నాడు.

పత్రిక స్టెనోగ్రాఫర్, మిస్ "పఫ్కిన్" మన రచయిత వున్న భవనంలోనే వుంటున్నది. ఆమె సన్నగా వున్నా, చాలా పెద్దదానిగా కన పడుతుంది ఇతరులతో కలసి మెలసి తిరుగదు. ఎప్పుడు యేదో బాధ పడుతున్నట్లు వుంటుంది. ఉన్నతాభిప్రాయాలుగల వ్యక్తి. చాలా కాలము క్రితమే, 'స్లేటన్'కు ఆమెతో పరిచయమేర్పడింది.

ఆత్మార్పణం చేసుకొనేటటువంటి సాహసోపేతమైన, రచయిత యొక్క పథకంయిది- 'అగ్ని గోళం' ఎడిటరుగారు శృంగార రసభరిత మైన రచనలమీద. మంచి అభిప్రాయం కోసం 'మిస్ పఫ్కిన్' మీద ఆధారపడినట్లు రచయితకు తెలుసు. ఆ రకమైన నవలలను, కథలను చదివి జీర్ణం చేసుకొని తమ రుచులను వెల్లడించగల మధ్య తరగతి స్త్రీలకు ఆమె ప్రతినిధి అని ఎడిటరుగారి నమ్మకము.

"ప్రేమే సర్వస్వము" (Love is All) నవలికలోని ముఖ్యమైన వుద్దేశ్యం యేమంటే, "ప్రేమ మొదటి చూపులోనే కలగాలి!" అని.

సంతోషముతో కూడినటు వంటి, యెదిరించ లేనటువంటి, ఆత్మను ఉద్రేకపరిచే భావమేదో, మనిషినిగాని, స్త్రీనిగాని, మొదటిసారి చూడగానే కలగాలి అప్పుడే వాళ్ళ హృదయాలు పరస్పరం తమ భావాలను వెల్ల డించుకొన్నట్లు! ఈ పరమసత్యాన్ని, 'మిస్ పఫ్కిన్"కు తనుకలగచేయ గలిగినట్లయితే, ఆమె తన గ్రంథాన్ని గురించి, ఎడిటరుగారికి గొప్పగా చెప్పదా? తన నూతనానందకరమైన భావాలకు వత్తాసు పలకదా? అను కొన్నాడు స్లేటన్.

'స్లేటన్' ఆ రకంగా ఆలోచించాడు. ఆ రాత్రే అతడు తన పథ కంలో భాగంగా మిస్ పఫ్కిన్‌ను థియేటరుకు తీసుకు వెళ్ళాడు. మరు నటి రాత్రి, ఆ లాడ్జింగు గృహంలో, మసకవెలుతురున్న అతిథులగదిలో,

మిస్ పఫ్కిన్ పట్ల తన భయంకరమైన ప్రేమ ప్రదర్శించాడు. తన నవలిక "ప్రేమ సర్వస్వము" నుంచి కొన్ని భాగాలు ఆమెకు విన్పించాడు. ఆమె తలను తన భుజం మీద పెట్టుకొని, ఆమె మీద తనకు గల ప్రేమ వొలకపోసాడు. అప్పుడతని బుర్రలో, తనకు రాబోయే సాహిత్యపు ప్రఖ్యాతి, గిర్రున తిరుగుతున్నది.

కాని స్లేటన్ తన ప్రేమను ప్రదర్శించటంలోనే ఆగలేదు. ఇది తన జీవితంలో ముఖ్యమైన మలుపు అని తెలుసుకొన్నాడు. కాబట్టి అతడు నిజమైన స్పోర్టుమనులాగా ప్రవర్తించాడు. గురువారం రాత్రి, వాళ్ళ క్లబ్ మధ్యలో వున్న "బిన్ చర్చి"కి నడిచివెళ్ళి వివాహము చేసుకున్నారు.

అహో! స్లేటన్! సాహసవంతుడవంటే నువ్వేనోయ్! 'ఛాటియో బ్రాండు' మేడ మీద ఒక దౌర్భాగ్యపు గదిలో తన అసువులు బాసాడు. "బైరన్" ఓ విధవరాలుతో సరసమాడాడు 'కీట్సు' ఆకలితో మరణించాడు. 'పో' పానియాలు అమ్ముకుంటూ బ్రతికాడు 'మూడీ'. చికాగోలోనే వుండి పోయాడు 'డికెన్సు'. తెల్లని మేజోళ్ళను ధరించాడు. "డిమొపాసాంటు" పొడుగైన జాకెట్లు వేసుకొన్నాడు. 'పేస్టన్' సామాన్యుల రాజకీయపార్టీలో చేరిపోయాడు. 'బారిమియూ' రోదించాడు. ఎంతోమంది రచయితలు సాహిత్యంలో కీర్తి సంపాదించటంకోసం యిలా యెన్నో పనులు చేసారు.

కాని 'స్లేటన్'గారూ! మీరు వారినందరిని మించిపోయారు. 'సాహిత్యపు కీర్తి' అనే గుడి నిర్మించటం కోసం మీరు యేకంగా, ఓ అభాగ్యురాలిని, సామాన్యురాలిని వివాహం చేసుకొన్నారు!!

శుక్రవారం వుదయం స్లేటన్‌గారి సతీమణి (పూర్వరంగంలో మిస్ పఫ్కిన్) అగ్నిగోళం పత్రికా కార్యాలయానికి వెళ్ళి, ఎడిటరుగారు తన అభిప్రాయం చెప్పమని యిచ్చిన ఒకటి రెండు రచనలను ఆయనకు తిరిగి యిస్తానన్నది.

"వాటిలో నీవు ప్రత్యేకంగా, గొప్పగా అభిమానించిన రచన యేదన్నా వున్నదా....?" అంటూ నట్టు నట్టుగా దీనముగా కొట్టుకొంటున్న హృదయంతో అడిగాడు ఆమెను స్లేటన్.

"అవును ...నేను గొప్పగా యిష్టపడిన ఓ నవలిక వుంది" స్లేటన్ భార్య అన్నది. అలా జీవితాన్ని ప్రతిబింబించిన అద్భుతమైన నవలికను నేనీమధ్య చదవలేదు.

ఆ సాయంకాలం స్లేటన్ హడావుడిగా 'అగ్నిగోళం' పత్రిక కార్యాలయానికి వెళ్ళాడు. తనకు రాబోయే బహుమానం దగ్గరలో వున్నట్లుగా అతడు అభిప్రాయ పడ్డాడు. 'అగ్నిగోళం' పత్రికలో ప్రచురింపబడే తన నవలికతో తన పేరు ఆకాశంలో మారు మ్రోగుతుంది.

కార్యాలయం బయట వరండాలో, కార్యాలయం బంట్రోతు, స్లేటనును కలిసాడు. తమ సాహిత్య జీవితంలో పేరు తెచ్చుకొన్న రచయితలు, యెప్పుడో తప్ప పత్రికా కార్యాలయపు బంట్రోతుతో పిచ్చాపాటి మాట్లాడటాని కిచ్చగించరు.

స్లేటన్ తన హృదయంలో ఎంతో సంతోషిస్తూ ఆ కార్యాలయ బంట్రోతును తనకు రాబోవు విజయముతో అణగ త్రొక్కగలననే ఆలోచనతో వున్నాడు.

స్లేటన్ తన నవలిక యేమయిందని అతనిని అడిగాడు. అతడు వెంటనే ఆఫీసులోపలికి వెళ్ళి ఓ పెద్ద కవరును తెచ్చాడు.

"మీ రచనను తిరస్కరిస్తున్నందుకు బాధ పడుతున్నట్లుగా మా యజమానిగారు (ఎడిటరు) మీతో చెప్పమన్నారు!" అంటూ ఆ కవరును స్లేటనుకు యిచ్చాడు.

స్లేటన్ విభ్రాంతుడయ్యాడు. ఆయన నత్తితో నట్టు నట్టుగా మాట్లాడుతూ యిలా అన్నాడు. "మిస్ పఫ్కిన్ అదే నా సతీమణి వుదయమే తనకు చదవమని యిచ్చిన ఓ నవలికను మీ కార్యాలయంలో యివ్వలేదా?"

"ఆమె యిచ్చిన మాట నిజమే!" ఆ ఆఫీసుబాయ్ తెలివిగా సమాధానం చెప్పాడు. "మిస్ పఫ్కిన్ ఆ నవలిక చాలా గొప్పగా వున్నట్లు చెప్పినట్లు మా ఎడిటరుగారు చెప్తుంటే నేను విన్నాను! ఆ నవలిక పేరు 'ఓ సామాన్య వుద్యోగిని సంతోషముతో వివాహమాడాడు' అని.

"ఓ! ఇప్పుడర్థమైంది" అతడన్నాడు "మీ పేరు స్లేటన్ అనుకొంటాను. నేను మీ రచనలను ఒకరి కివ్వాల్సినవి మరొకరికిచ్చాను అనుకోకుండా. మా యజమాని రెండు రోజుల క్రిందట రెండు పుస్తకాలు యిచ్చారు. ఒకటి 'పఫ్కిన్'కు మరొకటి మా భవనపు 'జానీటరు'కు యివ్వమని. నేను మిస్ పఫ్కిన్ కిచ్చేది జానీటరుకు, జానీటరు కిచ్చేది మిస్ పఫ్కిన్‌కి యిచ్చాను అంతే నేను చేసింది.

అప్పుడు స్లేటన్ తన గ్రంథమును పెట్టిన కవరు పై భాగం వంక చూసాడు.

టైటిల్ "ప్రేమే సర్వస్వము" క్రింద జానీటరు బొగ్గు ముక్కతో వ్రాసిన వ్యాఖ్య వున్నది.

"ప్రేమే సర్వస్వము అని మీరు చెప్తున్నారా?" అంటూ.

o(o)o

ఆఖరి పత్రము

(*The Last Leaf*)

'వాషింగ్ టన్' స్క్వేరుకు పడమరగా వున్న ఓ చిన్న జిల్లాలో "గ్రీన్ విచ్" గ్రామములో వీధులు చాలో అడ్డదిడ్డంగా వుంటాయి. వీధులు చిన్న చిన్న గొందులుగా చాలా చోట్ల చీలినై. ఒకే వీధిలో అడ్డదారులు ఒకటీ రెండు చోట్ల వుంటాయి. ఒకే వీధిన మీరు వెళ్ళితే మీరు తిరిగి వెనక్కి వస్తారు యింకో దారిలో. ఈ సంగతి ఒక కళాకారుడు కని పెట్టాడు

అద్దె తక్కువని కళాకారులు చాలామంది వచ్చి ఈ గ్రామములో నివాసమేర్పరచుకొన్నారు. దానినే యిప్పుడు 'కాలనీ' అని పిల్చుకొంటున్నారు.

ఇటుకలతో కట్టిన ఒక మూడంతస్థుల భవనం ఆఖరి అంతస్థులో "స్యూ" మరియు "జాన్సీ" అనే కళాకారులు తమ "స్టూడియో"ను పెట్టుకొన్నారు. ఒకళ్ళు 'మెయిన్' నుంచి మరొకరు 'కాలిఫోర్నియా' నుంచి వచ్చారు వాళ్ళు 'డెల్మోనికో' అనే హోటలులో కలుసుకొన్నారు. తమ ఆహారపు రుచులూ, కళలూ ఒకటే అని గుర్తించటంతో వాళ్ళిద్దరూ కలసి 'ఆర్టు స్టూడియో' పెట్టుకొన్నారు మే నెలలో.

నవంబరు మాసంలో అక్కడ చలి విపరీతంగా వుంది. మంచు బాగా కురుస్తున్నది. ఎంతోమంది 'న్యూమోనియా' వ్యాధికి గురయ్యారు. కాని వీధులు చాలా యిరుకుగా వున్న ప్రాంతంలోనూ, పుష్పములు లేకుండా చెట్లు ఎక్కువగా పెరిగి వున్న ప్రాంతంలోనూ ఈ వ్యాధి అంత త్వరగా వ్యాపించలేదు. కాని 'జాన్సీ'ని ఈ రోగం త్వరగా వశం చేసుకొంది.

ఆమె తన యినుప మంచంమీద లేకలేక పడుకొనే వుంటున్నది. ఆమె యెప్పుడూ ప్రక్కనే వున్న యిటుకరాళ్ళతో కట్టిన యింటిప్రక్క ఖాళీ స్థలంలోకి 'డచ్చి' కిటికీ అద్దాల గుండా చూస్తూ వుంటుంది.

ఓ రోజు వుదయం చాలా 'బిజీ'గా వుండే డాక్టరు 'స్యూ'ను ప్రక్కకు పిల్చి మాట్లాడాడు. అతడు థెర్మామీటరుతో జ్వరం చూస్తున్నాడు. థెర్మామీటరు విదిలిస్తూ అతడన్నాడు "పది అవకాశాలలో ఆమెకు ఒక్క అవకాశమే వుంది. కాని ఆ అవకాశంతోనే ఆమెకు బ్రతకాలనివుంది కాని ఆమె కోసం వైద్య గ్రంథాలలో చూసి వాడిన మందులన్నీ వ్యర్థమవుతున్నాయి. ఆమె మనస్సులో యేమనా కోరిక వుందా?"

"ఆమె .... ఆమె .... నేపుల్సు అఖాతాన్ని చిత్రించాలని అనుకొంటున్నది" 'స్యూ' అన్నది.

"చిత్రించటమా! బేష్! ఆమె తన ప్రేమికుని గురించి ఆలోచిస్తున్నదేమో చెప్పండి?" డాక్టరు అన్నాడు.

"ప్రేమికుడా?" 'స్యూ' అన్నది "ఆమె ప్రేమించ తగిన వాళ్ళెవరూ యింతవరకూ రాలేదు ... లేదు.... లేదు.... అటువంటి ప్రేమ విషయాలు ఆమె మనస్సులో చోటు చేసుకోలేవు—"

"మంచిది. అలా అయితే అదంతా ఆమె నీరసమేకావచ్చు. వైద్యశాస్త్రంలో వున్నదంతా నేను చెయ్యగలను. కాని రోగి — తన అంత్యక్రియలలో యెన్ని వాహనాలు పాల్గొంటాయి అని లెక్కపెడుతూ కూర్చుంటే—అటువంటి వాళ్ళకు మందులు సగమే పనిచేస్తాయి. ఈ చలి కాలంలో వాడే జాకెట్లను గురించి ఆమె ఒక ప్రశ్న వేయగలిగినట్లయితే, పదింట ఒక అవకాశమునకు బదులుగా, ఆమె బ్రతకటానికి అయిదింటిలో ఒక అవకాశముంటుందని నేను చెప్పగలను...." అన్నాడు డాక్టరు.

డాక్టరు వెళ్ళిన తర్వాత ఆమె తన డ్రాయింగు బోర్డుతో జాన్సీ గదిలోకి గర్వంగా నడుస్తూ వెళ్ళింది. ఆమె నోటితో యేదో పాట పాడుతున్నది.

గదిలో జాన్సీ కిటికీవంక తన ముఖం త్రిప్పి ప్రక్క గుడ్డలుకప్పుకొని పడుకొని వుంది. ఆమె నిద్రపోతున్నదనుకొన్న 'సూ' తన ఈలపాట ఆపింది.

తన డ్రాయింగు బోర్డును సరిగా వుంచుకొని, ఒక పత్రికకు బొమ్మను చిత్రించటం మొదలు పెట్టింది.

యువరచయితలు, పత్రికలకు కథలు వ్రాసి సాహిత్యంలో కృషి చేస్తుంటే యువకళాకారులు ఆ కథలకు తగిన చిత్రాలను చిత్రించి కళలో తమ పేరును నిలపెట్టుకోచూస్తారు.

ఆమె గుర్రము మీద స్వారీ చేస్తున్న కథనాయకుని స్కెచ్ గీస్తున్నది. అతడు ఆవులమందలను కాచే పిల్లవాడు. ఆమెకు ఒక చిన్నశబ్దము అనేకసార్లు వినిపించింది.

జాన్సీ కళ్ళు తెరుచుకొనే వున్నాయి. ఆమె కిటికీలో నుంచి చూస్తూ అంకెలను, అవరోహణక్రమంలో లెక్కపెడుతున్నది.

"పన్నెండు!" ఆమె అన్నది. కొంచెంసేపు తర్వాత "పదకొండు!" మరికాసేపటికి "పది!" తర్వాత "తొమ్మిది!" తర్వాత "ఎనిమిది! " "ఏడు" కలిపి ఒకేసారి లెక్కపెట్టింది.

"స్యూ" కిటికీలో నుంచి, తన పరిశోధనా దృష్టితో చూసింది. లెక్కపెట్టటానికి అక్కడేమున్నాయి? నలభై అడుగుల దూరములో వున్న యిటుకలతో కట్టబడిన ఓ యింటి ప్రక్కన ఖాళీస్థలము. యిటిక గోడ మీద, సగము వరకు పెరిగిన ఓ ద్రాక్షతీగల చెట్టు. ఆ చెట్టు చాలా కాలము నాటిది. దానివేళ్ళు కృశించిపోతూ, పతనావస్థలో వున్నాయి. ఆ వసంతకాలములో వీచే చలిగాలికి, ఆ చెట్ల ఆకులన్నీ ఒక్కొక్కటిగా రాలిపోతూ, మోడు కొమ్మలు మాత్రము— శిథిలావస్థలో వున్న యిటుక రాళ్ళను కరుచుకొని వున్నాయి.

"స్నేహితురాలా! అక్కడేము వుంది?" అడిగింది 'స్యూ'

"ఆరు!" అన్నది జాన్సీ, వినీవినపడని గొంతుతో "అవి యిప్పుడు చాలా త్వరగా రాలిపోతున్నాయి. మూడురోజుల క్రిందట ఆ కొమ్మలకు, దాదాపు నూరు ఆకులున్నాయి. అవి లెక్కపెట్టటం నాకు తల నొప్పి

5)

అయింది. కాని యిప్పుడు తేలికయింది. అదిగో! ఇంకొకటి రాలిపోయింది ఇప్పుడక్కడ అయిదే వున్నాయి!"

"అయిదా? ఏమిటవి? నాకు చెప్పవూ?" 'స్యూ' అడిగింది.

"ఆకులు! అదిగో! ఆ ద్రాక్షతీగమీద ఆఖరి ఆకు రాలిపోతే నేను గూడా నిష్క్రమిస్తాను. ఆ సంగతి మూడు రోజుల నుంచీ నాకు తెలుసు. డాక్టరుగారు నీకా సంగతి చెప్పలేదా?"

"అలాంటి నిరర్థకమైన విషయాలు నేనెప్పుడూ వినలేదు. నీకు ఆ ద్రాక్ష చెట్టు అంటే చాలా యిష్టము. అలా మూర్ఖంగా మాట్లాడద్దు. ఈ వుదయం డాక్టరుగారేం చెప్పారో తెలుసా? నివు త్వరలోనే కోలుకునే అవకాశముందని చెప్పాడు. పదింట్లో ఒక అవకాశ ముందన్నాడు. అది చాలా గొప్ప సంగతే! ఈ న్యూయార్కు మహానగరంలో రోడ్డుమీద కారులో పోతున్నా, కాలిబాటమీద నడుస్తున్నా ప్రమాదం పొంచివున్నప్పుడు పదింటిలో ఒక వంతు ప్రమాదం అంటే చాలా తక్కువన్నమాట! ఇప్పు డేదన్నా కొంచెం ఆహారం తీసుకో! నన్ను చిత్రించుకోనీయ్! ఆ చిత్రాన్ని ఎడిటరుకిస్తే బాగా డబ్బులొస్తాయి దానితో జబ్బులో వున్న నా బిడ్డకు జాన్సీ ద్రాక్షసారాయి కొంటాను."

తన దృష్టిని కిటికీ బయట కేంద్రీకరిస్తూ—జాన్సీ అన్నది "నీవు నా కోసం యింక యే సారాయీ కొనక్కరలేదు. ఇదిగో! నాలుగో ఆకు రాలిపోయింది. లేదు, నాకేమీ ఆహారం అవసరం లేదు. ఇంక నాలుగు ఆకులే మిగిలినై. చీకటి పడేలోపల ఆఖరి పత్రం కూడా రాలాలని కోరు కొంటున్నాను. అప్పుడు నేను గూడా నిష్క్రమిస్తాను."

"ఓ! నా ప్రియమైన జాన్సీ!" "స్యూ" ఆమె మీదికి వంగుతూ అంది. నేను నా పని పూర్తిచేసుకొనే దాకా కిటికీలోనుంచి బయటకు చూడ కుండా కళ్ళుమూసుకుని కూర్చుంటావా? రేపటికల్లా ఆ చిత్రాలను నేను అప్పగించాలి. నాకు అందుకు వెలుతురు కావాలి. లేకపోతే షేడ్‌ను క్రిందికి లాగుతాను."

"వేరే గదిలో నీవు చిత్రించుకోలేవా?" కోపంగా అడిగింది జాన్సీ.

"నేను నిన్ను వదలి వెళ్ళలేను" స్యూ అన్నది. "పైగా నీవు ఆ వ్యర్ధమైన తీగవంక చూడటం నాకిష్టం లేదు—"

"నీ పని పూర్తి కాగానే చెప్పు!" కళ్ళుమూసుకొని ఒక పడిపోయిన శిలావిగ్రహంలాగా పాలిపోయిన శరీరంతో, ప్రక్కమీద పడుకొంటూ అంది. "నేను ఆ ఆఖరి పత్రం రాలిపోవటం చూడాలనుకొంటున్నాను. నేను దానికోసం కాచుకుని అలసిపోయాను. ఆలోచిస్తూ అలసిపోయాను. అన్ని వస్తువులమీదా నా భ్రమ వదులుకోవాలనుకొంటున్నాను. ఈ దౌర్భాగ్యపు అలసిపోయిన ఆకులాగా ఈ ప్రపంచంలోనుంచి, అనంతంలోకి ప్రయాణమై పోవాలనుకొంటున్నాను...."

"నిద్రపోవటానికి ప్రయత్నించు!" స్యూ అన్నది "ఆ గనిలో పని చేసే పవిత్ర కార్మికునికి మోడలుగా వుండటానికి నేను 'బెహ్రమాన్'ను పిలవటానికి క్రిందకు వెళుతున్నాను, నేను ఒక్క నిమిషంలో తిరిగివస్తాను. నేను వచ్చేదాకా మంచంనుంచి కదలవద్దు."

వాళ్ళున్న మేడ క్రింద అంతస్థులో చిత్రకారుడు 'బెహ్రమాన్' నివసిస్తున్నాడు. అతనికి అరవై పైనే వయసుంటుంది. అతని గెడ్డానికున్న వుంగరాల జుట్టు క్రిందికి వ్రేలాడుతూ వుంటుంది. అది సగము మనిషి, సగము మేక ఆకారంవున్న దేవుని గడ్డంలా, చిన్న దయ్యపు శరీరము మీద వ్రేలాడుతున్నట్లుగా కనిపిస్తుంది. 'బెహ్రమాన్' చిత్రకళలో రాణించలేక పొయ్యాడు. నలభై సంవత్సరాలు శ్రమించినా, చిత్రలేఖనా రంగంలో యే మాత్రమూ పేరు తెచ్చుకోలేక పొయ్యాడు వృత్తిగా జీవించే మోడల్సుని పెట్టుకోలేని వాళ్ళు అతనిని మోడలుగా పెట్టుకొని కొద్దిగా ప్రతిఫలం ముట్టచెపుతూ వుంటారు. గొప్ప కళాఖండం చిత్రించాలని అతని ఆశయం. కాని యింకా దానిని అతడు ప్రారంభించనేలేదు. చాలా సంవత్సరాలు అతను చిత్రాలు గీయలేదు. అప్పుడప్పుడు వ్యాపార ప్రకటనలకు అసహ్యకరమైన చిత్రాలు తప్ప! అతడు బాగా త్రాగుతాడు. కాని రాబోయే తన అద్భుత కళాఖండాన్ని గూర్చి మాట్లాడతాడు. ఆ విషయం వదిలేస్తే

అతను భయంకరమైన చిన్న వృద్ధుడు. ఇతరుల మెత్తదనాన్ని అతడు యెగతాళి చేసాడు. పై అంతస్థులో వున్న యిద్దరు చిత్రకారిణులకు తనను అంగరక్షకునిగా భావించుకొంటాడు.

"స్యూ" క్రిందికి వచ్చి, బాగా వాసనకొడ్తూ, ఏకాంతంగా తన యేకాంతపు గదిలో కూర్చున్న 'బెహ్రమాన్'ను చూసింది. గదిలో ఒక మూలగా ఎత్తుగా వున్న ఓ స్టూలుమీద ఖాళీ కాన్వాసు గుడ్డ వున్నది. ఆ చిత్రకారుని చేతిలో, అద్భుత కళాఖండము చిత్రింపబడటానికి ఆ కాన్వాసు గుడ్డ పాతిక సంవత్సరాల నుంచీ యెదురు చూస్తున్నది అలాగే.

అతనికి 'స్యూ, జాన్సీ యొక్క మూర్ఖమైన వూహను గురించి చెప్పింది. ఆ ద్రాక్ష తీగకున్న ఆకులాగా తానుగూడా తేలికగా బలహీనముగా వున్నానని ఆమె అనుకొంటున్నది. ఆ ఆకు ఈ లోకం నుండి, అదృశ్యమైనప్పుడు తాను గూడా అనంతంలో కలిసిపోతానని ఆమె అనుకొంటున్నట్లు 'స్యూ' చెప్పింది.

ముసలి బెహ్రమాన్ మెరుపెక్కిన తన కళ్ళను త్రిప్పుతూ జాన్సీ యొక్క మూర్ఖపువూహను గట్టిగా అసహ్యించుకొన్నాడు.

"ఏమిటి?" అతడు పెద్దగా అన్నాడు. "ఓ ద్రాక్ష తీగె ఆకు రాలి పోయినంత మాత్రన తానుగూడా చనిపోతానని అనుకొనే మూర్ఖులుగూడా యీ ప్రపంచంలో వున్నారా? మీకు ఆ దౌర్భాగ్యుడైన గని పనివాని చిత్రానికి మోడలుగా నేను రాను ఆమె ఒక ప్రక్క బాధపడుతుంటే యిటువంటి వెధవపనులలో మీరెందుకు తలదూరుస్తారు? అమాయకురాలైన జాన్సీని బాధపెట్టకండి."

"ఆమె చాలా జబ్బుతో నీరసంగా వుంది" స్యూ అన్నది "ఆ జ్వరం ఆమెను ఈ అనవసరపు విషయాలలో యెక్కువ శ్రద్ధను చూపించేటట్లు చేసి వదిలింది. ఆ జ్వరం ఆమెలో అన్నీ విపరీతమైన వూహలను ప్రవేశపెట్టింది. 'బెహ్రమాన్'గారూ! మంచిది. మీరు నా చిత్రం కోసం మోడలుగా రాదల్చుకోపోతే పోనీలెండి! కాని మాటిమాటికీ అభిప్రాయం మార్చుకొనే పిరికివానిగా మిమ్మల్ని నేను భావిస్తున్నాను."

గ్రంథాలయం 40661 నమోదు సంఖ్య 15.3.95 తేది

"మీరు ఒక పూర్తి స్త్రీలాగా మాట్లాడుతున్నారు" బెహ్రమాను అరిచాడు. "నేను మోడలుగా వుండనని యెప్పుడు చెప్పాను? పదండి. ఇప్పుడే మీతో వస్తాను. అరగంట నుంచీ సిద్ధంగా వున్నానని చెప్పటానికి మీ కోసం చూస్తున్నాను మంచిది. ఇంకా జబ్బుతో వున్న 'మిస్ జాన్సీ' పట్ల అసహ్యం చూపదగిన సమయం కాదిది. ఏదో ఒక రోజున నేను ఒక గొప్ప కళాఖండము చిత్రిస్తాను అప్పుడు మనమంతా కలసి ఈ లోకంలో నుంచి తప్పుకోవచ్చు. మంచిది. అంతేగదూ!"

వాళ్లు మేడమీదికి వెళ్ళేటప్పటికి జాన్సీ నిద్రపోతున్నది. కిటికీ అద్దంమీది 'షేడు'ను ఆమె క్రిందికి లాగి, 'బెహ్రమాన్'ను ప్రక్కగది లోనికి రమ్మనమని సంజ్ఞ చేసింది. అక్కడ కిటికీలోంచి ఆ ద్రాక్షతీగ కొమ్మల వంక తొంగిచూసారు. మాట్లాడకుండా, ఒక్కనిమిషం ఒకరి ముఖం ఒకరు చూసుకొన్నారు. మంచుతో కూడిన చల్లటి వాన ఎడతెగ కుండా కురుస్తున్నది. తన పాత నీలపు చొక్కాతో, బెహ్రమాన్, పైకి త్రిప్పిన ఒక యిత్తడి బిందెమీద గనిలో పనిచేసే మంచి హృదయము గల పనివానిలాగ కూర్చున్నాడు.

మరునాటి వుదయం ఓ గంట నిద్రపోయి లేచింది 'స్యూ' బాగా తెరచుకొన్న బద్ధకపు కళ్ళతో జాన్సీ. కిటికీ మీద క్రిందికి లాగబడిన, ఆకు పచ్చని షేడ్‌వంక దీర్ఘంగా చూస్తున్నది.

"ఆ షేడ్ పైకి ఎత్తు! నేను బయటికి చూడాలి!" అన్నదామె రహస్యం చెప్పుతున్నట్లుగా బలహీనమైన గొంతుతో.

అలసటతో, 'స్యూ' జాన్సీ అడిగినట్లే చేసింది.

కాని ఆశ్చర్యం !

రాత్రంతా కురుస్తున్న, అభయంకరమైన వాన జల్లులనూ, గాలు లనూ, తట్టుకొని యిటుకరాతిగోడ కెదురుగా ఆ ద్రాక్షతీగ కొమ్మమీద, యింకా ఒక ఆకు నిల్చివుంది. ఆ ద్రాక్ష తీగకొమ్మకు అదే ఆఖరి పత్రం! ఆకుకాధారమైన చిన్నకొమ్మ ముదురు ఆకు పచ్చరంగులో వుంది. దాని

చివరలు 'V' ఆకారంలో వుండి, శిథిలమై, కరిగిపోతున్న, లేత పసుపు పచ్చ రంగులో భూమికి ఇరవై అడుగుల యెత్తులో ఒక కొమ్మమీద ఆ పత్రము ధైర్యముగా వ్రేలాడుతువ్నది.

అదే ఆఖరిది! "జాన్సీ అన్నది." క్రిందటి రాత్రి అది తప్పక రాలిపోతుందనుకొన్నాను. గాలిజోరు నాకు కన్పిస్తున్నది. ఆ ఆకు ఈ రోజున రాలిపోతుంది. దానితో పాటే నా చావుకూడా!.

"ప్రియమైన జాన్సీ! ప్రియమైన జాన్సీ!" స్యూ అన్నది. దిండు మీద వున్న చిక్కిపోయిన ఆమె ముఖం మీదికి వ్రాలుతూ "నీ కోసమే నీవు ఆలోచించకపోతే నాకోసమైనా ఆలోచించు! ఇంక నేనేం చెయ్యను?"

కాని జాన్సీ సమాధానం యివ్వలేదు. విచిత్రమైన తన అంతిమ ప్రయాణానికి సిద్ధమైన జీవికన్నా ఒంటరియైన మరో జీవి ఈ లోకంలో వుండదు గదా! ఈ ప్రపంచంతోనూ, స్నేహంతోనూ బంధించివున్న ఒక్కొక్క బంధమే విడిపోతుండగా, ఆమెకు తను చనిపోతానన్న వూహ గట్టిగా బలపడ సాగింది.

ఆ పగలు గడచిపోయింది. మసక వెలుతురులో గూడా గోడ కెదురుగా వున్న చిన్నకొమ్మను అంటుకొని వున్న ఆ పత్రాన్ని వారు చూడకలుగుతున్నారు. రాత్రి కాగానే, వుత్తరపు గాలులు, యింకా తీవ్రంగా వీచాయి. వాన చినుకులు, కిటికీ తలుపులమీద పెద్ద చప్పుడును సృష్టిస్తున్నాయి.

మళ్ళీ తెల్లవారి వెలుతురు రాగానే, నిర్దయురాలైన జాన్సీ, కిటికీ మీద షేడ్‌ను పైకెత్త వలసిందిగా ఆజ్ఞాపించింది.

కాని ఆ ద్రాక్షతీగ ఆకు అక్కడే వుంది.

దాని వంక చాలాసేపు చూస్తూ జాన్సీ పడుకొని వుండిపోయింది. గ్యాసు స్టౌమీద కోడిగుడ్డుకో పప్పురసము తయారు చేస్తున్న "స్యూ"ని పిల్చింది జాన్సీ.

"నేనెంత చెడ్డపిల్లను స్యూ!" అన్నది జాన్సీ. నేనెంత క్రూరురాలనో చూపించడానికి, ఏవో అజ్ఞాతశక్తి, ఆ ఆకును అక్కడ కొమ్మమీద నిలబడేటట్లు చేసింది. చావాలనుకోవటం మహాపాపం! నాకు కొంచెము కోడిగుడ్డు పప్పురసం తీసుకురా! ద్రాక్షసారాయితో కలిపి కొంచెము పాలు గూడా! తర్వాత .... లేదులే.... ముందు చిన్న అద్దము తీసుకురా! నేను అనుకోటానికి నా వెనుకదిండ్లు పెట్టు! నేను కూర్చొని, నువ్వు వంట చేస్తుంటే చూస్తాను !" అన్నది.

ఓ గంట తర్వాత జాన్సీ అన్నది.

"స్యూ! ఏవో ఒక రోజున నేను నేపిల్సు అఖాతాన్ని చిత్రిస్తాను !" అని

ఆ సాయంకాలం డాక్టర్లు వచ్చి ఆమెను పరీక్షించాడు. 'స్యూ' ఆయనతో కొంచెము దూరంగా వెళ్ళింది.

"మీ స్నేహితురాలు, మీరు చేస్తున్న మంచి సేవలో, బ్రతకటానికి మంచి అవకాశాలున్నాయి!" అన్నాడు డాక్టరు వణుకుతున్న ఆమె సన్నని చేతితో, కరచాలనం చేస్తూ...."ఇప్పుడు నేను మెట్లక్రింద యింకో కేసు చూడాలి! అతనిపేరు 'బెహ్రమాన్' అనుకొంటాను. ఓ రకమైన చిత్ర కారుడనుకొంటా. అతడు చాలా వృద్ధుడు. చాలా నీరసంగా వున్నాడు. అతనికి బాగా "న్యూమోనియా" వచ్చింది. అతడు బ్రతుకుతాడని ఆశ లేదు. ఇంకా కొంచెము మంచి వైద్యము కోసము ఆస్పత్రికి తీసుకు వెళుతున్నారు!"

మరునాడు డాక్టరు "స్యూ"కి చెప్పాడు. మీ స్నేహితురాలు ప్రమాదం నుంచి బయట పడింది. మీరే గెల్చారు! మంచి బలమైన ఆహారం యిస్తేచాలు! జాగ్రత్త! ఆమెకింక భయములేదు.

ఆ సాయంకాలము "స్యూ" జాన్సీ దగ్గరకొచ్చి ఆమె మెడమీదుగా చెయ్యివేసి, యిలా అన్నది. జాన్సీ అప్పుడు తృప్తితో ఓ పనికిరాని భుజముమీద కప్పుకొనే నీలిరంగు, గుడ్డను కుడుతున్నది.

"పిచ్చిజాన్సీ! నీకు ఒక వార్త చెప్పాలను కొంటున్నాను. ఆస్పత్రిలో బెహ్రమాన్ ఈ రోజున న్యూమోనియా వ్యాధితో చనిపోయాడు. రెండు రోజులనుంచి మాత్రమే అతడు జబ్బుతో వున్నాడు. మొదటిరోజు వుదయం అతని గదిలో మెట్లమీద నొప్పితో బాధపడుతుండగా 'జానీటరు' (ద్వారములను, గోడలను, నేలను శుభ్రపరిచే వుద్యోగి) చూసాడు. అతని చెప్పులు, గుడ్డలు కూడ మంచులో తడిసి, చాలా చల్లగా వున్నాయట! ఆ భయంకరమైన రాత్రి అతనెక్కడ వున్నాడో వాళ్ళకు తెలియలేదు. గోడ మీదనుంచి తీసిన నిచ్చెనా, యింకా వెలుగుతున్న ఓ లాంతరూ, వాళ్ళకు కన్పించాయి. పెయింటు చేసే బ్రష్లు అక్కడక్కడ పడివున్నాయి. చిన్న పళ్ళెంలో ఆకుపచ్చ, పసుపు పచ్చ కలిపిన రంగుల ద్రవము వుంది.... నా ప్రియతమా! కిటికీలో నుంచి బయటికి చూడు! గాలి వీచినప్పుడు అది ఆడనందుకుగాని, కదలనందుకుగాని, నీకు ఆశ్చర్యం వెయ్యటం లేదూ! ఓ! డార్లింగు! అదే బెహ్రమాన్ యొక్క అద్భుత కళాఖండము ఆ పత్రము పడిపోయిన రాత్రి దానినతడక్కడ చిత్రించాడు!!!"

o(o)o

వినోదపు డిటెక్టివులు

(The Sleuths)

పెద్ద పట్టణాలలో, క్రొవ్వువొత్తి కాలిపోయి ఆరినట్లుగా, ఒకవ్యక్తి అకస్మాత్తుగా అదృశ్యమౌతాడు. అప్పుడు పట్టణంలోని అన్ని పరిశోధనా సంస్థలకు, అన్నిరకాల డిటెక్టివులకు పని తగులుతుంది. చాలా తరచుగా అదృశ్యమైన వ్యక్తి తిరిగి దర్శనమివ్వడు. కొన్ని సందర్భాలలో యెక్కడో ఒకచోట అతను తిరిగి కన్పించవచ్చు కాని గతించిన కాలం గురించి, తన అప్పులను గురించి స్మరణ లేనట్లుగా అగుపిస్తాడు.

బ్లాక్ బోర్డునుంచి, చాక్ పీసుతో గీయబడిన బొమ్మ అదృశ్యమై నట్లుగా మనిషి అదృశ్యం కావటమనేది నాటకాలకి ఒక మంచి ఆకర్షణ గల విషయము.

"మేరీస్నైడరు" విషయం తీసుకొంటే కొంచెం విశేషమున్నట్లు తోస్తుంది. మిస్టెరిస్ స్నైడరు, 'మీక్సు' అనే వ్యక్తికి చెల్లెలు అతడు పశ్చిమ ప్రాంతమునకు చెందినవాడు. అతడామెను వెతుక్కుంటూ న్యూయార్కు వచ్చాడు. ఆమె యాభైరెండు సంవత్సరాల విధవరాలు. ఒక క్రిక్కిరిసిన ప్రాంతంలో, ఓ పెద్ద భవనంలో, ఓ చిన్న భాగంలో వుంటు వ్నది.

ఆమె నివసిస్తున్న ప్రాంతానికి వెళ్ళి వాకబు చేసాడు మీక్సు నెల క్రిందటనే ఆమె తన అద్దెయింటిని ఖాళీచేసినట్లు, ప్రస్తుతము యెక్కడ వున్నది తెలియదనీ అక్కడ వాళ్ళు చెప్పారు.

ఆ యింటి నుంచి వస్తూ, వీధిలో నిల్చొన్న రక్షక భటుని కలుసుకొని తన అవస్థను గురించి చెప్పాడు.

"నా చెల్లెలు చాలా పిచ్చిది" అతను అన్నాడు. "ఆమె యెక్కడ వున్నదో తెలుసుకోవాలని నాకు తొందరగా వుంది. ఈ మధ్యనే ఓ తగరపు గనిలో, నేను చాలా ధనము సంపాదించాను. ఆమెకు కొంత డబ్బిద్దామనుకొంటున్నాను. పత్రికలలో ఆమెను గురించి ప్రకటించటం వలన లాభం లేదు. ఎందు కంటే ఆమెకు చదువురాదు."

"మీరు 'కెనాల్ వీధి' ప్రాంతానికి వెళ్ళండి." అన్నాడు ఆ రక్షక భటుడు, అక్కడ మీకు కనపడిన పెద్ద లారీని తీసుకొని నడుపుకొంటూ పొండి, అక్కడ చాలా మంది వ్యక్తులు వాహనాల క్రింద పడి చనిపోతూ వుంటారు. వాళ్ళలో మీ చెల్లెలు కన్పించవచ్చు. మీకు అక్కడికి వెళ్ళటం యిష్టం లేకపోతే మా పోలీసు హెడ్ క్వార్టర్సుకి వెళ్ళి రిపోర్టు చెయ్యండి. ఎవరి నైనా తెలి వైన కానిస్టేబులును ఆమెను వెతకటానికి వినియోగించమని చెప్పండి.

పోలీసు హెడ్ క్వార్టర్సులో, వెంటనే సరియైన సహాయం లభించింది. పట్టణంలోవున్న అన్ని పోలీసుస్టేషన్లకీ, ఆమె ఫోటో (మిక్స్ యిచ్చినది) పంపబడింది. మల్బరీ వీధిలో పోలీసు సూపరెంటు, డిటెక్టివ్ "ములిన్స్"ను, ఆ కేసుకు వినియోగించాడు.

ఆ డిటెక్టివ్ 'మిక్స్'ని ప్రక్కకు తీసుకు వెళ్ళి యిలా చెప్పాడు. 'ఈ కేసును పరిష్కారం చెయ్యటం గొప్ప విషయమేమీ కాదు బాగా గెడ్డం చేయించుకొని, జేబులో మంచి సిగరెట్లు వేసుకొని, సాయంకాలము మూడుగంటలకు "వాల్‌డోర్ఫ్" కేఫ్‌కు రండి" అని.

మిక్స్, ఆయన చెప్పినట్లే ఆ కేఫ్‌కు వెళ్ళాడు. డిటెక్టివ్ ములిన్స్ అక్కడ సిద్ధంగా వున్నాడు. వాళ్ళు ఒక సీసా ద్రాక్ష సారాయి ఖాళీ చేసారు. సారాయిత్రాగుతూ డిటెక్టివ్ తప్పిపోయిన ఆయన చెల్లెలును గురించి వివరాలు అడిగాడు.

"ఇప్పుడు" ముల్విన్ అన్నాడు. "న్యూయార్క్ ఒక పెద్ద పట్టణం ఇక్కడ అపరాధ పరిశోధక వృత్తిని నియమబద్ధంగా చేస్తున్నాము. మీ చెల్లెలును కనుక్కోవటానికి రెండు మార్గాలున్నాయి. వాటిలో ఒక మార్గం అనుసరిద్దాము. మీ చెల్లెలుకు యాభైరెండేళ్ళు అన్నారు గదా!"

"యాభైరెండు కొంచెము గడిచింది"

డిటెక్టివ్ మీక్సును తీసుకొని, నగరంలో వున్న పెద్ద దినపత్రిక ప్రకటన కార్యాలయానికి వెళ్ళాడు. అక్కడ ఈ క్రింది ప్రకటన వ్రాసి మీక్సుచేతికిచ్చాడు.

"కావలెను.... అందంగా వున్న ఓ వంద మంది కోరస్ ఆడ పిల్లలు, ఒకనృత్య నాటికకు కావలెను. బ్రాడ్ వేలోని.... నంబరుకు, ఫలానారోజున రావలెను.

మీక్సు తనకు వచ్చిన కోపాన్ని అణుచుకొన్నాడు.

"అయ్యా! డిటెక్టివ్‌గారూ! నా చెల్లెలు చాలా బీదది కష్టపడి పనిచేసేది. పెద్ద వయసుగలది. ఇటు వంటి ప్రకటన యివ్వటం వలన ఆమెకు కలిగే లాభమేమిటి? అన్నాడు మీక్సు.

"మంచిది!" అన్నాడు డిటెక్టివ్," ఈప్లాను మీకు నచ్చకపోతే యింకోటి ప్రయత్నిద్దాము. ఆ ప్లానుతో తప్పక మనపని నెరవేరుతుంది. కాని దానికి మీరు డబ్బు బాగా ఖర్చు పెట్టాల్సి వుంటుంది.

"ఫరవాలేదు. డబ్బెంతైనా.... ఆ పద్ధతే ప్రయత్నిద్దాము "

డిటెక్టివ్ మళ్ళీ మీక్సుని "వాల్‌డోర్ఫ్" కేఫ్‌కు తీసుకు వెళ్ళాడు.

"రెండు బెడ్ రూములూ, ఒక కార్యాలయపు గదినీ 'బుక్' చెయ్యండి."

డిటెక్టివ్‌గారు సలహా యిచ్చాడు. "ఇప్పుడుపైకి పోదాంరండి!

మీక్స్ రెండు బెడ్ రూములనీ, ఒక కార్యాలయపు గదినీ ఆ కేఫ్‌లో బుక్ చేసాడు.

వెంటనే ఆయిద్దరికి. నాల్గవ అంతస్థులో ఓ అందమైన భాగం యివ్వబడింది. మీక్సుకు యిదీ అంతా అయోమయంగావుంది. కాని డిటెక్టివ్ ఓ అందమైన పడకకుర్చీలో కూర్చొని, తన సిగరెట్టు పెట్టెను బయటికి తీసాడు.

'ఆ నేను మీకు చెప్పటం మర్చిపోయాను మీక్సుగారూ! మీరు ఈ గదులను నెలకు ఒకేసారి బుక్ చేస్తే బావుండేది. అప్పుడయితే చాలా తక్కువ ఖర్చయేది" అన్నాడు డిటెక్టివ్.

"నెలకు బుక్ చెయ్యాల్నా?" ఆశ్చర్యపోతూ అడిగాడు మీక్సు, "మీ వుద్దేశ్యమేమిటి?"

"ఏమీ లేదు ఈ పద్ధతిలో మనం పని చేసుకొంటూ పోవటానికి చాలాకాలం పడుతుంది. అందుకే ఈ ప్లానుకు చాలా ఖర్చవుతుందని ముందే మీకు చెప్పాను మనం వసంతకాలం వచ్చేదాకా ఆగాలి. అప్పుడు ఈ నగరానికి క్రొత్త "డైరెక్టరీ" అచ్చవుతుంది. చాలా మటుకు దానిలో మీ చెల్లెలు పేరూ, అడ్రసు వుండవచ్చు"

మీక్సుకు తల తిరిగిపోయింది. లాభం లేక ఆ డిటెక్టివ్‌ను వెంటనే వదిలించుకొన్నాడు

మరునాడు మీక్సుకి ఎవరో సలహాయిచ్చారు. న్యూయార్కు పట్టణంలో ప్రసిద్ధుడైన "షామ్‌రాక్ జోన్సు" అనే డిటెక్టివ్‌ను కలవమని అయితే అతడు ఎక్కువ ఫీజు అడుగుతాడు కాని అతడు చాలా అద్భుతంగా ఎన్నో క్రిమినల్ కేసులను సాధించాడు అని.

రెండుగంటలు డిటెక్టివ్ భవనంలో అతని ముందు గదిలో వేచియుంటేగాని, ఆ డిటెక్టివ్ దర్శనం కాలేదు. జోన్సు ఎరుపు-నీలపు రంగు డ్రెస్సింగు గౌను వేసుకొన్నాడు. చేతిలో ఓ పత్రిక పట్టుకొని దంతముతో చేయబడిన చదరంగపు బల్ల ముందు కూర్చొని, 'వారు' అనే ఒక సమస్యను సాధించటంలో మునిగిపోయాడు.

సన్నగా తెలివితేటలుట్టిపడుతున్న ముఖంతో, సూదులులాగాగుచ్చే చూపులతో, వున్న అతని వర్ణన అందరికీ పరిచయమైనదే!

మీక్సు తను వచ్చిన పనేమిటో చెప్పాడు.

"నేను నా ప్రయత్నంలో విజయమొందితే 500 డాలర్ల ఫీజు తీసుకొంటాను. ఇష్టమేనా?" డిటెక్టివ్ అడిగాడు.

మీక్సు అందుకు అంగీకరించాడు.

"నేను మీ కేసును తీసుకొంటాను. మిష్టర్ మీక్సు!" జోన్సు చివరికి అన్నాడు.

"ఈ పట్టణంలోని వ్యక్తుల అదృశ్యం కావటం నాకొక కుతూహలం గల్గ సమస్యగా తయారయింది. ఓ సంవత్సరం క్రిందట నేను జయప్రదంగా సమస్యను సాధించిన ఓ కుటుంబపు కేసు నాకు జ్ఞాపకమొస్తున్నది. "క్లార్కు" అనే కుటుంబ నామముగల ఆ కుటుంబము. వాళ్లు వుండే చిన్న భాగములో నుంచి హఠాత్తుగా అదృశ్యమయ్యారు. వాళ్లు నివసించిన యింటిని రెండునెలలు నేను యేకధాటిగా పరిశీలించాను యేమన్నా ఆధారం దొరుకుతుందేమోనని. నాకు ఒక రోజున హఠాత్తుగా స్ఫురించింది. ఆ యింటికి పాలు సరఫరాచేసే పాలవాడూ, సరుకుతెచ్చే కుర్రవాడూ మెట్లమీదుగా పైకెక్కుతున్నప్పుడు యెప్పుడూ వెనకవైపుగా నడిచేవాళ్లు ఆ ఆధారంతో నేను ఆ తప్పిపోయిన కుటుంబమెక్కడుందో కనుక్కో గలిగాను. హాలులో, అడ్డంగా వున్న యింకో భాగంలోకిమారి, వాళ్ళ యింటిపేరును కూడా "క్రేల్"గా మార్చుకొన్నారు.

"మేరీ స్నైడర్" వుండే పెద్ద భవనం దగ్గరకు జోన్సును మీక్సు తీసుకు వెళ్ళాడు. ఆమె అదివరకు బసచేసిన గదిని ఆయనకు చూపించాడు ఆ గది చాలా చిన్నది. ఫర్నిచరుగూడా యెక్కువ లేదు. గది అంతా అశుభ్రంగా వుంది. పాపం! మీక్సు ఓ విరిగిపోయిన కుర్చీలో కూర్చున్నాడు. డిటెక్టివ్ ఆ గదినేలనూ, గోడలనూ, క్రిందపడివున్న పుల్లలనూ, విరిగిపోయిన ఫర్నిచరునూ నిశితంగా పరిశీలించాడు.

ఓ అరగంట శ్రమపడిన తర్వాత అంతగా అర్థం లేనటువంటి ఈ క్రింది వస్తువులు జోన్సుకు దొరికాయి.

1. ఓ నల్లటి చవకరకపు టోపీకి పెట్టుకొనే గుండుసూది.

2. ఓ థియేటరు ప్రోగ్రాము అచ్చువేసిన పత్రములో ఓ చిరిగిపోయిన ముక్క.

3. ఒక చిరిగిపోయిన అట్టముక్క చివరి భాగము - దానిమీద "ఎడమ వైపు" అనే మాటలూ, "సి 12" అనే మాటలూ వున్నాయి.

డిటెక్టివ్ తలమీద చేతులు పెట్టుకొని పదినిమిషాలు దీర్ఘాలోచనలో మునిగిపోయ్యాడు. ఆఖరికి అతడు వుద్రేకంతో యిలా చెప్పాడు "మీక్సు గారూ! ఈ సమస్యను సాధించాను. మీ చెల్లెలు వుంటున్న యింటి దగ్గరకే మిమ్మల్ని నేరుగా తీసుకు వెళ్ళగలను. మీరు ఆమె యెలా వున్నదీ అని బాధపడక్కరలేదు. ప్రస్తుతం ఆమె దగ్గర చాలా డబ్బు వుంది!" అన్నాడు.

మీక్సుకు చాలా సంతోషమైంది. చాలా ఆశ్చర్యపడ్డాడు కూడా.

"మీరెట్లా ఈ సమస్యను సాధించారు?" డిటెక్టివ్ పట్ల గొప్ప భావం ప్రకటించే గొంతుతో అడిగాడు.

బహుశా డిటెక్టివ్ జోన్సుకు వున్న బలహీనత అది ఒక్కటే నేమో! అతడికి తన వృత్తిపట్ల యెంతో గౌరవభావముంది. వినేవాళ్ళుంటే తన పరిశోధనను చక్కగా వర్ణించి చెప్పగలడు!

"పరివేత పద్ధతిమీద" ఓ చిన్న బల్లమీద చేతులు పరుస్తూ జోన్సు చెప్పాడు. "మిస్టెరిస్ స్పైడరు వెళ్ళగలిగిన కొన్ని ప్రదేశాలను నేను ముందుగానే తీసివేసాను. ఇదిగో! ఈ టోపీ పిన్నును చూసారా? దాని వలన పట్టణంలోని "బ్రూక్‌లిన్" ప్రాంతాన్ని తీసివేసాను ఎందుకంటే యే స్త్రీ కూడా టోపీపిన్ను లేకుండా కారెక్కే ధైర్యం కలిగి వుండదు. ఆ టోపీ పిన్నుతో అయితేనే కారులోని సీటుమీదకు వెళ్ళి కూర్చోవటానికి సాధ్యమవుతుంది. ఇప్పుడామె "హార్లిన్స్" ప్రాంతానికి యెందుకు వెళ్ళి

వుండకూడదో చెప్తాను. ఈ తలుపు వెనుక గోడకు రెండు కొక్కేములు వున్నాయి. ఒక కొక్కేనికి ఆమె తలమీద కప్పుకొనే గుడ్డను, రెండవ దానికి ఆమె తన భుజంమీద కప్పుకొనే గుడ్డని తగిలిస్తూ వుంటుంది. మీరు బాగా గమనిస్తే భుజం మీద కప్పుకొనే గుడ్డక్రింద ఓ మాసిపోయిన గీత సిమెంటు చేసిన గోడమీద కనబడుతుంది. ఆ గీత స్పష్టంగా కనపడటంతో ఆ గుడ్డకు చివర కుచ్చిళ్ళు లేవు అని స్పష్టంగా తెలుస్తుంది. అలా కుచ్చెళ్ళు లేని గుడ్డతో యే మధ్య వయస్కురాలైన స్త్రీ అయినా "హార్లెమ్" రైలు ఎక్కడం చూసారా? కాబట్టి మన జాబితాలో నుంచి "హార్లెమ్"ను గూడా తీసివేయవచ్చు.

"కాబట్టి మిస్ట్రెస్ స్నైడరు ఎక్కువ దూరం వెళ్ళలేదని తేల్చుకొన్నాను. ఈ చిరిగిన అట్టముక్కమీద 'ఎడమ' అనే అక్షరమూ, "సి" అనే అక్షరమూ దాని తర్వాత 12 నంబరు వున్నది చూసారా? నాకు బాగా తెలుసు. "12 భవనం సి" మొదటి తరగతికి చెందిన విశ్రాంతి గృహము. అది మీ చెల్లెలు భరించలేనంత ఖరీదు వుందని మనం అనుకొందాం. కాని ఈ థియేటరు ప్రోగ్రాము అచ్చువేసిన కాగితం ఓ వింత ఆకారంలో నలిపివేసి వుంది. దాని అర్థమేమిటి? మిస్టర్ మీక్సు! మీకు దాని అర్థం తెలియక పోవచ్చు. కాని యే చిన్న విషయాన్ని అయినా పరిగణలోకి తీసుకొనేటట్లు మాకు శిక్షణ యివ్వబడింది."

"మీరు, మీ చెల్లెలు యిండ్లు శుభ్రంచేసే పని చేస్తుందని నాకు చెప్పారు. ఆమె కార్యాలయాలలోని నేలలూ, పెద్ద హాల్సులోని నేలలూ శుభ్రం చేస్తూ వుండవచ్చు. అదేపని ఆమెకు ఒక థియేటరులో దొరికింది అనుకొందాము. థియేటర్లలో అయితే చాలా ఖరీదైన నగలు పోగొట్టుకొంటూ వుంటారు జనం. ఆ కాగితం మీద గుండ్రని ముద్ర వుండటం గమనించావా? మిస్ట్రెస్ స్నైడరు థియేటర్‌లో పని చేస్తున్నప్పుడు ఆమెకు ఒక వుంగరము దొరికి వుండవచ్చు. ఆమె జాగ్రత్తగా ఆ వుంగరాన్ని కాగితంలో చుట్టి, తన జాకెట్టులోపల దాచుకొని వుంటుంది. మరునాడు యే నగల దుకాణంలోనో అమ్మి బాగా డబ్బు చేసుకొని వుంటుంది.

అప్పుడు తనకు వుండటానికి మంచి విశ్రాంతి గదికోసం ఆమె ఆరాటపడి వుండవచ్చు. కాబట్టి యిలా క్రమంగా ఆలోచించుకుంటూపోతే ఆమె పెద్ద విశ్రాంతి భవనమైన నం "12 సి" అవెన్యూలో ఓ చిన్నభాగము అద్దెకు తీసుకొని వుండవచ్చు. కాబట్టి మీ చెల్లెలు అక్కడ దొరుకుతుందని గట్టిగా చెప్పవచ్చు."

ఇలా 'షామ్‌రాక్‌జోన్సు' తన దీర్ఘోపన్యాసాన్ని విజయోత్సాహం ప్రకటించే నవ్వుతో ముగించాడు. మిక్సు ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. ఇద్దరూ కలిసి "12 అవెన్యూ సి" భవనం దగ్గరకు వెళ్ళి చూసారు. అది పాతపద్ధతిలో మంచి సంపన్నుల, గౌరవస్థులుండే ప్రాంతంలో, లేత ఎరుపురంగు యిటుకరాళ్ళతో కట్టిన పెద్ద భవనము.

వాళ్ళు ఆ భవనం తలుపు గంట మ్రోగించి విచారిస్తే అక్కడ మిస్ట్రెస్ స్నీడరు పేరుతో యెవ్వరూ వుండటం లేదనీ, ఆరు నెలలలోగా యెవరూ క్రొత్తగా అక్కడకు అద్దెకు రాలేదని ఆ యింటివాళ్ళు చెప్పారు.

"నేను డిటెక్టివ్‌ను కాదనుకోండి!" మిక్సు మిస్టర్ జోన్సుతో అన్నాడు "ఈ ప్రోగ్రాము కాగితం ముక్కలో దాచింది బంగారు వుంగరము కాదనీ, పెప్పరమెంటు బిళ్ళనీ, ఈ కాగితం వాసనను బట్టికనుక్కోవచ్చని నాకనిపిస్తున్నది. ఆ అడ్రెసు....థియేటర్‌లోనే 'సి' వరుసలో నం. 12 సీటుగా నాకనిపిస్తున్నది."

పాపం డిటెక్టివ్ జోన్సు మిక్సు మాటలకు బిత్తరపోయాడు.

"మీరు "జుగ్గిన్సు"ను సంప్రదిస్తే బావుంటుందని తోస్తున్నది" అన్నాడు.

"ఆయనెవరు?" అడిగాడు మిక్సు.

"ఆయన క్రొత్త పద్ధతిలో నడుపుతున్న అపరాధ పరిశోధకుల పాఠశాలకు నాయకుడు. వాళ్ళ పద్ధతులకీ, మా వాటికీ చాలా తేడా వుంది. కాని ఆయన చాలా క్లిష్టమైన కేసులను పరిష్కరించాడని చెప్తారు.ఆయన దగ్గరకు మిమ్మల్ని తీసుకువెళతాను" అన్నాడు డిటెక్టివ్ జోన్సు.

వీళ్ళిద్దరూ వెళ్ళేసమయానికి జగ్గిన్స్ తన కార్యాలయంలోనే వున్నాడు. అతడు చాలా పొట్టిగా వున్నాడు. తల మీద వెంట్రుకలు చాలా పల్చగా వున్నాయి. ఆయన 'నెథానియల్ హాతొరాన్' మనుష్యుల స్వభావాలను గురించి వ్రాసిన ఓ పెద్ద పుస్తకం చదవటంలో నిమగ్నుడై వున్నాడు.

వేరు వేరు పద్ధతులకు చెందిన యిద్దరు గొప్పడిటెక్టివ్‌లు ఒకరితో నొకరు కరచాలనం చేసుకొన్నారు.

"మీరు జరిగిన విషయాన్ని చెప్పండి" అంటూ ఆయన తన పుస్తకం చదువుతూనే వున్నాడు.

మీక్స్ తన చెల్లెలును గురించి చెప్పటం ముగించిన తర్వాత తన పుస్తకం మూసి యిలా అడిగాడు.

"మీ చెల్లెలుకు 32 యేళ్ళ వయసు ఆమె ముక్కు మీద పెద్ద పుట్టుమచ్చ వుంది. ఆమె విధవరాలు, చాలా బీదది. ఇండ్లు, వాకిళ్ళు పరిశుభ్రంచేస్తూ తన పొట్ట గడుపుకొంటున్నది ఆమె సాధారణ గృహిణిలాగా వుంటుంది. అంతేగదూ మీరు చెప్పేది.

"మీరు చెప్పింది సరిగా వుంది" ఒప్పుకొన్నాడు మీక్స్.

జగ్గిన్సు తన కుర్చీలోనుంచి లేచి, తలమీద టోపీ పెట్టుకొన్నాడు.

"నేను పదిహేను నిమిషాలలో తిరిగి వస్తాను. మీ చెల్లెల అడ్రెసు తీసుకొని" జగ్గిన్సు అన్నాడు.

షామ్ రాక్సు జోన్సు ముఖం ఆమాటలతో చాలా పాలిపోయింది. కాని ముఖం మీద బలవంతాన నవ్వు కనబరస్తున్నాడు.

ఆయన చెప్పిన టైములోగా తిరిగి వచ్చాడు ఆయన చేతిలో ఓ చిన్న కాగితపు ముక్కవుంది.

"మీ చెల్లెలు అయిన మేరీ స్నైడర్" ప్రశాంతంగా అన్నాడు జగ్గిన్సు "చిల్టాను వీధిలో 162 నంబరు యింటిలో కనబడుతుంది. ఆరో అంతస్థులో ఓ 'బెడ్‌రూమ్' వెనకాల వున్న ఓ హాలులో వుంటున్నది. ఆ యిల్లు ఇక్కడ నుంచి నాల్గు బ్లాక్సు దూరములో వుంది."

6)

అతడు మళ్ళీ మీక్స్ వంక తిరిగి యిలా అన్నాడు." మీరువెళ్ళి ఆ అడ్రసులో విచారించి రండి ఈలోగా మిస్టర్ జోన్సు మీకోసం కాచుకొని వుంటాడు. నేను నమ్మకంగా చెప్తున్నాను."

మీక్స్ ఆ క్రొత్త అడ్రసు తెలుసుకోవటానికి త్వర త్వరగా వెళ్ళాడు. ఇరవై నిమిషాలలో అతడు తిరిగి వచ్చాడు. అతని ముఖం సంతోషంతో కళకళ లాడుతున్నది.

"మీరు చెప్పినట్లుగానే నా చెల్లెలు అక్కడే ఆరోగ్యంగా వుంది. మీకు నా కృతజ్ఞతలు. మీ ఫీజు యెంతో చెప్పండి చెల్లిస్తాను"

అన్నాడు మీక్స్.

"రెండు డాలర్లు!" జుగ్గిన్సు అన్నాడు.

మీక్సు తన బిల్లు చెల్లించి అక్కడి నుంచి నిష్క్రమించిన తర్వాత తన టోపీ చేతిలో పట్టుకొని మిస్టర్ జోన్సు, మిస్టర్ జుగ్గిన్సు ముందు నిలబడ్డాడు.

"మీరు నేను యెక్కువగా మాట్లాడుతున్నానని అనుకోకపోతే" నట్టునట్టుగా అన్నాడు జోన్సు.

"ఈ సమస్యను మీరెలా పరిష్కరించారో దయచేసి చెప్తే చాలా సంతోషిస్తాను....మీకభ్యంతరం లేకపోతేనే"

"తప్పకుండా చెప్తాను...." జుగ్గిన్స్ సంతోషముగా అన్నాడు. "నేను అడ్రెసు యెలా కనుక్కొన్నానో మీకు చెప్తాను. మిస్ట్రెస్ స్నీదరు యొక్క వర్ణన మీకు జ్ఞాపకముందా? మైనముతోచేసిన తన పెద్ద చిత్రం కోసం వారపుకంతులు చెల్లించలేని స్త్రీని గురించి మీరెప్పుడైనా విన్నారా? అటువంటి చిత్రాలు తయారు చేసే కర్మాగారము ఈ ప్రాంతములోనేవుంది నేనక్కడకు వెళ్ళి, వాళ్ళ పుస్తకాలనుంచి ఆమె అడ్రసు కనుక్కొని వచ్చాను....అంతే...."

—)o(—

మోలీ విజయము

(How She Got In The Swim)

'హౌస్టన్' పట్టణంలో, జార్జి, అతని భార్య 'మోలీ' కన్నా సంతోషంగా వున్న జంట లేదని చెప్పవచ్చును. కాని ప్రపంచములో యెప్పుడూ సుఖమే వుంటే, దుఃఖానికి తావెక్కడిది? శని మహారాజు యెవరిని పట్టి పీడించగలడు?

జార్జి దంపతులు ఒక అందమైన భవనములో, సర్వసౌఖర్యాలతో కాపురం చేస్తున్నారు. వాళ్ళకు డబ్బుతో కొనదగిన వస్తువులు అన్నీ వున్నాయి. వాళ్ళకి 'డాలీ', 'పోలీ' అనే పేర్లతో యిద్దరు అందమైన ఆడపిల్లలున్నారు.

జార్జి, ఆడంబరమైన ధనిక కుటంబాల సంఘంలో తిరగటానికి అలవాటు పడ్డాడు. భార్య 'మోలీ' భర్తకనుకూలవతి అవటంచేత, తన భర్త కోరికలను తీర్చటమే ప్రధానంగా గుర్తించి కుటుంబాన్ని హౌస్టను పట్టణానికి తరలింపచేసింది. జార్జి పట్టణంలోని విందులకూ, డ్యాన్సులకూ హాజరవుతూ తన భార్యాను యింటి దగ్గరే వుంచేవాడు. ఆమె అటువంటి పార్టీలకు పనికిరాదని.

ఒక రాత్రి ఆ నగరంలో పెద్ద పెద్ద వ్యాపారస్థులు గొప్పనృత్యము (డాన్సు), విందు యేర్పాటు చేసారు. జార్జి గూడా ఆ విందుకు ఆహ్వానింపబడటం చేత, ఒంటరిగానే, ఆ ఫంక్షనుకు హాజరైనాడు.

అతను యింటి నుంచి వెళ్ళిన తర్వాత, మోలీ తన ప్రతిబింబాన్ని అద్దంలో చూసుకొని, యిలా అనుకొంది. "ఈరోజు జరిగే విందులోగాని, డ్యాన్సు లోగాని, నాకు సరియైన వాళ్ళు లేరని నిరూపిస్తాను. అవసరమైతే డాలరు పందెం కాస్తాను."

ఆమెకు ఒక ఆలోచన తట్టింది. తనయింట్లో పనిచేసే పరిచారికను పిలిచి, ఒక కప్పు టీ చేయించుకొని, త్రాగి తన పిల్లలిద్దరినీ ఆమెను జాగ్రత్త చూస్తుండమని చెప్పింది. తర్వాత ఓ అద్దెకారులో, ఆరోజు ఆ విందు జరుగుతున్న చోటికి వెళ్ళింది. తనకున్న వాటిలో, అందమైన, ఆకర్షణీయమైన దుస్తులు ధరించింది.

జార్జి ఆవిందులో వుండి, ఆనందము జుర్రుకొంటున్నాడు. ఆపట్టణములో వున్న సంఘములోని గొప్పగొప్ప వాళ్ళంతా అక్కడే వున్నారు. జంటలునృత్యం, అద్భుతంగా గొప్పగా చేస్తున్నారు. మ్రోగిపోతున్న వాద్యాల కనుకూలంగా ప్రేక్షకుల కళ్ళన్నీ నృత్యం చేసే జంట మీద కేంద్రీకరింపబడి వున్నాయి.

అక్కడకు వచ్చిన వారిలో ఓ గొప్ప ఫ్రెంచి సంపన్నుడు వున్నాడు. అతడు కొన్ని రాజకీయ కారణాలవల్ల పారిస్ మహానగరం వదలి 'హ్యూసను' పట్టణంలో నివాసం యేర్పరచుకున్నాడు. ఆయనకు పెద్ద ద్రాక్షతోట వుంది

జార్జి భార్య మోలీ నృత్యమందిరానికి వచ్చినప్పుడు అతడొకమూల పండ్లు గీరుకుంటూ కూచున్నాడు. ఒక నిమిషములో అతడు మేరీని సమీపించి ఆమెతో పరిచయము చేసుకొని ప్రతి నృత్యములోనూ ఆమె జంటగా తనపేరు వ్రాసుకున్నాడు.

జార్జి వాళ్ళిద్దరూ నృత్యం చేస్తూంటే కళ్ళుతెరుచుకుని ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"ఆమె నా భార్యేనా?" అంటూ విస్మయం చెందాడు.

ఒక స్థంభానికి అనుకొని నిలబడి వారి నృత్యాన్ని తిలకించాడు. ఆ సాయంకాలం నృత్యంలో మోలీ ప్రథమస్థానం సంపాదించింది. అందరూ ఆమె చుట్టూ మూగేవాళ్ళే, ఆ ఫ్రెంచి సంపన్నుడు పేపరుతో ఆమెకు గాలి విసురుతున్నాడు. ఆమె అతి మనోహరంగా చిరునవ్వులు చిందిస్తున్నది.

ఆమె అద్భుతమైన చతురోక్తులు విసురుతూ యితరుల చలోక్తులను సరియైన సమాధానం యిస్తున్నది. ఆమె అందమైన నవ్వులు పువ్వుల వానలు కురిపిస్తున్నది.

"అద్భుతం! అపురూపమైన సుందరి" అంటూ ఆ ఫ్రెంచి సంప న్నుడు ఆమె ఎవరి తాలూకో తెలుసుకోవా లనుకున్నాడు.

విందులో ఆమె పాల్గొనటం ఆ విందుకు జీవం పోసింది. ఆమె అందరితో కలుపుగోలుగా, చతురతతో మాట్లాడింది. ఆ నగరంలోని అది వరకు అందరనూ నవ్వించేవారిగా పేరుబడ్డ యువకులు ఆమెకు సాటి రాలేదు ఎవరితో మాట్లాడితే వారి యాసతోనే మాట్లాడిందిఆమె. రాష్ట్రం లోని యూనివర్శిటీల్లో చదువుతున్న చెల్లెలున్న ఓ పెద్దమనిషి అడిగిన ప్రశ్నలన్నింటికీ చక్కగా సమాధానాలు యిచ్చింది.

ఈ అద్భుతమైన, అందమైన, తెలివయిన, చురుకుదనం వున్న యువతి తన భార్యేనా అని జార్జి నమ్మలేకపోతున్నాడు. ఈమెనేనా తను యింటివద్ద వదలి వచ్చింది? అతని ఆశ్చర్యానికి అంతు లేకుండాపోయింది.

ఆ భవనంలో నృత్యమూ, విందు ముగిసి వాద్యగాళ్లు, అతిథులు అంతా వెళ్ళిన తర్వాత అవమానంతో, పశ్చాత్తాపపడుతూ జార్జి వెళ్ళి తన భార్యను కలుసుకున్నాడు

"మోలీ! నన్ను క్షమిస్తావు గదూ! ఈ నృత్య బృందములో నీవు యెంతో అందముగా, హుషారుగా వున్నావు. ఈసారి నా మిత్రుడొకడు బ్రహ్మాండమైన నృత్యమూ, విందు ఏర్పాటు చేస్తున్నాడు. నిన్ను అక్క డకు తప్పకుండా తీసుకువెళతాను" అన్నాడు.

మోలీ తన భర్త చేతిని చిరునవ్వుతో అందుకుంది.

"మంచిది జార్జ్! ఈ నగరంలోని కులాసాజంట తెవ్వరూ నేను సరి తూగలేని నృత్యం చెయ్యలేరని మీకు చూపించాలనుకున్నాను. నేనులండన్ మహానగరంలో రెండు వారాలున్నాను. ఎంత గొప్ప నృత్యమైనా వెంటనే నేను అనుకరించగలను ఎంతో త్వరగా."

ప్రస్తుతం హిస్టను నగరంలో జార్జి-మోలీ జంటను మించిన అంద మయిన జంట, మెచ్చుకోదగిన జంట యింకోటిలేదు.

ఆ అందమైన జంటనుచూసి శని మహారాజు సిగ్గుపడి వాళ్ళను వదలి వెళ్ళిపోయాడు శాశ్వతంగా.

—)o(—

ఓ వింత జబ్బు

(A Strange Case)

"హౌస్టను" పట్టణంలో ఒక మంచి డాక్టరున్నాడు పోస్టుపత్రికలో పనిచేసే విలేఖరి అతనిని ఒకసారి కలుసుకొని,దగ్గరిలో వున్న హోటలుకు వెళ్ళి మాట్లాడుకొందాంరమ్మన్నాడు డాక్టరు అందుకు వొప్పుకొని, అతనితో హోటలుకు వెళ్ళి ఓ మూల ఫ్యాను క్రింద ఓ టేబులు ముందు కూర్చున్నాడు.డాక్టరుగారు నిమ్మకాయ రసం తెమ్మని ఆర్డరిచ్చారు సర్వరుకి. తర్వాత ఆ విలేఖరి డాక్టరుగారితో సంభాషణ ప్రారంభించాడు.

"మీ ప్రాక్టీసులో, మీ దగ్గరకొచ్చిన వింతకేసు లేమైనా వుంటే చెప్పండి!" అన్నాడు.

'తప్పకుండా! నావృత్తిరీత్యా రహస్యమైన కేసులను గురించి చెప్ప గూడదు. కాని కొన్ని వారాల క్రిందటనే నా దగ్గరకు వచ్చిన ఓవింతైన కేసును గురించి మీకు చెప్పకుండా వుండలేను. చెప్పమంటారా?" అడిగాడు డాక్టరు.

"తప్పక చెప్పండి. మనము మాట్లాడుకొంటున్నప్పుడు యింకో గ్లాసు నిమ్మరసానికి ఆర్డరిస్తే బావుంటుందేమో!" అన్నాడు విలేఖరి.

ఈ సలహాకు డాక్టరుకు కొంచెము కోపం వచ్చింది. అయినా తమా యించుకొని జేబులు వెతుకుతే, సరిపోయే డబ్బులుండటంలో ఇంకో రెండు గ్లాసులనిమ్మరసం తెమ్మనమని సర్వరుకు ఆర్డరు జారీచేసాడు.

"ఓ వారం క్రిందట, రోగులకోసం ఎదురుచూస్తూ, నా డిస్పెన్సరీలో కూర్చొని వుంటే. ఓ అందమైన అమ్మాయి నా గదిలోకి వచ్చింది. ఆమె నడక చాలా తమాషాగా వుంది. అంతఅందమైన నడక నేనెప్పుడు చూడ లేదు. ఆమె ఒక ప్రక్క నుంచి యింకో ప్రక్కకు తూలుతూ, ముందుకూ వెనక్కు గూడా నడుస్తున్నది ఎంతో శ్రమ మీద ఆమె నాగదిలోకి వచ్చి కుర్చీలో ఆసీనురాలయింది.

"డాక్టరుగారు! మధురమైన దుఃఖముతో కూడిన కంఠస్వరముతో ఆమె అన్నది. ఆమె ముఖం చాలా బావుంది. కాని దానిలో విచారరేఖలు స్పష్టంగా కన్పిస్తున్నాయి." నా పరిస్థితిని గురించి, మిమ్మల్ని సంప్రదించ టానికివచ్చాను. మీరు, దీర్ఘమైన, విసుగు పుట్టించేటటువంటి, నా కుటుంబ చరిత్ర వింటేగాని దాని ప్రభావము మీకు అర్థముగాదు. మీరు దయచేసి ఓపికతో వినగలరా?" అన్నాదా యువతి.

"మేడమ్! మీరు చెప్పే విషయము మీజబ్బును గుర్తించడానికి అవకాశమున్నట్లయితే వినటానికి నాకేమి అభ్యంతరము లేదు. మీకు కావలసినంత టైము తీసుకోండి" అన్నాను నేను.

"మా తండ్రిగారు తూర్పు ప్రాంతపు 'టెక్సాస్' కుటుంబమునకు చెందిన 'ఆడెమ్స్' యింటి పేరుకు సంబంధించిన వారు. మీరు ఆ కుటుంబా లను గురించి వినే వుంటారు...."

"నిజమే! కాని ఆ పేరుతో చాలా కుటుంబాలున్నాయి గదా ..."

"దానివలన యేమీ యిబ్బంది లేదు. అయిదు శతాబ్దముల క్రిందట మా తాతగారి కుటుంబానికి, ప్రాత "టెక్సాస్"లో స్థిరపడి పోయిన 'రెడ్మాండు' అనే పేరుగల కుటుంబమువారితో, గాఢమైన శత్రుత్వము వుండేది. ఇరుపక్షాలవారూ, హత్యలు చెయ్యడంలో ఆరితేరారు. చర్చిలో గాని, భోజనం చేసే హోటలులోగాని, ఒకరికొకరెదురైతే, పోట్లాట అంటూ జరగకుండా వుంటే ఆశ్చర్యపడాలి. వాళ్ళు ఒకళ్ళ బావులలో మరొకరు విషం కలిపారు. ఒకరి పంట లొకరు నాశనం చేసుకొన్నారు. అలాగే వారి తండ్రులు తమ పిల్లలకు పుట్టుకతోనే ఆ కుటుంబాల మధ్య శత్రుత్వము నేర్పించారు. ఇలా ముప్పది సంవత్సరాలు ఈ విరోధము, తాతల నుంచి తండ్రులకూ, తండ్రుల నుంచి పిల్లలకు, సంప్రదాయంగా వచ్చింది. చివరకు యిర్వై సంవత్సరాల క్రితం, రెండుకుటుంబాలు నాశనము కాగా, వాళ్ళకు ప్రతినిధులుగా, ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక్కరే మిలిలారు. వాళ్ళ పేర్లు "లెమ్యూయల్ ఆడమ్స్" మరియు "లాయి సారెస్మాండుఅనేవారు వాళ్ళిద్దరూ యవ్వనంలో వుండి.అందముగా వున్నారు. వారి ప్రథమ కలయికలోనే, తమ తండ్రి తాతల శత్రుత్వము మర్చిపోయి. ఒకరినొకరు గాఢముగా ప్రేమించుకొని, వెంటనే వివాహం చేసుకొన్నారు.

కాని వారి కుటుంబాల చిరకాల శత్రుత్వానికి, చివరకు ఓ అమాయక ప్రాణి గురికావలసి వచ్చింది.

"వారి వివాహ ఫలితమే నా జన్మ!" "ఆడమ్స్ యొక్క రక్తము 'రెడ్మాండ్సు' యొక్క రక్తము కలవటంచే నేను అందరి పిల్లలలాగే వుండటమే గాకుండా, చాలా అందముగా వుంటానని చాలా మంది అంటారు...."

"అవును— ఆ విషయం నేను ఒప్పుకొంటాను!" నేను మధ్యలో కల్పించుకొని అన్నాను.

ఆ మనోహరి కొంచెము సిగ్గుపడి తనకథనం కొనసాగించింది. "కాని నా వయస్సు పెరిగిన కొద్ది నాలో వ్యతిరేక భావాలు నన్ను ప్రభావితం చెయ్యటం సాగించాయి. నేను ఆలోచించిన ప్రతి విషయానికీ, విరుద్ధమైన ఆలోచన వచ్చేది నాకు అదంతా మా వంశీయుల పాత శత్రుత్వ ఫలితమే! నాలో సగము 'ఆడమ్స్' రక్తము సగము 'రేమాండ్సు' వారి రక్తము, కలిసి పోయినై, నేను ఒక కన్నుతో ఒక వస్తువుపంక చూస్తే, యింకోకన్ను యింకో వస్తువు పంక తేరిపార చూస్తుంది. నేను బంగాళా దుంప కూరలో ఒక చేతితో వుప్పు కలుపుతే, నాకు తెలియకుండానే, నా రెండవ చెయ్యి పంచదార కలుపు తుంది...."

"నేను మధురమైన గీతాలు ఆలాపన చేస్తుంటే, వెంటనే అది విషాద ఆలాపనగా మారుతుంది. నేను డ్రింక్సు దుకాణములోకి వెళ్ళి ఐస్ క్రీముకు ఆర్డరిస్తే, వెంటనే నిమ్మరసానికి ఆర్డరివ్వమంటూ నా అంతరాత్మ నన్ను ప్రబోధిస్తుంది. రాత్రి పూట దుస్తులు విప్పి పడుకుందామని నేను అనుకొంటే, నాలోని యేదో వ్యతిరేకశక్తి, నేను పూర్తి దుస్తులు ధరించి, చెప్పులతో గూడ, ప్రక్క మీద నిద్రపోయేటట్లు చేస్తుంది. ...."

"చాలా తమాషాగా వుంది. మీరిప్పటి వరకూ, మీలోని వ్యతిరేక శక్తి నెదుర్కో లేక పోయారన్నమాట!" నేను అన్నాను.

"అవును డాక్టరుగారు! కాని నా ప్రత్యేక కృషిచేత, శ్రమచేత, నాలోని వ్యతిరేక మనో భావాలను చాలా వరకు నేను జయించగల్గాను. నేను జయించలేనిది ఒక్కటే మిగిలిపోయింది. అదీ నానడక నాశరీరము లోని.... క్రింద అవయవములు, నేను చెప్పినట్లుగా నడుచుకోవటానికి,

వ్యతిరేకిస్తున్నాయి. నేను ఒక ప్రక్కగా నడుద్దామని అనుకొంటే నాలోని వ్యతిరేకశక్తి నన్ను వేరే మార్గములోకి తీసుకు వెళ్ళటానికి ప్రయత్నిస్తుంది. అంటే ఒక వేపు నడవమని చెప్పే శక్తి 'అడమ్సు' అయితే, అందుకు వ్యతిరేకముగా నడవమని చేప్పే శక్తి 'రేమాండ్సు'గా అనుకొంటున్నాను. కాని అతి విచిత్రంగా ఆ వ్యతిరేకశక్తులు నేను సైకిలు త్రొక్కేటప్పుడు మాత్రము నాకు తోడ్పడుతాయి. కారణం సైకిలు యొక్క ఒక 'పెడలు' పైకి పోతుంటే రెండొవది వ్యతిరేకదిశలో, క్రిందకు పోవటమే అనుకుంటూ. "అదే నేను నడవటానికి ప్రయత్నించినప్పుడు అవి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి. నేను గదిలోకి యెలా వచ్చిందీ మీరు గమనించే వుంటారు. ఈ విషయంలో మీరు నాకు సహాయం చేయగలిగింది యేమైనా వుందా?...." అంటూ ఆమె నన్ను ప్రాధేయపడుతూ అడిగింది.

"మీ కేసు చాలా వింతగా వుంది ... అయినా నేను దీర్ఘముగా పరిశీలిస్తాను. రేపు వుదయం పదిగంటలకు నా గదికి వస్తే మీకు నా సలహాయిస్తాను!" అన్నాను.

ఆమె తన కుర్చీలోనుంచి లేచింది. ఆమె బండి దగ్గరకు వెళ్ళటానికి నేను సహాయం చేసాను. ఆమెలాగా రెండు విధాలుగా ముందుకూ, వెనక్కూ, ప్రక్క-ప్రక్కకు నడవటం నేనెక్కడా చూడలేదు.

"ఆ రాత్రి నేను చాలా వైద్యగ్రంధాలు తిరగేసాను కండరాల జబ్బును గురించి, పూర్తిగా వ్రాసిన ప్రత్యేక గ్రంధము పూర్తిగా చదివాను కాని ఎక్కడ అటు వంటి పాత కేసు నాకు తగలలేదు చివరకు అర్ధరాత్రి వేళ చల్లగాలికోసం నేను వీధులలో తిరగటం మొదలు పెట్టాను దారిలో ఓ జర్మను మిత్రుడు నడుపుతున్న 'స్టోరు'లోకి నేను అడుగుపెట్టాను అతనితో కొంచెముసేపు కబుర్లు చెపుదామని స్టోరు ముందు వున్న కొద్ది పచ్చిక బయలులో, వేరు వేరుగా పరుగెత్తుతున్న రెండు పెంపుడు లేళ్ళను చూసాను. వాటి విషయమేమిటని అడిగాను. అవి రెండూ ఒక దానితో నొకటి పోట్లాడుకోవటం, వలన, వాటిని వేరే వేరే పచ్చిక బయళ్ళలో పెట్టినట్లు చెప్పాడు. అప్పుడు హఠాత్తుగా నా బుర్రలో ఒక ఆలోచన తట్టింది.

"రెండవ రోజున యవ్వనవతియైన ఆ అమ్మాయి నా డిస్పెన్సరీకి

సరిగా పది గంటలకు వచ్చింది. నేను నా సలహాను ఒక చీటిమీద వ్రాసి సిద్ధంగా వుంచాను. అది ఆమె కిచ్చాను. అది చదివిన తర్వాద ఆమె కళ్ళు కొంచెము ఎరుపెక్కాయి. ఆమెకు నా మీద కోపము వచ్చేటంత పన యింది.

"దానిని అమలులో పెట్టి చూడండి మేడమ్" అన్నాను.

"అలాగే అని ఆమె ఒప్పుకొని వెళ్ళి పోయింది. నిన్ననే ఆమె బజారులో నడుస్తుంటే చూసాను. అందరి స్త్రీల లాగానే ఆమె చాలా హుందాగా మామూలుగా గర్వముతో నడుస్తున్నది.

"మీరు ఆమెకేమి సలహా యిచ్చారు? పోస్టు విలేఖరి, డాక్టరుగారిని అడిగాడు.

"ఆమెను 'బ్లూమర్సు' ధరించమని సలహా యిచ్చాను" డాక్టరుగారు సమాధానం యిచ్చారు.

(బ్లూమర్సు అంటే ఆడవాళ్ళు ధరించే వదులైన ట్రాజర్లు మోకాళ్ళ దగ్గర మాత్రం బిగుతుగా వుంటై)

"వ్యతిరేకశక్తులను దేనికి దానికి, వేరు చెయ్యటంలో శాంతి యేర్పడింది 'ఆడమ్స్' మరియు 'రెడ్మాండు' భాగాలు యింక పోట్లాడుకునే ప్రశక్తి లేదు. దానితో నారోగికి మానసిక జబ్బు పూర్తిగా నయమయింది అంటూ డాక్టరు చెప్పడం యింకా ముగించలేదు. "ఇప్పుడు రాత్రి ఏడున్నర గంటలు కావస్తున్నది. ఆమెను నేను ఎనిమిది గంటలకు కలుసు కొంటానని మాట యిచ్చాను. ఇంకో విషయమేమంటే, ఆమె తన పేరును నా పేరుగా మార్చుకోవటానికి ఒప్పుకుంది. ఇప్పుడు చెప్పినదంతా ఒక స్త్రీకి సంభంధించినదీ, అతి గొప్యమైనది కాబట్టి, దానిని మీరు మీపత్రికలో యెక్కించ వద్దని వేడుకొంటున్నాను."

"తప్పకుండా! కాని మీరు యింకో గ్లాసు నిమ్మరసం తీసుకోరూ?" అన్నాడు పోస్టు విలేఖరి.

"లేదు.... లేదు.... నన్ను క్షమించండి.... "అన్నాడు డాక్టరు. హడావుడిగా కుర్చీనుంచి లేస్తూ" నేను యిప్పుడు తప్పక వెళ్ళాలి. గుడ్ ఈవెనింగు. మిమ్మల్ని తిరిగి త్వరలోనే కలుసుకొంటాను, అంటూ డాక్టరు త్వరత్వరగా హోటలునుంచి మాయమయ్యాడు.

—)o(—

హృదయాలూ-హస్తాలూ

(Hearts and Hands)

"డెన్వర్" నగర రైల్వేస్టేషనులో తూర్పునకు ప్రయాణంచేయు "Brin" ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణీకులు ఎక్కుతున్నారు. ఒక పెట్టెలో ఓ అందమైన యువతి ఆసీనురాలయి వుంది. ఆమె మంచి దుస్తులు ధరించింది. ప్రయాణములో అన్ని విలాసములకు అలవాటుపడ్డ ప్రయాణీకురాలిలాగా ఆమె కన్పిస్తున్నది. పెట్టెలోకి యెక్కిన యిద్దరు యువకులలో ఒకడు అందమయిన, నిష్కపటమైన ధైర్యమును ప్రదర్శించు ముఖము గలవాడు. రెండవతను దృఢకాయుడు. అనాగరికమైన దుస్తులు వేసుకున్నాడు. అతని ముఖము దుఃఖముతో కూడి దురుసుగా నున్నది.

వాళ్ళు పెట్టెలోని సీట్ల మధ్యగా నడచి వెళుతున్నారు. ఆ అందమయిన యువతి కెదురుగా వున్న సీట్లు మాత్రమే ఖాళీగా వున్నాయి. ఇక్కడ చేతులకు బిగించిన గొలుసులతో ఆ యిద్దరు యువకులు కూర్చున్నారు. ఆ అందమైన యువతి దృష్టి అయిష్టముగానే వాళ్ళమీద పడింది. ప్రకాశిస్తున్న ముఖముతో, అందమైన చిరునవ్వుతో ఆమె చేతిని ముందుకు చాచింది. ఆమె చేతికి గ్లౌజులు (తొడుగులు) ధరించి వుంది. ఆమె చెక్కులు ఎర్రబడ్డాయి. ఆమె తన మధురమైన నిండు గొంతుతో జాగ్రత్తగా మాట్లాడినప్పుడు అలామాట్లాడటంలో చాలా అనుభవముందనీ, తన మాటలను ఎదుటవారు వినేటట్లు చేయగల చతురురాలు అని గ్రహించగలరు.

"మంచిది ఈస్టన్‌గారూ! మీరు నేనే ముందు మాట్లాడాలనుకుంటే అలాగే తప్పక మాట్లాడతాను" ఆమె అన్నది. "పడమర ప్రాంతములోని మీ పాత స్నేహితులను కలుసుకొన్నప్పుడు మీరు వారిని గుర్తించలేరా?"

అక్కడనే యెదురుగా కూర్చున్న యువకుడు ఈమె కంఠధ్వని వినగానే కొంచెము తొట్రుపాటు పడినా త్వరలోనే సర్దుకొని ఆమె చేతి వ్రేళ్ళను తన ఎడమచేతితో పట్టుకొన్నాడు.

"మీరు మిస్ "ఫెయిర్‌చైల్డు" కదా!" అతను మందహాసముతో అన్నాడు "నా రెండవ చేతిని క్షమించమని మిమ్మల్ని అడుగుతున్నాను. ఎందుకంటే అది ప్రస్తుతం అది వేరే పనిలో నిమగ్నమై వుంది"

అని తన కుడిచేతిని కొద్దిగా పైకి ఎత్తాడు. అది అతని యువకుని ఎడమచేతికి ప్రకాశిస్తున్న యినుప గొలుసులతో కట్టబడి వుంది. ఆ అమ్మాయి మొఖములోని అందమైన చూపులు త్వరలోనే కంగారుపడు తున్న భయం కనబడుస్తున్న చూపులుగా మారినయ్, ఆమె చెక్కిలిలోని కాంతి అదృశ్యమయింది. ఆమె పెదవులు అర్థంకాని పట్టు తప్పుతున్న ఆవేదనతో విచ్చుకున్నాయి

ఈస్టన్ చిరునవ్వుతో ఆమెతో తిరిగి మాట్లాడబోయాడు. కాని అతని బంధితుడు అతనికన్నా ముందుగానే నోరు విప్పాడు.

"అమ్మాయిగారూ! మాట్లాడుతున్నందుకు క్షమించండి. ఈ "మార్షల్"తో బాగా పరిచయమున్నట్లు కనబడుతున్నది నన్ను గురించి ఒక్కమాట యితనికి చెప్తారంటే నేను చెరసాలకు చేరినప్పుడు ఆయన నా తరపున ఒక్కమాట అక్కడ చెబితే అక్కడ నాకు కొంచెము సౌక ర్యముగా వుంటుంది. ఆయన నన్ను "లీవన్‌వర్తు" చెరసాలకు తీసుకు వెళుతున్నాడు. నకిలీ నోట్లను ముద్రించినందుకు నాకు ఏడు సంవత్సర ముల శిక్ష పడింది"

"ఓ! అదా!" ఆ అందమైన అమ్మాయి దీర్ఘంగా వూపిరి పీలుస్తూ రంగు తిరిగి వస్తున్న మొహంతో అంది. "కాబట్టి మీరు యిక్కడ చేస్తున్న ఉద్యోగం 'మార్షలు' అధికారి" అన్నమాట.

"మైడియర్ ఫెయిర్ చైల్డు" ప్రశాంతంగా అన్నాడు ఈస్టను. నేను ఏదో ఒక ఉద్యోగం చేయాలికదా! డబ్బుకు లెక్కలున్నాయి. అది విచ్చలవిడిగా ఖర్చవుతుంది. 'వాషింగ్‌టన్' మహా నగరంలో మన సంఘ ములో బ్రతకాలంటే ధనం యెంతో అవసరం కదా! పడమర ప్రాంతంలో ఈ ఉద్యోగం చిక్కించుకోగల్గాను. కాని 'మార్షలు' ఉద్యోగం 'రాయ బారి' అంత హోదాగల ఉద్యోగం కాదనుకోండి. కాని....

రాయబారి ఉద్యోగం పూర్వపు ప్రాముఖ్యాన్ని కోల్పోయింది. అన్నది ఆ అమ్మాయి సుహృద్భావంతో "పూర్వపు ఔన్నత్యం ఆ పద

విలో లేదు. మీరా విషయం తెలుసు కుంటే మంచిది. కాబట్టి పశ్చిమ ప్రాంతంలో మీరొక 'హీరో'గా మారారన్నమాట. మీ ఉద్యోగంలో అశ్వసవారీ, తుపాకీ కాల్పులు మొదలయిన ప్రమాదాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. 'వాషింగ్‌టన్'లోని విలాసవంతమైన జీవితానికి, ఈ జీవితానికి ఎంతో తేడావుంది. మా సంఘంలో ఒక మంచి మిత్రుని కోల్పోయాము"

ఆ అమ్మాయి కళ్ళు ఎంతో అందంగా ప్రకాశించినాయి. ఆమె తన నేత్రాలు పెద్దవిచేస్తూ తళతళలాడుతున్న ఆ దొంగ చేతులకు వేసిన సంకెళ్ళమీద పడ్డాయి.

బంధితుడయిన రెండో యువకుడు అన్నాడు. "ఈ సంకెళ్ళను గురించి మీరు బాధపడకండి" ఆఅమ్మాయివంక చూస్తూ అన్నాడు. అందరు 'మార్షల్సు' యిలాగే తమ ఖైదీల సంకెళ్ళ గొలుసులను తమ చేతులకు బిగించుకుంటారు. వాళ్లు పారిపోకుండా. ఈస్టన్ గారికి తమ వుద్యోగ ధర్మం నిర్వర్తించటం బాగా తెలుసు".

"మంచిది. ఈస్టన్‌గారూ! మిమ్మల్ని తిరిగి వాషింగ్‌టన్‌లో త్వరలోనే చూస్తాననుకుంటాను" అన్నదా అమ్మాయి.

"త్వరలో కాకపోవచ్చు" అతను అన్నాడు. "నా విలాసమయిన రోజులు అయిపోయినవేమోనని నేను భయపడుతున్నాను"

"పశ్చిమప్రాంతం అంటే నాకు ఇష్టం" ఆ అమ్మాయి సందర్భశుద్ధి లేకుండా అన్నది. ఆమె నేత్రాలు మృదువుగా మెరుస్తున్నాయి. రైలు కిటికీలోనుంచి ఆమె బయటకు చూస్తున్నది. ఆమె తన ఆడంబరాలన్నీ వదలి చాలా నిజాయితీతో సామాన్యురాలిలా మాట్లాడింది. "డెన్వరు"లో మా అమ్మా, నేనూ ఈ వేసవి గడిపాము. మా తండ్రిగారికి జబ్బుగా వుండటం చేత ఆమె మా యింటికి వెళ్ళింది. నాకిక్కడే ఎంతో సుఖంగా వుంది. ఇక్కడ వాతావరణం నాకు సరిపోయింది. లోకంలో ధనమే సర్వస్వం కాదుగదా! కాని ప్రజలెప్పుడూ ఈ విషయాన్ని తప్పుగా అర్ధం చేసుకొంటారు. మూర్ఖంగా ప్రవర్తిస్తారు"

"అయ్యా మార్షల్‌గారు!" దురుసు ముఖంకల ఆ ఖైదీ యువకుడు గోలపెట్టాడు. "ఇదేమీ బాగాలేదు. నాకేదయినా పానీయం త్రాగాలని పిస్తున్నది. ఈ రోజంతా నేను సిగరెట్టు కాల్చనేలేదు. మీరు చాలాసేపటి నుండి మాటలలో మునిగిపోయారు. నన్ను పొగత్రాగే గదిలోకి తీసుకు వెళ్ళండి. ఇప్పటికే సిగరెట్టు త్రాగక సగం చచ్చిపోయాను"

ఆ ఖైదీ యువకునితో పాటు "ఈస్టన్" తన మామూలు చిరునవ్వుతో తన సీటులోనుంచి లేచాడు

"పొగత్రాగాలి అనే అభ్యర్ధనను నేను కాదనలేను అతడు చాలా తేలికగా అన్నాడు. "దురదృష్టవంతులకు అదొకస్నేహితుడు. మిస్ ఫెయిర్ చైల్డు! మీ నుంచి వీడ్కోలు తీసుకుంటాను నా ఉద్యోగధర్మం నన్ను పిలుస్తున్నది" అతడు ఆమెతో కరచాలనానికి తన చేతిని చాపాడు.

"మీరు తూర్పుప్రాంతం పోకపోవడం ఏమీ బాగాలేదు" ఆమె అన్నది తన పూర్వపు విలాసాన్ని, శీఘని తిరిగి తెచ్చుకొంటూ. "కాని మీకు 'లీవెన్‌వర్తు' పోవటం తప్పనిసరి అనుకుంటాను"

"అవును నేను 'లీవెన్‌వర్తు' తప్పక వెళ్ళాలి" అన్నాడు మార్షల్ ఈస్టన్.

వీళ్ళు కూర్చున్న చోటికి దగ్గరలో కూర్చున్న ఇద్దరుప్రయాణీకులు వీరి సంభాషణలోని చాలాభాగం విన్నారు.

"ఆ మార్షల్ అధికారి చాలా మంచివాడిలా వున్నాడు. ఈ పడమటి ప్రాంతంలో కొంతమంది మంచివారున్నారు" అన్నాడు వాళ్ళలో ఒక ప్రయాణీకుడు.

"అంతటి గొప్ప ఉద్యోగం చెయ్యటానికి అతడు చాలా అందమైన చిన్నవాడు గదూ?" అడిగాడు రెండవ ప్రయాణీకుడు.

"చిన్నవాడా?" ఆశ్చర్యం ప్రకటించాడు మొదటి ప్రయాణీకుడు. "ఎందుకని—ఓ! నీ కర్ధంకాలేదా? ఖైదీల సంకెళ్ళకు వేసిన గొలుసును తన కుడిచేతికి బంధించుకొన్న అధికారిని నీవెప్పుడయినా చూశావా?"

—(౦)—

ఓ దిన పత్రిక కథ

(A News Paper Story)

"సంచారి" దిన పత్రికకు మంచి పేరుంది. ఆ వార్తా పత్రిక ప్రజల సమస్యలను తీర్చడంలో ఆరితేరింది. అది ప్రజలకు ఒక మార్గదర్శిగా, ప్రజల కష్టాలను ప్రతిబింబించే పత్రికగా ప్రతి గృహములోనూ, ఒక అవసరమైన వస్తువుగా అశేషమైన కీర్తిని గడించింది.

ఆ పత్రికలో వచ్చిన మూడు సంపాదకీయాలు ప్రజానీకంలో అద్భుతమైన కీర్తిని సంపాదించి పెట్టాయి. మొదటి సంపాదకీయము పాఠశాలలో, పిల్లలకు శారీరక శిక్షను నిరసిస్తూ, వుపాధ్యాయులకు, పిల్లల తల్లిదండ్రులకు, సరళమైన పవిత్రమైన అద్భుతమైన పదజాలముతో చేసిన హెచ్చరిక!

ఒక శ్రామిక నాయకుడికి పారిశ్రామిక సంస్థలలో సమ్మె చెయ్యాలి అంటూ కార్మికులను వుద్రేక పరుస్తూ యిచ్చిన వుపన్యాసములను ఖండిస్తూ తీవ్ర పదజాలములతో, కూర్చినవి ఆ పత్రిక రెండవ సంపాదకీయం.

మూడవ సంపాదకీయము, నగర రక్షకభటులు తమ విధులను సరిగానూ సమర్థతతోనూ' నిర్వర్తిస్తూ, ప్రజల ఆస్తులకు రక్షకులుగా వుండిటానికి ప్రజలు వారి కివ్వవలసిన సహాయ సహకారములను గురించి.

ఈ మూడు సంపాదకీయాలూ, ప్రజలలో మంచి మెప్పునూ సంపాదించుకొన్నాయి.

ఆ పత్రికలో సంపాదకుడు ప్రజల సాంఘిక సమస్యలను గురించి, వాటికి నివారణోపాయాలు సూచించే ఒక ప్రత్యేకమైన శీర్షికను ప్రవేశ పెట్టాడు. యవ్వనంలో వున్న ఒక యువకుడు, తన భార్యయొక్క మూఢ

విశ్వాసాలను గురించి పేర్కొంటూ ఆమె తన విశ్వాసాలను విడనాడి తనను ప్రేమించే మార్గము చెప్పమంటూ వ్రాసిన సమస్యకు సమాధానం ఆరోజు వుదయం యెనిమిది గంటలకు విడుదలైన 'సంచారి' దినపత్రికలో వుంది.

యవ్వనవతియైన యింకో సుందరి, తన కళ్ళయొక్క కాంతిని మెరుగు పరచటానికి తన చెంపలు గులాబీ రంగుతో మెరవటానికీ, తన ముఖము అందముతో కళకళ లాడుతూ వుండటానికీ అడిగిన చిట్కాకు సమాధానము కూడా ఆ రోజు 'సంచారి' దిన పత్రికలో వుంది.

"స్వవిషయము"నకు సంబంధించిన కాలములో ఒక ప్రకటన యిలా వుంది!

"ప్రియమైన జాక్!" నన్ను క్షమించు! నీదే సరియైన పద్ధతి! ఈ రోజు వుదయం 8-30కు మెడిసన్ గొందులో నన్ను కలుసుకోవలసింది. సాయంకాలము మనము అనుకోన్న చోటికి వెళ్ళిపోదాము.

'పశ్చాత్తాపము చెందిన

నీ ప్రియురాలు'

ఆ వుదయం సరిగా 8-00 గంటంకు నిర్లక్షపు చూపుతో, యేదో సమస్యతో బాధపడుతున్నట్లు కనబడుతున్న ఓ యువకుడు "సంచారి" దిన పత్రిక అమ్మే దుకాణంలో ఓ పెన్నీ యిచ్చి ఆ పత్రికను కొన్నాడు. రాత్రి అంతా అతనికి నిద్రలేకపోవటం చేత అతను వుదయం ప్రొద్దు పోయి లేచాడు. తొమ్మిదిగంటలకే, తను వుద్యోగము చేసే కార్యాలయానికి చేరవలసి వుండటం చేత ఆ పత్రికను మధ్యాహ్నపు భోజన వేళలో చద వాలనుకొని, దానిని తన ప్యాంటు ప్రక్క జేబులో పెట్టుకొని రోడ్డుమీద హడావుడిగా నడుస్తున్నాడు. ఇంకొక వీధిలోకి, అతడు చేరుకునేలోగా ఆ పత్రిక అతని జేబులోంచి చేతులకు తొడుగుకొనే రబ్బరు తొడుగులతో సహా జారి, రోడ్డుమీద పడిపోవటం. అతడు గమనించలేదు. అతడు యింకా కొన్ని వీధులు దాటిన తర్వాతగాని, తన పేపరూ చేతి తొడుగులు

జారిపోయిన సంగతి గమనించలేదు. అప్పుడతడు విసుక్కొంటూ వెనక్కి తిరిగి, వచ్చిన దారినే నడవసాగాడు.

ఒక అరగంటలో అతను తన పత్రిక గ్లౌజులు పడిపోయిన చోటికి చేరుకొన్నాడు. అక్కడ ఓ అందమైన యువతి నిల్చొని వుంది. ఆమె మంచి యవ్వనంలో వుంది. ఆమె నేత్రాలలో పశ్చాత్తాపము తొంగి చూస్తున్నది. ఆమెని చూడగానే అతని హృదయము ఆనందముతో గంతులు వేసింది. అతడామెను సమీపించి, ఆమె చిన్న చేతులను పట్టుకొని అందమైన ఆమె రాగి వన్నె గల నేత్రాలలోకి చూస్తూ వుండి పోయాడు. ఆశ్చర్యముగా అతడు వేటికోసం వెతుకుతూ వచ్చాడో ఆ సంగతి మర్చి పోయాడు.

"ప్రియమైన జాక్! నాకు తెలుసు నీవు ఈ స్థలములో నిర్దేశింపబడిన సమయానికి వుంటావని....!" ఆమె అన్నది. "ఆమె యేమంటున్నది?" అని ఆ యువకుడు స్వగతంగా అనుకొన్నాడు. పైకి మాత్రము "అది సరే అది సరే...." అన్నాడు.

పడమటి నుంచి పెద్దగాలి వీచి రోడ్డుమీద పడివున్న దినపత్రికను, గాలిలోకి ఎగురవేసి ప్రక్కనేవున్న మరొక వీధిలోకి పడ వేసింది. ఆ వీధిలో ఒక నవయువకుడు ఒంటి గుఱ్ఱపు బండిని తోలుతున్నాడు. ఆ గుఱ్ఱము చాలా నిర్లక్ష్యముగా బండిని లాగుతున్నది. 'సంచారి' పత్రికలో తన ప్రియురాలు తనను ప్రేమించే విషయము చెప్పమని, ఆ పత్రికలోని 'వ్యక్తి గత విషయము' శీర్షికను వ్రాసింది ఆ యువకుడే.

ఆ ఈదురుగాలి నిర్లక్ష్యంగా వీస్తూ, ఎగురుతున్న ఆ దినపత్రికను ఆ యువకుడు తోలుతున్న బండికి కట్టిన గుర్రం మొఖం మీద కప్పింది. దానితో ఆ గుర్రము బెదిరి పెద్దగా ఘీంకారము చేస్తూ, అమిత వేగముతో, నాలుగు వీధులు దాటింది. అరుణ వర్ణ ముతో కలిగియున్న, పొడుగైన ఓ జలప్రవాహము నాలుగు బ్లాకులలోనూ పరుచుకొని వుంది. ఈ వింత ప్రపంచములో ఒక నీటి పంపు తన పాత్రను నిర్వహించింది. ఆ వీధి

7)

పంపుకు గుర్రపు బండి కొట్టుకొని ముక్కలు ముక్కలైంది. ఆ బండి కొట్టుకొన్న విసురుకు బండిని తోలుతున్న యువకుడు, రోడ్డుమీద ఒక పెద్ద భవనము ముందు పడిపోయాడు.

ఆ యింటిలోనివారు వచ్చి, ఆ యువకుని లోపలికు తీసుకువెళ్ళి, మంచం మీద పరుండ పెట్టారు. ఓ అందమైన యువతివచ్చి ఆయన తల క్రిందట ఓ దిండు తీసుకొచ్చి పెట్టింది.

"ఓ! మీరేనా? బాబీ! మీరేనా యింత అఘాయిత్యానికి ఒడిగట్టింది. మీరు చనిపోయినట్టయితే నాగతి యేమయ్యేది ? అయ్యో భగవంతుడా ! ఎంత ఆపద తప్పించావు?" అంటూ రోదించటం మొదలు పెట్టింది.

మనమింక ఆ ప్రేమికులనక్కడే వదిలి ఆ యెగిరి పోతున్న "సంచారి" పత్రికను వెంబడిద్దాము. అది ఓ రక్షక భటుని కంటపడింది. అతడు దానిని పట్టుకొని ఆపి తన చిన్న వేళ్ళతో ఆ పత్రిక పేజీలను త్రిప్పిచూస్తున్నాడు. అతడు ఓ ప్రఖ్యాతమైన విస్కీ సెలూనువద్ద కుటుంబ సభ్యులు ప్రవేశించే ద్వారము దగ్గర నిలబడ్డాడు. అతడు ఆ దినపత్రికలోని ఓ పెద్ద శీర్షికను ఆలోచిస్తూ చదివాడు.

"రక్షక భటులకు సహాయం చేయుటలో దినపత్రికల ముందంజ!" అని.

కాని ఎంత తమాషా! ఆ తలుపు సందులోంచి సెలూను సర్వరు మాటలు వినిపించాయి. "పోలీసుగారూ! ఇదిగో మీ మామూలు విస్కీ!" అంటూ.

వెంటనే ఆ రక్షక భటుడు త్వరగా తన విస్కీగ్లాసు అందుకొని, దానిని ఖాళీచేసి హుషారుగా ముందుకు సాగి పోయాడు.

తమాషాకు అతడు ఆ పత్రికను మడిచి దారినపోతున్న ఓ కుర్రవాడి చంకలో యిరికించాడు. ఆ పిల్లవానిపేరు "జానీ" అతడు ఆ పత్రికను యింటికి తీసుకుని వెళ్ళాడు. అతని సోదరి పేరు గ్లాడీ. ఆ అమ్మాయి "సంచారి" పత్రికలోని "అందమునెట్లా పెంచుకోవాలి" అనే శీర్షికకు తన

ప్రశ్న పంపింది. అది ఆమె పంపించి కొన్ని వారాలయింది. ఇంక పత్రిక వారు సమాధానము యివ్వరనే భావంతో పత్రికను చూడడం మానేసింది.

"గ్లాడీ" యొక్క ముఖపురంగు అందంగా వుండదు. ఆమెకళ్ళల్లో కాంతిలేదు. ఆమె ముఖంమీద యెప్పుడూ అసంతృప్తి తాండవమాడుతుంది. దుకాణంలో జుట్టు సవరం తెచ్చుకొందామని బయలుదేరింది. తమ్ముడు తెచ్చిన పత్రికలోని తనకు కావలసిన రెండు పేజీలు గౌనుక్రింద దాచుకొంది. ఆమె నడుస్తుంటే, ఆమె ధరించిన సిల్కుగౌను ఓ విధమైన, అందమైన శబ్దము చేస్తున్నది.

ఆమె వీధిలోకి వెళ్ళగానే క్రింది అంతస్థులోని ఓ అందమైన అమ్మాయిని....రాగిరంగు ముఖంతో వున్న అమ్మాయిని కలిసింది. 'గ్లాడీ' నడుస్తున్నప్పుడు కలుగుతున్న శబ్దానికి కారణం, ఆమె ధరించిన... ఖరీదైన....మీటరు అయిదు డాలర్ల చొప్పున కొన్న సిల్కు గుడ్డే....! అని ఆ అమ్మాయి తెలుసుకొంది. "గ్లాడీ"ని చూసి అసూయతో ఆమెను గురించి యేవో నిందాపూర్వకమైన మాటలు అని, మూతి విరుచుకొంటూ తనదారిన పోయింది.

అందమైన గులాబీ పుష్పాలు వికసించినట్లుగా "గ్లాడీ" చెంపలు అరుణకాంతితో మెరిసిపోయినై. ఒక మధురమైన మందహాసం ఆమె ముఖానికి అందము తెచ్చిపెట్టింది. ఇప్పుడామె మనోహరమైన సుందరి కాదని యెవ్వరనగలరు? ఆ పత్రికలోని "అందము నెలా పెంచుకోవాలి" అనే శీర్షికను నడిపే ఎడిటరు అప్పుడామెను చూసి వుంటే యెంత బావుండేది? ఆ పత్రికలో ఆమె ప్రశ్నకు యేదో సమాధానము వుండి వుంటుంది.

"ఇతరులను గురించి మనకు మంచి భావములు వుంటే మన ముఖముగూడా అందముగా ప్రకాశిస్తుంది" అని కావచ్చు బహుశా.

'సంచారి' పత్రిక సంపాదకీయములో విమర్శించబడిన కార్మిక నాయకుడు ఈ 'గ్లాడీస్', 'జానీ' పిల్లల తండ్రే! అతడు తన యింట్లో, ఆ పత్రికలో మిగిలిన పేజీలను చూసాడు. అతని దృష్టి దానిలో తనను విమర్శించిన సంపాదకీయము జోలికి పోలేదు గాని మరొక పేజీలోని ఒక

"పజిల్" (సమస్య) అతని దృష్టిని ఆకర్షించింది. వెంటనే అతడు కలము, కాగితము తీసుకొని దానిని పూరించే ప్రయత్నములో మునిగి పోయాడు. ఎందుకంటే ఆ "పజిల్" సామాన్యుని....సన్యాసిని గూడా ఆకర్షించే విధముగా వుంది.

అక్కడ కార్మికులు సమ్మె చెయ్యాలని నిర్ణయించుకొన్న కర్మాగారముల దగ్గర ఈ కార్మిక నాయకునికోసం మూడుగంటలు వేచియున్న అనంతరము మద్దుని యిచ్చగించని యితర నాయకులు అధికారులతో సంభాషణలు సామరస్యముతో జరిపి, వారి వలన కొన్ని లాభములుగూడా పొంది సంధి కుదుర్చుకొన్నారు. కాబట్టి అపాయములతో కూడిన సమ్మె ఆగిపోయింది. తర్వాత వచ్చిన పత్రిక సంచికలలో ఈ కార్మిక నాయకుని చర్యలను గర్హించి విజయముతో సమ్మె నాపినందులకు కార్మికులను ప్రశంసిస్తూ రంగు రంగుల శీర్షికలతో వార్త ప్రచురించబడింది.

పత్రికలోని యితర పేజీలలోని వార్తలు గూడా తమ నిజాయితీని ప్రదర్శించుకొన్నాయి యిదే విధంగా.

"జానీ" తన పాఠశాల నుంచి తిరిగి రాగానే ఓ ప్రత్యేకమైన ఏకాంత ప్రదేశములో తన వద్ద దాచుకొన్న 'సంచారి' పత్రికలోని పేజీలను తీసి చదివాడు. అందులోని సంపాదకీయములో పిల్లలను శారీరకముగా శిక్షించటం మంచిది కాదంటూ, ఎడిటరుగారు పిల్లల వుపాధ్యాయులకు, వారి తల్లిదండ్రులకు చేసిన హెచ్చరిక అతనికి యెంతో నచ్చింది.

"జానీ" ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. ఒక విషయములో అతడు వుపాధ్యాయునితో తగాదా పడవలసి వచ్చింది. ఇప్పుడీ పత్రికలో వ్రాసిన సంపాదకీయం అతనికి చాలా ప్రోత్సాహము కలగ చేసింది.

ఆ సంపాదక ప్రభావము ఆ వుపాధ్యాయుని మీద తప్పక వుంటుందనటంలో సందేహము లేదుగదా!

ఈ పై సంఘటనల తర్వాత పత్రికలకు, ప్రజల మీదవున్న అధికారమును యెవరన్నా శంకించగలరా?

—)o(—

వెయ్యి డాలర్లు
(One Thousand Dollars)

"ఒక వెయ్యి డాలర్లు!" నిజాయితీతో కూడిన తీవ్రమైన స్వరముతో అన్నాడు లాయర్ 'టోల్‌మాన్, "ఇదిగో డబ్బు!"

యాభై డాలర్ల నోట్లను లెక్కిస్తూ, యువకుడైన గిలియన్ మందహాసము చేసాడు.

"అవి చాలా యిబ్బంది పెట్టేటువంటి సొమ్ము మొత్తము!" అతడు లాయరుతో వుత్సాహంతో అన్నాడు. "అదే గనుక పదివేల డాలర్లు అయినట్లయితే యే టపాకాయల వ్యాపారంలోనో పెట్టుబడి పెట్టవచ్చు. గౌరవంగా బ్రతకవచ్చు. అదే యాభై డాలర్లు అయినా కూడా అంతకష్ట ముండదు."

"మీరు మీ మామగారి వీలునామాలోని విషయాలను సరిగా అర్థం చేసుకొన్నారనుకొంటాను" అన్నాడు లాయర్ "టోల్‌మాన్" "నేను మీకొక విషయం మళ్ళీ జ్ఞాపకం చెయ్యాల్సి వస్తున్నది· అదేమిటంటే ఆ డబ్బును మీరు ఖర్చు పెట్టగానే దానినెలా ఖర్చు పెట్టిన వైనము మాకు వివరాలు యివ్వాలి. వీలునామాలోని విషయమది. మీరు మరణించిన మీ మామ మిస్టర్ గిలియన్‌గారి కోరికను తీరుస్తారని నమ్ముతున్నాను."

"మీరు ఆ విషయంలో నా మీద పూర్తి నమ్మకముంచవచ్చు" అన్నాడు గౌరవంతో, యువకుడైన గిలియన్ "దాని కోసం నాకు అదనపు ఖర్చు అయినా ఫరవాలేదు. ఎందుకంటే లెక్కలు నాకు సరిగా రావు గనుక, అందుకోసం ప్రత్యేకంగా ఒక సెక్రటరీని పెట్టుకోవాల్సి వుంటుంది."

అంటూ గిలియన్ ఆ క్రొత్త నోట్లను తన జేబులో కుక్కుకొని, తన క్లబ్‌కు వెళ్ళాడు. అక్కడ తనకు కావలసిన "ఓల్డుబ్రైసన్" అనే పెద్ద మనిషిని కలుసుకొన్నాడు.

"ఓల్డుబ్రైసన్! మేలుకోవయ్యా బాబూ! నేను నీకో తమాషా కథ చెప్పాలి!" అన్నాడు గిలియన్.

"మహానుభావా! నువ్వు నీ కథలను 'బిలియర్డ్సు' గదిలో యెవరికన్నా చెప్పు! నీ కథలను నేనెలా ద్వేషిస్తానో తెలుసుకదా!" అన్నాడు ఓల్డుబ్రైసన్.

"అయ్యా! మామూలు కథలకన్నా వేరైనకథ యిది!" సిగరెట్టు వెలిగించుకొంటూ అన్నాడు గిలియన్. "ఆ కథ నీకే చెప్పాలి. గజిబిజి చప్పుడు గలాటాగా వుండే ఆ బిలియర్డ్సు గదిలోకి వెళ్ళాలంటే నాకు తమాషాగానే కాదు దుఃఖంగా గూడా వుంటుంది. మా మామగారి లాయర్ల ఆఫీసు నుంచి నేనిప్పుడే వస్తున్నాను. ఆయన నాకు వెయ్యిడాలర్లు యియ్యమని వీలునామా వ్రాశాడు. వెయ్యిడాలర్లతో ఒక మనిషి యేమేమి చెయ్యగలడో నీవు నాకు చెప్పాలి."

"మీ మామగారైన కీర్తిశేషుడు "సెప్టియస్ గిలియన్" ఎంత లేదనుకొన్నా అయిదులక్షల డాలర్ల కన్నా అధిపతి అయివుంటాడనుకొన్నానే!" అన్నాడు బ్రైసన్. తేనెటీగలు తమ తేనెచుట్టమీద చూపించే ఆసక్తి కనపరుస్తూ.

"అది నిజమే!" గిలియన్ సంతోషంగా ఒప్పుకున్నాడు. "అక్కడే వుంది తమాషా! అతడు ఒక ఓడనిండా పట్టేటన్ని పాత అమెరికన్ బంగారు నాణేలు ఒక "సూక్ష్మజీవి"కి ధారాదత్తం చేసాడు. అంటే ఓ క్రొత్త సూక్ష్మజీవిని... రోగక్రిమిని ఎవరయితే కనిపెట్టారో అతనికిదానిలో కొంత భాగం పోతుంది. మిగతాది ఆ సూక్ష్మజీవులను నాశనం చేసే ఆస్పత్రిని నిర్మించటానికి పోతుంది. అవి పోగా ఒకటి రెండు చిన్న దానాలు వున్నాయి. వంటవానికీ, హౌస్‌కీపరుకు ఒక్కొక్కరికీ పదిడాలర్లు ఒక సీలు చేసిన వుంగరమూ వస్తాయి. అతని మేనల్లుడికి వెయ్యి డాలర్లు వస్తాయి...."

"ఎలాగయినా నీకు ఖర్చుపెట్టడానికి బోలెడంత ధనమున్నదిగదా!" బ్రైసన్ గుర్తు చేసాడు.

"అవును నా దగ్గర టన్నుల ధనముంది" అన్నాడు గిలియన్. "కాని ఈ వారసత్వపు డబ్బుకు అధిపతి మా మామయే గదా!"

"ఇంకెవరయినా వారసులున్నారా?" బ్రైసన్ అడిగాడు.

"ఎవ్వరూలేరు" అంటూ గిలియన్ సిగరెట్టు మీద తన కోపం చూపిస్తూ ఆ గదిలోని సోఫామీద పై తోలు కవరుని కాలితో తన్నాడు. "నా మామగారి రక్షణలో ఆయన యింట్లో వుండే 'మిస్ హేడెన్' అనే అమ్మాయి వుంది. ఆమె చాలా నెమ్మదయిన అమ్మాయి. మంచి అమ్మాయి. ఆమె మా మామగారి దురదృష్టవంతుడయిన స్నేహితుని కుమార్తె. చెప్పటం మర్చాను. ఆమెకు కూడా ఓ సీలు చేసిన ఉంగరం చెందుతుంది. నాకు గూడా అవి యిచ్చివుంటే బావుండేది. వాటితో రెండు సీసాలు విస్కీ కొని బట్లరుకు రింగు బహుమానంగా యిచ్చి నా చేతులు దులుపుకొని వుండేవాడిని. ఏదో గొప్పగా అనుకొని నన్ను అగౌరవించవద్దు. ఓల్డు బ్రైసన్! దయచేసి చెప్పు. ఈ వెయ్యి డాలర్లతో ఒక వ్యక్తి ఏం చెయ్యగలడూ?" అన్నాడు గిలియన్ను.

ఓల్డుబ్రైసన్ తనకళ్ళ అద్దాలను గుడ్డతో తుడుచుకుని మందహాసం చేశాడు. అతడు నవ్వాడంటే అతడింకా తనను రెచ్చగొట్టేటట్లు మాట్లాడతాడని గిలియన్‌కు తెలుసు.

ఒక వెయ్యి డాలర్లు! అతడు అన్నాడు. "ఎక్కువ కావచ్చు.... తక్కువ కావచ్చు! ఒక వ్యక్తి దానితో ఒక మంచి యిల్లు కొనుక్కో గలడు. 'రాక్‌ఫెల్లరు' ను గూడా యెగతాళి చెయ్యగలడు. ఇంకోడు ఆ డబ్బుతో తన భార్యను వైద్యానికి దక్షిణానికి పంపి ఆమె ప్రాణం కాపాడుకో గలడు. జూన్, జూలై, ఆగస్టు నెలలలో వెయ్యి డాలర్లతో ఒక వంద బేబీలకు సరిపోయే పాలుకొని ఒక యాభయిమంది ప్రాణాలు కాపాడవచ్చు. ఒక మంచి పిల్లవానికి ఆ డబ్బుతో చదువు చెప్పించవచ్చు. ఓ గొప్ప కళామందిరంలో ఆ డబ్బుతో ఓ అరగంట హాయిగా వినోదించ

వచ్చు. ఆ డబ్బుతో నీవు క్రొత్త 'హాంప్షైర్' పట్టణంలో రెండు సంవత్సరాలు జీవనం గడపవచ్చు"

"ఆ డబ్బుతో ఒక సాయంకాలము 'మెడిసన్ స్క్వేర్ గార్డెను' అద్దెకు తీసుకొని ప్రేక్షకులకు ఉపన్యాసం యివ్వవచ్చు. వారసత్వపు ఆస్తి అనుభవించటంలో వున్న చిక్కులను గురించి....

"ఓల్డు బైసన్!" గిలియన్ ఎప్పటిలాగే మర్యాదతో అన్నాడు. నీవు నీతులు చెప్పకుండా వుంటే ప్రజలు నీవంటే యిష్టపడవచ్చు. కాని నేను ఆ వెయ్యి డాలర్లతో యేమి చెయ్యగలను అని నిన్ను అడుగుతున్నాను"

"నేనా?" అంటూ చిన్నగా నవ్వి అన్నాడు బైసన్. "గిలియన్ బాబూ! సరిగా చెప్పాలంటే ఒక్కటే మార్గముంది. దానితో మిస్ లోలా లారియర్‌కు ఒక డైమండు హారం కొని "ఇడావో" కి వెళ్ళి అక్కడ ఒక గొర్రెల మందను పెంచవచ్చు. 'గొర్రె' అని ఎందుకంటున్నానంటే అదంటే నాకు యిష్టంలేదు గనుక"

"థాంక్యూ" అక్కడినుంచి లేస్తూ గిలియన్ను అన్నాడు. "నేను నువ్వు చెప్పే ఆలోచనను నమ్ముకొందా మనుకున్నాను. కాని వూరికే నా ఆలోచనల నెగతాళి చేస్తున్నావు. నేను డబ్బంతా ఒకేసారి ఖర్చు పెట్టాలనుకుంటున్నాను....చిల్లరగా ఖర్చుపెట్టి దాని జాబితా వ్రాయడం నా కిష్టం లేదు"

గిలియన్ ఫోనుచేసి టాక్సీ తెప్పించుకొని డ్రయివరుకు చెప్పాడు. "కొలంబియా థియేటరు ప్రవేశద్వారం దగ్గరకు పోనీయ్" అని.

ఆ సమయంలో మిస్ లోలాలారియల్ జనంతో క్రిక్కిరిసిన ఒక 'మ్యాటినీ'కి పోవటానికి పౌడరు అద్దుకొని తయారవుతున్నది. అప్పుడామె పరిచారిక మిస్టర్ గిలియన్ వచ్చినట్లు చెప్పింది.

"ఆయనను లోపలకు రానియ్యి" అన్నదామె.

"గిలియన్‌గారూ! రెండు నిమిషాలలో నేను బయటికి పోబోతున్నాను మీ పనేమిటి?"

"కొంచెం నేను చెప్పేది విను" గిలియన్ బ్రతిమాలాడు. "నా కోసం రెండు నిమిషాలు ఖర్చు చెయ్యి. నేను ఒక హారం కొనటంలో నీ ఉద్దేశ్య మేమిటి? మూడు సున్నాల ముందు ఒక అంకెతో డబ్బు నేను ఖర్చు పెట్టగలను"

"మంచిది. నీవు చెప్పినట్లే కొనవచ్చు" మిస్ లారియల్ సంతోషముగా పాడుతూ అంది. "నా కుడి భుజమయిన 'డెల్లాస్టీన్' క్రిందటి రాత్రి ధరించిన మెడలో హారాన్ని చూసావా? జపానీలో అది రెండువేల రెండువందల డాలర్ల ఖరీదయింది"

"మిస్ లారియల్! కోరస్ పాటకు అంతా సిద్ధంగావుంది" బయటి నుంచి కాల్‌బాయ్ కేకేసాడు.

గిలియన్ అక్కడినుంచి నిష్క్రమించి బయట వేచియున్న తన టాక్సీ దగ్గరకు వెళ్ళాడు.

"నీ దగ్గర వెయ్యి డాలర్లు వుంటే యేం చేస్తావు?" గిలియన్ డ్రయివరును అడిగాడు.

"విస్కీ సెలూన్ తెరుస్తాను" వెంటనే బొంగురుగొంతుతో సమాధానం చెప్పాడు డ్రయివర్ "రెండుచేతులా డబ్బు సంపాయించే చోటు నాకు తెలుసు. అది ఒక వీధిలో నాలుగంతస్థుల భవనం. నేనప్పుడే ఆలోచించి పెట్టుకొన్నాను. రెండవ అంతస్థులో రకరకాల మాంసపు వంటలు తయారుచేసే హోటలు. మూడవ అంతస్థులో చేతివ్రేళ్ళకు రంగులువేసే శాల, మరియు విదేశీయులకు వైద్యం సహాయంచేసే ఆసుపత్రి పెడతాను. నాల్గవ అంతస్తులో ఊతకొట్టే పిన్నకోలను కట్టిస్తాను. మీరు మీ ధనాన్ని పెట్టుబడి పెట్టదలచుకొంటే—" ఆగిపోయాడు డ్రయివర్.

"లేదు....లేదు...." అన్నాడు గిలియన్. "నేను వూరికే ఆత్రంతో అడిగాను. నీకు గంటల ప్రకారం బాడుగ యిస్తాను. నేను ఆపమనేదాకా కారు నడుపుతూ వుండు"

'బ్రాడ్ వే'లో ఎనిమిది బ్లాకులు దాటిన తర్వాత గిలియన్ కారులో నుంచి దిగాడు. మనుషులు నడిచేబాట మీద వో స్టూలుమీద కూర్చొని ఒక అంధుడు పెన్సిళ్ళు అమ్ముతున్నాడు. గిలియన్ వెళ్ళి అతనిముందు నిలుచున్నాడు.

"ఇదిగో యిటు చూడు!" గిలియన్ అన్నాడతనితో. "నీకొక వెయ్యి డాలర్లు వున్నట్లయితే యేమి చేస్తావో చెప్తావా" అతనిని అడిగాడు.

"ఇప్పుడే యిక్కడికి వచ్చిన టాక్సీలోనుండి మీరు దిగారుకదూ?" ఆ గ్రుడ్డి అతను అడిగాడు.

"అవును" గిలియన్ అన్నాడు.

"పగటిపూట సూర్యకాంతితో మీరు ఆ కారులో ప్రయాణం చేయడం బాగా వుందనుకొంటున్నాను నేను" అతడు అన్నాడు. "మీకు ఓపిక వుంటే ఇది చూడండి"

అతడు తన కోటు జేబులోనుంచి ఒక చిన్నప్యాకెటు పుస్తకంతీసి చేతిలో పట్టుకున్నాడు. గిలియన్ అది తెరచిచూచి బ్యాంకు డిపాజిట్ పుస్తకంగా గుర్తించాడు దానిలో అతని ఖాతాక్రింద 1785 డాలర్లు వున్నట్లుంది.

గిలియన్ మాట్లాడకుండా ఆ పుస్తకం అతని కిచ్చివేసి తిరిగి కారులో కూర్చున్నాడు.

"నేనొక సంగతి మర్చిపోయాను. నీవు 'టోల్మాన్ అండ్ షార్ప్' 'లా' కార్యాలయానికి నన్ను తీసుకుని వెళ్ళు... అది బ్రాడ్వేలో వుంది."

లాయర్ల కార్యాలయంలో లాయర్ టోల్మాన్ తన బంగారపు ఫ్రేము కళ్ళద్దాలగుండా గిలియన్ వంక శత్రుభావంతోనూ, ప్రశ్నార్థకంగానూ చూసాడు.

"నన్ను క్షమించండి లాయరుగారూ!" గిలియన్ ఉత్సాహంగా అన్నాడు. "కాని మిమ్ములను నేనొక ప్రశ్న అడగవచ్చునా?" అది

మూర్ఖపు ప్రశ్న కాదనుకుంటాను. ఆ ఉంగరము 10 డాలర్లు కాక "మిస్ హెడెన్"కు మా మామగారు యింకా ఏమన్నా వ్రాసివ్వారా?"

"ఏమీ లేదు!" అన్నాడు టోల్‌మాన్.

"చాలా కృతజ్ఞుణ్ణి!" అంటూ అక్కడి నుంచివచ్చి తిరిగి తన అద్దె టాక్సీలో కూర్చున్నాడు. డ్రైవరుకు తన కీర్తిశేషుడైన, మామ అడ్రెసు యిచ్చాడు.

లైబ్రరీలో కూర్చొని 'మిస్ హెడెన్' వుత్తరాలు వ్రాసు కొంటున్నది. ఆమె చాలా సన్నగా, చిన్నదిగా వుంది. ఆమె నల్లటి దుస్తులు ధరించింది అతడు ఆమె కళ్ళలోకి చూడ లేదు. ఈ ప్రపంచంలో తనకు సంబంధము లేనట్లుగా గిలియన్ ఆమెను సమీపించాడు.

"నేనిప్పుడే లాయరు 'టోల్‌మాన్' కార్యాలయం నుంచి వస్తున్నాను. "అతడు ఆమెకు చెప్పాడు." వాళ్ళు మామ వీలు నామా కాగితాలు పరిశీలిస్తున్నారు. వాళ్ళకు ఒక.... "గిలియన్ సరియైన న్యాయ పరి భాష లోని పదం కోసం ఆగాడు...." సవరణలాంటిది తర్వాత వ్రాసినది. అటు వంటిదే.... వీలునామాలో.... కనుక్కొన్నారు. ఆ ముసలాయన తన రెండవసారి ఆలోచనలో తన మొదటి అభిప్రాయం మార్చుకొని మీకు వెయ్యిడాలర్లు తన వీలునామాలో వ్రాశాడు. నేనిప్రక్కగా వస్తుంటే ఆ డబ్బు మీకిమ్మని లాయరు 'టోల్‌మాన్' చెప్పాడు. ఇదిగో ఆ వెయ్యి డాలర్లు! సరిగా వుందేమో లెఖ్ఖపెట్టండి!"

అంటూ ఆమె డెస్కుముందు తన జేబులోనుంచి వెయ్యిడాలర్లు యాభై డాలర్లు నోట్లు అన్నీ .... తీసి వుంచాడు.

మిస్ హెడెన్ ముఖంలో కళ వచ్చింది. "ఓఁ ఆమె అన్నది. మళ్ళీ "ఓఁ" అంది గిలియన్ వంక సగం తిరిగి కిటికీలోంచి బయటికి చూసింది.

"నేను అనుకొంటున్నాను." గిలియన్ చిన్న గొంతుతో అన్నాడు. "నేను మిమ్ములను ప్రేమిస్తున్నానని మీకు తెలుసనుకొంటాను."

" నాకు చాలా విచారంగా వుంది" అన్నది మిస్ హేడెన్ ఆ డబ్బు తీసుకొంటూ.

"ఇంకేమీ అవకాశం లేదా?" గిలియన్ ఆమెను అతి తేలిక హృదయంతో అడిగాడు.

"నేను విచారపడుతున్నాను." ఆమె తిరిగి అంది.

"నేను ఒక చిన్న విజ్ఞాపన వ్రాసుకోవచ్చునా?" అడిగాడు గిలియన్ చిరునవ్వుతో.

లైబ్రరీ టేబిలు ముందు అతడు కూర్చున్నాడు అతనికి కాగితమూ, పెన్సిలూ, యిచ్చి లోపలికి వెళ్ళిపోయింది.

గిలియన్ను 'వెయ్యిడాలర్లు' ఖర్చు పెట్టిన వివరం యిలా వ్రాశాడు. శాశ్వతమైన స్వర్గసుఖం కోసం భూమిమీద తనకు ప్రియాతి ప్రియమైన స్త్రీకి గొప్పెలా నల్లగా వుండే రాబర్టు గిలియన్ వెయ్యి డాలర్లు చెల్లించాడు" అని.

ఆ 'నోట్'ను కవరులో వుంచి, ఆమెకు నమస్కారం చేసి తన దారిన వచ్చాడు.

అతడి టాక్సీ తిరిగి 'టోల్‌మాన్ షార్ప్' వారి 'లా' కార్యాలయం ముందు ఆగింది.

"నేను వెయ్యిడాలర్లు ఖర్చు పెట్టేసాను" బంగారపు ఫ్రేము కళ్ళద్దాలతో వున్న 'టోల్‌మాన్'కు గిలియన్.... సంతోషముగా చెప్పాడు. దానిని గురించి మనము మొదట అనుకొన్నట్లుగా ఆ ఖర్చు వివరం యివ్వటానికి వచ్చాను. ఇక్కడ వెచ్చగా, వేసవి వాతవారణం వుంది కదా?" అతడు తన కవరును లాయరుగారి బల్లమీదకు విసిరి వేశాడు. "దానిలో నేను ఖర్చు పెట్టిన వివరం వుంటుంది...."

ఆ కవరును ముట్టుకోకుండా టోల్‌మాన్ లోపలికి వెళ్ళి తన భాగస్థుణ్ణి పిల్చాడు. అతడే "షార్ప్!"

ఇద్దరూ కలిసి బరువైన యినప్పెట్టె తలుపు తెరచారు. దానిలో నుంచి ఓ సీలు వేసిన కవరు తీసారు. దానిని యిద్దరూ కలిసి తెరచి వీలు నామాలోని వివరాలు చదివారు. అప్పుడు టోల్‌మాన్ యిలా చెప్పటం సాగించాడు.

"మిస్టర్ గిలియన్స్!" అతడు మామూలుగా అన్నాడు. "మీ మామ గారి వీలునామాకు ఓ అనుబంధము వుంది. మీకు యిచ్చిన 1000 డాలర్లు ఖర్చుపెట్టి దాని అక్కౌంటు మాకు యిచ్చేటంతవరకు దానిని తెరవ వద్దని మాకు గట్టిగా చెప్పారు. మీరు యిప్పుడు మాకు ఆ వెయ్యి డాలర్ల వివరం యిచ్చారు కాబట్టి. నేనూ, నా భాగస్థుడూ ఆ అనుబంధాన్ని చదివాము. దానిలో వున్న న్యాయ సంబంధమైన పదజాలముతో మిమ్మల్ని యిబ్బంది పెట్టకుండా దానిలో భావమేమో మీకు చెప్తాము."

"మీరు ఆ 1000 డాలర్లు వెచ్చించిన విధానములో మీకు బహుమానం యివ్వతగిన పద్ధతిలో వుంది. మీకు యెక్కువ లాభం కలుగుతుంది మిస్టర్ షార్ప్ మరియు నేను దీనికి న్యాయనిర్ణేతలగా (జడ్జీలగా) నియమింపబడ్డాము మేము న్యాయ సూత్రముల ప్రకారం మాకు విధించిన కర్తవ్యం నిర్వహిస్తామని మీకు వాగ్దానం చేస్తున్నాము.... కాని మిస్టర్ గిలియన్స్! ఆ అనుబంధములో విధింపబడిన షరతుకు వద్దాము. మీరు ఆ 1000 డాలర్లు ఖర్చుపెట్టిన విధానము ముందు ఆలోచన గలదీ, తెలివైనదీ, నిస్వార్థతతో కూడుకొన్నది అయితే మా చేతిలో వుంచబడిన 50,000 డాలర్లు మీకు యివ్వటానికి మాకు అధికారము యివ్వబడినది.... కాని మా పార్టీ .... మీ కీర్తిశేషుడైన మామగారు మిస్టర్ గిలియన్ వ్రాసినట్లుగా.... ఆ డబ్బును మీరు ఆదివరకు ఖర్చు పెట్టినట్లుగా.... మిస్టర్ గిలియన్ వ్రాసిన మాటలనే నేను చెప్తున్నాను.... చెడ్డ మనుషులతో కూడి, నిందించతగిన అనవసరపు ఖర్చు చేసినట్లయితే.... ఆ 50,000 డాలర్లను వెంటనే మిస్టర్ గిలియన్ రక్షణలోవున్న "మిరియల్ హేడెన్"కు చెల్లింపబడాలి. ఇప్పుడు షార్ప్, నేనూ కలిసి మీరిచ్చిన 1000 డాలర్లు

ఖర్చు వివరము పరిశీలిస్తాము. మా నిర్ణయంలో మీరు నమ్మక ముంచు తారని.... మేము నమ్ముతున్నాము."

మిస్టర్ టోల్‌మాన్ జేబిలు మీద పెట్టిన మిస్టర్ గిలియన్స్ యిచ్చిన ఆ కవరు అందుకోబోయాడు. కాని ఆయనకన్నా తొందరగా, గిలియన్స్ దానిని తీసుకొని ఆ కవరును దానిలోని కాగితంతో సహా చిన్న చిన్న ముక్కలుగా చించి తన జేబులో వేసుకొన్నాడు.

"మంచిది...." అతడు నవ్వుతూ అన్నాడు. "ఈ కవరులోని వివరాలను మీరు చూడవలసిన పనిలేదు. దీనిలోని చిన్న చిన్న వివరాలను మీరు చూడవలసిన అవసరం లేదు. నేను ఆ వెయ్యి డాలర్లను గుర్రపు పందేలలో ఓడిపోయాను! పెద్ద మనుషులారా! మీకు సుదినం!!"

గిలియన్స్ బయటికి వెళ్ళగానే టోల్‌మాన్ మరియు షార్ప్లు తమ శిరస్సులను, దుఃఖముతో విదిలించుకొన్నారు. గిలియన్సు సంతోషంతో ఈల వేసుకొంటూ బయటికివెళ్ళి లిఫ్టుకోసం వేచియుండటం వాళ్ళు గమనించారు.

—)o(—

వయసు విడదీసిన ప్రేమికుల జంట

(October And June)

గోడమీద వ్రేలాడగట్టిన తన కత్తి వంక దీర్ఘంగా, విచారంగా చూసాడు కెప్టన్. ప్రక్కనే వున్న అతని అంతరంగిక గదిలో, తనవెలసి పోయిన యూనిఫారం వుంది. గాలి చేతా, చాలా కాలము వుపయోగించ బడటం చేతా అది మరకలతో చిరిగి వుంది. భయంకరమైన సంగ్రామము ఆగిపోయి చాలా చాలా కాలమయినట్లు కన్పిస్తున్నది.

తన దేశము కష్టాలమధ్యలో వున్నప్పుడు తానొక సాహసిక వీరు విగా భాసించాడు. కాని యిప్పుడు ఒక స్త్రీ యొక్క అందమైన, మనోహర మైన మెత్తటి కళ్ళ ప్రభావానికి లొంగిపోయి అల్పుడైనాడు. అతడు తన ప్రశాంతమైన గదిలోకూర్చొని ఆమె దగ్గరనుంచి యిప్పుడే వచ్చిన వుత్త రాన్ని తన చేతిలో పట్టుకొన్నాడు· ఆ వుత్తరమే అతనిని దుఃఖసాగరంలో ముంచింది. అతని ఆశలను భగ్నంచేసిన ఆ లేఖను అతడు పదేపదే చదువు తున్నాడు.

"మీరు నన్ను మీ భార్యగా వుండమని కోరటమనే గౌరవాన్ని తిరస్కరించే ముందు మీతో నేను నిష్కపటముగా మాట్లాడదలచు కొన్నాను. ముఖ్యంగా మీ కోరికను నేను తిరస్కరించటానికి కారణం మన యిద్దరి వయస్సులలో గల తేడాయే. నేను మిమ్మల్ని అధికంగా యిష్ట పడుతున్నాను. కాని మన వివాహం ఆనందప్రదము కాదని నా గట్టినమ్మక నేనీ విషయం మీకు తెలియచేయటానికి చాలా విచారపడుతున్నాను. కాని నిజమైన కారణం వెలిబుచ్చినందుకు మీరు నన్ను ప్రశంసిస్తారనే అను కొంటున్నాను"

పాపం! కెప్టను నిట్టూర్చాడు. తన తలను చేతిమీద ఆనించు కొన్నాడు. నిజమే! తమ యిద్దరి వయస్సుల మధ్య చాలా తేడా వున్న మాట నిజమే! కాని తను చాలా దృఢంగానూ, అందముగానూ వున్నాడు. తనకు వున్నతోద్యోగము వుంది. కావలసినంత సంపద వుంది. తన యొక్క ప్రేమా, ఆమె పట్ల తను చూపే అత్యంతాశక్తి, తనకున్న వ్యక్తి గత లాభములతో ఆమెను తన వయస్సును మరచిపోయేటట్లు చేయలేదా? పైగా ఆమెను తను బాగా చూసుకొంటాడనే నమ్మకం తనకుంది.

ఆ కెప్టెను కార్యశూరత్వానికి పేరుపడ్డవాడు. యుద్ధరంగములో తనయొక్క నిర్ణయాలకు తన శక్తికి మించి పేరుపడ్డాడు. తను ఆమెను స్వయంగా చూస్తాడు. వ్యక్తిగతంగా ఆమెతో వాదిస్తాడు. వయస్సు....! ప్రేమికుల మధ్య అది పరిగణలోకెట్లా వస్తుంది!

రెండు గంటలలో అతను సిద్ధమయ్యాడు. తను పోరాడబోయే మహాసంగ్రామానికి "టెన్నిసీ" ప్రాంతములోని పాత దక్షిణపు ప్రాంత పట్టణానికెళ్ళే రైలు అధిరోహించాడు.

కెప్టను వచ్చినప్పుడు అతని ప్రేమికురాలు...."థియోడోరా" తన పాతభవనంలో అందమైన ముఖమంటపంలో మెట్లమీద వుంది. అక్కడామె వేసవికాలపు నీరెండలో ఆనందాన్ననుభవిస్తున్నది. ఆమె చిరునవ్వుతో కెప్టెనును ఆహ్వానించింది. ఆ చిరునవ్వులో వ్యగ్రతలేదు. ఆమె నిల్చొన్న మెట్టుక్రింద కెప్టను నిల్చొనివుంటే వారిద్దరి మధ్య వున్నవయసు తేడా అంత పెద్దగా కనపడటంలేదు. అతడు నిటారుగా పొడుగ్గావున్నాడు. అతని కళ్ళు రాగిరంగులో పరిశుద్ధంగా వున్నయి. ఆమె అందమైన స్త్రీ! యవ్వనంలో మొదటి దశలో వుంది.

"మీరొస్తారని నేను అనుకోలేదు" థియోడోరా అన్నది. "కాని మీరొచ్చారు గనుక, ఆ మెట్టుమీద ఆసీనులు కండి. మీకు నా వుత్తరం అందలేదా?"

"అందింది అందుకే నేనొచ్చానిప్పుడు" కెప్టను అన్నాడు. "మళ్ళీ అడుగుతున్నాను నా ప్రియమైన థియో మీ సమాధానాన్ని తిరిగి ఆలోచించలేరా?"

అతనిని చూసి ఆమె మృదువుగా మందహాసం చేసింది. అతడు వయస్సులో పెద్దవాడుగానే కన్పిస్తున్నాడు. అతని అందమైన చూపులూ, గట్టి శరీరమూ ఆమె కిష్టమే! అతనిలోని పురుషత్వాన్ని ఆమె గుర్తించింది. కాని····తను...వివాహానికి అంగీకరిస్తే....?

"లేదు....లేదు...." ఆమె తన తల అడ్డంగా త్రిప్పింది. "దానిని గురించి తిరిగి ప్రశ్నించవద్దు. మిమ్మల్ని నేను అభిమానిస్తున్నాను నిజమే! కాని వివాహమాడలేను....మీ వయస్సు....నా వయస్సు··· ఆ విషయాన్ని గురించి నాతో చెప్పించకండి....నేనది వరకే నా వుత్తరంలో వ్రాశాను."

కెప్టను నేత్రాలు కొంచెం ఎరుపెక్కాయి. ఆ వేసవికాలపు వెలుతురులో దుఃఖంగా చూస్తూ కాసేపు నిశ్శబ్దంగా వున్నాడు. తనకు కనబడే అడవి వెనుక....ఒక పచ్చని వీడు వుంది. తన తోటి సిపాయిలు సముద్రం వేపు ప్రయాణం చేస్తూ, అక్కడ గుడారాలు లేకుండా గడిపారు. అబ్బా! అది ఎన్ని రోజుల క్రితమో లాగుంది. యిప్పుడు తలుచుకుంటే!

నిజంగా తన కర్మ! తను జన్మించిన కాలమూ, తనను బాధపెట్టే టట్లుగా మోసం చేసాయి. తనకీ, తన ఆనందానికీ మధ్య కొద్ది సంవత్సరాలు మాత్రమే అడ్డు నిలిచాయి!

"థియోడోరా" చెయ్యి క్రిందికి పాకివచ్చి కెప్టను చేతిలోగట్టిగానూ రాగిరంగులోవున్న చేతిలో బిగుసుకొంది. కనీసం ఆ భావన ప్రేమ జాతికి చెందినదేనని ఆమె అభిప్రాయపడింది.

"మీరు ఆ విషయాన్ని అంత తీవ్రంగా తీసుకోవద్దు!" ఆమె మృదువుగా అంది. "అదీ అంతా మన మంచికోసమే! అదంతా నాలో నేను తర్కించాను. మనకు వివాహం కానందుకు యేదోఒక రోజున మీరు సంతోషపడకపోరు. మన వివాహం అయితే కొంతకాలము యెంతో మధురముగానూ అందముగానూ వుండవచ్చు....కాని ఆలోచించండి! చాలా కొద్ది రోజులలోనే మన ఈ అభిరుచులు విభేదిస్తాయి! మనలో ఒకరు కుంపటి దగ్గర కూర్చొని చదువుకొంటూ, కడుపు నొప్పితో, కాళ్ళ

8)

నొప్పితో బాధపడుతుంటే యింకొకరు రాత్రి కాగానే విందులు, వినో దాలు, నృత్యాలతో వినోదించాలని కోరుకుంటారు.... లేదు—లేదు—నా ప్రియమైన స్నేహితుడా! మనిద్దరికీ వివాహం పొసగదు. మనిద్దరికీ మధ్య వున్న తేడా జనవరికీ, మే నెలకీ వున్నంతకాకపోయినా స్పష్టమైన అక్టో బరు మాసానికీ, అందమైన జూన్ మాసానికీ వున్న తేడాతో పోల్చవచ్చు"

"మీరేది చెప్పితే అది చేస్తాను థియోడోరా! మీరు కావాలను కుంటే—"

"వద్దు—వద్దు! మీరేమీ చెప్పద్దు! నేనేది చెప్పినా చెయ్యగలనని, మీరిప్పుడు అనుకోవచ్చు. కాని తర్వాత చెయ్యలేరు ఇంక నన్నేమీ అడ గద్దు దయచేసి"

కెప్టను తన పోరాటంలో అపజయం పొందాడు. కాని అతడు సాహసమైన యోధుడు! ఆమె అతనికి వీడ్కోలు చెప్పటానికి లేచినప్పుడు అతడు చాలా మౌనంగా వున్నాడు. తన ధైర్యాన్ని కూడగట్టుకొన్నాడు.

అతడు ఆరాత్రే ఉత్తరానికి ప్రయాణం చేసే రైలెక్కాడు. మరు నాడుదయం అతడు తన గదిలో కూర్చున్నాడు. గోడమీద అతని ఖడ్గము వ్రేలాడుతున్నది. అతడు అందమైన తెల్లటి "టై" ధరించి మధ్యాహ్న భోజనానికి తయారవుతున్నాడు. కాని అదే సమయంలో తనలో తను దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

"థియో" సరిగానే చెప్పిందని నేను నమ్ముతాను. ఆమె అందమై నది కాదని యెవ్వరూ అనలేరు కాని ఎంత తక్కువగా లెఖ్ఖవేసినా ఆమెకు ఇరవై ఎనిమిది సంవత్సరాలుండవచ్చు!

అసలు సంగతేమిటంటే పాపం కెప్టను....వయస్సు పంధొమ్మిది సంవత్సరాలే! అతడింతవరకు తన ఖడ్గాన్ని వుపయోగించలేదు, మిలటరీ ప్యారేడులో తప్ప!

—)o(—

ఇరవై సంవత్సరాల తర్వాత

(After Twenty Years)

రాత్రి పది గంటల సమయము. వీటు మీద వున్న రక్షకభటుడు తన [illegible] నడకతో అక్కడ వెడల్పైన బాటమీద పహరా కాస్తున్నాడు. చల్లగాలి వీస్తున్నది. గాలిలో తేమను బట్టి వానరావచ్చని సూచన వుంది.

అతడు తిరుగుతూ దుకాణాల తాళాలు సరిగా వున్నయ్యే లేవో తట్టి చూస్తున్నాడు. చేతి కర్రను అప్పుడప్పుడు అతిలాఘవంగా తిప్పుతున్నాడు అతడు బాటమీద జాగ్రత్తగల తన చూపులతో, అటూయిటూ గర్వంగా నడుస్తుంటే శాంతిని కాపాడటానికి దివి నుంచి భువికి దిగి వచ్చిన దేవదూతలా వున్నాడు. ఆ ప్రాంతంలో రాత్రిపూట తొందరగానే దుకాణాలు మూసి వేస్తారు. అప్పుడప్పుడు యేదో సిగరెట్ల దుకాణంలో నుంచి గాని, రాత్రి బోజనాలకు ప్రత్యేకంగా పనిచేసే హోటళ్ళ నుంచి గాని మాత్రమే దీపాల కాంతి కనపడుతున్నది.

ఒక వీధి కూడలిలో అతడు అకస్మాత్తుగా తన నడకను తగ్గించాడు. చీకటిలో వున్న ఓ యినుప దుకాణం తలుపు దగ్గర ఒక వ్యక్తి చేతిలో వెలిగించని సిగరెట్టుతో నిలబడి వున్నాడు. పోలీసు మనిషి, ఆ వ్యక్తిని సమీపించగానే అతడు తొందరగా మాట్లాడాడు.

"మంచిది కానిస్టేబుల్ గారూ!" అతడు దృఢమైన స్వరంతో అన్నాడు." నేను యిక్కడ ఒక స్నేహితుని కోసం కాచుకొని వున్నాను. అది యిరవై సంవత్సరాల క్రిందట మేము చేసుకొన్న ఒక యేర్పాటు మీకు

కొంత వింతగా వుండవచ్చు, మంచిది. ఆ విషయంగురించి మీకు నేను సూటిగా చెప్తాను. ఇప్పుడున్న కొట్టుకు బదులుగా అప్పుడు యిక్కడ ఒక రెస్టారెంటు వుండేది. దానిపేరు— "బిగ్‌జో! బ్రాడీ రెస్టారెంటు—"

"అవును అదీ యిక్కడ అయిదు సంవత్సారాల క్రితం వరకు వుండేది. ఇప్పుడది శిథిలమయిపోయింది." అన్నాడు రక్షకభటుడు.

తలుపు దగ్గర నిలబడ్డ వ్యక్తి అగ్గి పుల్లతో సిగరెట్టు వెలిగించు కొన్నాడు. ఆ దీపపు కాంతిలో, అతని ముఖం అంత కాంతి వంతంగాలేదు చప్పిడి దవడలు, చురుకైన కళ్ళు, కుడి కంటి కనుబొమ్మమీద తెల్లటి మచ్చ వుంది. అతని మెడలో ఒక పెద్ద డైమండు వ్రేలాడు తున్నది.

"ఇరవై సంవత్సరాల క్రితం, యిక్కడ వున్న 'బిగ్ జో బ్రాడ్' రెస్టారెంటులో నా స్నేహితుడు 'జిమ్మీ వెల్సు'తో కలిసి భోజనం చేసాను. అతడు నాకు చాలా ముఖ్యమైన స్నేహితుడు ప్రపంచములో కెల్ల మంచి వాడు. న్యూయార్కులో మేమిద్దరం అన్న దమ్ములుగా పెరిగాము. అప్పుడు నావయస్సు పదునెనిమిది సంవత్సరాలయితే, జిమ్మీకి యిరవైయేళ్ళు. మరునాటి వుదయం నేను నా అదృష్టం వెతుక్కోవటానికి, పడమటి ప్రాంతానికిపోవటానికి సిద్ధమవుతున్నాను. "న్యూయార్కు" మహానగరం నుంచి జిమ్మీని యెవరూ బయటికి తీసుకురాలేరు. ప్రపంచంలో బ్రతకటానికి అదొక్కటే నగరమని అతని వుద్దేశ్యము. అప్పుడు మేము ఒక ఒప్పందము చేసుకున్నాము. మేము యే పరిస్థితులలో వున్నా, యెంత దూరములో వున్నా, సరిగా యిరవై సంవత్సరాల తర్వాత యిక్కడే కలుసుకోవాలను కొన్నాం. ఈ యిరవై సంవత్సరాలలో, మేము మా భవిష్యత్తు కోసం ప్రయత్నంచేసి పాటుపడాలి. చివరకి ఆ అదృష్టం యెలా వున్నాసరే ..."

"మీరు చెప్పేది చాలా కుతూహలంగా వుంది." అన్నాడు ఆ రక్షక భటుడు. "మీరు కలుసుకోవటానికి దీర్ఘకాలం యేర్పాటు చేసుకొన్నారు. సరే! మీరు విడిపోయిన తర్వాత మీ స్నేహితుని గురించి వినలేదా?" అతడు అడిగాడు.

"కొంత కాలం వరకు, మాయిద్దరి మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు సాగిన మాట నిజమే! "అన్నాడా వ్యక్తి," కాని ఒకటి రెండు సంవత్సరాల తర్వాత అవి ఆగిపోయినై. మా యిద్దరి మధ్య సంబంధాలు తెగిపోయినై. పడమటి ప్రాంతంలో డబ్బు సంపాదనకి చాలా మార్గాలున్నాయి కొద్ది కాలంలోనే, నేను ధనవంతుడనై హాయిగా బ్రతుకు తున్నాను కాని జిమ్మీ తప్పకుండా నన్ను యిక్కడ, యిరవై సంవత్సరాల తర్వాత నన్ను కలుసుకొంటాడని నానమ్మకం. అతడు ఈ ప్రపంచములో చాలా నమ్మదగినవాడు. అతడు మా ఒప్పందం యెప్పటికీ మర్చిపోడు. నేను ఈ రోజున వెయ్యిమైళ్ళ దూరం నుంచి ప్రయాణము చేసి, యిక్కడకు చేరుకొన్నాను. నా పాత స్నేహితుణ్ణి కలుసుకోగలిగినట్లయితే, నా ప్రయాణం వృథా అయినట్లు కాదు."

స్నేహితుడి కోసం వేచియున్న ఆవ్యక్తి తన జేబులో నుంచి ఓ అందమైన చిన్న గడియారం బయటికి తీసాడు. అది అమూల్యమైన డైమండ్ల తలుపులతో బిగించబడి వుంది.

"పదిగంటలకింకా మూడునిమిషాలుంది. క్రిందటి సారి, మేమీ రెస్టారెంటు ద్వారం దగ్గర సరిగా పది గంటలకు విడి పోయాము!" అన్నాడతడు.

"పశ్చిమ ప్రాంతంలో మీరు బాగా సంపాదించారనుకొంటాను!" అన్నాడు రక్షకభటుడు.

"నిజమే! నేను బాగా సంపాదించినమాట వాస్తవమే! జిమ్మీ నా ఆస్తిలో సగము కూడా సంపాదించి వుండడు. ఎందుకంటే అతడు తెలివి గలవాడు కాదు కాని, నిదానమైన పనివాడు, మంచివాడు. నేను డబ్బు సంపాదించటంలో చాలా మంది తెలివైన వాళ్ళతో పోటీ పడాల్సి వచ్చింది. న్యూయార్కులో డబ్బు సంపాదించటం చాలా తేలిక అదే పశ్చిమ ప్రాంతంలో అయితే కత్తి మీద సాములాంటిది.

రక్షకభటుడు తనచేతి కర్ర నూపుతూ ఒకటి రెండడుగులు వేసాడు.

"నేను నాడ్యూటి మీద వెళుతున్నాను. మీ స్నేహితుడు సరియైన టైముకే వస్తాడను కొంటాను మీరు సరిగా ఆ టైములో అతనిని కలుసు కొంటారను కొంటాను." అన్నాడు పోలీసు.

"నేను సరిగా ఆ టైముకే అతనిని కలుసు కోవడం లేదు." ఆ రెండవ వ్యక్తి అన్నాడు! నేనతనికి ఓ అరగంట టైము యెక్కువ యిస్తాను ఈ భూమి మీద 'జిమ్మీ' ప్రాణాలతో వుంటే ఆ టైములోపల అతను తప్పక వస్తాడు. మంచిది పోలీసుగారూ! గుడ్ నైట్!"

ఇప్పుడు అందమైన మంచు చల్లగా కొద్దికొద్దిగా పడుతున్నది గాలి గట్టిగా వీచడం మొదలు పెట్టింది.

"గుడ్ నైట్ సార్!" అంటూ రక్షకభటుడు తన బీటు మీద పోతూ దుకాణాల తలుపులు, తాళాలు చూసు కొంటూ వెళ్ళాడు. ఆ కాలిబాట మీద వున్న కొద్ది మంది ప్రయాణీకులు గూడా తమ కోటు కాలర్లతో వంటిని నిండుగా కప్పుకొని జేబుల్లో చేతులు పెట్టుకొని, గబగబా తమ యిళ్ళవేపు నడుస్తున్నారు.

ఆ యినుప దుకాణం దగ్గర, వెయ్యి మైళ్ళ దూరం నుంచి తన మిత్రుని కోసం వచ్చిన వ్యక్తి తన మిత్రుడు వస్తాడోరాడో అనుకొంటూ నిలబడి చూస్తున్నాడు.

అతడు యిరవై నిమిషాలు అలా కాచుకొని వున్నాడు. ఎదురుగా వున్న వీధిలోనుంచి ఓవరుకోటు నిండుగా వేసుకొన్న ఓ పొడుగాటి వ్యక్తి త్వరత్వరగా వచ్చి అక్కడ నిలబడి వున్న వ్యక్తిని సమీపించాడు.

"ఇక్కడ నిల్చొన్నది నువ్వేనా బాబు!" అంటూ ఆ క్రొత్త వ్యక్తి పలకరించాడు

"జిమ్మీ వెల్సు! నీవేనా?" తలుపు దగ్గర నిలబడ్డ వ్యక్తి అరిచాడు.

"భగవంతుడు నన్ను రక్షించుగాక!" క్రొత్తగా వచ్చిన వ్యక్తి రెండవ వ్యక్తి రెండుచేతులూ తన చేతితో పట్టుకొని పెద్దగా అన్నాడు.

అది నువ్వే అని నాకు తెలుసు నీవు బ్రతికి వుంటే తప్పక యిక్కడకు వస్తావని తెలుసు! మంచిది.... మంచిది.... మంచిది.... ఇరవై సంవత్సరాలు అంటే చాల కాలముగదా! ఇక్కడ వున్న పాత రెస్టారెంటు యిప్పుడు లేదు. బాబ్! ఆ హోటలు వుంటే యెంత బావుండేది! తిరిగి మనమా రెస్టారెంటులో ఈరాత్రి విందు భోజనం చేసేవాళ్ళము. ఆ పశ్చిమ ప్రాంతంలో నీ వేమి సంపాదించావు?"

"అవును నేను బాగానే సంపాదించాను. నాకు కావలసినంత, కోరుకొన్నంత, సంపాదించుకొన్నాను. కాని మిస్టర్ జిమ్మీ నీవు చాలా మారిపోయావు. నీవు రెండు మూడు అంగుళాలు ఎత్తు పెరుగుతావని నేను అనుకోలేదు...."

"అవును.... నాకు ఇరవై యేళ్ళు నిండిన తర్వాత, నేను కొంచెం ఎత్తు పెరిగిన మాట నిజమే!

"సరే! న్యూయార్కులో బాగా వున్నావా, జిమ్మీ!"

"ఫరవా లేదు పట్టణశాఖలలో ఒక దానిలో నాకు వుద్యోగం వుంది నాకు తెలిసిన ఒక స్థలానికి పోయి మన పాత సంగతులను గురించి మాట్లాడుకొందాము.

ఆ యిద్దరు వ్యక్తులు చేతిలో చెయ్యి వేసుకొని, ఆ బాట మీద నడిచారు. పశ్చిమ ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తి, తను జీవితంలో యెలా పైకి వచ్చింది గర్వంగా చెప్పసాగాడు. రెండవతను, తన ఓవరు కోటులో మునిగిపోయి, అతను చెప్పేది శ్రద్ధగా వింటున్నాడు.

ఆ వీధి చివర ఒక మందుల షాపు వుంది. అక్కడ విద్యుత్ దేదీప్య మానంగా వెలుగుతున్నాయి.

ఇద్దరూ ఆ వెలుతురులోకి రాగానే ఒకరినొకరు దీర్ఘంగా, తదేకంగా చూసుకొన్నారు.

పశ్చిమ ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తి అకస్మాత్తుగా ఆగిపోయి, తనచేతిని, రెండవ వ్యక్తి చేతినుంచి విదిలించుకొన్నాడు.

"నీవు జిమ్మీ వెల్సు కావు!" అతడు ఒకసారిగా పెద్దగా అన్నాడు. ఇరవై సంవత్సరాలు చాలా కాలము అన్న సంగతి నిజమే! కాని అది ఒక మనిషి యొక్క ముక్కును యింత యిదిగా మార్చలేదు!"

"కాలము ఒక్కొక్కప్పుడు మంచి మనిషిని గూడా చెడ్డవ్యక్తిగా మార్చగలదు." అన్నాడా పొడుగు వ్యక్తి "సిల్కీబాబ్! పదినిమిషాల నుంచి నీవు 'అరెస్టు'లో వున్నావు. 'చికాగో' నుంచి నీవు పారిపోయి, ఈ ప్రాంతాలకు వస్తున్నట్టుగా, మాకు సమాచారము అందింది. పాపం నీవు ప్రశాంతంగా తిరిగి, వెళ్ళిపోవామను కొన్నావుగదూ? మనమిప్పుడు పోలీస్టేషనుకు పోయే ముందు నేనొక 'నోట్' యిస్తాను. దానిని నీకిమ్మని నీ మిత్రుడు చెప్పాడు. కిటికీ దగ్గరకు వెళ్ళి అది చదువుకో! అది 'పెట్రోలింగ్ పోలీసువీల్సు' వ్రాసిన 'నోట్'

పశ్చిమ ప్రాంతంనుంచి వచ్చిన వ్యక్తి, ఆ కాగితం విప్పి చదవటం మొదలు పెట్టాడు. మొదట అతని చేతులు దృఢంగా వున్నాయి. కాని ఆ కాగితం చదవటం పూర్తికాగానే, అతని చేతులు కొంచెము వణికాయి. ఆ 'నోట్'లో వ్రాసింది చాలా క్లుప్తంగానే వుంది.

"బాబ్! నేను మనం అనుకొన్న వేళకు అనుకొన్న చోటికి వచ్చాను. నీ మొఖం చూసాను. 'చికాగో' పోలీసులు ఆ వ్యక్తి కోసం వెతుకుతున్నారని నాకు తెలిసి పోయింది. నేను నిన్ను స్వయంగా నా చేతులతో, పోలీసులకప్పగించలేక, మామూలు దుస్తులలో వున్న ఓ రక్షకభటునికి ఆ పని వప్పగించాను. నన్ను క్షమించు!

—జిమ్మీ"

—)o(—

క్షురకుని ప్రసంగము

(The Barber Talks)

'పోస్టుమాన్' పశ్చాత్తాపంతో కుర్చీలో కూర్చున్నాడు తనేదో గొప్పవాడైనట్లుగా ఒక అమర్యాదను సూచించే చూపును క్షురకుడు అతని మీద విసిరాడు.

పోస్టుమాన్ క్రిందటిరోజే క్రాపు చేయించుకొన్నాడు గానీ గెడ్డము చేయించుకోలేదు.

"క్రాపు చెయ్యాలా?" క్షురకుడు అడిగాడు.

"లేదు, గెడ్డం మాత్రమే!"

క్షురకుడు, తన కనుబొమలనెత్తి, అతని వంక ద్వేషభావం వుట్టిపడే చూపు చూసాడు. అతడు కూర్చున్న కుర్చీని, సరియైన స్థానంలో వుంచటానికి పెద్దగా త్రోసాడు. అది పెద్దగా శబ్దంచేస్తూ తన స్థానంలో కూర్చుంది.

తర్వాత క్షురకుడు ఒక చిన్న మగ్గు, బ్రష్, తీసుకొని తన కష్టమరు తన కన్నా చాలా అల్పుడైనట్లుగా అమర్యాదను సూచించే చూపును చూస్తూ, నీళ్ళ కుండీ దగ్గరకు వెళ్ళాడు. అప్పుడతడు తిరిగివచ్చి పోస్టుమాను శరీరం మీద ఒక దవళవస్త్రాన్ని కప్పాడు జాలియెరుగని అతని చేతిలోని బ్రష్‌తో, సబ్బునురగ తీసుకొని పోస్టుమేను నోటిమీద పడేటట్లు అతని మొఖంమీద కొట్టాడు.

అప్పుడు తన మామూలు వాగుడు మొదలు పెట్టాడు.

"మీరెప్పుడైనా 'వాషింగుటన్' ప్రాంతములో 'సేటిల్' నగరాన్ని చూసారా?" అడిగాడు.

"లేదే?" నోటిమీదపడ్డ సబ్బు నురగను ఒక చేత్తో తుడుచుకొంటూ పోస్టుమాన్ అన్నాడు.

"నేనుగూడా వెళ్ళలేదనుకోండి!" క్షురకుడు తన ప్రసంగము కొనసాగించాడు. "సెయింటు జాన్‌స్లా"కి తొమ్మిది మైళ్ళ దూరంలో నారింజ తోటను పెంచుతున్న నా తమ్ముడున్నాడు. అదిగో మీ మెడమీద ఒక చీలిన వెంట్రుక వున్నది అది తప్పుడు దోవలో పెరుగుతున్నది. మెడమీద అడ్డదిడ్డంగా క్షౌరంచేస్తే అలా వెంట్రుకలు మొలుస్తాయి. విస్కీ త్రాగిన 'బార్బరు' అయితే అలా తప్పుడు క్షౌరం చేస్తాడు. విస్కీ చాలా భయంకరమైన పదార్థము మీకు విస్కీ త్రాగే అలవాటుందా ?....."

పోస్టుమేన్ ముఖంలో అన్ని భాగాలనూ సబ్బు నురగ కప్పేసింది. దానినుంచి తప్పించుకొన్నది అతని ఒక కన్ను మాత్రమే. ఆ కంట్లో అన్నా సబ్బు నురగ పడకుండా చూడవయ్యా! అని చెప్పుదామనుకొన్నాడు పోస్టుమాన్. కాని అతను చెప్పేలోగానే అతి చాతుర్యంతో ఆ కన్నును గూడా ఓ బ్రష్ విసురుతో సబ్బునురగతో కప్పేసాడు క్షురక మహాశయుడు

"నా తమ్ముడు "బిల్" త్రాగేవాడు." తన సంభాషణను కొనసాగించాడు క్షురకుడు "హౌస్టను నగరంలో ఎవరూ త్రాగనంత విస్కీ అతను త్రాగగలడు కాని యెప్పుడూ స్పృహపోయేటంత త్రాగడు. అతనికి నా క్షౌరశాలలో క్షౌరం చెయ్యటానికి ఒక కుర్చీ ప్రత్యేకించాను. కాని తర్వాత వాడిని బయటకు పంపక తప్పలేదు. "బిల్"ది చాలా దృఢమైన శరీరము పూర్తిగా త్రాగికాని ఆపడు. అతడు పూర్తిగా త్రాగినట్లు అతని కళ్ళనుబట్టే మనం తెలుసుకోవచ్చు. అప్పుడు వాడి కళ్ళలో ఒక వింత కాంతి వస్తుంది. అవి మబ్బుగా మత్తుగా వుండి వాడి తలనెటూ త్రిప్పనియ్యవు వాడెటువేపైనా చూడాల్సివస్తే తన చేతి వ్రేళ్ళతో ఆ వైపుకు తన కంటి గ్రుడ్లను త్రిప్పుకొనేవాడు. అప్పుడతని కళ్ళు పోస్టాఫీసు దోమలో వుండే చిన్నని

గుండ్రని కిటికీలలాగా వుంటాయి. అతను పూర్తిగా త్రాగి వీధిలో నడుస్తుంటే ప్రక్క వాళ్ళకు వాసన కొడ్తుంది అతడు. బాగా వున్నప్పుడెంత నేర్పుగా క్షౌరం చేస్తాడో, త్రాగి వున్నప్పుడు గూడా అంతే!.... ఏమిటి? రేజరు మిమ్మల్ని గాయపరిచిందా?"

పాపమా తపాలా బంట్రోతు తనకేమీ గాయం కాలేదు అని చెప్పటానికి తన చేతితో సంజ్ఞ చెయ్యబోయాడు. కాని ఆ చెయ్యి కదలటం గుర్తించిన క్షురకుడు అతని చేతిని తన శరీరము మొత్తము బరువుతో కుర్చీకి అదిమిపెట్టాడు.

బార్బరు... తన వాగుడిని.... మళ్ళీ కొనసాగించాడు.

"అతడెంత త్రాగినా, నాదగ్గరకు ఒక్క 'కస్టమరు' వస్తే వాడి దగ్గరకు నలుగురు రావటం నేను గమనించాను. ముగ్గురు లేక నలుగురు వచ్చి, తమ వంతు వచ్చేదాకా 'బిల్' కోసం కూర్చునేవాళ్ళు నా కుర్చీ యేమో ఖాళీగానే వుండిపోయేది. నాకేం చెయ్యాలో తోచలేదు మా తమ్ముడికి మాత్రం చేతినిండా పనేవుండేది. వాడు విస్కీ సెలూన్‌కు వెళ్ళడాన్కి గూడా తీరిక వుండేదికాదు. కాని వాడొక తమాషా చేసాడు మా వెనుక గదిలో ఒక పెద్దగాజు కూజా వుంచుకొని, ప్రతి అయిదు నిమిషాలకి లోపలికి వెళ్ళి ఒక్కగుటక త్రాగి వచ్చేవాడు.

"ఓ రోజున ఓ వింత విషయం నేను గమనించాను. 'బిల్' చేత క్షౌరం చేయించుకొని బయటకు పోతున్న ఒకతను తూలుతూ పోవటం చూశాను. ఒకటి రెండు రోజుల తర్వాత మా సెలూను అంతా వుదయం నుంచి రాత్రిదాకా వాడకం దార్ల చేత నిండిపోయింది. ఒక వాడకందారు, మళ్ళీ మళ్ళీ వచ్చి ఆ వుదయం మూడుసార్లు గెడ్డం చేయించుకొన్నాడు. రెండు రోజులలో మా దుకాణం ముందు గుంపు పెరిగి పోయింది. వాళ్ళు క్యూలో రోడ్డు ప్రక్కన వున్న ఒకటి రెండు షాపుల ముందు గూడా నిలబడాల్సి వచ్చింది ఆరోజున మా తమ్ముడు "బిల్" ఆదాయం తొమ్మిది డాలర్లు! ఆ సాయంకాలం ఒక రక్షకభటుడు వచ్చి, "లైసెన్సు" లేకుండా విస్కీ సెలూను, నడుపుతున్నానని నన్ను పోలీసు స్టేషనుకు లాక్కు

పోయాడు. మావాడు పీర్చేగాని పదిలేగాలి అంతా విస్కీ వాసనతో నిండి పోయేది. అతడు క్షౌరం చేసినవాడల్లా హుషారుగా బయటకు వెళ్ళి తన స్నేహితులను గూడా అక్కడకు పంపేవారు. ఆ పోలీసుల బెడద నుంచి తప్పించుకోటానికి, నాకు 300 డాలర్లు వదిలినై. వెంటనే వాడిని ఓడలో ఎక్కించి, "ఫ్లోరిడా" పంపాను.

2

క్షురకుడు పోస్టుమాను ఒకచేతిని తన ఒక చేతితో, గట్టిగా పట్టుకుని అతడి తలను రెండోవేపుకు విసిరి మళ్ళీ చెప్పడం సాగించాడు.

"ఒకసారి నాకు "పెన్నీ" బజారుకువెళ్ళి ఒక చనిపోయిన వానికి గెడ్డం చెయ్యమని కబురు వచ్చింది. 5 నుంచి 10 డాలర్ల దాకా చనిపోయిన వాళ్ళకు గెడ్డం చెయ్యటానికిచ్చినా, మాకాపనులు చేయ్యటం సహజంగా యిష్టం వుండదు. నేను పోవాల్సిన యిల్లు "పెన్నీ" వీధిలో 1908 నంబరుది రాత్రి పదకొండు గంటలకు నేను బయలు దేరాను. నేను ఆ వీధిని సరిగానే కనుక్కోగలిగాను వీధి చివరనుంచి లెక్కించుకొంటూ వెళ్ళి చివరకు నేను 1908 నంబరు యిల్లు చేరాను. నేను లోపలికి వెళ్ళి తలుపు తట్టాను. నా చిన్నపెట్టెలో, రేజరూ సబ్బూ చిన్న మగ్గు వున్నాయి ఒక ముసలాతను తలుపు తెరచాడు అతని కళ్ళు నా చేతిలోని చిన్నపెట్టె మీద పడ్డాయి.

"ఓ! మీరొచ్చారా" చాలా మంచిది. మీరు ఈ మెట్ల మీదుగా పైకి వెళ్ళండి. అతను కుడి ప్రక్క మొదటి గదిలో వుంటాడు అతని దగ్గర యెవరూ లేరు. ఈ వూరిలో ఆయన చుట్టాలుగానీ, స్నేహితురాలు గానీ లేరు. అతనిక్కడ ఒక వారం రోజులనుంచే మకాం వుంటున్నాడు!"

"అది జరిగి ఎంతసేపై వుంటుంది?" అడిగాను నేను.

"ఒక గంట అయివుండచ్చు అనుకొంటాను!" అన్నాడావృద్ధుడు.

ఆ విషయం విని నాకు చాలా సంతోషమయింది· శవానికి శరీరం చల్లబడకముందే క్షౌరం చెయ్యటం చాలా తేలిక.

నేను గదిలోకి వెళ్ళి దీపం పెద్దది చేసాను. ఆ వ్యక్తి మంచం మీద పడుకొని వున్నాడు. అతడి వళ్ళు యింకా వెచ్చగానే వుంది· అతను గెడ్డం చేయించుకొని వారం రోజులై వుంటుంది. నేను వెంటనే పని ప్రారంభించాను. ఓ అరగంటలో అతని గెడ్డం నున్నగా క్షౌరం చేసాను. అతను బ్రతికివుంటే నేను చేసిన క్షౌరానికెంతో సంతోషించేవాడు.

అప్పుడు నేను మేడమెట్లు దిగి క్రిందికివచ్చి, ఆ వృద్ధుణ్ని చూసాను.

"పని విజయవంతమేనా?" అతను అడిగాడు.

"చాలా బాగా జరిగింది. అతను బాగున్నాడు. నాకు డబ్బులెవరిస్తారు?"

"'అలాబామా'లోని అతని చుట్టాలకు కబురు చేయమంటూ విన్న నా చేతికి 30 డాలర్లు యిచ్చాడు. దానిలో నుంచి మీ ఫీజు యివ్వాలి!"

"నా ఫీజు అయిదు డాలర్లు!"

ఆ ముసలతను నాకు అయిదుడాలర్ల నోటు యివ్వగానే సంతోషించి నేను తిరిగి వచ్చాను.

3

ఇక్కడ బార్బరు కుర్చీని పట్టుకొని దానిని సరైన స్థానంలోకి సర్దాడు. పోస్టుమాను వంటిమీద తెల్లటిగుడ్డను లాగేసాడు. తన రెండు చేతులతో అతని జుట్టును బాగా లాగి, చప్పుడు వచ్చేటట్లు అతని తలమీద తబలా వాయించాడు. వ్యంగం ధ్వనించేటట్లుగా అడిగాడు.

"బేరమ్ కావాలా?"

పాపం పోస్టుమాను మూర్ఖంగా తలాడించి కళ్ళు మూసుకొని, భగవంతుణ్ణి ప్రార్థన చెయ్యాలని వ్యర్థ ప్రయత్నం చేసాడు.

క్షురకుడు మళ్ళీ చెప్పటం సాగించాడు.

"మరునాడు నాకు కొంత సమాచారము అందింది. ప్రక్క యింట్లో వ్యక్తి విషం తీసుకోవటానికి కొంచెం ముందుగా 1908 నంబరు యింట్లో ఒక మనిషి చనిపోయాడట! ఒక యింట్లోవాళ్ళు "డాక్టరు"కోసం కబురంపిస్తే యింకొక యింట్లోవాళ్ళు "బార్బరు" కోసం కబురు పంపారు. తమాషా యేమంటే డాక్టరుగారూ, నేనూ గూడా పప్పులో కాలేసి తప్పుడు యిళ్ళలో ప్రవేశించాము.

"డాక్టరు" చనిపోయిన వ్యక్తిని చూడటానికి వెళ్ళి ఆ యింటి కుటుంబ వైద్యుడు అప్పుడే బయటకు వెళ్ళటానికి సిద్ధంగా వుండటం గమనించాడు.

డాక్టరుగారు ఒక్కక్షణం గూడా వృధాచెయ్యలేదు. వెళ్ళినవెంటనే తనతో తెచ్చిన "పొట్టనుండి ద్రవము త్రోడే గొట్టము" తీసుకొని చనిపోయినవాని పొట్టలోకి పోనిచ్చి లోపలి విషమంతా బయటికి లాగేసాడు.

అదే సమయంలో ప్రక్క యింటిలో విషం తీసుకొన్న వ్యక్తికి గెడ్డం చెయ్యటంలో మునిగి వున్నాను నేను.

ఇంకో తమాషా యేమంటే ఆ కుటుంబ డాక్టరు.... యిచ్చిన మందునంతా చచ్చినవాని పొట్టలోనుంచి బయటికి పంపు చెయ్యడంతో అతను కళ్లు తెరచి, ప్రక్కలో లేచి కూర్చొని మాంసమూ.... బంగాళాదుంప కూరా కావాలని అడగటం!

దీనితో ఆ కుటుంబ వైద్యునికి పిచ్చి యెత్తినట్లయి 'స్టమక్ పైపు' తెచ్చిన డాక్టరుతో దెబ్బలాడటం, యిద్దరూ మెట్లమీదనుంచి క్రిందపడటం జరిగింది. వాళ్ళిద్దరి కొట్లాటలో టోపీలు పెట్టుకొనే "ర్యాక్" ముక్కలు ముక్కలుగా విరిగిపోయింది.

అంటూ అంతవరకు క్షురక మహాశయుడు తన ప్రసంగాన్ని ఆపాడు.

"మరి నీవు గెడ్డం చేసిన విషం తీసుకొన్న మనిషి సంగతేమిటి?"

అంటూ పిరికిగా అడిగాడు పోస్టుమాన్.

"అతని సంగతికేముంది!" బార్బరు చెప్పాడు "అతడు చనిపోయాడనుకో! కాని....అంత అందమైన గెడ్డముతో ఎవరు చనిపోతారు?"

భయంకరమైన ఆకారంగల ఆఫ్రికను సేవకుడు పోస్టుమేను దగ్గరకు వచ్చి, చీపురు చివరలతో (సూదిలాంటి) అతని పళ్ళు దులిపి, అతని కోటును పట్టుకొని కాలరు నుంచి పూడదీసాడు.

"మళ్ళీరండి!" అరిచాడు క్షురమహాశయుడు బయటికి వేగంగా తప్పించుకొని వెళుతున్న పోస్టుమాన్ తో. అతని కంఠస్వరము—తీవ్రమైన ఆపదను సూచించే దానిలాగా వుంది.

—(o(—

గొప్ప డిటెక్టివ్

(The Dissipated Jeweller)

"హౌస్టను" నగర డైరెక్టరీలో మీకు 'థామస్ కీలింగు' పేరు కన్పించదు. అతను రెండు నెలల క్రిందట తన వృత్తి మానేసి వేరే ప్రాంతానికి పోయి వుండక పోతే, ఆ డైరెక్టరీలో అతని పేరు వుండేదే!

"మిస్టర్ కీలింగు" కొన్నాళ్ళ క్రితమే ఆ నగరంలో తన డిటెక్టివ్ కార్యాలయము తెరిచాడు. అతడు 'గాబొరోల్', 'కానల్ డాయిల్'యొక్క అపరాధ పరిశోధక కథలు క్షుణ్ణంగా చదివాడు. ఒక యజమాని తన దుకాణంలోని గుమస్తాల నిజాయితీని పరీక్షించాలన్నా, ఒక భార్య తన భర్తయొక్క తిరుగుబోతు తనాన్ని గురించి తెలుసుకోవాలన్నా, పార్టీలు అతని దగ్గరకే వస్తారు. అతడు చాలా నెమ్మదైన, జాగ్రత్తగా వుండే మనిషి. అతడు తూర్పున వున్న ఓ అపరాధ పరిశోధక సంస్థలో చిన్న వుద్యోగిగా పనిచేసాడు. కాని అక్కడ తనకు ప్రమోషను రావటానికి చాలా కాలం పట్టవచ్చుననే భయంతో పడమటి ప్రాంతంలో వున్న ఈ హోస్టను పట్టణానికి వచ్చాడు. ఎప్పటికైనా తను ఒక పెద్ద డిటెక్టివుగా పేరు తెచ్చుకొగలననే నమ్మకంతో వున్నాడు.

అతను డిటెక్టివు కార్యాలయము తెరచిన మూడురోజులకు ఓ పార్టీ అతని దగ్గరకు వచ్చింది. ఆమె చాలా అందమైన యువతి. ఆమెకు యిరవై ఆరేళ్లు వుండవచ్చు. ఆమె తన నల్లటి గడ్డి టోపీ వరకు పల్చటి ముసుగు కప్పుకొని వుంది. ఆమె చాలా సున్నితంగా వుంది. ముఖంలో నాగరికత వుట్టిపడుతున్నది. ఆమెవి చురుకైన బూడిదరంగు నేత్రాలు. ముఖంలో ఆదుర్దా కనపడుతున్నది.

మధురమైన, కాని శోకం సూచించే కంఠ స్వరముతో ఆమె అన్నది "మీతో ఒక ప్రత్యేకమైన పనిమీద మాట్లాడటానికి వచ్చాను. అది నా కుటుంబ విషయము. ఈ విషయము వూరిలోని నా స్నేహితులతో చర్చించలేదు. నా భర్తతో నాకు వివాహమై అయిదు సంవత్సరాలయింది. ఇంతవరకు నా భర్తతో హాయిగా సంసారం చేస్తున్నాను. నా భర్తకు వివాహానికి పూర్వము ఒక యువతితో పరిచయముంది. ఆమె తిరిగి ఈ మధ్యనే "హౌస్టను" పట్టణానికి వచ్చి నా భర్తతో కలిసి తిరుగుతున్నది. నా భర్త ఆమె అంటే చాలా మక్కువతో వున్నట్లు తోస్తున్నది. కాబట్టి నా భర్తయొక్క రహస్య శృంగార విషయాలు తెలుసుకోవటానికి మిమ్ము లను నియోగించాలనుకొంటున్నాను. నా పేరు "శ్రీమతి R" నా భర్త ఈ వూరిలో ఒక నగల దుకాణానికి యజమాని. రెండు రోజులకొకసారి మీరు చెప్పిన సమయానికి మీ కార్యాలయంలో మిమ్ములను కలుసుకొం టాను నా భర్త కదలికలను గురించి మీరు పరిశోధించి నాకు చెప్పాలి. ఇందుకుగాను మీకు బాగా ఫీజు యివ్వగలను. ప్రస్తుతం ఈ 20 డాలర్లు వుంచండి!"

ఆ యువతి మిస్టర్ కీలింగుకి 20 డాలర్లు యిచ్చింది. అదేదో తనకు చాలా సామాన్య విషయ మన్నట్లుగా, నిర్లక్ష్యంగా ఆ డబ్బును మిస్టర్ కీలింగు తీసుకొని జేబులో వేసుకొన్నాడు. మిస్టర్ కీలింగు ఆమె కోరి కను తప్పక నెరవేర్చగలనని వాగ్దానం చేస్తూ ఆమెను మరునాడు సాయం కాలము తన కార్యాలయానికి రమ్మన్నాడు.

మరునాడు కీలింగు "మిస్టర్ R" యొక్క నగల దుకాణానికి వెళ్ళి అతనిని గురించి వాకబు చేసాడు. అతడు 35 సంవత్సరాల మంచి ప్రవర్తనగల యువకుడు. అతని దుకాణం చిన్నదైనా, దానిలో మంచి డైమండ్లు, చాలా రకాల వెండి, బంగారపు నగలూ, చేతి గడియారాలు నిల్వచేసి విక్రయిస్తున్నాడు. అతడికి త్రాగుడు అలవాటు లేదనీ, తన బల్ల వద్దనే పనిచేసుకొంటూ వుంటాడని తెలుసుకొన్నాడు.

9)

"మిస్టర్ కీలింగు", ఆదుకాణానికి సమీపంలోనే కొన్ని గంటలు తారట్లా
డాడు. చివరకు అతని శ్రమ ఫలించింది. మంచి దుస్తులు ధరించి నల్లటి
కళ్ళతో, ఒక అందమైన స్త్రీ "మిస్టర్ ఆర్" దుకాణములోనికి ప్రవేశించి,
నేరుగా "మిస్టరు ఆర్ "దగ్గరకు వెళ్ళి, అతని కౌంటరు దగ్గర నిలబడింది
మిస్టర్ ఆర్.... ఆమెను చూడగానే, తన కుర్చీలో నుంచి లేచి, ఆమెతో
చాలాసేపు, తక్కువ స్వరముతో మాట్లాడాడు. తర్వాత కొన్ని
వెండి, బంగారు నాణాలు 'మిస్టరు ఆర్....' ఆమె కందిచ్చాడు. అది ఆమె
తీసుకొని దుకాణం బయటికి వచ్చి రోడ్డు మీద చకచకా నడిచిపోయింది.
ఇదంతా దుకాణం దగ్గర అటూయిటూ తిరుగుతూ, మిస్టర్ కీలింగు కని
పెట్టాడు.

2

మరునాడు నియమిత వేళకు కిలింగు పార్టీ, అతని కార్యాలయానికి
వచ్చింది. ఆమెకు తన చూసిందంతా చెప్పాడు.

"ఓ!.... కాబట్టి నా అనుమానం నిజమేనన్న మాట! ఆమెతో
తిరిగి డబ్బంతా, నాభర్త ఆమెకు దారపోస్తున్నాడు. నేటికి మా కుటుంబ
వ్యవహారాలు ఈ పరిస్థితికి వచ్చాయి..." అంటూ తన కన్నీటిని తన
చేతితో తుడుచుకొంది.

"శ్రీమతి ఆర్ గారూ! ఈ విషయంలో నన్నేమి చెయ్య మంటారు
మీకెటువంటి సహాయం కావాలి? చెప్పండి!.... అన్నాడు మిస్టరు కీలింగు.

"ఈ విషయాన్ని స్వయంగా నా కళ్ళతో చూడాలను కొంటున్నాను
నాకు జరుగుతున్న విషయం చూసి చెప్పగల సాక్షులు కూడా కావాలి ఈ
దౌర్భాగ్యపు జీవితం యింకా ఎంతో కాలం భరించలేను. కోర్టులో విడా
కులు తీసుకొంటాను.

ఆమె యింకో పది డాలర్ల నోటును మిస్టరు కీలింగుకి యిచ్చి వెళ్ళి పోయింది. రెండవ రోజున ఆమె మళ్ళీ తన ఆఫీసుకు వచ్చినప్పుడు మిస్టర్ కీలింగు యిలా చెప్పాడు. "ఈ సాయంకాలము యేదో నెపంతో మీ దుకాణానికి వెళ్ళాను. నిన్న నేను చూసిన యువతి అప్పటికే అక్కడ వుంది. కాని ఆమె యెక్కువ సేపు వుండలేదు. వెళుతూ మీ ఆయనతో యిలా చెప్పింది— "మిస్టర్ ఛార్లెసు! మీరు చెప్పినట్లుగానే ఈరోజు రాత్రి మనము యే హోటలులోనైనా భోజనం చేద్దాం. తర్వాత స్టోరుకు వచ్చి సరదాగా మాట్లాడుకొందాము. అదై మందు గొలుసు తయారుచెయ్యటంలో మీకు యెటువంటి ఆటంకము కలగచెయ్యను "....అంటూ వెళ్ళిపోయింది. కాబట్టి మీ అనుమానాలు ఋజువు చేసుకోటానికి ఈ రాత్రి మంచి సమయం...."

"అన్నాడు మిస్టర్ కీలింగు."

"నా భర్త యెంత మోసగాడు!" ఆమె కన్నీళ్ళు పెట్టుకొంది. "మధ్యాహ్నం భోజన సమయంలో, ఈరాత్రి దుకాణములో నాకు చాలా పని వుంది. నేను వచ్చేటప్పటికి చాలా ప్రొద్దు పోతుంది నా కోసం చూడక భోజనంచేసి పడుకో! నేను ఆలస్యంగా వస్తాను." అన్నాడు అంటే ఆయన యిలా ఈ మనిషితో ఈరాత్రి జల్సాచేద్దామను కొన్నాడన్న మాట!"

అన్నది మిస్సెస్ ఆర్....

"మీరు ఈరోజు రాత్రి మీదుకాణములో దాక్కొని వుంటే వారు యేమి మాట్లాడేది మీరు వినవచ్చు. ఆయన ప్రవర్తన మీరు నిర్ధారణ చేసుకొన్న తర్వాత సాక్షులతో, మీరు ఆయన్ని యెదుర్కోవచ్చు...."అన్నాడు కీలింగు.

"అలా చేస్తే బావుంటుంది! ఆ వీధిలో కాపలాతిరిగే రక్షకభటుడు, మా కుటుంబానికి పరిచయస్థుడే! రాత్రి వేళల అతను డ్యూటీలో మా దుకాణానికి దగ్గరలోనే వుంటాడు. మీరు అతనిని కలిసి విషయాలు అన్నీ చెప్పి నేను పిల్చినప్పుడు మీతో పాటు అతడు గూడా సాక్షిగా హాజరు కావచ్చు!" అన్నది ఆ అందమైన, నల్లటి ముసుగు వేసుకొన్న మిస్టరు కీలింగు 'క్లయింటు.'

"అలాగే! నేనతనితో మాట్లాడి అతని సహాయం కోరతాను. మీరు ఈరాత్రి కొంచెము ముందుగా మా ఆఫీసుకు వస్తే, మీ ఆయనను యెలా పట్టుకోవాలో ప్లాను తయారు చేసుకొందాము...."

3

డిటెక్టివు కీలింగు ఆ వీధిలో పహరా వుండే రక్షకభటుని కలసి తమ కథ అంతా చెప్పాడు.

"చాలా వింతగా వుంది. 'మిస్టర్ ఆర్....' అంత సరసుడనుకో లేదు. కాని ఈ రోజుల్లో యెవరు మంచి వాళ్ళో, యెవరు చెడ్డ వాళ్ళో చెప్పలేము. కాబట్టి అతని భార్య అతనిని పట్టుకోవాలను కొంటున్నదన్న మాట. ఆ దుకాణానికి వెనుక చిన్న గది వుంది ఆ గదిలో 'మిస్టర్ ఆర్....' బొగ్గునూ, పాతపెట్టెలనూ వుంచుతాడు. స్టోరులోకి ప్రవేశించే ఆగది తాళం వేసి వుంటుంది. ద్వారంగుండా మీరు ఆమెను స్టోరులోకి తీసుకురాగలిగితే, స్టోరులో యెక్కడో ఒకచోట ఆమె దాక్కొని, వాళ్ళ చేష్టలను గమనించవచ్చు. ఇటువంటి వ్యవహారాలలో జోక్యం కలిగించు కోవటం నా కంత యిష్టముండదు కాని 'శ్రీమతి ఆర్'ను చిన్న పిల్లగా వున్నప్పటి నుంచి యెరుగుదును. కాబట్టి ఆమెకు సహాయం చెయ్యటం అంటే నాకు యిష్టమే ..."

ఆ సాయంకాలము చీకటి పడేలోగా, డిటెక్టివు పార్టీ ఆత్రంగా అతని కార్యాలయానికి వచ్చింది. ఆమె నల్లటి దుస్తులు ధరించింది. గుండ్రటి నల్లటి టోపి పెట్టుకొంది. ముఖం మీద ముసుగు వేసుకొంది.

"మిస్టర్ ఛార్లీ ఈ వేషంలో నన్ను గుర్తు పట్టలేడు!" ఆమె అన్నది.

'ఆర్' నగల దుకాణానికి యెదురుగా వున్న గొందులో మిస్టర్ కీలింగు ఆ యువతితో కొంత సేపు కాలక్షేపం చేసాడు. సరిగా రాత్రి యెనిమిది గంటలకు ముందుగా చెప్పిన యువతి మిస్టరు 'ఆర్' చేయిపట్టు

కొని బయటకు వచ్చి బహుశా రాత్రి భోజనానికి కాబోలు హడావుడిగా వెళ్ళారు.

'మిస్టర్ ఆర్' వెంబడి వున్న స్త్రీ యొక్క హస్తము వణుకుతున్నట్లుగా అనిపించింది మన డిటెక్టివు కీలింగుకు.

"దుర్మార్గుడు! కీలింగు క్లయింటు అన్నది. "అతడు తన స్నేహితురాలితో సరసాలాడుతూ వుంటే, నేను యింటి దగ్గర, అమాయకంగా తన కోసం కాచుకొని వుంటాననుకొంటున్నాడు! అహా! పురుషులెంత మోసగాళ్ళు!"

కీలింగు తన క్లయింటును ఒక పెద్ద హాలుగుండా, స్టోరువెనకవున్న గదీ దగ్గరకు తీసుకొని వెళ్ళాడు. ఆ గది వెనుక తలుపుకు తాళం వేసి లేదు. ఆ గదిలోకి వాళ్ళిద్దరూ ప్రవేశించారు.

"నగల దుకాణంలో నా భర్త పని చేసే బెంచి ముందు ఒక పెద్ద టేబిలు వుంది. దాని మీద గుడ్డ నేలకు వ్రేలుతూ వుంటుంది. నేను ఆ టేబులు క్రింద కూర్చోగలిగితే, వాళ్ళిద్దరి సంభాషణ తేలికగా వినగలను." అన్నది కీలింగు క్లయింటు

4

మిస్టర్ కీలింగు తన దగ్గర వున్న తాళం చెవి గుత్తిలో నుంచి చెవితో, ఆ వెనుక గది తాళం తేలికగా తీయగల్గాడు. వాళ్ళు తలుపు తెరచుకొని నగల దుకాణం లోకి అడుగు పెట్ట గలిగారు. అక్కడ లోపల ఒక నల్లటి యినుప బొయ్యిలో, గ్యాసు మెల్లగా మండుతున్నది.

క్లీలింగు క్లయింటు అయిన ఆ అందమైన యువతి అన్నది. 'నేను లోపలతలుపు వేసుకొని వుంటాను. మీరు నాభర్తను అవగలాడిని కని పెట్టి వుండండి వాళ్ళు హోటలులో యింకా భోజనం చేస్తున్నారేమో చూడండి వాళ్ళు భోజనం చేస్తున్నట్టయితే, తిరిగి రావటానికి బయలు దేరగానే మీరు వచ్చి ఈ తలుపు మీద మూడుసార్లు తట్టండి. అప్పుడు వాళ్ళు వచ్చినట్లు నేను తెలుసుకొంటాను. వాళ్ళ మాటలు కొంత సేపు విన్న తర్వాత నేను తలుపు తీసుకొని బయటకు వచ్చి ఆ దోషులిద్దరినీ పట్టు కొంటాను. మీరు

అప్పుడిక్కడ వుండటం అవసరం. విందు కంటె ఆ దుర్మార్గపు జంట నాకపాయం తలపెట్ట వచ్చుగదా! నా రక్షణ కోసం మీరు వుండటం అవసరం....!" అన్నది.

డిటెక్టివ్ కీలింగు నెమ్మదిగా బయటికి వెళ్ళి, మిస్టరు 'ఆర్'ను అతని వెంబడి వున్న అతని సరసురాలిని వెంబడించాడు వాళ్ళు రెస్టారెంటులో ఒక గది తీసుకొని, రాత్రిభోజనానికి 'ఆర్డరు' చేయటం చూసాడు. వాళ్ళు భోజనం చేసి బయటకు వచ్చేదాకా అతను బయటనే తారట్లాడుతూ వాళ్ళు బయటకు రాగానే వెంటనే నగలదుకాణం దగ్గరకు వచ్చి దానికి వెనక గదిలోకి వెళ్ళి తలుపు మీద మూడుసార్లు శబ్దం చేసాడు.

కొద్దినిమిషాలలో ఆ నగల వర్తకుడు తన వెంబడి వున్న స్త్రీతో నగల దుకాణంలోకి ప్రవేశించాడు. తలుపుకు వున్న కంతలో నుంచి లోపల దీపము పెద్దగా వెలుగుతున్నట్లు గమనించాడు. వాళ్ళిద్దరూ చాలా సేపు మంచి పరిచయస్థుల లాగా మాట్లాడటం అతను విన్నాడు. కాని వారి మాటలు అతనికి సరిగా విన్పించలేదు.

అతడు మళ్ళీ వీధిలోకి వచ్చి దుకాణపు కిటికీలో నుంచి చూసాడు. మిస్టర్ 'ఆర్' తన బల్ల దగ్గర పనిచేసు కొంటున్నాడు. ఆ నల్లటి జుట్టు యువతి అతనికి దగ్గరగా కూర్చుని మాట్లాడుతున్నది.

"ఇంకా కొంచ సేపు చూద్దాం" అనుకొన్నాడు మిస్టరు కీలింగు.

వీధిలో మెల్లగా నడుచు కొంటూ వచ్చాడు.

ఆ వీధి చివర రక్షక భటుడు నిల్చొని వున్నాడు.

'మిస్టర్ ఆర్' యొక్క సతీమణి నగల దుకాణంలో దాక్కొని వున్నదనీ తాము వేసుకొన్న ప్లాను, విజయవంతముగా సాగుతున్నదనీ, అతనితో చెప్పాడు.

"నేను యిప్పుడు దుకాణం వెనక్కి వెళతాను, నా క్లయింట్ పిల్చినప్పుడు సిద్ధంగా వుండటానికి...." అన్నాడు కీలింగు.

రక్షక భటుడు డిటెక్టివ్‌తో నగల దుకాణానికి వచ్చి కిటికీ గుండా లోపలికి చూసాడు.

"వాళ్ళిద్దరూ హుషారుగా వున్నట్లున్నారు" అన్నాడు పోలీసు "మీరు చెప్పిని ఆ రెండో యువతి ఎక్కడ?"

"అదిగో! ఆయన ప్రక్కన కూర్చున్న స్త్రీయేగదా!"

"ఆమెను గురించి కాదు నే అడిగేది....'మిస్టర్ ఆర్'తో బయటికి వెళ్ళిన అతని స్నేహితురాలి గురించి—"

"నేనూ అదే చెప్తున్నాను!" అన్నాడు డిటెక్టివ్

"మీరేదో పొరపాటు పడుతున్నట్లున్నారు. మిస్టర్ ఆర్ తో వున్న యువతిని మీరెరుగుదురా?" అడిగాడు రక్షకభటుడు.

"ఆమెతో నేగదా యిప్పుడతను బయటకు వెళ్ళింది."

"మహానుభావా! ఆమె, మిస్టర్ ఆర్ సతీమణి. ఆమెను నేను పదిహేను సంవత్సరముల నుంచి యెరుగుదును"

"ఆ! అలాగా? అయితే టేబిలు క్రింద దాక్కొన్న స్త్రీ యెవరు? ఓయి భగవంతుడా!" మిస్టర్ కీలింగు గాభరాతో నగల దుకాణం తలుపు తన్నాడు.

'మిస్టర్ ఆర్' ముందుకు వచ్చి తలుపు తీసాడు కీలింగు.... రక్షకభటుడు దుకాణంలోకి ప్రవేశించారు.

"ఆ టేబిల్ క్రింద చూడండి త్వరగా?" అంటూ పోలీసుని తొందర చేసాడు.

పోలీసు, క్రిందదాకా వ్రేలాడుతున్న బల్లమీద గుడ్డను పైకి లాగి, తీసి.... క్రింద వున్న ఓ నల్లటి దుస్తులనూ, నల్లటి ముసుగునూ, ఓ స్త్రీ ధరించే నల్లటి 'విగ్'ను బయటికి తీసాడు.

"ఈమె మీ భార్యేనా?" అంటూ 'ఆర్' ప్రక్కన నిల్చొని ఆశ్చర్యంగా చూస్తున్న నల్లటికళ్ళ స్త్రీని చూపించి అడిగాడు డిటెక్టివ్ కీలింగు.

"ఆమె నా భార్యేస్వామీ! మీరు నా దుకాణం తలుపు బాది, టేబిలు క్రింద వెతుకుతూ ఎందు కింత గందరగోళం చేస్తున్నారు? "అడిగాడు మిస్టర్ ఆర్.

"మీ 'షో' కేసులు చూసుకోండి!" అన్నాడు పరిస్థితిని అర్థంచేసుకొన్న పోలీసు.

5

పోయిన డైమండు వుంగరాలు గడియారాల ఖరీదు 800 డాలర్లుగా మరునాడు డిటెక్టివ్ కీలింగు లెఖ్ఖ కట్టాడు. ఆ డబ్బంతా 'మిస్టర్ ఆర్' కు చెల్లించాడు తన ఖాతాలో నుంచి.

'మిస్టర్ ఆర్'కు ఆ రాత్రి జరిగిన తతంగమంతా డిటెక్టివ్ కీలింగు వివరించాడు. ఓ గంట తర్వాత మిస్టర్ కీలింగు, తన కార్యాలయంలో కూర్చుని దొంగల "ఆల్బము"లు తిరగేసాడు చివరకు ఆయనకు ఒక బొమ్మ కన్పించింది.

ఆ చిత్రాన్ని చూసి డిటెక్టివ్ తన జుట్టు పీక్కొన్నాడు. అది ఒక అందమైన, సున్నితమైన ముఖము గల ఓ యువకుని చిత్రము ఆ చిత్రము క్రింద అతని గురించి యిలా వ్రాసి వుంది

"జేమ్సు హెచ్ మిగ్గిల్సు అసలు పేరు స్లిక్‌సైమను ... వురఫ్ దీ లీడింగ్ లిడో, వురఫ్ బుంకో కేటు, వురఫ్ ది జిమ్మీ స్నీక్,.... ప్రఖ్యాత చోర శిఖామణి తరచుగా ఆడ వేషాలలో మోసగిస్తాడు. నమ్మ తగిన మనిషిగా కనిపిస్తాడు. చాలా అపాయకారి కాన్సాస్ పట్టణములోనూ, ఓష్‌కాష్ లోనూ, న్యూ ఆర్లియన్సులోనూ, మరి మూమిల్ వాకీ లోనూ దొంగతనాలు చేసాడు. అతని కోసం అన్వేషణ జరుగు తున్నది...."

తర్వాత ఈ కారణం చేత మిస్టర్ థామస్ కీలింగు తన అపరాధ పరిశోధకవృత్తిని 'హూస్టను' పట్టణంలో కొనసాగించలేదు.

—)o(—

హెయిర్ టానిక్

(Barber Shop Adventure)

పోస్టుమాను క్షురకశాలలో ప్రవేశించేటప్పటికి అక్కడ వున్న కుర్చీలన్నీ వాడకం దార్లతో నిండిపోయి వున్నాయి. తను యింక వెళ్ళి పోవచ్చని ఆశపడ్డాడు. కాని క్షురకశాల యజమాని నిరాశావాదముతో కూడిన భయంకరమైన చూపులు అతనిమీద ప్రసరించాయి.

"ఈ సారి మీ వంతు!" అంటూ ఒక క్రూరమైన చూపు క్షురకశాల యజమాని ఆతనివంక విసిరాడు. నిరాశతోకూడిన హృదయంతో పోస్టుమాను గోడకు బిగించబడిన కుర్చీలో కూలబడ్డాడు.

కొద్ది నిమిషాలలోనే పెద్ద రణగొణధ్వనితో చప్పుడయింది. కుర్చీలో కూర్చున్న వాడకందారు కుర్చీలో నుంచి భయంకరంగా నెట్టివేయబడ్డాడు. అతడు దుకాణంలో నుంచి పరుగెత్తుతుంటే నల్లటి ఆఫ్రికను ఆ వాడకందారుకు అంతదాకా క్షవరం చేసిన క్షురక సహాయకుడు, అరిగిపోయి, సూదులలాంటి చివరలు కల్గిన చీపురుతో అతని వంటిని శుభ్రం చేస్తూ వెంబడి పడ్డారు.

సూర్యకాంతివంక పోస్టుమేను దీర్ఘంగా చూసి, తన మెడలో కట్టుకొన్న "పై"కి తన అడ్రెసు వ్రాసిన చిన్న కాగితాన్ని పిన్నుతో గుచ్చాడు. జరగరానిది జరిగినప్పుడు తనను ఎవరైనా గుర్తించటానికి వీలుగా.

తనకు 'క్రాపు' అక్కరలేదనీ 'గెడ్డం' మాత్రం చెయ్యమని పోస్టుమాను క్షురకమహాశయుడైన విక్టరుకు చెప్పడంతో అతడు ఓ నిందాపూర్వకమైన, అసహ్యకరమైన చూపు పోస్టుమాను వంక చూసాడు.

కుర్చీని సరియైన స్థానంలోకి సర్ది, సబ్బునురగను విలియమ్స్ (పోస్టుమాను) గెడ్డంమీద బ్రష్‌తో యిష్టమొచ్చినట్లుగా పులిమాడు. ఆ సబ్బు నురగకి పోస్టుమేనుకి చిన్పించటం కన్పించడంపోయి, అఘ్రాణ శక్తికూడా నశించి ఓ శవంలాగా కుర్చీలో కూలబడ్డాడు పోస్టుమాను విలియమ్స్. పెద్ద శబ్దంతో, స్టీలుతో చేయబడిన పరికరంతో గెడ్డంమీద సబ్బు నురుగును 'విక్టరు' బరికినప్పుడు మాత్రం ఒక్కసారిగా విలియమ్స్‌కు మెళకువ వచ్చింది. ఆ తుడిచిన నురగను ఆ స్టీలు పరికరంతో 'విలియమ్స్' చొక్కాకు తుడుస్తున్నాడు క్షురకశాల యజమాని విక్టర్.

"ప్రతి ఆడపిల్లా యిప్పుడు సైకిలు త్రొక్కుతున్నది మగరాయుడిలాగా! రోడ్డుమీద సైకిలు నడపటానికి అందరికీ స్వాతంత్ర్యము వుందిగదా! వాళ్ళ నెవరాపుతారు? కొన్నాళ్ళుపోతే సైకిలుత్రొక్కే ఆడవాళ్ళను మగవాళ్ళు వింతగా చూడటం మానేస్తారు. ఆడపిల్లలకుగూడా అది మంచి వ్యాయామమే గదా!" అంటూ క్షురకశాల యజమాని విక్టరు తన సహజ ధోరణిలో వాగటం మొదలు పెట్టాడు.

"వాళ్ళు మగరాయుళ్ళలాగా దుస్తులు వేసుకొని యిలా సైకిళ్ళు త్రొక్కకపోతే వ్యాయామమెందుకు నేర్చుకోకూడదు? రెండు రోజుల క్రిందట జరిగిన కథ మీకు చెప్తే నమ్మరేమో?"

సబ్బు నురగతో యుద్ధంచేస్తూ విక్టరు విలియమ్స్‌వంక భయంకరంగా తేరిపార చూసాడు. తను చెప్పింది తన వాడకందారు విలియమ్స్ నమ్ముతున్నాడని ఆతనికి గట్టి నమ్మకమే!

"నాకు ఒక భాగ్యవంతుల యింటినుంచి కబురు వచ్చింది. నా కత్తులు కతారులతో రమ్మని....నేను యిల్లు వెతుక్కుంటూ వెళ్ళాను. వెళ్ళి యింటిగేటు తట్టాను. గేటులోపల కాంపౌండులో ఓ అమ్మాయి సైకిలు త్రొక్కుతున్నది. ఆ అమ్మాయి మగవాడిలాగా దుస్తులు వేసుకొంది. నేను గేటు తెరవగానే ఓ పెద్దామె వచ్చి, నన్ను తీసుకువెళ్ళి ముందువున్న ఓ గదిలో కూర్చోమన్నది. కొద్ది నిమిషాల తర్వాత ఓ అందమైన అమ్మాయి యింటి లోపలి నుంచి వచ్చి, నా ముందున్న కుర్చీలో కూర్చుంది.

"జుట్టు కత్తిరించండి....నా జుట్టు రెండింతలు తగ్గించండి.... త్వరగా పని కానివ్వండి.... అవతల నాకు పని వుంది" అన్నది ఆ అందమైన పిల్ల.

నేను ఆశ్చర్యపోయాను. నా పనిముట్లను సిద్ధం చేసుకొన్నాను. ఆ ఇంట్లో ఆ అమ్మాయిదే రాజ్యం అనితెలుసుకొన్నాను. ఆ ముసలామె నాతో రహస్యంగా అన్నది "మాఅమ్మాయి ఈవూళ్ళో ఆడపిల్లల లీడర్! స్త్రీల వున్నతికోసం పాటుపడుతున్నది. మగవాళ్ళలాగా మీసం కూడా పెంచు కోవాలనుకొంటున్నది!"

ఆ అందమైన అమ్మాయి కుర్చీలో వెనక్కి వాలి కళ్ళుమూసుకొంది. నా బ్రష్‌ను సబ్బునురగలో ముంచి దానిని ఆ అమ్మాయి పై పెదవిమీదుగా పూసాను. అలా చేసానో లేదో ఆ అమ్మాయి కుర్చీలో నుంచి రౌద్రంగా లేచింది. ఆమె కళ్లు కోపంతో యెర్రబడ్డాయి.

"నన్ను అగౌరవ పరచటానికి నీకెంత ధైర్యము?" అంటూనన్ను తినేటట్లు చూసింది "వెంటనే యిక్కడి నుంచి బయటికి నడు!" అంటూ నా మీద పెద్దగా అరిచింది.

నేను నిర్ఘాంతపోయాను. నా సామానంతా సర్దుకొని వాకిలి దగ్గరకు వెళ్ళాను. అప్పుడు కొంచెము ధైర్యం తెచ్చుకొని....ఆ అమ్మాయిని అడిగాను.

"అమ్మాయిగారూ! మిమ్మల్ని అగౌరవ పరిచేపని యేదీ నేనుచెయ్య లేదని నాకు బాగా నమ్మకం! నేను యెప్పుడూ యిటువంటి సమయాల్లో పెద్ద మనిషిగానే ప్రవర్తిస్తాను ఏ రకంగా మిమ్మల్ని అవమానపరచాను. దయచేసి చెప్పండి" అంటూ నెమ్మదిగా నాలుగు మాటలు మాట్లాడాను ధైర్యంతో.

"నీవు త్వరగా బయటికి దయచెయ్యి—ఒక మగవాడు ముద్దు పెట్టుకొన్నప్పుడు నేను తెలుసుకోలేనా....?" అన్నది.

"ఆ ముక్కలు వింటూ నేను బయటికి వచ్చేసాను. ఈ విషయంలో మీ అభిప్రాయమేమిటి?" అంటూ నన్ను అడుగుతూ ఓ బొన్ను సబ్బు నురగను నా నోటిమీద కొట్టాడు ఆ క్షురక మహాశయుడు.

"మీరు చెప్పిన కథ నమ్మటం కొంచెం కష్టమే!" అని పోస్టుమాన్ విలియమ్స్ తని ధైర్యానంతా కూడకట్టుకొని అన్నాడు.

క్షురక మహాశయుడు గెడ్డం చెయ్యటం ఆపాడు. ఒక క్రూరమైన వాడి చూపుతో పోస్టుమానువంక చూసాడు.

"నీవు చెప్పినట్లుగా జరిగి వుండవచ్చునటంలో సందేహములేదు!" పోస్టుమాన్ త్వరత్వరగా చెప్పాడు.

"అయ్యా! ఆ కథ అలా జరిగింది. నేను నా మాటని పూరకనే నమ్మమనటం లేదు ...చూడండి....ఆ షెల్ఫు మీద....కుడి ప్రక్కనుంచి వున్న మూడో నీలపు 'మగ్గు'ను దానిని నేనక్కడికి తీసుకు వెళ్ళాను ... ఇప్పుడయినా మీరు నమ్ముతారనుకుంటాను."

పోస్టుమాన్ విలియమ్స్ క్షురశాల యజమాని చెప్పేది మౌనంగా వింటున్నాడు.

"ఇంక 'బోడిగుండు తలల' వాళ్ళ విషయం వస్తే ఓ పెద్ద మనిషి నన్ను యెలా మోసం చేసిందీ చెప్తాను."

"ఇక్కడే ఈ పట్టణంలోనే ప్రపంచంలో యే టానిక్కూ గూడా, బోడితలలమీద వెంట్రుకలు మొలిపించలేదని మీకూ నాకూ తెలుసు! జుట్టు పెరుగుతుందంటూ అనేకమైన టానిక్కులు మార్కెట్టులో వున్నాయి. ఓ క్రొత్త పెద్దమనిషి ఓ సారి నా సెలూన్‌కి వచ్చాడు. ఆయన తల.... టీ కప్పు....ఎంత నున్నగా వున్నదో—అంత నున్నగా వుందనుకోండి. పాపం ఆయన జుట్టు పెరగటానికి....చాలా....టానిక్కులు వాడాడట— కాని ఓ వెంట్రుకగూడా పెరగలేదట! అతడు పూరిబయట కూరగాయల తోట పెంచుతున్నాడు. అతడు మా సెలూనుకి....ఆ తర్వాత .... వరుసగా మూడుసార్లు....క్షౌరానికి వచ్చాడు. అప్పుడు ఓ సారి నన్ను అడిగాడు, తన బోడి తలమీద జుట్టు మొలవటానికి యేదన్నా టానిక్కు చెప్పమని"

ఇక్కడ క్షురకమహాశయుడు ముందున్న షెల్ఫులో నుంచి 'స్టికింగు ప్లాస్టరు' ముక్కనుతీసుకొని, దానిలో ఒక ముక్క కత్తిరించి....దానిని

వాడికందారు "విలియమ్స్" గెడ్డంమీద గాయం తగిలినచోట అంటించాడు.

"ఒక క్షౌరశాలలో జుట్టు మొలవటానికి టానిక్ కావాలని అడుగుతే యెవరు యివ్వకుండా వుంటారు. యేదో ఒక టానిక్కు! అతడు దానిని చాలాకాలం వాడిన తర్వాతగాని, దాని వలన ప్రయోజనం శూన్యం అని తెలుసుకోలేడు గదా! ఈలోగా మా 'సెలూను'లో ఎన్నో సార్లు క్షౌరం చేయించుకొంటాడు గదా!

"నేను ఆ పెద్దమనిషికి చెప్పాను....నేను ఒక జుట్టు టానిక్కును కనిపెట్టానని....దానిని విడవకుండా చాలా కాలం వాడితే....బోడి తలలు జుట్టుతో విరగపూస్తాయని నమ్మకంగా చెప్పాను నేను వెంటనే ఓ కాగితం ముక్క తీసుకొని నోటికి వచ్చిన దినుసులు (ఔషధులు) వ్రాశాను. ఆ దినుసులతో యే పచారీ దుకాణంలోనో టానిక్కు తయారుచేయించి వాడమన్నాను. కాని ఆ 'ఫార్ములా' మాత్రం యెవరికీ చెప్పవద్దన్నాను. ఎందుకంటే ఆ టానిక్ పేటెంటు హక్కులు రిజిష్టరు చేయించుకోబోతున్నాననీ పెద్ద యెత్తున ఆ టానిక్ తయారుచేసి మార్కెట్టులో పెట్టేటందుకు ఆలోచిస్తున్నాననీ అతనికి చెప్పాను. అతని కిచ్చిన పట్టీలో ప్రమాదము కాని దినుసులనే వుటంకించాను. కొన్ని 'తార్తారుసాల్టు'లూ, 'అల్మండు పండ్ల' నూనె, రోజ్‌వాటరు, చెట్లకొమ్మల నుంచి కారేటటువంటి ఓ రకమైన ద్రవమూ....బేరమ్మూ (అల్కహాలుతో "బే చెట్టు" ఆకు కలిపి చేసిన తియ్యటి వాసన వచ్చే ఓ రకమైన ద్రవము) యింకా ఏవేవో దినుసులు ఆ పట్టీలో వున్నాయి. నా తలలోకి వచ్చిన ప్రతి దినుసూ ఆ పట్టీలో వ్రాశాను. అరగంట తర్వాత అడిగితే ఆ పట్టీలో వ్రాసిన వస్తువుల పేర్లు నేనే చెప్పలేక పొయ్యాను....ఆ పెద్దమనిషి ఆ పట్టీ తీసుకుని నాకొక డాలరు యిచ్చాడు."

"తర్వాత ఆ వారంలో అతడు రెండుసార్లు నా సెలూనుకి వచ్చి నేను యిచ్చిన పట్టీతో తయారు చేయించిన టానిక్కును క్రమం తప్పకుండా తను వాడుతున్నట్లు చెప్పాడు. తర్వాత ఓ మంచి సాయంకాలము అతడు నా షాపుకు వచ్చి తన టోపీతీసి గోడకు తగిలించాడు. అతడి తల

మీద పెరిగిన మెత్తటి, నల్లటి అందమైన జుట్టును చూసి నాకు తల తిరిగి నట్లయింది. అతని తలమీద నల్లటిజుట్టు యెంత మనోహరంగా పెరుగు తున్నదీ! రెండు వారాల క్రిందట అతడిది నున్నటి బోడి తలేగదా!

"అతడు చాలా సంతోషముగా నా టానిక్కును గొప్పగా మెచ్చు కొన్నాడు. నేను అతనికి క్షౌరంచేస్తూ, నేను అతనికి వ్రాసియిచ్చిన పట్టీ లోని దినుసులూ, ద్రవాలూ యేమిటా అని ఆలోచించ సాగాను. కాని నా దురదృష్టంకొద్దీ వాటిలో సగంకూడా నాకు జ్ఞాపకానికి రాలేదు. నాతప్పు తర్థమయింది. నేను అనుకోకుండా జుట్టు పెరగటానికి పనికివచ్చే అద్భుత మైన "ఫార్ములా"ను సృష్టించానని, దానితో ప్రపంచ మార్కెట్టులో టానిక్కు తయారుచేసి బజారులో విక్రయిస్తే లక్షలు, కోట్ల డాలర్లు సంపా దించవచ్చనీ నాకు తట్టింది. ఏ బంగారపు గనికూడా ఆ "పట్టీ" ముందు సరితూగదని పించింది. ఎలాగైనాసరే ఆ "ఫార్ములా" అతని వద్దనుంచి సంపాయించాలని నిశ్చయించుకొన్నాను.

అతను వెళ్ళానికి వుద్యుక్తుడవుతుండగా, నేనతనితో నిర్లక్ష్య ముగా యిలా అన్నాను "మిస్టర్ జాన్సన్‌గారూ! "ఫార్ములా" వ్రాసుకొన్న నా చిన్ననోటు పుస్తకం యెక్కడో పెట్టి మరచాను. ఈ వుదయం నేను ఒకటో, రెండో ఆ టానిక్కులు తయారు చెయ్యాలనుకొంటున్నాను. నేను మీకిచ్చిన పట్టీ మీ దగ్గరుంటే నాకది ఒకసారి యిస్తే కాపీ చేసుకొని వెంటనే యిచ్చేస్తాను" అన్నాను.

నేను చెప్పటంలో బాగా ఆతురత ప్రకటించి వుంటాను. ఎందు కంటే జాన్సన్ నా వంక అదేపనిగా కొన్ని నిమిషాలుచూసి, పెద్దగా నవ్వేసాడు.

"విక్టర్‌గారూ! మీ దగ్గర ఆ "ఫార్ములా" వుందని నేననుకోను. మీరు అప్పటికప్పుడు నోటికి వచ్చినట్లుగా పట్టీవ్రాసి నా చేతికిచ్చారు. కాని ఆ పట్టీలో మీరు యేమి వ్రాసారో, మీకిప్పుడు జ్ఞాపకం లేదు. నేను మీరనుకొన్నంత అమాయకుణ్ణి కాదండీ! నాకు తెలుసు ఆ జుట్టును పెంచే టానిక్కు కోట్ల డాలర్ల విలువచేస్తుందని. ఆ పట్టీని జాగ్రత్తచేసి, ఆ

ప్రకారం టానిక్కు తయారుచేసి, మార్కెట్టులో పెడితే బోలెడంత డబ్బు నేను సంపాదించుకోగలను...."

అంటూ అతడు వెళ్ళిపోవటానికి ఉద్యుక్తుడైనాడు. నేనతనిని వెనక్కిపిల్చి, వెనక గదిలో ఓ అరగంట ఈ విషయం మాట్లాడాను

"చివరకు అతనితో బేరం కుదుర్చుకొన్నాను. 250 డాలర్లకు ఆ "ఫార్ములా" అతను నాకు అమ్మేటట్లు. వెంటనే నేను బ్యాంకుకు వెళ్ళి అక్కడ యిల్లు కట్టుకోవాలని భద్రంగా నేను దాచిన డబ్బు 250 డాలర్లు తీసుకొచ్చి అతనికి చెల్లించి ఆ"ఫార్ములా" అతని దగ్గర కొనుక్కున్నాను. దానిమీద తన సర్వహక్కులూ వదులుకొంటున్నట్లు అతనొక పత్రంగూడా వ్రాసిచ్చాడు. పైగా, ఆ టానిక్కు బోడి తలల మీద రెండువారాలలో జుట్టును పెంచుతుందని ప్రశంసా పత్రంకూడా వ్రాసి సంతకంచేసి యివ్వటానికిగూడా ఒప్పుకొన్నాడు."

పాపం ఆ క్షురకుడు దుఃఖపడుతున్నట్లు కనిపించాడు. పోస్టుమాన్ విలియమ్సు చొక్కాకాలరులోకి తన వ్రేళ్లు చొప్పించి గుండీ లాగేసాడు. ఆ గుండీ క్షౌరశాల తలుపుగుండా యెగిరి రోడ్డుమీద పడిపోయింది. అతను చెప్పటం సాగించాడు.

"రెండో రోజునుంచి నా పని ప్రారంభించాను. 'వాషింగుటన్' వెళ్ళి ఆ టానిక్కు తయారు చెయ్యటానికి పేటెంటు హక్కుల కోసం దరఖాస్తు పెట్టి "హౌస్టను" నగరంలోని ఓ పెద్ద "ఫరము"తో కూడా నా టానిక్కును మార్కెట్టులో పెట్టటానికి యేర్పాటు చేసుకొన్నాను. నా కళ్ళముందు "పదిలక్షల డాలర్లు కనబడుతున్నాయి. నా టానిక్కును తయారు చేసుకోటానికి ప్రత్యేకంగా ఓ గదిని అద్దెకు తీసుకొన్నాను. ఎందుకంటే ఆ టానిక్కును ఏ పదార్థాలతో, యే ద్రవములతో తయారు చేసున్నానో ఏ దుకాణదారుడికీ తెలియగూడదు. నేను టానిక్కుతయారు చేసి సీసాలలో పోసిన తర్వాత కంపెనీవాళ్ళు తమ కంపెనీ "లేబుల్సు"ను వాటిమీద అంటించుకొంటారు.

"నేను నా క్షౌరశాలలో పని మానేసి నా కాలమంతా ఈ టానిక్కును తయారు చెయ్యటంలో వినియోగించాను. ఆ తర్వాత జాన్సన్

రెండు వారాలలో నా క్షౌరశాలకు ఒకటి రెండుసార్లు వచ్చాడు. అతని తల మీద జుట్టు అందంగా పెరుగుతూనే వుంది. త్వరలో రెండువందల డాలర్లు ఖరీదు చేసే టానిక్కు సీసాలు తయారుచేసి మార్కెట్టులో విడుదలకు సిద్ధంగా వుంచాను. మిస్టర్ జాన్సన్ ఆ శనివారం "హౌస్టను" పట్టణానికి వచ్చి తన ప్రశంసా పత్రాన్ని నాకివ్వాలి. ఈ ప్రశంసా పత్రాన్ని నేను అన్ని పేపర్లలోనూ, బహిరంగ ప్రదేశాలలోనూ ప్రకటించి దేశాన్ని ఆశ్చర్యంలో ముంచటానికి సన్నాహాలు చేసుకొంటున్నాను.

"ఆ శనివారం వుదయం పదకొండు గంటలకు నేను టానిక్కులు తయారుచేసి, నా గదిలో కూర్చొని జాన్సన్ కోసం యెదురు చూస్తున్నాను. నా గది తలుపు తెరుచుకొని మిస్టర్ జాన్సన్ గదిలోకి ప్రవేశించాడు.

అతడు చాలా వుద్రేకంతోనూ. కోపంతోనూ వున్నట్లు కన్పించాడు

"చూడండి!" అతను అన్నాడు "మీ ముండమోపి టానిక్కుకేమి వచ్చింది?"

అతడు తన తలమీది టోపీ తీసాడు. అతడి తల "చైనాకోడిగుడ్డు" లాగా ప్రకాశిస్తున్నది.

"నా తలమీద జుట్టు నిన్న వుదయందాకా బాగానే పెరుగుతూ వస్తున్నది" అతడు చాలా దురుసుగా అన్నాడు. "కాని నిన్న వుదయం నుంచీ నా తలమీద వెంట్రుకలు ఒక్కొక్కటే రాలిపోవటం ప్రారంభించాయి. ఇవ్వాళ వుదయానికి నా తలమీద ఒక్క వెంట్రుకగూడా లేదు...."

నేను అతని బోడి తలను నిశితంగా పరిశీలించాను తలమీద యెక్కడా ఒక్క వెంట్రుకలేదు.

"మీ టానిక్కు వలన ప్రయోజనమేమిటి?" అతడు చాలాకోపంగా అన్నాడు. "పెరిగిన జుట్టు అంతా మళ్ళీ రాలిపోతే మీ టానిక్కు వలన యేమిటి వుపయోగం?"

"చూడండి జాన్సన్‌గారూ! నా కోసం నా టానిక్కుని గురించి మీరేమీ చెడ్డగా చెప్పకండి. అలా చెప్తే నేను నాశనమయి పోతాను. నాకు

ఈ ప్రపంచములో వున్న ఆస్తి అంతా అమ్మి వచ్చిన డబ్బంతా యీ టానిక్ తయారీ కోసం వెచ్చించాను. తిరిగి నా డబ్బు నాకు రావాలి. అది మీ జుట్టును పెంచింది కాబట్టి మీ యోగ్యతా పత్రం యిచ్చి నా దగ్గర వున్న సరుకునంతా అమ్ముకోనియ్యండి ఎలాగో మీకు దాని కోసం 250 డాలర్లు యిచ్చాను గదా! దానికోసమైనా నేను ఈ వూబిలోనుంచి బయట బడటానికి సహాయం చెయ్యండి!"

అంటూ జాన్సను నేను బ్రతిమాలుకొన్నాను. కాని జాన్సను చాలా పిచ్చికోపంలో వున్నాడు. నాతో చాలా దురుసుగానూ, కరుకుగానూ మాట్లాడాడు నేను అతనిని మోసం చేసానని నా మీద కోర్టులో కేసుపెట్టి, నాకు శిక్షపడేటట్లు చేస్తానని యేమేమో ప్రేలాడు.

చివరకు నేనతనికి యింకో వంద డాలర్లు యిచ్చేటట్లయితే ఆ టానిక్కుతో తన జుట్టు పెరిగినట్లు ప్రశంసా పత్రము వ్రాసి యిస్తాననీ, దానిని గురించి పెద్దగా మాట్లాడనని ఒప్పుకొన్నాడు. ఇప్పుడు తయారు చేసిన సరుకును సీసా ఒక్క డాలరు చొప్పున అమ్మితే నేను నష్టం లేకుండా బయట పడతాను.

"నేను బయకివెళ్ళి ఆ వందడాలర్లు అప్పుచేసి తీసుకొచ్చి అతనికిచ్చాను అప్పుడు జాన్సన్ ప్రశంసా పత్రముమీద సంతకం చేసి వెళ్ళిపోయాడు

2

"మరి మీ టానిక్కు సీసాలను అమ్మివేసారా?" క్షురకశాల యజమానికి కోపం రాలేనంత నెమ్మది గొంతుతో పోస్టుమాన్ విలియమ్సు అడిగాడు

ఆ క్షురకుడు పోస్టుమాన్ వంక ఓ అసహ్యమైన చూపుచూసి, వ్యంగం ధ్వనిస్తున్న స్వరంతో యిలా అన్నాడు.

10)

"అవును! నేను నా టానిక్కు సీసాలను అమ్మాను. సరిగా అయిదు సీసాలు అమ్మాను. ఒక నెల రోజులు క్రమం తప్పకుండా నా టానిక్కుని వాడిన తర్వాత టానిక్కును కొన్న విక్రేతలు వచ్చి, వాళ్ళ డబ్బు తిరిగి యిచ్చివేయమని నన్ను గోల చేసారు. ఆ టానిక్కు వాడిన ఒక్కరి తలమీద గూడా ఓ చిన్న వెంట్రుకగూడా మొలవలేదు మరి!"

"అయితే మరి ఆ టానిక్కు జాన్సన్ బోడి తల మీద జుట్టును యెలా పెరగనిచ్చింది? దానికి నీ సమాధానమేమిటి?" పోస్టుమాన్ విలియమ్సు అడిగాడు.

"నేనేం చెప్పేది? అదే మీకు చెప్పబోతున్నాను. పట్టణం చివరలో వున్న కూరగాయల తోటకు జాన్సన్ నివసిస్తున్నాడే....అక్కడకు వెళ్ళి అతనికోసం విచారించాను.

"మీరు యే జాన్సను కోసము అడిగేది?" అంటూ గేటు తీసుకొని బయటికి వచ్చిన వ్యక్తి అడిగాడు.

"బయటికి రండి ...ఇంకెవ్వరు? ఇక్కడవుండే జాన్సన్ కోసమే అడిగేది" అన్నాను.

"వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు!" అన్నాడా వ్యక్తి.

"ఇద్దరంటే మీ వుద్దేశ్యమేమిటి?" అంటూ అతన్ని అడిగాను. కాని నాలో నేను మళ్ళ ఆలోచించుకొని మళ్ళీ యిలా అడిగాను.

"జాన్సను....యిద్దరూ యెలా కనపడేవారు?"

"వాళ్ళిద్దరూ కవల పిల్లలయ్యా! వాళ్ళ ముఖాలనుబట్టిగానీ, వారి మాటలను బట్టిగానీ ఎవరు ఎవరో ఎవరూ పోల్చలేరు. వాళ్ళిద్దరికీ వున్న ముఖ్యమైన తేడా యేమిటంటే ఒకతనిది పూర్తి బట్టతల! ఇంకో అతనిది మంచి అందమైన జుట్టుతోవున్న తల!"

"ఇప్పుడు!" క్షౌరశాల యజమాని చెప్పాడు రెండు బొమ్మల "బేరమ్మ"ను. పోస్టుమాన్ చొక్కా ముందు భాగం నుంచి క్రిందకు పోస్తూ, "నేను చెప్పేదేమంటే ఆ యిద్దరి కవలలలో బోడి తలతను ఒక సారి, జుట్టు తల వున్నతను మరొక సారి నా సెలూనుకు వచ్చేవాళ్ళు. వాళ్ళిద్దరిలో బేదము నేనెప్పుడూ కనుక్కోలేకపోయ్యాను."

క్షురకుడు తన కథ ముగించే సమయానికి అతని సహాయకుడైన నల్లటి ఆఫ్రికన్ సూదులలాంటి అంచులు కల్గిన తన చీపురుతో, విలియమ్సు (పోస్టుమాన్) వంటిని శుభ్రం చెయ్యటానికి ముఖద్వారం దగ్గర నిలబడి వుండటం, కష్టమరైన విలియమ్సు చూసి ఆ క్షౌరశాలకు వెనక వున్న ద్వారం ద్వారా పరుగెత్తి ఒక యిటుకగోడ యెక్కి ప్రక్కవీధిలోకి తప్పించుకు పోయాడు.

—)o(—

'బిన్క్లీ' పత్రికా రచన ప్రయోగ పాఠశాల

("Binkley"s Practical School of Journalists)

క్రిందటి మంగళవారం సాయంకాలము, మెయిన్ స్ట్రీట్‌లో ఓ పెద్దమనిషి యెవరికోసమో కాచుకొని వుండటం చాలామంది చూశారు. ఆ దారిన రెండవసారి పోయినవాళ్ళు ఆయనక్కడే నిలబడి వుండటం గమనించారు.

ఆఖరికి, ఆ వీధిలోకి ఒక యువకుడు ప్రవేశించాడు. ఆ పెద్దమనిషి అతని మీదకుదూకి అతనిని చితకకొట్టటం ప్రారంభించాడు. పాపమూ యువకుడు చేతనైనంతవరకు ఆత్మరక్షణ చేసుకొన్నాడు. దారిన పోయేవాళ్ళు కూడా అతని రక్షణకు తోడ్పడినా, అతనికి బాగానే దెబ్బలుతగిలినై. అతని ఒక కన్ను దెబ్బతింది. మరొక చెంప మీద గాయమయింది. దగ్గరిలో యే పోలీసు లేకపోవటం చేత ఆ పెద్దమనిషి తప్పించుకుపోయాడు.

దారిన పోతున్న ఓ టపాలా బంట్రోతు ఈ సంఘటన చూసి చాలా ఆశ్చర్యపోయాడు. పాపమా యువకుడు యేమీ చెయ్యకుండానే ఆ పెద్దమనిషి అతని మీదికెందుకు దండెత్తిందీ, అతనికగమ్యగోచరమయింది. కొంతదూరం ఆ పెద్దమనిషిని కుతూహలంతో వెంబడించాడు. అతడు సంతోషంతో యిలా అంటున్నట్లు వినపడింది.

"వీడే ఆఖరివాడు! ఒక విషయంలో విజయం సాధించటం కన్నా పగ సాధించటంలోనే ఆనందముంది."

కొంతదూరము పోయిన తర్వాత, ఆ పెద్దమనిషి "కాంగ్రెసు" వీధిలో ఒక "విస్కీ సెలూన్" లోకి ప్రవేశించాడు. పాపమతని గుడ్డలన్నీ

ఈ దెబ్బలాటలో చాలావరకు దెబ్బతిన్నాయి. అతడు ఒక చిన్నబల్ల ముందు కూర్చున్నాడు. బోస్టుమాన్‌గూడా సర్వరును ఒకగ్లాసు మంచి నీళ్ళు అడిగి త్రాగి ఆ బల్లదగ్గరే మరొక కుర్చీలో ఆసీనుడయ్యాడు.

బోస్టుమాను ఆ పెద్దమనిషిని త్వరలోనే సంభాషణలోకి దించగలిగాడు త్వరలోనే, అతడు గొప్ప తెలివిగలవానిగానూ, చదువుకొన్న వాడిగానూ, కన్పించాడు బోస్టుమానుకు.

"మీరు వార్తాపత్రికల మనిషి అంటున్నారు కాబట్టి నాకు మీమీద నమ్మకముంది. నేనుగూడా ఒకప్పుడు వార్తాపత్రిక నడిపినవాడినే! నేను నా కథ చెప్తాను వింటారా?" అన్నాడు.

అతడు తన జేబులోనుంచి ఓ సన్నటి పుస్తకం తీసి, అందులో నుంచి, ఒక డాలరు బిళ్ళతీసి సర్వరుకిచ్చి ఒక సీసా మంచి ద్రాక్షరసానికీ, కొన్ని చుట్టలకూ ఆర్డరిచ్చాడు.

సర్వరు గ్లాసులూ, సీసా ద్రాక్షసారాయి వాళ్ళ ముందు వుంచాడు. వాళ్ళు గ్లాసులలో సారాయి పోసుకొని త్రాగుతుంటే, ఆ పెద్దమనిషి బోస్టుమానుకు తన కథ చెప్పటం సాగించాడు.

2

నా పేరు "బింక్లీ" "బ్రింక్లీ స్కూల్ ఆఫ్ జర్నలిజమ్"ను స్థాపించింది నేనే. ఇందాక ఖర్చు పెట్టిన డాలరు ఈ ప్రపంచంలో నాకున్న ఆఖరి డాలరు! నేను యిందాక కొట్టిన యువకుడు, నా సంపాదకీయ రిపోర్టర్ల బృందంలో ఆఖరివాడు.

ఒక సంవత్సరం క్రిందట నాదగ్గర 15,000 డాలర్లు వున్నాయి. ఆ డబ్బును ఖర్చు పెట్టాలంటే ఎన్నో మంచి మార్గాలున్నాయి. కాని నా కొక దురదృష్టకరమైన ఆలోచన తోచింది.

నాకు వార్తాపత్రికల వ్యాపారంలో ఎనిమిది పది సంవత్సరాల అనుభవముంది. నేను మొదటి తరగతికి చెందిన వార్తాపత్రికలో పనిచేసాను.

మా అత్త ఒకామె చనిపోతూ నాకు 15,000 డాలర్లు యిచ్చింది. దేశంలో చాలా మంది విద్యాధికులైన యువకులు 'జర్నలిజం' నేర్చుకోవాలని కుతూహల పడుతున్నట్లు నాకు తోచింది. వారు తమకు వచ్చే వేతనాల కోసం కన్నా అనుభవం కోసం తాపత్రయ పడుతున్నారని నా కనిపించింది.

మొదటి తరగతి వార్తాపత్రిక కార్యాలయంలో సంపాదకీయ విలేఖర్ల, పదవులకోసం వారు డబ్బును యివ్వటానికి సిద్ధంగా వున్నట్లు నాకు తోచింది. దేశంలో 'జర్నలిజం' నేర్పే పాఠశాలలు చాలానే వున్నాయి. ఇలాంటి ప్రయోగాత్మక జర్నలిజం నేర్పే పాఠశాలను ఒక వార్తాపత్రికతో కలిపి స్థాపించి నట్లయితే. ఆ పత్రికకు మంచి ప్రచారమూ, అమ్మకమూ, వుంటుందని నేను నమ్మాను.

అది ఒక గొప్ప ప్రణాళికగా, నాకనిపించింది. నేను వెంటనే ఒక వార్తా పత్రికను స్థాపించాను. దక్షిణ ప్రాంతంలో ఒక పట్టణంలో, ఒక వార్తాపత్రిక అధిపతి జబ్బుపడి వైద్యంకోసం ఈ దేశం వదిలి పెట్టాలనుకొన్నాడు ఆ పత్రిక సంస్థ చాలా మంచి సంస్థ, ఖర్చులన్నీ పోనూ, దానికి ప్రతి సంవత్సరము 3000 డాలర్ల నికరాదాయం వుంది. ఆ సంస్థను నేను 12,000 డాలర్లకు కొన్నాను. 3000 డాలర్లు బ్యాంకులో వేశాను. కాబోయే జర్నలిస్టుల దృష్టి నాకర్షించటానికి, ఒక ప్రకటనను వ్రాసి, ఉత్తర, తూర్పు ప్రాంతాలలో పేరు పడ్డ పేపర్లకు పంపి, దాని ఫలితాలకోసం ఎదురుచూసాను.

అది వరకే నా పత్రికకు మంచిపేరుంది నా పత్రికలో 'జర్నలిజం' నేర్చుకోవటానికి ప్రజలలో వుత్సాహము కనిపించింది ప్రయోగాత్మకంగా 'జర్నలిజం' నేర్చుకోవటానికి నాపత్రికలో కొన్ని పదవులే వున్నాయి గనుక యెవరు యెక్కువ డబ్బు ఖర్చుపెడితే, వారికి అవి యివ్వబడతాయని, ప్రకటించాను.

ఇంక చూసుకోండి! వారం రోజులలో, ఎంతో మంది నుంచి దరఖాస్తులు వచ్చాయి. వాళ్ళు యిస్తామన్న డబ్బును పట్టి వాళ్ళ పేర్లను

నేను ఎన్నిక చేసాను. ఫలానారోజున వారిని వచ్చి డ్యూటీలో చేరమన్నాను. నేను నియమించిన యువక జర్నలిస్టుల నుంచి ఈ విధముగా, నాకు డబ్బు ముట్టింది.

వారానికి, సంపాదకీయ రచయిత - 50 డాలర్లు; పట్టణ సంపాదకుడు - 40 డాలర్లు; ముగ్గురు విలేఖరులు ఒక్కొక్కరు- 30 డాలర్లు; నాటక విమర్శకుడు - 20 డాలర్లు; సాహిత్య విమర్శకుడు - 35 డాలర్లు రాత్రి ఎడిటరు టెలిగ్రాఫ్ ఎడిటరు ఒక్కొక్కరికి - 30 డాలర్లు, ప్రత్యేక పనులమీద విమర్శలు వ్రాయటానికి ప్రత్యేక విలేఖరులు - 15 డాలర్లు ఒక్కొక్కరికి.

నేనేమో మేనేజింగు ఎడిటరుగా వుండి, వాళ్ళకి జర్నలిజంలో సలహాల వివ్వటం విమర్శనలను నేర్పటం చేస్తుండే వాడిని."

అదీ వరకు పత్రికలో పనిచేస్తున్న పాతవారిని.... యింటికి పంపించాను. ఒక గంటసేపు నా పత్రికా బృందానికి నేను పాఠాలు చెప్పాను. తర్వాత వాళ్ళను, వాళ్ళ పనుల మీద వదిలేసాను.

నా పత్రికలో చేరినవాళ్ళలో చాలామంది గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు కావడమేకాక, మంచి సంపన్న కుటుంబాలకి చెందినవారు. 'పత్రికారచన' నేర్చుకోవటానికి ఎంత డబ్బయినా ఖర్చు పెట్టగల సమర్థులు!

నా బృందమంతా, వాళ్ళ పనులమీదీ వెళ్ళగానే, తృప్తితో, నా కుర్చీలో విశ్రాంతి తీసుకొన్నాను. నాకు పత్రికమీద వచ్చే సంవత్సర నికరాదాయం 3000 డాలర్లు కాక, అందులో పనిచేసే సిబ్బంది నుంచి నాకు నెలకు 1400 డాలర్లు ముడుతాయి. అబ్బ! ఎంత గొప్ప విషయమది !

మొట్టమొదట నా సిబ్బంది చేసే పనిలో కొంత అనాగరికంగా, మొరటు తనం వుండచ్చు అని నేను అనుకొన్నాను. కాని వాళ్ళు యేమి తప్పులు చేసినా, తమ మంచి కథనంలో చేస్తారేగాని, మరో విధంగా చేస్తారని నేను అనుకోలేదు.

నేను ఒక సిగరెట్టు వెలిగించుకొని నా సంపాదకీయ సభ్యులు పని చేస్తున్న గదిలోకి అడుగుపెట్టాను. నా ముఖ్య సంపాదకుడు తన గొప్ప బుర్రతో, తెలిపైన నుదురుతో అందమైన దుస్తులతో తన బల్ల ముందు పనిలో నిమగ్నమైవున్నాడు. సాహిత్య సంపాదకుడు ఒక "విజ్ఞానసర్వస్వాన్ని" తిరగేస్తున్నాడు. నాటక విమర్శకుడు తన బల్ల మీద మహాకవి షేక్స్పియరు చిత్రాన్ని అంటిస్తున్నాడు. పట్టణ విశేఖరులు పట్టణంలో వార్తా సేకరణకు వెళ్ళారు.

ఇంత గొప్ప ప్రణాళికను, యింతకు ముందు యెవ్వరూ అమలులో పెట్టనందుకు నాలో నేను గర్వించాను. ఈ సందర్భాన్ని పురస్కరించికొని విజయోత్సవం జరుపుకోటానికి నా పాత మిత్రుడొకణ్ణి పట్టుకొని, "బార్"కు తీసుకువెళ్ళి అతనితో సీసాలమీద సీసాలు లాగించాను.

నేను పత్రిక కార్యాలయానికి తిరిగి వచ్చేటప్పటికి నా సిబ్బంది అంతా తమ తమ వ్రాతలతో తయారుగా వున్నారు. వాళ్ళ పని తనం చూసి నాకు చాలా సంతోషం కల్గింది. వాళ్ళలో నా కున్న మంచి నమ్మకం చేత వాళ్ళు వ్రాసిన వార్తలను చూడకుండానే 'ఓ కె' చేసాను. కంపోజిటర్లకు అచ్చుకిచ్చాను. కంపోజిటర్లు ఆ వార్తలను అచ్చు వేయటంలో మునిగి పోయారు.

రాత్రి ఎడిటరుకు అతను చేయవలసిన విధులేమిటో చెప్పి, నేను యింటికి ప్రయాణమయ్యాను నాకు రాబోయే సంపదను గూర్చి కలలు కంటూ.

రెండవరోజు వుదయం సరిగా తొమ్మిది గంటలకు నేను నా కార్యాలయానికి వచ్చాను. నాకక్కడ పత్రికలమ్మే కుర్ర వాళ్ళు తప్ప యెవరూ కన్పించలేదు. నగరంలో యెక్కడ చూసినా పేపరు కుర్రాళ్ళు నా పత్రికను ప్రజలకు అమ్ముతున్నారు. ప్రజలు వేలం వెర్రిగా యెగబడి కొనుక్కుంటున్నారు. నేను తృప్తితో నిట్టూర్చి గర్వపడ్డాను. నేను తిరిగి నా కార్యాలయం దగ్గరకు వచ్చేటప్పటికి ప్రక్క కాలి బాట మీద అయిదుగురు వ్యక్తులు తమ తుపాకులతో నిలబడి వున్నారు.

నేను వీధి మలుపు తిరుగుతుండగా వాళ్ళలో ఒకడు నన్ను చూసి నా వేపు తుపాకీ పేల్చాడు. ఒకటి నా చెవిని రాసుకొంటూ యింకా కొన్ని గుండ్లు, నా టోపీని చీలుస్తూ దూసుకు పోయాయి. ఇలా యెందుకు జరిగిందో కారణం తెలుసు కొవటం కోసం ఆగకుండా వీధి వెనక్కి పారి పోయాను. ఎందుకంటే, మిగతా నల్గురు కూడా నా వేపు తుపాకీ ప్రేల్చ టానికి ప్రయత్నించారు. ఆ వెనుక వీధి అంత్లా సరుకులు రవాణా అయిన ఖాళీ పెట్టెలతో నిండి వుంది.

ఒక పేపరమ్మే కుర్రవాడు ఆ ప్రక్క గుండా వెళుతుంటే మా పత్రిక ఒకటి డబ్బులిచ్చి కొన్నాను. ఆ పత్రికలో యెవరినిగురించి ఆక్షేపణ కరమైన వార్తలుండవచ్చని నేను కొన్నాను.

అక్కడ ఒక పెద్ద ఖాళీ పెట్టెలోకి దూరి పత్రిక పేజీలు విప్పి చూసాను. చదివిన కొద్దీ నాకు కోపమెక్కువ కాసాగింది. విషయం మారుస్తున్నందుకు నన్ను క్షమించండి!" మాటలు ఆపి అన్నాడు చిరిగిన దుస్తులలో వున్న ఆ పెద్ద మనిషి. "మీరిందాక డ్రింకుకు డబ్బు లిస్తామని అన్నట్టున్నారు.... దయచేసి తమ డబ్బుతో యింకో సీసా ద్రాక్ష రసం తెప్పిస్తారా?" అన్నాడు.

పోస్టుమాను, ఆ మాటలకు, చాలా గాభరాపడి తన జేబులన్నీ వెతికి నిరాశపడి సెలూను కుర్రవాడిని ప్రక్కకు తీసుకెళ్ళి అతనితో మెల్లగా ఓ పావు గంట మాట్లాడాడు. ఫలితమేమంటే ఆ సెలూనుబాబు మరొక సీసా ద్రాక్షరసం తెచ్చాడు. కాని అది మంచిరకానికి చెందినది కాదు. ఆ సీసాను గ్లాసులతోసహా వాళ్ళిద్దరూ కూర్చున్న బల్ల మీద వుంచాడు. అమర్యాదకరంగా శబ్దం చేస్తూ.

చిరిగిన దుస్తులలో వున్న ఆ పెద్ద మనిషి చిరు నవ్వుతో గ్లాసులను ఆ సీసాలోని ద్రాక్ష సారాతో నింపి, కొంచెము త్రాగిన తర్వాత తిరిగి తన కథనం సాగించాడు.

"ముందు నేను స్థానిక వార్తలున్న పేజీ చూసాను. మొదటి వార్త యిలా వుంది...." పెకిన్సు ఎస్టేటు కర్నల్ జె. హెన్రీ. గిలన్.... ఒక చని

పోయిన వాని కుటుంబాన్ని 75,000 డాలర్ల వరకు
వారసులు త్వరలోనే, అతని మీద కోర్టులో దావా వెయ్యబోతున్నారు
అని.

నాకప్పుడు జ్ఞాపక మొచ్చింది మొదట నామీద తుపాకీ ప్రేల్చిన వానిలో ఆ కర్ణులు పోలికలున్నాయని తర్వాత రెండవ వార్త చదివాను.

"ఫలానా పట్టణ పురపాలక సంఘ సభ్యుడు 1204 వెస్టు 30-రెండవవీధికి, కొన్ని మైళ్ళ దూరంలో 10,000 డాలర్లు పెట్టి యిల్లు కట్టించాడు. ఈ తడవ పట్టణ పురపాలక సంఘంలో సభ్యుల కొనుగోలు ఖరీదు ఎక్కువగా వుండవచ్చు!"

ఇలాగా యింకో పదిహేను వార్తలున్నాయి. ప్రతివార్తా నష్టపరిహారం కోరేటట్లుగా వుంది. తర్వాత సంఘము వార్తలుండే "కాలము" చూసాను. అక్కడ ప్రమాదంలేని కొన్ని వార్తలిలా వున్నాయి.

"జనరలు క్రౌడరు సతీమణి రాత్రి జాన్సను భవనంలో పెద్ద డాన్సు పార్టీ యిచ్చింది. ఆమె క్రౌడరు సతీమణిగా ప్రాముఖ్యం సంతరించుకోక ముందే కాన్సాస్ పట్టణంలోని సిటీఏజంటు నుంచి విడాకులు తీసుకొనే టట్లు కనిపిస్తున్నది!"

"క్రితం రాత్రి హెన్రీబామ్ గార్డను తిరిగి తన భార్యను కొట్టాడు."

"నారీమణి నాటక సంఘము క్రిందటి సాయంకాలము "కీటన్సు మ్యూజిక్ స్టోరు"లో సమావేశమయింది. ఆమెకు వేడిచెయ్యటంచేత మిస్ సాడీ డాడ్సను గుఱ్ఱపు బండిలో యింటికి తీసుకొని వెళ్ళబడింది. వేడి! ఆ సంఘానికి క్రొత్తపేరు!"

అడ్డుచెప్పటానికి వీలులేని వార్తలు కొన్ని వున్నాయి. కొన్ని వార్తలు చదువుతుంటే నాకు పిచ్చి ఎక్కుతున్నట్లయింది. అప్పుడుసంపాద కున్ని పేజీ త్రిప్పాను. అక్కడయినా యేమీ తప్పులుండక

గ్రామములోనూ అధికారులంతా
యియ్యబడ్డాయి. పది

తపు ఆరోపణ ఋజువు చేసుకో లేకపోతే ... త్మకాలకయినా 10,000 డాలర్లు యివ్వటానికి సిద్దంగా వున్నట్టు వ్రాయబడింది.

ఆ పెట్టెలో నుంచి బయటపడి మధ్యలో వున్న కంచెను మెల్లగా దాటి ఆఫీసుకు వెనుకవున్న మేడమెట్లు దగ్గరకు దేకుకొంటూ వెళ్ళాను. వెనుక దొడ్లో యిద్దరు రిపోర్టర్లు తిట్టుకొంటూ, కొట్టుకొంటూ కన్పించారు. ఒకడు మెత్తటి బొగ్గుల కుప్పలో పడి వున్నాడు. రెండో అతను కర్రల కంచెపైన తన కోటుకు వ్రేలాడుతున్నాడు. ఎవరో వాళ్ళిద్దరినీ కిటికీలో నుంచి బయటికి త్రోసారు పాపం!

మనస్సులో బాధపడుతూ మేడమీద వున్న సంపాదకుల గదిలోకి ... అక్కడ పెద్ద గందరగోళంగా వుంది. 50 డాలర్లు యిచ్చిన సంపాదకీయ రచయిత ఒక మూల కూర్చొని సగం కుర్చీతో పట్టణ పాలక సభ్యులనుంచి వచ్చే దెబ్బలను ధైర్యంగా యెదుర్కొంటు న్నాడు. అతడు ముగ్గురిని క్రిందపడవేసి, వాళ్ళతో భయంకరంగా యుద్ధం చేస్తున్నాడు.

పట్టణ సంపాదకుని క్రిందపడవేసి అతని మీద నలుగురు కూర్చు న్నారు.

కోపంతో వున్న ఒక జర్మను పెద్ద మనిషి....పుస్తకాల షెల్ఫు వెనకాల దాగుకొని వున్న నాటక సంపాదకుణ్ణి 'గ్యాసు గొట్టపుముక్కతో కొట్టాలని' చూస్తున్నాడు.

తన సిబ్బంది నుంచి నెలకు 1400 డాలర్లు సంపాదిస్తున్న ఒక పత్రికాధిపతికి నిరుత్సాహ పరచటానికి ఆ భీకర దృశ్యాలు చాలవా?

నేను నా ప్రైవేటు కార్యాలయములోకి వెళ్ళి కూర్చునా...
అప్పటికే రెచ్చిపోయి వున్న జనం నన్ను వెంబడించారు
వాదించినందు వల్ల లాభముండదని నాకు ...
పుస్తకం అందుకొని నష్టపడ ...
...ంకు అకౌంటులో ...